సోమవారం 1-12-2025

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 250

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కోహ్లి 'నూరు'... సిక్స్‌లలో రోహిట్

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో భారత్ 17 పరుగుల తేడాతో గెలిచింది. విరాట్ కోహ్లి (120 బంతుల్లో 135పరుగులు) వన్డేల్లో 52వ సెంచరీ చేయగా... వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన ప్లేయర్‌గా రోహిత్ శర్మ (352 సిక్స్‌లు) రికార్డు నెలకొల్పాడు. -10లో



ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో మార్పులు చేసింది. ఈ ప్రక్రియను మరో వారంపాటు పొడిగించింది.

వివరాలు 6లో ▸

సోనియా, రాహుల్‌పై ఎఫ్ఐఆర్

నేషనల్ హెరాల్డ్ కేసులో ప్రధాన నిందితులైన సోనియా, రాహుల్‌గాంధీపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

వివరాలు 6లో ▸

తమిళనాడులో ఘోర ప్రమాదం

తమిళనాడులోని శివగంగ జిల్లా తిరుపత్తూరు వద్ద రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొనడంతో 11 మంది మరణించారు.

వివరాలు 14లో ▸

భారతీయుల నుంచి ఎంతో లబ్ధి

ప్రతిభావంతులైన భారతీయుల నుంచి అమెరికా అత్యంత లబ్ధి పొందిందని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸

ఫీజులకు బూజు..

బకాయిల బండ

రూ.7,800 కోట్లు బకాయి పెట్టిన బాబు సర్కారు

చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 8 క్వార్టర్ల ఫీజులు పెండింగ్‌లోనే

రాష్ట్ర చరిత్రలో తొలిసారి భారీగా పేరుకుపోయిన బకాయిలు

- కాలేజీల ఒత్తిళ్లు తట్టుకోలేక అప్పులు చేసి కడుతున్న తల్లిదండ్రులు
- ఫీజులు కట్టలేదని ప్రభుత్వ వర్సిటీల్లో సైతం సర్టిఫికెట్లు ఇవ్వని దుస్థితి
- షెడ్యూల్ ప్రకారం చెల్లింపులను అడ్డుకున్న చంద్రబాబు ప్రభుత్వం..
- నేరుగా కాలేజీలకే ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తామని చెప్పి మొండిచెయ్యి
- పాక్షికంగా ఫీజుల విడుదలతో పిల్లల చదువులకు పెను గండం..

2 లో



వైఎస్ జగన్ హయాంలో విద్యాదీవెన, వసతి దీవెనకు రూ.18,663.44 కోట్లు వ్యయం

క్రమం తప్పకుండా త్రైమాసికం వారీగా తల్లుల ఖాతాల్లోనే నిధుల జమతో పిల్లల చదువులకు పూర్తి భరోసా

గతంలో టీడీపీ పెట్టిన రూ.1,778 కోట్ల ఫీజుల బకాయిలు సైతం చెల్లించింది వైఎస్ జగనే

చిల్లి గవ్వ ఇవ్వలేదు..

నా కుమారుడు రోషన్ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు చిల్లి గవ్వ కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వ లేదు. కళాశాలలో ఫీజు కట్టకపోతే పంపొద్దు అంటూ బెదిరిస్తున్నారు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం సాయం చేస్తుందనే ధైర్యంతో ఉన్నత విద్యలో చేర్పించాం.

– బాబు, విద్యార్థి తండ్రి, చిత్తూరు

మదనపల్లె సమీపంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఎంబీఏ రెండో ఏడాది చదువుతున్న విజయ్‌బాబుకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఫీజులు కట్టాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ చదివిస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు అప్పులు చేసి జూన్‌లో రూ.25 వేలతో మొదటి ఏడాది ఫీజు కట్టారు. ఉన్నత చదువులు చదవాలని ఆశతో ప్రభుత్వాన్ని నమ్ముకుని ఎంబీఏలో చేరితే తన పరిస్థితి తల్లకిందులైందని.. రెండో ఏడాదీ ఫీజు తానే కట్టుకోక తప్పదని విజయ్‌బాబు వాపోతున్నాడు.

రాష్ట్ర సమస్యలపై ఎలుగెత్తాలి..

పార్లమెంట్‌లో ప్రజా గళం

వైఎస్సార్‌సీపీ ఎంపీలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం

రాష్ట్రంలో తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం

తుపానుతో రైతాంగానికి కోలుకోలేని నష్టం

పరిహారం ఊసే లేదు.. ఏ పంటకూ 'మద్దతు' లేదు

ధాన్యం సేకరణలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం

అంతా మిల్లర్లు, దళారులదే రాజ్యం.. అన్నదాతల ఇక్కట్లను పట్టించుకోని ప్రభుత్వం

- ఉపాధి హామీ జాబ్ కార్డుల తొలగింపు దారుణం
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను తక్షణమే ఆపాలి
- సంక్షేమ హాస్టళ్లలో దారుణ, దుర్భర పరిస్థితులు
- ఏపీలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు
- ఈ అంశాలపై పార్లమెంట్‌లో బలంగా గళం విప్పాలని ఎంపీలకు వైఎస్ జగన్ నిర్దేశం

వివరాలు 2లో

వివాహితపై ఇద్దరు లైంగిక దాడి



ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో శనివారం రాత్రి ఒక వివాహితపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడి చేశారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న మహిళను తమ కారులో దింపుతామని ఎక్కించుకొని.. అఘాయిత్యానికి పాల్పడ్డారు.

5 లో

అక్క కంట నీరు చూడలేక.. బావ, అత్త హత్య

పల్నాడు జిల్లా ధూళిపాళ్లలో తల్లి, కొడుకు హత్యకు గురయ్యారు. దొప్పలపూడి సాంబశివరావు, కృష్ణకుమారిపై దాడి చేసిన ముగ్గురు.. కత్తులతో పొడిచి, నరికి చంపేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో బావమరిది తన స్నేహితులతో కలిసి ఈ దారుణానికి పాల్పడ్డాడు.

5 లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్ 118 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో 210 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్ 145 కిలో	స్కిన్ లెస్ 239 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

సున్నితత్వం పెంచుకోండి

జనాభిప్రాయాన్ని మార్చండి

డీజీపీల సదస్సులో పోలీసులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హితవు

విచ్ఛిన్న శక్తులపై నిత్యం డేగకన్ను అత్యవసరం

6 లో

విచ్ఛిన్న కార్యకలాపాలకు పాల్పడేందుకు పొంచి ఉన్న నిషేధిత శక్తులపై నిత్యం డేగ కన్నుంచడం కూడా అత్యవసరం. వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తమైన ప్రాంతాల సమగ్రాభివృద్ధిలో పోలీసులు కూడా తమ వంతు పాత్ర పోషించాలి. అప్పుడే ప్రజల్లో వారిపై మరింత సదభిప్రాయం కలుగుతుంది. పోలీసులంటే ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఉన్న భావనను మార్చడానికి సున్నితత్వం, జవాబుదారీతనం పెంచుకోవాలి. అర్బన్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, పర్యాటక పోలీసింగ్‌ను మరింత స్నేహశీలంగా మార్చడం, కొత్తగా వచ్చిన భారత న్యాయ చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయడం తదితరాలపై పోలీసులు బాగా దృష్టి సారించాలి. – ప్రధాని మోదీ

నేటి నుంచి సభా సమరం

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ఆరంభం కానున్నాయి. ఈ నెల 19 వరకు మొత్తం 15 రోజులపాటు సమావేశాలు కొనసాగుతాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై ప్రభుత్వాన్ని నిలదీయడానికి విపక్షాలు సిద్ధమవుతున్నాయి. అలాగే ఢిల్లీలో పేలుడు, దేశ భద్రత, విదేశాంగ విధానం, ధరల పెరుగుదల, నిరుద్యోగం తదితర కీలక అంశాలను ప్రస్తావించాలని నిర్ణయించాయి.

6లో

బలహీన పడుతున్న 'దిత్వా'

తుపాను ప్రభావంతో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జోరువానలు

నేడు రాయలసీమ, దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు..

తిరుపతి జిల్లాలో నేడు అంగన్‌వాడీలు, పాఠశాలలకు సెలవు

తమిళనాడులోని కావేరి డెల్టాలో కుంభవృష్టి.. ఆరుగురు మృత్యువాత

తిరుపతి జిల్లా వాకాడు వద్ద నీట మునిగిన పొలాలు

సాక్షి, అమరావతి/తిరుపతి అర్బన్/తిరుమల/ఇందుకూరుపేట/ఒంగోలు సబర్బన్/సాక్షి, చెన్నై: దిత్వా తుపాను ఆదివారం తమిళనాడు, పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా కదులుతూ క్రమేపీ బలహీనపడుతోంది. సోమవారం తెల్లవారుజామునకల్లా ఇది తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం సాయంత్రానికి ఇది గంటకు 4 కిలోమీటర్ల వేగంతో కదులుతూ చెన్నైకి 150 కిలోమీటర్లు, వేదరన్నియంకు 170, కరైకల్‌కు 120, కడలూరుకు 90 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో అత్యధికంగా 6.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అదే జిల్లా నావూరులో 4.8, బుచ్చిరెడ్డిపాలెంలో 4.7, జలదంకిలో 3.6, పులికల్లులో 3.6, తిరుపతి జిల్లా చిట్టమూరులో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని తీర ప్రాంతంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. మైపాడు, కోడూరు, జువ్వలదిన్నె, తుమ్మలపెంట, రామాయపట్నం బీచ్‌లలోకి పర్యాటకులు రాకుండా మెరైన్, స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. తుపాను నేపథ్యంలో

మిగతా 3వ పేజీలో ▸

ఇంకుచుక్క్

ఏమనుకోకు! నీ బ్రేక్‌ఫాస్ట్ కూడా నేనే తినేస్తున్నా.. సీఎం పదవిలాగా!!

'ఉపాధి' కూలీలకు

ముఖ ఆధారిత హాజరు

- నేటి నుంచి పార్వతీపురం మన్యం, దేశంలోని మరో రెండు జిల్లాల్లో అమలు
- పని జరిగే ప్రాంతంలో పది మీటర్ల పరిధిలో నమోదు
- 4 గంటల వ్యవధిలో రోజులో 2 విడతలు
- ఆ ఫొటో ఆధార్‌తో అనుసంధానం.. మ్యాచ్ అయితేనే బిల్లు

3 లో

తొలుత కృష్ణా తర్వాత గంగ

అత్యధిక నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలున్న బేసిన్‌లో అగ్రగామిగా కృష్ణా

రెండో స్థానంలో నిలిచిన గంగ.. మూడో స్థానంలో గోదావరి

కేంద్ర జలసంఘం నివేదికలో వెల్లడి

14 లో



మీ కార్డు సంపాదిస్తోందా?

కొంచెం తెలివిగా, క్రమశిక్షణతో వాడితే క్రెడిట్ కార్డుతో లాభమే ఎక్కువ. పైసా వడ్డీ చెల్లించక్కర్లేదు. పైపెచ్చు కాస్త సంపాదించుకోవచ్చు కూడా. వీటన్నిటికీ తోడు హోటళ్లు, సినిమా టికెట్లు, ప్రయాణ టికెట్లపై ఎప్పటికప్పుడు ఆఫర్లూ వస్తాయి.

12లో

గృహ రుణానికి ముందే గుడ్‌బై

గృహ రుణంపై నెల నెలా చెల్లించే ఈఎంఐకి అదనంగా రూ.5 వేలు చెల్లిస్తే 20 ఏళ్లలో ఏకంగా రూ.11.5 లక్షల వడ్డీ ఆదా అవుతుంది. పైపెచ్చు ఈఎంఐలు చెల్లించాల్సిన కాలమూ తగ్గుతుంది. 5 వేల రూపాయలు చేసే మ్యాజిక్ ఇది. అదెలాగంటే..

13లో

బ్రేక్‌ఫాస్ట్‌తో కుర్చీ పోరుకు బ్రేక్!

- సోనియాగాంధీ నివాసంలో 'కర్ణాటకం'పై చర్చ
- కూలంకషంగా వివరించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే
- తనకు సీఎం సిద్ధరామయ్యతో విభేదాలు లేవని అంతకుముందే డీకే శివకుమార్ స్పష్టీకరణ
- 2028 ఎన్నికలే తమ లక్ష్యమని వెల్లడి

బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ (ఫైల్)

14లో

'సోషల్' టేకోవర్‌కు చెక్!

సిమ్ బైండింగ్ విధానాన్ని తెచ్చిన 'డాట్'

- ఆ సిమ్ కార్డు ఉన్న ఫోన్ నుంచే సోషల్ మీడియా యాప్స్ సేవలు
- సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల
- మార్చి నుంచి కొత్త విధానం అమల్లోకి..

3 లో

క్లుప్తంగా...

రబీలో 70 వేల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనం పంపిణీ

- 15,312 క్వింటాళ్ల అపరాలు, చిరుధాన్యాల విత్తనాల మినీ కిట్లు సిద్ధం
- 'సబ్సిడీ విత్తనానికి మంగళం'పై వ్యవసాయ శాఖ వివరణ

సాక్షి, అమరావతి: 2025–26 వ్యవసాయ సీజన్‌లో 8.08 లక్షల క్వింటాళ్ల రాయితీ విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేయగా, ఇప్పటివరకు 4.86 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని రైతులకు సరఫరా చేశామని వ్యవసాయ శాఖ తెలిపింది. అలాగే, ప్రస్తుత రబీ సీజన్‌లో 3.03 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తన పంపిణీకి ఏర్పాట్లుచేయగా, ఇప్పటివరకు 70 వేల క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీ చేశామని వెల్లడించింది. మరో 15,312 క్వింటాళ్ల అపరాలు, చిరుధాన్యాల విత్తనాలను మినీ కిట్‌ల రూపంలోనూ, కంటింజెన్సీ ప్రణాళిక కింద 16,591 క్వింటాళ్ల విత్తనం సిద్ధంగా ఉంచామని తెలిపింది. 'సబ్సిడీ విత్తనానికి మంగళం' శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనంపై వ్యవసాయ శాఖ వివరణ ఇచ్చింది. 2024–25లో రూ.328.75 కోట్లతో 10.48 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తన పంపిణీకి ఏర్పాట్లుచేయగా, 7.35 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీ చేశామని వివరించింది. గడిచిన ఐదేళ్లలో సగటున 1.50 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనం సరఫరా చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 25 శాతం సబ్సిడీపై 63 వేల క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీ చేశామని వ్యవసాయ శాఖ పేర్కొంది.

సిక్కోలు తీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు

మెరైన్ పోలీసుల అదుపులో 13 మంది

బంగ్లాదేశ్ మత్స్యకారులు

ఎచ్చెర్ల: బంగ్లాదేశ్ నుంచి వేటకు బయల్దేరిన 13 మంది మత్స్యకారులు ఆదివారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని మూసివానిపేట తీరానికి చేరుకున్నారు. వీరు సముద్రంలో వేటకు వెళ్లిన వారం రోజుల తర్వాత బోటు ఇంజిన్ పాడవడంతో సముద్రం మధ్యలో బోటు ఆగిపోయిందని మెరైన్ పోలీసులు తెలిపారు. అలల ద్వారా బడివానిపేట పంచాయతీ మూసవానిపేట తీరానికి వీరు రావడంతో స్థానికులు మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఎం.సబీర్ అనే మత్స్యకారుడి ఐడీ ద్వారా వీరు బంగ్లాదేశ్ వాస్తవ్యులుగా గుర్తించినట్లు మత్స్యశాఖ ఎఫ్‌డీఓ రవికుమార్ తెలిపారు. వీరిని జహంగీర్, సబీర్, కోకన్, మాక్సుద్, మాలిక్, ఫారుక్, మాక్సుద్, నజీర్, హెల్లల్, ఫారుఖ్, ఆలమ్, సలీమ్, షాజీబ్‌లుగా గుర్తించారు. ఇక వీరు వచ్చిన పడవలో ఎలాంటి మాదకద్రవ్యాలు, అదనపు వస్తువులు లేవని, కేవలం వేట సామగ్రి మాత్రమే ఉందని ఎఫ్‌డీఓ తెలిపారు.

అమరావతిలో ఆప్కాబ్ ప్రధాన కార్యాలయం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) రూ.85,79,23,848తో రాజధాని అమరావతిలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తోంది. దీని నిర్మాణం కోసం ఆసక్తి గల సంస్థల నుంచి ఏపీఐఐసీ బిడ్లను ఆహ్వానించింది. బిడ్ దక్కించుకున్న సంస్థ 18 నెలల్లోగా నిర్మాణాలను పూర్తి చేయాలి. బిడ్ల దాఖలుకు డిసెంబర్ 12 వరకు గడువు ఇచ్చింది.

విద్యా సంస్కరణలు, ప్రగతిపై శ్వేతపత్రం ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అమలు చేసిన విద్యా సంస్కరణలు, ఫలితంగా సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత హామీల అమలు స్థితిపైన, మూల్యాంకనం దుర్వినియోగం, పిల్లల మానసిక ఆరోగ్యం, హామీల అమలుపై తక్షణం శ్వేత పత్రం విడుదల చేయాలని అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు నరహరి శిఖరం, కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకుంటున్నారని, ఏడాదిన్నరగా విద్యా ప్రమాణాల క్షీణత, విద్యార్థుల మానసిక ఒత్తిడి ఆందోళనకర స్థాయిలో పెరిగిపోయాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగంలో తక్షణ సంస్కరణలు చేపట్టాలన్నారు.

రాష్ట్ర సమస్యలపై ఎలుగెత్తాలి..

పార్లమెంట్‌లో ప్రజా గళం

వైఎస్సార్‌సీపీ ఎంపీలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: అన్నదాతల ఇక్కట్లతోపాటు రాష్ట్రానికి సంబంధించిన అన్ని ప్రధాన సమస్యలను పార్లమెంటు ఉభయ సభల్లో బలంగా లేవనెత్తి.. ప్రజల గొంతుకను గట్టిగా వినిపించాలని పార్టీ ఎంపీలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. ఒకవైపు తుపానుతో తీవ్ర నష్టం, మరోవైపు ఏ పంటకూ కనీస మద్దతు ధర దక్కక కుదేలైన వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. ఈ అంశాలన్నింటినీ పార్లమెంటు సమావేశాల్లో ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. మొంథా తుపాను వల్ల తీర ప్రాంత జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం పరిహారం అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరోవైపు ఏ పంటకూ కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) లేకపోవడం వారిని మరింత కష్టాల పాల్జేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్బీకేల ద్వారా నేరుగా ధాన్యాన్ని సేకరించడం వల్ల ప్రతి పంటకూ కనీస మద్దతు ధర కచ్చితంగా దక్కేదని గుర్తుచేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వాటన్నింటికి మంగళం పాడి రైతులను గాలికి వదిలేయడంతో దళారులు, వ్యాపారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారని మండిపడ్డారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కంది, అరటి, మిర్చితోపాటు మామిడి లాంటి ప్రధాన పంటలకు ఎమ్మెస్పీ లభించక రైతులు అల్లాడుతున్న దృష్ట్యా కేంద్రం వెంటనే అత్యవసర నిధులు విడుదల చేసి కనీస మద్దతు ధర దక్కేలా ఎంపీలు ఒత్తిడి తేవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కాగా అమలు చేసిన ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదని, ఈ–క్రాపింగ్ చేయకపోవడం వల్ల పంటల గణాంకాలు స్పష్టంగా తెలియక అర్హులైన రైతులకు కూడా పరిహారం అందని దుస్థితి నెలకొందన్నారు. మిర్చి రైతులను ఆర్థికంగా ఆదుకుంటామని మాట ఇచ్చిన ఈ ప్రభుత్వం దాన్ని నిలబెట్టుకోకుండా వారిని దగా చేసిందని, మామిడి కొనుగోళ్లలో కంపెనీలు తగిన ధర చెల్లించేలా చూడడంలో ప్రభుత్వ వైఫల్యం వల్ల ఆ రైతులూ తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు.

గ్రామీణ నిరుపేదల ఉపాధిని దెబ్బతీశారు..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సామూహికంగా 18.63 లక్షల జాబ్ కార్డులను చంద్రబాబు ప్రభుత్వం తొలగించడాన్ని ఎంపీల వద్ద వైఎస్ జగన్ ప్రస్తావించారు. ఇది అత్యంత దారుణమని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. అర్హత ఉన్న జాబ్ కార్డులన్నింటినీ పునరుద్ధరించడంతోపాటు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపేయాలి..

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను గట్టిగా వ్యతిరేకించాలని ఎంపీలను జగన్ ఆదేశించారు. సంస్థను ముక్కలుగా చేసి అమ్మేస్తున్నారని, ఇది సంస్థ పూర్తి ప్రైవేటీకరణ దిశగా చేస్తున్న పని అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు, వేలాది మంది త్యాగాల ఫలితంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పడిన విషయాన్ని గుర్తుచేశారు. వారందరితోపాటు ఆ సంస్థ కోసం భూములిచ్చిన రైతులను దగా చేయడం తగదన్నారు. సంస్థను ముక్కలు చేస్తూ ప్రైవేటీకరణ కోసం చేపట్టిన చర్యలన్నింటినీ వెంటనే ఉపసంహరించాలని, సంస్థను పునరుద్ధరించేలా వెంటనే సొంతంగా ఇనుప ఖనిజం గనులు కేటాయించి వేలాది మంది కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవనోపాధిని కాపాడాలని కోరారు.

శాంతి భద్రతలు దారుణం..

రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తంచేశారు. రాజకీయ కక్షతో పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని ప్రస్తావించారు. చాలా మంది నాయకులు, ప్రజా ప్రతినిధులకు సెక్యూరిటీ తగ్గించి వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి తీసుకొచ్చారని ఆక్షేపించారు. మరోవైపు ప్రభుత్వ హాస్టళ్లు, సంక్షేమ వసతిగృహాల్లో పరిస్థితి నానాటికీ దుర్భరంగా మారుతోందన్నారు. విద్యార్థులకు సరైన ఆహారం, తాగు నీరు అందడంలేదని, పరిశుభ్రత పూర్తిగా కొరవడిందని ఆందోళన వ్యక్తంచేశారు. వీటన్నింటితోపాటు కేంద్రం నుంచి పెండింగ్ నిధులు రాబట్టడం, రాష్ట్రంలో ఉపాధి కల్పన, కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడుకునే దిశగా ఎంపీలు చొరవ చూపాలని.. ప్రజాసమస్యలను గట్టిగా ప్రస్తావిస్తూ, వారి గొంతుకలను బలంగా వినిపించి, కేంద్రం వాటిపై దృష్టిసారించేలా కృషిచేయాలని వైఎస్ జగన్ మార్గనిర్దేశం చేశారు.

- ఫీజులకు బూజు..

బకాయిల బండ

రాష్ట్ర చరిత్రలో తొలిసారి రూ. 7,800 కోట్లు బకాయి పెట్టిన బాబు సర్కార్

పుట్టపర్తిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం రూ.60 వేలు ఫీజు కట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా సమాచారం పంపించింది. తమకు రీయింబర్స్‌మెంట్ జమ కానందున ఫీజులు కట్టాల్సిందేనని తేల్చి చెప్పింది.

కదిరిలోని ఎస్‌ఎంజేఎల్ డిగ్రీ కాలేజీతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి చెందిన కళాశాలలో సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారు. దీంతో కొందరు తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టి విద్యార్థులను పరీక్షలకు పంపించారు. కొందరు బాలికలను చదువు మానిపించి చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్న దుస్థితి కనిపిస్తోంది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నపరెడ్డి గారి గంగిరెడ్డి సొంతూరు అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం చౌటుపల్లె కొత్తపల్లి. ఆయన కుమార్తె గౌరీప్రియ రాజంపేటలో ఇంజనీరింగ్ రెండో ఏడాది చదువుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో రూ.45 వేలు అప్పు చేసి కాలేజీలో చెల్లించారు. రెండో ఏడాదీ ఇదే పరిస్థితి కనిపిస్తోందని వాపోతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో తన కుమారుడు గౌతమ్‌రెడ్డి బీటెక్ ఎలాంటి ఆర్థిక ఆటంకాలు లేకుండా పూర్తయిందని గుర్తు చేసుకుంటున్నారు.

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబు సర్కారు ఉన్నత విద్యను అథఃపాతాళానికి దిగజార్చింది. అప్పులు చేసి ఫీజులు కట్టలేక విద్యార్థుల తల్లిదండ్రులు అల్లాడుతుండగా.. పాఠాలు బోధించడం మానేసి కాలేజీ యాజమాన్యాలు ఫీజుల కోసం పిల్లలను వేధిస్తున్నాయి. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి ప్రైవేట్ యాజమాన్యాలు తాము కళాశాలలు నడపలేమంటూ రోడ్డెక్కిన పరిస్థితి కనిపిస్తోంది. చంద్రబాబు సర్కార్ గత ఏడాదిన్నరకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించే కుయుక్తులు పన్నుతూ లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది. కళాశాలల ఖాతాల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ఎన్నికల సమయంలో నమ్మబలికి తరువాత చేతులు ఎత్తేసింది. ఇప్పటి వరకు చెల్లించాల్సిన ఎనిమిది క్వార్టర్ల ఫీజుల డబ్బులు రూ.5,600 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ కింద విద్యార్థులకు ఇవ్వాల్సిన మరో రూ.2,200 కోట్లతో కలిపి ఏకంగా రూ.7,800 కోట్ల మేర బకాయిలు కొండలా పేరుకుపోయాయి. నిధులను తొక్కిపెట్టి అరకొరగా, పాక్షిక చెల్లింపులతో విద్యార్థులను సర్కారు తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తోంది. తేలికగా ఎగ్గొట్టవచ్చనే దురుద్దేశంతోనే తల్లుల ఖాతాలో కాకుండా, తాము కాలేజీల ఖాతాలో జమ చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నమ్మబలికారు. ఉన్నత విద్యలో పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అమలు చేసి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పిల్లల చదువులకు ఆటంకం లేకుండా సంపూర్ణ భరోసా కల్పించి ఐదేళ్ల పాటు అండగా నిలిచారు. త్రైమాసికం వారీగా నిధుల విడుదలకు చర్యలు తీసుకున్నారు. 2024 జనవరి నుంచి మార్చి త్రైమాసికం ఫీజులు ఏప్రిల్‌లో ప్రాసెస్ చేసి మే నెలలో విడుదల కావాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అడ్డు పెట్టుకుని టీడీపీ కూటమి నాయకులు కుట్రలతో అడ్డుకున్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు సుమారు ఎనిమిది క్వార్టర్లకు సంబంధించిన ఫీజులు చెల్లించకుండా విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెట్టేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసింది.

ప్రభుత్వ వర్సిటీల్లోనూ సర్టిఫికెట్ల నిలుపుదల..

చంద్రబాబు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోవడంతో విద్యార్థులు ఫీజులు చెల్లిస్తే గానీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వబోమనే పరిస్థితికి ఉన్నత విద్య దిగజారిపోయింది. చివరికి ప్రభుత్వ వర్సిటీలు సైతం ఇదే బాటలో పయనిస్తూ విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపేశాయి. సర్కారు బాధ్యతారాహిత్యానికి బదులు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విలువైన ఉద్యోగ అవకాశాలు, పీజీ విద్య సీట్లను కోల్పోతున్న దుస్థితి దాపురించింది. ఎంటెక్, పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఆయా వర్సిటీలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యా మండలికి మొరపెట్టుకోవడం చర్చనీయాంశమైంది. ఏ ప్రభుత్వమైనా తప్పనిసరిగా కొనసాగించాల్సిన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.

'ఎక్స్'లో ట్వీట్ల పిట్టలా లోకేశ్!

ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పర్యవేక్షణలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మొత్తం కుదేలైంది. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అస్తవ్యస్తంగా మారింది. ప్రపంచ స్థాయి విద్య, క్వాంటం సెంటర్లు అంటూ ప్రచారం మినహా కళాశాలలకు సకాలంలో ఫీజులు చెల్లించకపోవడం విద్యా నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఉన్నత విద్యపై సమీక్ష చేసినప్పుడల్లా అదిగో ఫీజులు చెల్లిస్తున్నాం.. ఇదిగో ఇచ్చేస్తున్నాం.. అంటూ 'ఎక్స్' ఖాతాలో ట్వీట్లు చేసుకోవడంతోనే లోకేశ్ కాలం గడిపేస్తున్నారు. ఈ తంతు గతేడాది జూన్ నుంచి మొదలు కాగా ఈ ఏడాది నవంబర్ వచ్చినా బకాయిలు చెల్లించకపోవడంతో కొండలా పేరుకుపోతున్నాయి. ఈ ఏడాది జూలైలో కచ్చితంగా ఫీజు బకాయిలు విడుదల చేస్తామని యాజమాన్యాలకు హామీ ఇచ్చిన లోకేశ్ అక్టోబర్ చివరిలో కంటి తుడుపుగా విదిల్చారు.

విద్యకు లోటు 'బడ్జెట్'..

ఒక్కో విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.2,800 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ ఖర్చులు కింద రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.3,900 కోట్లు అవసరం. చంద్రబాబు ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లు కేటాయింపులు చూపించి నిధులు మాత్రం ఇవ్వకపోవడం గమనార్హం. అదే వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జగనన్న విద్యా దీవెన కింద ఫీజుల కోసం రూ.12,609.68 కోట్లు క్రమం తప్పకుండా ప్రతి త్రైమాసికానికి చెల్లించడంతో పాటు గతంలో టీడీపీ సర్కారు బకాయి పెట్టిన రూ.1,778 కోట్లు సైతం చెల్లించింది. కళాశాలలు సక్రమంగా నడిచేలా, విద్యార్థులు నిశ్చింతగా చదువుకునేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసా కల్పించింది. ఇక జగనన్న వసతి దీవెన కింద రూ.4,275.76 కోట్లు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసింది. ఇలా ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఒక్క విద్యా దీవెన, వసతి దీవెన కోసమే ఏకంగా రూ.18,663.44 కోట్లు ఖర్చు చేసింది.

2014–19లో టీడీపీ హయాంలో 16.73 లక్షల మంది విద్యార్థులకు బకాయి పెట్టిన రూ.1,778 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను అనంతరం వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే తక్షణ బాధ్యతగా భావించి చెల్లింపులు చేసింది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం చెల్లింపులకు మంగళం పలికి ఆర్నెల్లకు ఒకసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామంటూ కళాశాలలను, విద్యార్థులను నిలువునా ముంచేసింది.

ఆర్థిక ఇబ్బందుల్లో కళాశాలలు..

రాష్ట్రవ్యాప్తంగా 230కిపైగా ఇంజనీరింగ్ కళాశాలలు, 1,250 వరకు డిగ్రీ కాలేజీలు ఉన్నత విద్యలో వివిధ కోర్సుల్లో బోధన సాగిస్తున్నాయి. ఇందులో 70 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి బోధిస్తున్నాయి. చంద్రబాబు సర్కారు సుమారు రూ.7,800 వేల కోట్ల చెల్లింపులు నిలిపివేయడంతో నిర్వహణ భారాన్ని భరించలేక అటు కాలేజీలు ఇటు విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఫీజుల కోసం విద్యార్థులపై యాజమాన్యాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. తల్లిదండ్రులు అప్పులు చేసి, పుస్తెలు తాకట్టు పెట్టి ఫీజులు కడుతున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది.

వసతి దీవెనకు మంగళం..

పిల్లల చదువులకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు హాస్టల్ మెయింటెనెన్స్ (వసతిదీవెన) ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. భోజన, వసతి ఖర్చుల కోసం ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని క్రమం తప్పకుండా జమ చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఫీజులను నీరుగార్చగా.. వసతి దీవెనను ఏకంగా ఎత్తేసింది. విద్యార్థులకు రూ.2,200 కోట్లు వసతి దీవెన బకాయిలు ఎగ్గొట్టింది. హాస్టల్ మెయింటెనెన్స్ ఇచ్చే అంశాన్ని పక్కన పడేసింది. ప్రైవేటు కళాశాలల్లో పీజీ విద్య అభ్యసిస్తున్న వారికి సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని ఎన్నికల వేళ చంద్రబాబు బృందం నమ్మబలికింది. తీరా అధికారంలోకి వచ్చాక ఎగ్గొట్టింది.

ఎంబీఏ పూర్తయి ఏడాదిన్నర..

రామచంద్రపురం కాలేజీలో ఎంబీఏ పూర్తి చేశా. ఫీజు చెల్లించలేదని సర్టిఫికెట్లు ఇవ్వడంలేదు. రూ.48,500 వరకు కట్టాలని చెబుతున్నారు. నాన్న ఇటుక బట్టీలో కార్మికుడు. సర్టిఫికెట్లు లేక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నా.

– ఎస్.గంగరాజు, సందిపూడి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నగలు తాకట్టు పెట్టి ఫీజులు చెల్లించా

మా కుమార్తె తిరుపతి సమీపంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో ఏడాది చదువుతోంది. ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదు. కళాశాల యాజమాన్యం ఒత్తిడిని తట్టుకోలేక బంగారు నగలు తాకట్టు పెట్టి ఫీజులు చెల్లించాం. నా భర్త చనిపోయారు. కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివించుకుంటున్నా.

– సుభద్రమ్మ, విద్యార్థిని తల్లి, తిరుపతి

మానసికంగా కుంగిపోతున్నా..

కర్నూలు జీఎన్ఎంలో నర్సింగ్ మూడో ఏడాది చదువుతున్నా. గతంలో మా అమ్మ ఖాతాలో జగనన్న విద్యా దీవెన సకాలంలో జమయ్యేది. ఈ ప్రభుత్వం వచ్చాక కాలేజీ యాజమాన్యం ఖాతాలో జమ కాలేదు. పెండింగ్ ఫీజులు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. ఇంట్లో ఫీజులు అడగలేక.. కాలేజీలో ఒత్తిళ్లు తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్నా. ప్రశాంతంగా చదువుకోలేకపోతున్నాం.

– కె.సురేష్, నర్సింగ్ విద్యార్థి, సి.బెళగల్ మండలం, ముడుమూల

మా పీక పట్టుకుంటుంది..

మా అబ్బాయి కార్తికేయ భీమిలి మండలంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ మూడో ఏడాది చదువుతున్నాడు. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఒక క్వార్టర్ ఫీజు మాత్రమే జమ చేసింది. అప్పటికే కళాశాల యాజమాన్యం రూ.20 వేలు చొప్పున వసూలు చేసింది. జిరాక్స్ షాపుపై ఆధారపడి జీవిస్తున్న నేను అతి కష్టం మీద ఆ డబ్బులు కట్టా. లేదంటే సెమిస్టర్ పరీక్షలు రాయనివ్వబోమంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందనే కాలేజీలో చేర్చాం. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుంటే యాజమాన్యం మా పీక పట్టుకుంటుంది.

– గంటా రాజు, భీమిలి మండలం

సకాలంలో ఇస్తే మాకీ అవస్థలుండవు

నా కుమారుడు హుసేన్ అమీద్ బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. గతేడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. మాకు ఎలాంటి చర, స్థిర ఆస్తులు లేవు. చిన్న దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. ఏటా ప్రభుత్వం సకాలంలో ఫీజులు జమ చేస్తే మాకీ అవస్థలు ఉండవు.

– హుసేన్‌బీ, విద్యార్థి తల్లి, పాములపాడు, నంద్యాల జిల్లా

దేశం నవీన ఆలోచనలకు ప్రతిబింబం

- అంతరిక్ష పర్యావరణ వ్యవస్థకు 'ఇన్ఫినిటీ క్యాంపస్' ఊపు
- హైదరాబాద్ స్టార్టప్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు
- యువతరం అంకిత భావం 'వికసిత్ భారత్'కు గొప్ప బలం
- 'వోకల్ ఫర్ లోకల్'ను ప్రోత్సహించేలా కరీంనగర్ కళాకృతుల బహూకరణ

సాక్షి, న్యూఢిల్లీ: భారత దేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థకు స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలోని నవీన ఆలోచన, ఆవిష్కరణ, యువ శక్తికి ప్రతిబింబంగా నిలిచిందని కొనియాడారు. యువత అంకిత భావం 'వికసిత్ భారత్'కు గొప్ప బలం అని చెప్పారు. ఆదివారం 128వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థపై ప్రశంసలు కురిపించారు. ఇటీవలే హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఇంజిన్ మెయింటినెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (ఎంఆర్‌ఓ)ను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. విమాన నిర్వహణ, మరమ్మతు, పునఃపరిశీలన రంగంలో మన దేశం ప్రధాన అడుగు వేసిందని చెప్పారు. చంద్రయాన్–2 మిషన్ విఫలమైనా, శాస్త్రవేత్తలు నిరాశ చెందినా.. ఆ తర్వాత అకుంఠిత దీక్షతో చంద్రయాన్–3ని ప్రయోగించి విజయం సాధించారన్నారు. మన యువత అంకితభావం, మన శాస్త్రవేత్తల నిబద్ధతను చూసిన ప్రతిసారీ నా హృదయం ఉత్సాహంతో పొంగిపోతుంది..' అని ప్రధాని తెలిపారు. యువతరం అంకితభావం 'వికసిత్ భారత్'కు గొప్ప బలం అని ఆయన పేర్కొన్నారు.

అందరూ 'వోకల్ ఫర్ లోకల్' మంత్రం పాటించాలి

'మీరంతా 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని పాటించాలి. జి–20 శిఖరాగ్ర సమావేశాల్లోనూ దీన్ని పాటించాలని వివిధ దేశాల ప్రతినిధులు, నాయకులను నేను కోరా. 'వోకల్ ఫర్ లోకల్ 'ను ప్రోత్సహించేందుకు పలు దేశాల ప్రధానులకు కరీంనగర్ సిల్వర్ క్రాఫ్ట్, లోహ శిల్ప కళ నైపుణ్యాన్ని పరిచయం చేస్తూ ఇక్కడ తయారైన వివిధ కళాకృతులను బహూకరించా. జపాన్ ప్రధానమంత్రికి వెండి బుద్ధ ప్రతిమను ఇచ్చా. ఇది తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన ప్రసిద్ధ సిల్వర్ క్రాఫ్ట్ నైపుణ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ఇటలీ ప్రధానమంత్రికి పూల ఆకృతులతో కూడిన వెండి అద్దం బహుమతిగా ఇచ్చా. ఇది కరీంనగర్ సాంప్రదాయిక లోహ శిల్పకళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇదే విధంగా పలు దేశాల అధినేతలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అద్భుతమైన కళా రూపాలను బహూకరించా. భారతీయ హస్తకళలు, కళలు, సంప్రదాయాల గురించి ప్రపంచానికి అవగాహన కల్పించడం, మన చేతి వృత్తుల వారి ప్రతిభను ప్రపంచానికి అందించడమే లక్ష్యం. రాబోయే క్రిస్మస్, న్యూ ఇయర్ షాపింగ్‌లో 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని గుర్తుంచుకోండి. దేశంలో తయారు చేసిన వాటిని మాత్రమే కొనండి. దేశప్రజలు కష్టపడి తయారుచేసిన వాటిని మాత్రమే అమ్మండి' అని మోదీ విజ్ఞప్తి చేశారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

క్లుప్తంగా...

సర్జికల్ బ్లేడ్‌ను లోపలే పెట్టి కుట్టేశారు!

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. ఉచిత చికిత్సల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లిన వారికి చంద్రబాబు ప్రభుత్వం నరకం చూపిస్తోంది. కాకినాడ జిల్లా తుని ఏరియా ఆస్పత్రిలో ఓ యువకుడి కాలులో సర్జికల్ బ్లేడ్ పెట్టి కుట్టేసిన ఘటన ప్రభుత్వాస్పత్రుల్లో దిగజారిన పరిస్థితులకు అద్దం పడుతోంది. రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖలో కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని రాడ్ వేయించుకున్న యువకుడు అప్పట్లో అమర్చిన స్క్రూ తొలగించాలని తుని ఆస్పత్రిని ఆశ్రయించాడు. వైద్యులు నవంబర్ 27న శస్త్ర చికిత్స చేసి స్క్రూ తొలగించి, సర్జికల్ బ్లేడ్‌ను లోపలే పెట్టి కుట్టేశారు. ఇంటికి వెళ్లాక నొప్పి తీవ్రమవడంతో బాధితుడు ఎక్స్‌రే తీయించాడు. సర్జికల్ బ్లేడ్ లోపలే ఉన్నట్టు తేలడంతో శస్త్రచికిత్స చేసిన వైద్యుడు సత్యప్రసాద్, నర్సు పద్మావతిని సస్పెండ్ చేసినట్టు వైద్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఏపీలో 13 వేల కొత్త హెచ్ఐవీ కేసులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2024–25లో 13,383 కొత్త హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఐవీ కేసుల్లో మహారాష్ట్ర (3,62,392) తరువాత ఏపీ (2,75,528) రెండో స్థానంలో ఉందన్నారు. గర్భిణుల్లో హెచ్ఐవీ పాజిటివిటీ రేటు 0.04 శాతంగా నమోదైనట్టు పేర్కొన్నారు. సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ఇంజెక్షన్ల ద్వారా మత్తు పదార్థాలు వినియోగించేవారు, ట్రాన్స్‌జెండర్స్, లారీ డ్రైవర్ల వంటి హైరిస్క్ వర్గాల వారికి ఏటా రెండుసార్లు హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు.

పొలిటికల్ గవర్నెన్సే ప్రభుత్వ విధానం

- టీడీపీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: పొలిటికల్ గవర్నెన్స్ తమ ప్రభుత్వ విధానమని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిపాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఆదివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. డిసెంబర్ నెల కార్యకలాపాల కోసం పార్టీ ప్రత్యేక క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. పెన్షన్ల పంపిణీ కోసం ఇంత వరకు రూ.50,763 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రజలకు సంతృప్తి కలిగించేందుకు 17 నెలలుగా తానే స్వయంగా పెన్షన్ పంపిణీలో పాల్గొంటున్నానని గుర్తు చేశారు. డిసెంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాపులు, 5న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ వంటి కార్యక్రమాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. కుటుంబాలకు మరింత లబ్ధి చేకూర్చేలా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. కొన్ని చోట్ల అనర్హులకు పెన్షన్లు అందుతున్నాయన్నారు. అర్హులైన పేద వారికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

అప్పుల బాధ తాళలేక ఇద్దరు రైతుల ఆత్మహత్య

మద్దయ్య (ఫైల్)

సత్యనారాయణరెడ్డి (ఫైల్)

మార్కాపురం/వెల్దుర్తి: టీడీపీ కూటమి ప్రభుత్వంలో రైతుల బలవన్మరణాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. పంట దిగుబడి రాక, ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వానికి చేతులు రాకపోవడంతో.. చేసిన అప్పులు తీర్చే దారిలేక రైతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కలుగొట్లకి చెందిన రైతు బోయ చింతమాను మద్దయ్య(55) తనకున్న 1.25 ఎకరాల పొలంతోపాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. గత ఏడాది సాగు చేసిన వేరుశనగ దిగుబడి రాలేదు. అధిక వర్షాలు, తుపానుల ప్రభావంతో ప్రస్తుతం సాగు చేసిన మొక్కజొన్న, ఉల్లి, పత్తి సైతం చేతికందలేదు. సాగు ఖర్చుల కోసం దాదాపు రూ.6 లక్షలు అప్పు చేసిన ఆయన... అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆదివారం ఉదయం తన పొలం సమీపంలోని దిబ్బకుంట ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రకాశం జిల్లాలో..

ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం కోలభీమునిపాడుకి చెందిన మందా సత్యనారాయణరెడ్డికి ఒక ఎకరా సొంత పొలం ఉంది. మరో 19 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, కంది పంటలు సాగు చేశాడు. వ్యవసాయం కోసం దాదాపు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. మొంథా తుపానుకు పంటలు పూర్తిగా దెబ్బతినడంతో అప్పులు తీర్చే దారిలేక నవంబర్ 26న పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య కోటేశ్వరమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

‘సోషల్’ టేకోవర్‌కు చెక్!

సిమ్ బైండింగ్ విధానాన్ని తెచ్చిన ‘డాట్’

- ఆ సిమ్ కార్డు ఉన్న ఫోన్ నుంచే సోషల్ మీడియా యాప్స్ సేవలు
- సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల
- మార్చి నుంచి కొత్త విధానం అమల్లోకి..

వాట్సాప్, టెలిగ్రాం తదితర సోషల్ మీడియా యాప్స్ టేకోవర్‌కు ఆస్కారం లేకుండా డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్) కీలక నిర్ణయం తీసుకుంది. వీటికి సిమ్ బైండింగ్ విధానం ప్రవేశపెట్టింది. 2026 మార్చి నుంచి అమలులోకి వచ్చే ఈ విధానంతో సైబర్ కేటుగాళ్లకు చెక్ పడటంతోపాటు పోలీసుల్ని తప్పుదోవ పట్టించే నేరగాళ్లనూ కట్టడి చేసే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన కీలక మార్గదర్శకాలను ‘డాట్’ శనివారం జారీ చేసింది.

సాక్షి, హైదరాబాద్

ఇప్పటి వరకు సాగుతోంది ఇలా...

సాధారణంగా ఎవరైనా ఒక స్మార్ట్‌ఫోన్‌లో వాట్సాప్, టెలిగ్రాం తదితరాలను యాక్టివేట్ చేసుకోవాలంటే ఆ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత వెరిఫికేషన్ కోడ్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ కోడ్‌ను వినియోగదారుడు పొందుపరిచిన నంబర్‌కే యాప్ నిర్వాహక సంస్థలు పంపిస్తుంటాయి. సదరు ఫోన్‌లో ఈ యాప్స్ పని చేయడానికి ఈ వెరిఫికేషన్ కోడే కీలకమే కానీ.. సిమ్‌తో పని లేదు. సిమ్ కార్డు ఎవరి వద్ద, ఏ ఫోన్‌లో ఉన్నప్పటికీ.. వెరిఫికేషన్ కోడ్ ఎంటర్ చేసే స్మార్ట్‌ఫోన్‌లో ఆయా యాప్స్ యాక్టివేట్ అయి పని చేస్తుంటాయి. దీన్ని తమకు అనువుగా మార్చుకుంటున్న సైబర్ కేటుగాళ్లు, ఇతర నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ చేసే సూత్రధారులు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉంటున్నారు. వీళ్లు వాట్సాప్, టెలిగ్రాంలను వాడే బాధితులకు ఎర వేస్తుంటారు. ఇలా చేయడానికి అవసరమైన నంబర్లను సామాన్యులు లేదా కమీషన్ల కోసం ఆశపడి వివరాలు అందించే వారి నంబర్లతో యాక్టివేట్ చేసుకుంటున్నారు. తమ ఫోన్‌లో యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత ఓ నంబర్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. వారికి కాల్ చేసి రకరకాలు కారణాలు చెప్తూ తమ లావాదేవీల్లో పొరపాటున మీ నెంబర్ ఎంటర్ చేశామని, దాంతో ఓటీపీ మీకే వస్తోందని అంటున్నారు.

వెరిఫికేషన్ కోడ్ అందడంతోనే...

ఇది నమ్మిన వాళ్లు ఓటీపీగా భావించి వెరిఫికేషన్ కోడ్ చెప్పేస్తున్నారు. దీంతో ఆ నంబర్‌తో తమ ఫోన్లలో ఆయా యాప్స్ యాక్టివేట్ చేసుకుంటున్నారు. ఆ వెంటనే వారి వాట్సాప్, టెలిగ్రాం డీపీలను కాపీ చేసి తమ దానికి పెట్టేస్తున్నారు. దీంతోపాటు సెక్యూరిటీ సెట్టింగ్స్‌ను మార్చేస్తూ టూ స్టెప్ వెరిఫికేషన్ యాక్టివేట్ చేస్తున్నారు. దీనివల్ల అసలు వ్యక్తి ఈ విషయం గుర్తించి తన ఫోన్‌లో వాట్సాప్‌ను మరోసారి యాక్టివేట్ చేసుకోవాలని భావించినా... అది సాధ్యం కాదు. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది నంబర్లను సైబర్ నేరగాళ్లు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. వాట్సాప్ బ్యాకప్ డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా వారి కాంటాక్ట్స్‌తోపాటు చాటింగ్స్‌ను తమ ఫోన్‌లోకి వచ్చేలా చేస్తున్నారు. ఆపై ఆ కాంటాక్ట్స్‌లో కొందరికి అత్యవసరంగా డబ్బు కావాలంటూ సందేశాలు పంపుతూ, మరికొందరికి హ్యాకింగ్ లింకులు సెండ్ చేస్తున్నారు. వైఫై లేదా వీపీఎన్ ద్వారా వీటిని వినియోగిస్తూ తమ ఉనికి బయటపడకుండా పోలీసుల్నీ తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఇకపై వారి ఆటలకు చెక్

డాట్ మార్గదర్శకాల ప్రకారం ఇకపై ఇలా సిమ్ ఓ ఫోన్‌లో ఉన్నప్పుడు ఆయా యాప్స్‌ను అదే ఫోన్‌లోనే యాక్టివేట్ చేసుకోవాలి. మరో ఫోన్‌లో యాక్టివేట్ చేసుకునే అవకాశం ఉండదు. కచ్చితంగా ఆ సిమ్ ఉన్న ఫోన్ నుంచి మాత్రమే యాప్స్‌ను వాడాల్సి వస్తుంది. సిమ్ బైండింగ్‌గా పిలిచే ఈ విధానం వల్ల యాప్స్ దుర్వినియోగం, సైబర్ నేరాలు కట్టడి చేసే అవకాశాలు ఉంటాయని అధికారులు చెప్తున్నారు. దీంతోపాటు వాట్సాప్ వెబ్ సైతం ప్రతి ఆరు గంటలకు ఆటోమేటిక్‌గా లాగౌట్ అయ్యే విధానమూ అందుబాటులోకి రానుంది.

విశాఖలో భూ దోపిడీ

- శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజం
- ఓపెన్ ఆక్షన్ లేకుండానే నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా కేటాయింపులు
- రియల్ ఎస్టేట్ సంస్థలకు మాత్రం ఎకరం 99 పైసలకే
- గిరిపుత్రులను, సంక్షేమ హాస్టళ్లను గాలికొదిలేశారు
- చంద్రబాబు పాలనలో తీవ్ర సంక్షోభంలో సాగు రంగం
- అమరావతిలో భూ దోపిడీ సహా త్వరలోనే ప్రజలకు అన్నీ అర్థమవుతాయి

మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, చిత్రంలో పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో భూ దోపిడీ జరుగుతోందని, ఓపెన్ ఆక్షన్ లేకుండానే నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా కేటాయింపులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. రియల్ ఎస్టేట్ సంస్థలకు మాత్రం ఎకరం 99 పైసలు, రూ.100కే కట్టబెడుతూ భూ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వంలో గుడ్ గవర్నెన్స్ అర్థమే మార్చేశారని, ఏ కార్యాలయానికి వెళ్లినా లంచం లేకుండా పని జరగడం లేదన్నారు. ఈ అవినీతి వెనుక అధికార పార్టీ నేతల లావాదేవీలే కారణమన్నారు. ఆదివారం ఆయన విశాఖ లాసన్స్‌బే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భూ కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వం తాజాగా రెండు జీవోలు జారీ చేయడంపై స్పందిస్తూ.. రహస్యంగా ఒప్పందాలు చేసుకుని, కోట్ల విలువైన భూములను పప్పుబెల్లాల్లా కేటాయిస్తుండటం దారుణం అని మండిపడ్డారు. గిరిజన ప్రాంతాల పిల్లలకు సరైన పౌష్టికాహారం ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. గిరిజన బాలింత మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించిన పాపాన పోలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లను పూర్తిగా గాలికొదిలేశారని.. పిల్లలు కలుషిత ఆహారం తిని అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చడం తప్ప ఈ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణ ఘనత వైఎస్సార్‌సీపీదే

భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణ ఘనత ముమ్మాటికీ వైఎస్సార్‌సీపీదే అని, వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే అన్ని అనుమతులతో విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభించామని స్పష్టం చేశారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం రోజున మండలి విపక్ష నేతకు ఆహ్వానం లేకుండా చేసి, ఈ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచిందని ఆక్షేపించారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో రైతులు, రైతు కూలీల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని, సాగు రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని, ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదన్నారు. మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలును మార్క్ ఫెడ్ ద్వారా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని నిలదీశారు. ‘ఉపాధి’ కూడా నీరుగారిపోయిందని చెప్పారు. భూసేకరణ పేరుతో అమరావతిలో జరుగుతున్న భూ దోపిడీ సహా అన్నీ త్వరలోనే ప్రజలకు అర్థమవుతాయని స్పష్టం చేశారు. భూసేకరణపై అమరావతి రైతుల విధానమే తమ విధానం అని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పడానికి కోటి సంతకాల కార్యక్రమానికి వస్తున్న స్పందనే నిదర్శనం అన్నారు. సిరిమాను జాతర సందర్భంగా వేదిక కూలడం, తన భద్రతపై ప్రభుత్వం అలసత్వం వహించడంపై గవర్నర్‌కు లేఖ రాశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ నేత మూగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే భూ కేటాయింపులు

‘మైరా.. మై హూనా’ కథనంపై పర్యాటక శాఖ స్పందన

- విశాఖ, మచిలీపట్నంలో మైరా సంస్థ ఒక్కటే ముందుకొచ్చిందని వివరణ
- ఈ సంస్థ వల్ల మంచి ఆదాయం వస్తుందని భావిస్తున్నామని వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యాటక, భూ కేటాయింపుల విధానం 2024–29ని అనుసరించే ప్రాజెక్టులకు భూ కేటాయింపులు చేస్తున్నట్టు పర్యాటక శాఖ తెలిపింది. ఇందులో భాగంగానే మైరా బే వ్యూ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖపట్నం, మచిలీపట్నంలో రెండు వేర్వేరు ప్రాజెక్టులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ఆర్‌వో) విలువ ప్రకారం 99 ఏళ్లకు భూములు ఇచ్చామని పేర్కొంది. ఆదివారం ‘సాక్షి’ దిన పత్రికలో ‘మైరా.. మై హూనా’ శీర్షికన ప్రచురితమైన కథనంపై పర్యాటక శాఖ స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ‘ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాం. విశాఖపట్నం, మచిలీపట్నంలో ప్రాజెక్టులు పెట్టేందుకు ప్రతిపాదించగా.. ఆ రెండు ప్రాంతాల్లోనూ కేవలం మైరా బే వ్యూ రిసార్ట్స్ సంస్థ నుంచి మాత్రమే ప్రతిపాదన వచ్చింది. ఈ నేపథ్యంలో 30 రోజులు వేచి చూసిన అనంతరం భూ కేటాయింపులు చేశాం. ప్రాజెక్టు విలువలో 25 శాతం నెట్‌వర్త్ మైరా బే వ్యూ ఫర్మ్‌కు ఉంది. విశాఖపట్నంలోని భీమిలి నుంచి భోగాపురం వరకు ప్రభుత్వం పర్యాటక కారిడార్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా మైరా ఫర్మ్ కొత్తవలసలో రూ.255.91 కోట్ల పెట్టుబడితో ముందుకొస్తే 15 ఎకరాలు కేటాయించాం. స్థానిక సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం ఎకరం రూ.3.63 కోట్లు (15 ఎకరాలకు రూ.54.45 కోట్లు)ఉంది. 99 ఏళ్ల లీజు ద్వారా రూ.130.78 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నాం. మరోవైపు 99 ఏళ్లలో రెవెన్యూ షేర్ ద్వారా రూ.216.63 కోట్లు వస్తుందని భావిస్తున్నాం. అంటే, విశాఖలో 99 ఏళ్లలో పర్యాటక శాఖకు రూ.347.41 కోట్లు వస్తుంది. మచిలీపట్నంలో లార్జ్ అమ్యూజ్‌మెంట్ పార్కు, రిసార్టు నిర్మాణానికి రూ.157.53 కోట్లు పెట్టుబడి పెడుతున్నందుకు తాళ్లపాలెంలో 20 ఎకరాలు కేటాయించాం. సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం ఎకరం రూ.26.67 లక్షలు (20 ఎకరాలు రూ.5.33 కోట్లు). ఇక్కడ లీజు రెంటు ద్వారా 99 ఏళ్లకు రూ.12.81 కోట్లు, రెవెన్యూ షేర్ ద్వారా రూ.119.17 కోట్లతో కలిపి మొత్తం రూ.131.98 కోట్లు వస్తుంది. మైరా ఫర్మ్ భాగస్వాములు రాయపూర్‌లో ఆరు ఆతిథ్య సంస్థల ద్వారా సేవలందిస్తున్నారు’ అని పేర్కొంది. అయితే, ప్రస్తుతం విశాఖలో మార్కెట్ రేటు ప్రకారం 15 ఎకరాల భూమి విలువ రూ.600 కోట్ల నుంచి రూ.750 కోట్లు కాగా, మచిలీపట్నంలో 20 ఎకరాల భూమి విలువ రూ.60 కోట్ల నుంచి రూ.100 కోట్లుగా ఉండటం గమనార్హం. కానీ, ప్రభుత్వం చెబుతున్న లీజురెంట్లు, రెవెన్యూ షేర్లు మార్కెట్ ఆర్థిక ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటాయి. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్ష ఉపాధి కల్పన కేవలం 880 మందికి మాత్రమే ఉండటం గమనార్హం.

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు

బలహీనపడుతున్న ‘దిత్వా’

▶ మొదటి పేజీ తరువాయి

చల్లగాలులు వీస్తుండటంతో చలి తీవ్రత పెరిగింది.

నేడు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు

తుపాను ప్రభావంతో సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

తిరుపతి జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం

దిత్వా తుపాను తిరుపతి జిల్లాను వణికిస్తోంది. జిల్లాలోని 24 మండలాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం తిరుపతి జిల్లాలోని అంగన్‌వాడీ స్కూల్స్‌తోపాటు అన్ని పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో తిరుమలలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందుజాగ్రత్తగా పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాలను టీటీడీ అధికారులు మూసివేశారు. తిరుమలలోని ఐదు డ్యామ్‌లు పూర్తిగా నిండినట్లు టీటీడీ వాటర్ వర్క్స్ ఈఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (ఫోన్ నంబర్ 0877 2236007)ను ఏర్పాటు చేశారు.

ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాల్లో..

ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం నుంచి చిరు జల్లులు కురుస్తున్నాయి. సోమ, మంగళవారాలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఒంగోలులోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలోనూ శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు వర్షం కురుస్తోంది. జిల్లాలో అత్యధికంగా ఒంటిమిట్టలో 25.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చే దశలో ఉన్న పంటలను వర్షం దెబ్బతీస్తుందని భయపడుతున్నారు.

తమిళనాడులో భారీ వర్షం.. ఆరుగురు మృతి

నాగపట్నంలో కుంభవృష్టి.. 23 సెం.మీ. వర్షపాతం నమోదు

దిత్వా తుపాను ప్రభావంతో తమిళనాడులోని కావేరి డెల్టా ప్రాంతంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు అతిభారీ వర్షం కురిసింది. కావేరి డెల్టా పరిధిలోని తిరువారూర్, రామనాథపురం జిల్లాల్లో భారీ వర్షం పడింది. అత్యధికంగా నాగపట్నంలో 23 సెం.మీ., మైలాడుతురైలో 20 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ ప్రాంతాల్లో ఆరుగురు మృతిచెందారు. గోడలు, ఇళ్లు కూలి రామనాథపురం జిల్లాలో ముగ్గురు, తూత్తుకూడి, నాగపట్నం జిల్లాల్లో ఒక్కొక్కరు, విద్యుత్ షాక్‌తో మైలాడుతురై జిల్లాలో ఒకరు మృతిచెందారు. దిత్వా తుపాను ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నాగపట్నం, కడలూరు మీదుగా పుదుచ్చేరి వైపునకు నెమ్మదిగా ప్రయాణించి కరైకాల్–పుదుచ్చేరి మధ్య బలహీన పడుతుండటంతో చెన్నై నగరంతోపాటు శివారు జిల్లాల్లో పెద్దగా వర్షం కురవలేదు.

విత్తన బిల్లుతో రైతుకు అపార నష్టం

- అమెరికాతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందాల కోసమే ఈ బిల్లు
- దేశంలోకి వెల్లువెత్తనున్న జన్యుమార్పిడి విత్తనాలు
- కేంద్ర విత్తనబిల్లు–2025పై రౌండ్‌టేబుల్ సమావేశం ఆందోళన

మాట్లాడుతున్న రైతు నాయకుడు కేశవరావు, చిత్రంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

సాక్షి,అమరావతి/కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొస్తున్న కేంద్ర విత్తన బిల్లు–2025ను వ్యతిరేకించాలని వ్యవసాయరంగ నిపుణులు, సీనియర్ శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. ఈ బిల్లు చట్టమైతే దేశంలోని రైతుల హక్కులను పూర్తిగా హరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి కేంద్రం ఈ చట్టం తీసుకొస్తోందని విమర్శించారు. కేంద్ర విత్తనబిల్లుకు వ్యతిరేకంగా ఏపీ రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ బిల్లుతో దేశంలోని రైతులకు, వ్యవసాయరంగానికి జరిగే నష్టాలను వారు వివరించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొస్తున్న ఈ బిల్లుపై రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం తమ వైఖరి ప్రకటించాలని కోరారు. రైతుల పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే.. ఈ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి

రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయరంగాన్ని కేంద్రం తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ఉద్దేశించిందే ఈ బిల్లు అని చెప్పారు. నిపుణులు, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ ముసాయిదాపై కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని తెలపాలని సూచించారు. రైతుసంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు సిద్ధమవుతున్న కేంద్రం రైతుల హక్కులను పణంగా పెడుతోందని విమర్శించారు. ఈ అగ్రిమెంట్ ద్వారా జన్యు మార్పిడి విత్తనాలను ఫ్రీగా మనదేశం దిగుమతి చేసుకోవాలని అమెరికా చూస్తోందన్నారు. ఈ బిల్లు చట్టమైతే నష్టపోయిన రైతులు కోర్టుకెళ్లడానికి కూడా వీలుండదని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేతలు బి.శరత్‌బాబు, వేణుగోపాల్, కొల్లా రాజమోహన్, రైతుసంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, రైతుసంఘం నాయకులు మర్రాపు సూర్యనారాయణ, వి.నరసింహారావు, జొన్న శివశంకర్, జములయ్య, కె.అజయ్‌కుమార్, కె.సురేష్‌బాబు, కె.గణేష్‌కుమార్, బొట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీలకు ▶ ముఖ ఆధారిత హాజరు

నేటి నుంచి పార్వతీపురం మన్యం, దేశంలోని మరో రెండు జిల్లాల్లో అమలు

- దొంగ మస్టర్ల కట్టడిలో భాగంగా వినూత్న విధానం
- పని జరిగే ప్రాంతంలో పది మీటర్ల పరిధిలో నమోదు
- నాలుగు గంటల వ్యవధిలో రోజులో రెండు విడతలు
- ఆ ఫొటో ఆధార్‌తో అనుసంధానం.. మ్యాచ్ అయితేనే బిల్లు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకంలో రోజువారీ పనులకు హాజరయ్యే కూలీలకు కూడా ఉద్యోగుల మాదిరి ముఖ ఆధారిత హాజరును నమోదు చేయనున్నారు. ఈ పథకంలో దొంగ మస్టర్ల కట్టడికి కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా మూడు రాష్ట్రాల్లోని ఒక్కో జిల్లాలో సోమవారం నుంచి అమలు చేయనుంది. ఇందులో మన రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లాను రాష్ట్ర అధికారులు ఇందుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే కూలీల నమోదును గ్రామాల్లో పనిచేసే ఫీల్డు అసిస్టెంట్లు లేదా మేట్‌లు రోజువారీగా నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేసుకొని, వారానికి ఒకసారి మండలాఫీసులోని ఉపాధి హామీ పథకం విభాగంలో అందజేస్తారు. ప్రస్తుత ప్రక్రియలో పనులకు హాజరయ్యే కూలీలను గ్రూపు ఫొటో తీసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ, మాన్యువల్ విధానంలో సమర్పించే రోజు వారీ మస్టరు షీట్లలో పేర్కొన్న కూలీల వివరాల మేరకే వేతన బిల్లులు రికార్డు చేస్తున్నారు. ముఖ ఆధారిత హాజరు కోసం ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశంలో ఆయా కూలీల ఫొటో తీసినప్పుడు, అది ఆ వ్యక్తి ఆధార్‌లో ఉన్న ఫొటోతో సరిపోయినప్పుడే అతని హాజరు నమోదవుతుందని అధికారులు చెబుతున్నారు. రెండు మూడు నెలల తర్వాత దేశమంతటా ఈ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉంది.

4 గంటల వ్యవధిలో రోజూ రెండుసార్లు

క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ పథకం అమలుకు ఉద్దేశించి పనిచేసే ఫీల్డు అసిసెంట్లు లేదా మేట్‌ల వద్ద ఉండే మొబైల్ యాప్‌లో కూలీలు ఫొటో దిగి తమ రోజు వారీ హాజరు నమోదు చేస్తారు. పని జరిగే ప్రాంతానికి గరిష్టంగా పది మీటర్ల పరిధి లోపు మాత్రమే ముఖ ఆధారిత హాజరు నమోదు చేసేలా కేంద్రం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఉదయం 11 గంటల లోపు ఒక విడత.. మరో నాలుగు గంటల తర్వాత రెండో విడత ఈ తరహాలో హాజరు నమోదు చేయనున్నారు. ఇలా హాజరు నమోదు చేసుకున్న వారికి మాత్రమే కేంద్ర ప్రభుత్వ పోర్టల్ వేతన బిల్లులను అనుమతిస్తుందని అధికార వర్గాలు వివరించాయి. ఇందులో భాగంగా కేంద్రం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసి, ఈకేవైసీ చేపట్టి, దాదాపు పూర్తి చేసింది. కాగా, ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ఇటీవల దాదాపు ఏడున్నర లక్షల కుటుంబాల జాబ్ కార్డులు తొలగించిన తర్వాత కూడా రాష్ట్రంలో 64.93 లక్షల కుటుంబాలకు సంబంధించి 1.13 కోట్ల మంది ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. సగటున 47 లక్షల కుటుంబాలు సుమారు రూ.7 వేల కోట్ల మేర లబ్ధి పొందుతున్నాయి. దేశ వ్యాప్తంగా 15.50 కోట్ల కుటుంబాలకు సంబంధించి 26.57 కోట్ల మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి.

ఒకరు వదిలి వెళ్లగల గొప్ప వారసత్వం ఏమిటంటే... వారి కృషి, సహకారాల వల్ల ప్రపంచం కాస్తయినా మెరుగై ఉండటం.

– కాకాసాహెబ్ కలేల్కర్

సాక్షి

సోమవారం, 1 డిసెంబర్ 2025

చిరంజీవి మానవుడు!

అమృతం తాగిన దేవతలకు మరణం ఉండదు. అందుకే దేవతలను అమర్త్యులన్నారు. మానవులకు మరణం తప్పదు. అందుకే మానవులను మర్త్యులన్నారు. మానవులే కాదు, భూమ్మీద పుట్టిన ప్రతిజీవి కాలం తీరాక కాలధర్మం చెందక తప్పదు. దేవతల మాదిరిగానే జరామరణాలను జయించాలనే కోరిక మానవులకు చిరకాలంగా ఉంది. అయితే, అది ఇప్పటి వరకు నెరవేరని కలగానే మిగిలి ఉంది.

అమరత్వ సాధన అసాధ్యమని ఎందరో శాస్త్రవేత్తలు, తత్త్వవేత్తలు కొట్టిపారేసినా, దీని కోసం మానవులు తరతరాలుగా కలలు కంటూనే ఉన్నారు. మానవాళికి గల ఈ చిరకాల స్వప్నానికి దేశవిదేశాల పురాణాలే నిదర్శనం. ప్రపంచంలోనే తొలి పురాణంగా చెప్పుకోదగిన 'గిల్గమేష్'లో రాజైన ఉరుక్ తన మిత్రుడు ఎంకిడు మరణం తర్వాత అమరత్వ సాధన కోసం విఫలాన్వేషణ సాగించాడు. మన పురాణాల్లో శుక్రాచార్యుడి శాపం వల్ల అకాల వార్ధక్యం పొందిన యయాతి– తన కొడుకు పురుడి వల్ల పునర్యవ్వనం పొందిన ఉదంతం మనకు తెలిసినదే!

పురాణ గాథలలో మినహా వాస్తవ జీవితంలో జరామరణాలను శాశ్వతంగా జయించిన వారెవరూ లేరు. సగటు మనిషి నూరేళ్లు బతకడమే గగనం. నిండు నూరేళ్లు బతకమనే కోరికతోనే 'శతాయుష్మాన్ భవ' అని పెద్దలు ఆశీర్వదిస్తూ ఉంటారు. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చాక మానవుల సగటు ఆయుర్దాయం ఇదివరకటి కంటే బాగా పెరిగింది. వైద్యశాస్త్రం చెప్పుకోదగిన పురోగతి సాధించిన ఇప్పటికాలంలోనూ ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే మనుషుల సగటు ఆయుర్దాయం డెబ్బయి మూడేళ్ల పైచిలుకు మాత్రమే! సంపన్న దేశాల్లో శతాయుష్కుల సంఖ్య నెమ్మదిగా పెరుగుతోంది. జపాన్‌లో శతాయుష్కుల సంఖ్య ఇటీవలే లక్షను దాటింది. పంతొమ్మిదో శతాబ్ది చివరినాళ్లలో పరమపదించిన త్రైలింగస్వామి దాదాపు మూడు వందల ఏళ్లు జీవించినట్లుగా చెబుతారు. అయితే, అందుకు నిర్దుష్టమైన ఆధారాలేవీ లేవు.

చరిత్రకెక్కిన ఆధారాల ప్రకారం చెప్పుకోవాలంటే, ఫ్రాన్స్‌కు చెందిన జాన్ కాల్మన్ అనే మహిళ నూట ఇరవై రెండేళ్ల నూట అరవై నాలుగు రోజులు బతికింది. ఇప్పటి వరకు ఆమె రికార్డును అధిగమించిన వారెవరూ లేరు. 'ఎవడు బతికాడు మూడు యాభైలు' అని మనకొక నానుడి ఉంది. నిండు నూరేళ్లు బతికిన వారున్నారే గాని, నూటయాభై ఏళ్లు బతికిన మనుషులెవరూ ఇప్పటి వరకు లేరు.

కరవు కాటకాలు, మహమ్మారులు, మాయరోగాలు, ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, యుద్ధాలు, అలజడుల వంటివి మనుషుల అకాల మరణాలకు కారణమవుతున్న నేపథ్యంలో మనిషి నిండు నూరేళ్లు బతకడమే ఘనత! అలాగని, ఇంతటితోనే మనుషులు సరిపెట్టుకోవడానికి మనుషులు సిద్ధంగా లేరు. యవ్వనాన్ని, జీవితకాలాన్ని వీలైనంతగా పొడిగించుకునే ప్రయత్నాలను, అంతిమంగా అమరత్వాన్ని సాధించే ప్రయత్నాలను విరమించుకోవడం లేదు. ఇలాంటి ప్రయత్నాలను సాగిస్తున్న వాళ్లలో అమెరికన్ సంపన్నుడు బ్రయాన్ జాన్సన్‌ను 'కలియుగ యయాతి'గా చెప్పుకోవచ్చు. ఇతగాడి వయసు నలభై ఎనిమిదేళ్లు. యవ్వనాన్ని పొడిగించుకునేందుకు బ్రయాన్ తన పదిహేడేళ్ల కొడుకు నెత్తురును ఎక్కించుకోవడం సహా నానా చికిత్సలు పొందుతూ కొన్నేళ్లుగా వార్తలకెక్కుతున్నాడు. బ్రయాన్ మహాశయుడు వ్యాపారవేత్తే గానీ, శాస్త్రవేత్త కాదు. అందువల్ల ఇతగాడి ప్రయత్నాలను జనాలు వెర్రిమొర్రి చేష్టలుగానే చూస్తున్నారు. అయితే, ఇటీవల 'లోన్వి బయోసైన్స్' అనే చైనీస్ కంపెనీ ఒక అద్భుత మాత్రను రూపొందించింది. దీనిని తీసుకుంటే, మనుషులు నిక్షేపంగా మూడు యాభైలు బతకగలరనీ, అనతికాలంలోనే దీనిని జనాలకు అందుబాటులోకి తీసుకువస్తామనీ సదరు కంపెనీ సీఈవో ఇప్ ఝు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, మరణించిన వారిని పునర్జీవితులను చేసే సాంకేతికత భవిష్యత్తులో అందుబాటులోకి రాగలదనే నమ్మకంతో 'క్రయోనిక్స్' ప్రయోగాలు కూడా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అలాంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చేంత వరకు మృతదేహాలను అతి శీతల వాతావరణంలో భద్రపరుస్తున్నారు. ఇదే గనుక సాధ్యమైతే రేపటి మానవుడు చిరంజీవి కాగలడేమో!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.ఏకాదశి ప.2.21 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** రేవతి రా.7.52 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.8.28 నుండి 9.59 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.16 నుండి 1.00 వరకు తదుపరి ప.2.27 నుండి 3.11 వరకు, **అమృత ఘడియలు:** సా.5.31 నుండి 7.04 వరకు, **గీతా జయంతి.**

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

పోరాటం

యుద్ధంలోకి దిగిన తర్వాత అది హింసాత్మకమైనా, అహింసాత్మకమైనా చివరి వరకు పోరాడాలి. ఇది నేను కార్మిక సంఘ కార్యకర్త అయిన నా తండ్రి నుండి నేర్చుకున్నాను. ఆమరణ నిరాహార దీక్ష కూడా పోరాటమే! లక్ష్యానికి నిబద్ధతను చేకూర్చే అంతిమ ప్రయత్నమది.

– మేధా పాట్కర్, సామాజిక కార్యకర్త

వికాసం

మనిషి ఒక పాత్ర నుండి మరొక పాత్రకు సౌకర్యవంతంగా మారిపోగల పరిస్థితులు సమాజంలో ఉండాలి. ఒక విలువ నుండి మరొక విలువకు, ఒక జీవితం నుండి ఇంకో జీవితానికి స్వేచ్ఛగా కొత్త దారులను ఎంపిక చేసుకోవడానికి హద్దులు ఉంటే మానవ వికాసం ఆగిపోతుంది.

– ఉల్లా ఎస్సెన్‌డ్రాప్, టీవీ ప్రెజెంటర్

కీలకం

ఆలోచనాపరులైనవారు నిరంతరం చర్చలు, సమావేశాలు నిర్వహిస్తూ ఉండాలి. పేదరికం, మహిళలపై హింసపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి. ఈ రెండు సమస్యలకు పరిష్కారం కనుగొనగలిగితే ఇతర సమస్యలన్నీ వాటంతటవే తగ్గుముఖం పడతాయి.

– షిరిన్ ఎం. రాయ్, రాజకీయ విశ్లేషకురాలు

బోధన

విషయజ్ఞానం కలిగిన గురువు మీకు తెలియని దాని గురించి అడగరు. మీకేమి తెలుసో అడిగి, ఆ తెలిసిన వాటి గురించి మిమ్మల్ని ప్రశ్నిస్తారు. అది మీలో తెలియని విషయాల పట్ల ఆసక్తిని రేకెత్తిస్తుంది. నేర్పటం కంటే నేర్చుకునేలా చేయటం శక్తిమంతమైన బోధన అవుతుంది.

– మంజూ బన్సల్, జీవ భౌతిక శాస్త్రవేత్త

సాధన



ఫీల్డింగ్‌లో మీరు అలసిపోయి ఉన్నప్పుడు కూడా క్యాచ్ పట్టవలసి రావచ్చు. మీరు డైవ్ చేయాల్సి రావచ్చు. బంతిని పట్టుకోవడానికి మీరు జర్రున జారవలసి రావచ్చు. ఆ సామర్థ్యం మీకు టెక్నిక్‌తో లభించదు. పదే పదే ప్రాక్టీస్ చేసి ఉన్నందువల్ల మాత్రమే సాధ్యం అవుతుంది.

– మొహమ్మద్ కైఫ్, మాజీ క్రికెటర్

స్థానం

మ్యూజిక్ ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటం చాలా కష్టం. నిష్ణాతులైన సంగీతకారులు మీకు గట్టి పోటీగా ఉంటారు. వారిని దాటి మీకో స్థానం సంపాదించుకోవాలంటే, ఇండస్ట్రీ అంతా ఒక్కసారిగా మీవైపు తలతిప్పి చూసేలా మీ దగ్గర ఏదైనా ప్రత్యేకత ఉండాలి.

– శివమణి, 'డ్రమ్స్' వాద్యకళాకారుడు

రైతుల హక్కుల మాటేమిటి?

విశ్లేషణ

డా॥ జి.వి. రామాంజనేయులు

దాదాపు రెండు దశాబ్దాల చర్చలు, కోర్టు కేసులు, విత్తన వైఫల్యాలు, పెరుగుతున్న సాగు వ్యయాల తర్వాత, భారత దేశం మరోసారి తన విత్తన చట్టాలను మార్చే దశకు వచ్చింది. 2004, 2019 ముసాయిదాల తర్వాత వచ్చిన విత్తనాల ముసాయిదా బిల్లు 2025 ఎన్నో ఆశలను రేకెత్తించింది. నేడు రైతులు ఎదుర్కొంటున్న అస్థిర విత్తన నాణ్యత, ఊగిసలాట ధరలు, పెరుగుతున్న కార్పొరేట్ ఆధిపత్యం వంటి భారాలను దృష్టిలో పెట్టుకుని రైతులను బలోపేతం చేస్తుందని అంతా ఆశించారు. కానీ ఈ బిల్లులో 'వ్యాపార సౌలభ్యం' (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)కు ఉన్న ప్రాధాన్యం, 'వ్యవసాయ సౌలభ్యం' (ఈజ్ ఆఫ్ ఫార్మింగ్)కు లేదు.

నష్టపోయిన రైతుల్ని వదిలేసి...

బిల్లులోని ఉద్దేశ్య వాక్యం దీని అసలు వైఖరిని తేటతెల్లం చేస్తోంది. ఇది 'నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరాను సులభతరం చేయుటకు' అని చెబుతుందే తప్ప, రైతుల హక్కులు, పంట నష్టపరిహారం, ధరల నియంత్రణ వంటి అంశాలపై ఒక్క మాటా లేదు. ఇది ముసాయిదాలో లోపం కాదు. ఇది చట్టం ఏ ధోరణిలో ఉన్నదో స్పష్టంగా తెలియజెబుతోంది. అసలు బిల్లే పరిశ్రమ – వాణిజ్య చట్టంలా కనిపిస్తుంది తప్ప, రైతుల హక్కుల చట్టంలా కాదు!

నాణ్యత నియంత్రణ బలోపేతం అవుతుందనీ, కేంద్రీకృత విత్తన ట్రేసబిలిటీ పోర్టల్ వస్తుందనీ బిల్లు మద్దతుదారులు చెబుతున్నారు. క్యూఆర్ కోడ్‌లు, డిజిటల్ ట్రేసింగ్– ఇవన్నీ కాగితంపై బానే కనబడతాయి. కానీ ఇవి న్యాయం సాధించడానికి సరిపోవు. ట్రేసబిలిటీ డేటా ఆధారంగా చెడు బ్యాచ్‌లు ఆటోమేటిక్‌గా వెనక్కి పోతాయనీ, పునరావృత దోషులను బ్లాక్ లిస్ట్‌లో పెడతారనీ, రైతులకు నష్టపరిహారం స్వయంచాలకంగా అందుతుందనీ బిల్లు ఎక్కడా నిర్దేశించలేదు.

విత్తనాల ముసాయిదా బిల్లులోని అత్యంత పెద్ద లోపం? రైతులకు చట్టబద్ధ, కాలపరిమితి ఉన్న నష్టపరిహారం వ్యవస్థ లేకపోవడం! తేలిక, చిన్న, పెద్ద తప్పులకు భారీ జరిమానాలు, జైలు శిక్ష వరకూ బిల్లు నిర్దేశిస్తోంది. కానీ ఆ జరిమానాలు రైతులకు కలిగిన నష్టాలను భర్తీ చేయలేవు. పాత, నాసిరకం, నకిలీ విత్తనం వల్ల పంటనష్టం జరిగిన రైతు, ఇంకా వినియోగదారుల కోర్టులకే వెళ్లాలి; సాక్ష్యాధారాలు సమర్పించాలి; సంవత్సరాల తరబడి కేసును లాగాలి. చిన్న రైతులకు ఇది సాధ్యం కాని వ్యవస్థ.

ధరల నియంత్రణపై చేతులెత్తేసి...

ధర నియంత్రణ విషయంలో కూడా బిల్లు బలహీనంగానే ఉంది. సెక్షన్ 22 ప్రకారం ధరలను కేవలం 'అత్యవసర పరిస్థితుల్లో' – అసాధారణ పెరుగుదల, కొరత, ఏకాధిపత్య ధోరణి సమయాల్లో మాత్రమే నియంత్రించవచ్చు. దీని అర్థం: సాధారణ పరిస్థితుల్లో విత్తన ధరలపై ప్రభుత్వం తన చేతులు దులుపుకొంటుంది. గతంలో రాష్ట్రాలు అత్యవసర ఉత్పత్తుల చట్టం కింద బీటీ కాటన్ ధరలు, రాయల్టీలను నియంత్రించిన చట్టపరమైన హక్కులు ఇప్పుడు క్షీణిస్తాయి. విత్తన మార్కెట్ ఇప్పటికే కొద్ది కంపెనీల చేతుల్లో ఉండగా, ఈ బలహీన నియంత్రణ రైతులపై మరింత భారాన్ని మోపుతుంది.

◆ 'విత్తనాల ముసాయిదా బిల్లు 2025'లోని అత్యంత పెద్ద లోపం? రైతులకు చట్టబద్ధ, కాలపరిమితి ఉన్న నష్టపరిహార వ్యవస్థ లేకపోవడం! పాత, నాసిరకం, నకిలీ విత్తనం వల్ల పంటనష్టం జరిగిన రైతు, ఇంకా వినియోగదారుల కోర్టుకే వెళ్లాలి; సాక్ష్యాధారాలు సమర్పించాలి; సంవత్సరాల తరబడి కేసు కోసం తిరగాలి. చిన్న రైతులకు ఇది సాధ్యం కాని వ్యవస్థ.

ఇంకో ప్రధాన సమస్య– ఈ బిల్లు కేంద్రాధిపత్యాన్ని బలపరచడం, రాష్ట్రాల హక్కులను బలహీన పరచటం! సెక్షన్ 17(8)లో సూచించిన 'కేంద్ర అక్రెడిటేషన్ వ్యవస్థ' వల్ల, ఒకసారి కేంద్రం నుండి అక్రెడిటేషన్ పొందిన కంపెనీలు అన్ని రాష్ట్రాల్లో ఆటోమేటిక్‌గా నమోదు అయినట్లే! రాష్ట్రాలు సాంకేతిక, ఆర్థిక, వసతి కారణాల మీద ఆ కంపెనీలను నిరాకరించలేవు. సెక్షన్‌లు 38, 41తో కలిపి చూస్తే, ఈ బిల్లు రాష్ట్రాల విత్తన పాలనా హక్కులను దాదాపుగా తొలగిస్తుంది.

వెరైటీ ట్రయల్స్, సర్టిఫికేషన్‌లో విదేశీ సంస్థలను అనుమతించే నిబంధనలు దీనికంటే ప్రమాదకరమైనవి. ఐసీఏఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాల స్థానిక శాస్త్రీయ పరీక్షలను పక్కన పెట్టి, విదేశీ ట్రయల్ డేటాకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భారత వాతావరణానికి సరిపోని వెరైటీలు వేగంగా మార్కెట్లోకి రావచ్చు. ఇది విత్తన స్వావలంబనకు ముప్పు. జన్యుమార్పిడి పంటలు (జీఎం) లేదా 'ప్రొప్రైటరీ హైబ్రిడ్స్' నిర్బంధం లేకుండా ప్రవేశించే పరిస్థితి వస్తుంది.

కమ్యూనిటీ విత్తన వ్యవస్థలు, ఇప్పటికీ అనేక పంటలలో ప్రధాన విత్తన వనరుల గురించి బిల్లులో కేవలం ప్రస్తావన స్థాయిలోనే చూపారు. రైతు–బ్రీడర్ల హక్కులు, ఎఫ్‌పీఓలు చేసే స్థానిక విత్తన వ్యాపారం, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు–వీటిని బలపరచడంలో బిల్లు పూర్తిగా విఫలమైంది. కాంట్రాక్ట్ ఆధారంగా విత్తనాలు ఉత్పత్తి చేసే విత్తన రైతుల హక్కులను కూడా పూర్తిగా పట్టించుకోలేదు.

పాలనా నిర్మాణం అంతా కూడా కేంద్రీకృతమైపోయింది. రైతుల ప్రతినిధులు సెంట్రల్ కమిటీలో కొన్ని రొటేటింగ్ సీట్లు పొందినా, ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదా గ్రీవెన్స్ రిడ్రెస్సల్ వ్యవస్థల్లో వారికి ప్రత్యక్ష పాత్ర లేదు. దీని వల్ల పెద్ద కంపెనీలు వ్యవస్థను సులభంగా తమ వైపు తిప్పుకోగలవు. చిన్న డీలర్లు, చిన్న కంపెనీలు మాత్రమే నియంత్రణ బరువును మోస్తాయి.

మరి బిల్లు ఎలా ఉండాలి?

నిజమైన రైతు కేంద్రీకృత విత్తన చట్టం ఎలా ఉండాలంటే: 1. నష్ట పరిహారం ఆటోమేటిక్ కాల పరిమితితో, పంట నష్టానికి అనుసంధానంగా ఉండాలి. కంపెనీల నుంచే సీడ్ లయబిలిటీ ఫండ్ ఏర్పడాలి. 2. విత్తన ధరలు, రాయల్టీలను శాశ్వతంగా నియంత్రించే స్వతంత్ర సంస్థ ఉండాలి. అందులో రైతులు, రాష్ట్రాలు, శాస్త్రవేత్తలకు భాగస్వామ్యం ఉండాలి. 3. స్థానిక అవసరాల ప్రకారం విత్తన రకాలను అనుమతించడానికి/నిరాకరించడానికి రాష్ట్రాలకు పూర్ణ అధికారం ఉండాలి. 4. రైతు బ్రీడర్లను, కమ్యూనిటీ సీడ్ వ్యవస్థలను బలపరచాలి. 5. సీడ్ ప్రొడ్యూసర్ రైతులకు న్యాయమైన కాంట్రాక్టులు, కచ్చితమైన చెల్లింపులు, రక్షణ ఇవ్వాలి. 6. లెసెన్సింగ్, ట్రేసబిలిటీ రెండూ తప్పనిసరి కావాలి. 7. జెర్మినేషన్, పేరెంటేజ్, రాయల్టీ, రిజిస్ట్రేషన్ వివరాలపై పూర్తి పారదర్శకత ఉండాలి. 8. 'పీపీవీ అండ్ ఎఫ్ఆర్' చట్టంలోని రైతుల హక్కులు బలపడాలి తప్ప బలహీనపడకూడదు.

'విత్తనాల బిల్లు 2025' భారత విత్తన వ్యవస్థను సమానత్వం, ప్రతిస్పందనశీలత, స్వావలంబన దిశగా మలిచే అవకాశం. కానీ బిల్లు రైతుల రక్షణ కంటే వ్యాపార నిర్వహణ సులభతరంపై ఎక్కువ దృష్టి పెట్టినట్లయితే, ఆ అవకాశం వృథా అవుతుంది. బిల్లుకు తుది రూపం దిద్దేముందు రైతు సంఘాలు, రాష్ట్రాలు, శాస్త్ర సమాజం, ప్రజా పరిశోధనా సంస్థలతో కేంద్రం అర్థవంతమైన సంప్రదింపులు జరపాలి. విత్తనం వేస్తున్న రైతు ప్రమాదం భరించాల్సిన చివరి వ్యక్తి కాకుండా ఉండేలా చట్టాన్ని పునర్నిర్మించాలి.

వ్యాసకర్త 'సుస్థిర వ్యవసాయ కేంద్రం' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

అంతిమంగా రష్యాకు మేలు...

అభిప్రాయం

బుడ్డిగ జమిందార్

రష్యా ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని విరమించేందుకు 28 అంశాలతో కూడిన శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో యుద్ధం ఆగుతుందనే ఆశలు చిగురిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగటానికి ప్రధాన కారణాల్లో ఒకటి ఉక్రెయిన్ 'నాటో' సభ్యత్వం స్వీకరించకూడదనేది. అమెరికా, పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌లో 'నాటో' స్థావరాలను స్థాపించి మాస్కో పొలిమేర్ల వరకూ అమెరికా మిలిటరీ క్షిపణుల్ని మోహరించే ప్రయత్నంలో భాగంగా 'నాటో'లో సభ్యత్వానికి ఉక్రెయిన్‌ను ప్రోత్సహించాయి. దీంతో తన ఆత్మరక్షణ కోసం ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగింది రష్యా.

ఉక్రెయిన్ తూర్పు భాగంలో 25 శాతం భూభాగాన్ని రష్యన్ సేనలు ఆక్రమించాయి. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మిత్రులు అవినీతి ఆరోపణల్లో ఇరుక్కున్నారు. ఉక్రెయిన్ ప్రధాన పట్టణాలను ఆక్రమించి రాజధాని కీవ్ దిశగా రష్యన్ సేనలు దూసుకెళుతున్నాయి. 'మీరు శాంతియుతంగా లొంగకపోతే ఉక్రెయిన్‌ను నామరూపాలు లేకుండా చేస్తామ'ని రష్యా హెచ్చరిస్తోంది. ఈ తరుణంలో యుద్ధాన్ని ప్రోత్సహించిన అమెరికాయే ఇప్పుడు ట్రంప్ రూపంలో శాంతి ప్రతిపాదనలు తెరపైకి తెచ్చి, ఉక్రెయిన్ ఓటమి నుంచి బయటపడే మార్గాల్ని అన్వేషిస్తోంది.

28 శాంతి ప్రతిపాదనల్లో ప్రధానంగా 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియా ద్వీపకల్పాన్ని వాస్తవ రష్యన్ నియంత్రణ ప్రాంతంగా గుర్తించి... అమెరికా గుర్తింపుతో సహా అంతర్జాతీయ గుర్తింపును పొందేలా చూడాలి. యుద్ధంలో రష్యా వశపరచుకున్న డొనెట్స్క్ పొరుగున ఉన్న లుహాన్స్క్ ప్రాంతాలను రష్యాకు ఇవ్వాలి. రష్యా నియంత్రణలో ఉన్న ప్రాంతాల కంటే ఎక్కువ ప్రాంతాన్ని ఉక్రెయిన్ ఇవ్వాలి. అక్కడ మిగిలి ఉన్న ఉక్రెయిన్ ట్రూపులను వెనుకకు పిలవాలి. 'నాటో సభ్యత్వాన్ని కోరను' అని ఉక్రెయిన్ చేయాలని చెబుతున్న ప్రతిజ్ఞను ఈ శాంతి ముసాయిదాలో చేర్చారు. ఇందుకోసం ఉక్రెయిన్ రాజ్యాంగాన్ని కూడా మార్చాలి. ప్రతిఫలంగా ఉక్రెయిన్ భద్రతా హామీలను పొందుతుంది. ఉక్రెయిన్‌లో విదేశీ మిలిటరీ స్థావరాలు కానీ, దూరపు శ్రేణి క్షిపణులను కానీ మోహరించ కూడదు. ఉక్రెయిన్ ఆర్మీని 6 లక్షలకు మించకుండా కుదించడం, 'నాటో' ఇకపై రష్యా వైపు విస్తరించదనీ, రష్యా ఇకపై పొరుగు దేశాలపై దాడి చేయకూడదనీ ఈ ముసాయిదాలో ఉన్నాయి. ఉక్రెయిన్ పారిశ్రామిక వాడలన్నీ రష్యా స్వాధీనంలో ఉన్నాయి. ఉక్రెయిన్ అణుశక్తిగా ఎన్నటికీ ఉండకూడదు. యుద్ధ నష్టపరిహారం వంటివి ఇరువైపులా ఉండవు. రష్యాపై ఆంక్షలను ఎత్తివేసి, 2014లో తొలగించిన జీ8 దేశాల కూటమిలో సభ్యత్వం తిరిగి ఇస్తారు. ఉక్రెయిన్‌లో 100 రోజులలోగా అధ్యక్ష ఎన్నికలు జరగాలి.

యూరోపియన్ యూనియన్ అధికారులు మాత్రం ఈ శాంతి ప్రణాళిక కోసం తమతో సంప్రదించలేదనీ, ఇది రష్యా అనుకూల ప్రణాళిక అనీ అంటున్నారు. 4 సంవత్సరాల క్రితం ఈ ప్రతిపాదనల్ని ఒప్పుకొని ఉంటే యుద్ధమే ఉండేది కాదు. ఇంత విధ్వంసమే జరిగేది కాదు. లక్షలాది మంది పశ్చిమ యూరప్‌కు వలసలు పోయేవారు కాదు. ఐతే బ్యాంకుల్లో స్తంభించిన 30,000 కోట్ల డాలర్ల రష్యా కరెన్సీ గురించి ఇంకా స్పష్టత రాలేదు. శాంతి ఒడంబడిక జరిగితే అంతిమ విజేతగా రష్యా నిలవనుంది. రష్యాను బలహీనపర్చి, రష్యాను విభజించి వలస దేశంగా మార్చి ఖనిజ సంపదను దోచుకోవాలన్న అమెరికా, పశ్చిమ దేశాల ఆశలు అడియాసలుగా మిగిలిపోతాయి.

పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థ దిగజారుడులో ఉంది. పరిశ్రమలు సంక్షోభంలోకి వెళ్తూ ఐఎంఎఫ్ నుంచి ఆర్థిక సహాయానికి కూడా వెళ్లాలనే ఆలోచనలో యూకే ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో యుద్ధాన్ని ఆపటం ద్వారా అమెరికా, మిత్రదేశాలు తమ పరువును కాపాడుకొనే ప్రయత్నంలో ఉన్నాయనడం సముచితం.

వ్యాసకర్త 'ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం' జాతీయ కార్యవర్గ సభ్యులు

ఆయనదొక శకం!

ఇన్ బాక్స్

ఆధునిక తెలుగు పత్రికా రచనకు ప్రామాణికమైన నవ్యతను తీసుకువచ్చిన పాత్రికేయులు, హేతువాది నార్ల వెంకటేశ్వరరావు. వి.ఆర్. నార్లగా ఆయన ప్రసిద్ధులు. పత్రికలకు రచనలే కాకుండా ఎన్నో కథలు, నాటకాలు రచించి పాఠకుల విశేష ఆదరణ పొందారు. 1908 డిసెంబర్ 1న మధ్యప్రదేశ్ జబల్పూర్‌లో లక్ష్మణరావు, మహాలక్ష్మి దంపతులకు ఆయన జన్మించారు.

1928లో ముద్దూరి అన్నపూర్ణయ్య ప్రచురించే 'కాంగ్రెస్' పత్రికలో ఆయన రాసిన తొలి ఉత్తరం ప్రచురితమైంది. స్వరాజ్య, జనవాణి, ప్రజామిత్ర, ఆంధ్రప్రభ వంటి అలనాటి తెలుగు పత్రికలలో ఆయన పాత్రికేయునిగా పనిచేశారు. 1938– 1959 మధ్యకాలంలో ప్రచురణ మాధ్యమ న్యూస్ ఎడిటర్‌గా, ఎడిటర్‌గా బాధ్యతలను నిర్వహిస్తూ రచనా పరంగా అనేక నూతన మార్పులకు పత్రికలలో శ్రీకారం చుట్టారు. పత్రికా సంపాదకుడిగా ఛాందస విశ్వాసాలతో రాజీలేని పోరాటం చేసి వాస్తవాలను నిగ్గుతేల్చి నిజాయతీ, నిబద్ధత, నిర్భీతితో ఆయన వృత్తి నిర్వహణ చేశారు. ఇంగ్లీషును ఆధారం చేసుకుని తెలుగులో రాసే మూసలో వెళ్తున్న జర్నలిజానికి ప్రజల వ్యవహారిక భాషను చేరువ చేశారు. మహాత్మా గాంధీ, పుచ్చలపల్లి సుందరయ్య, త్రిపురనేని గోపీచంద్ వంటి ప్రముఖులు చనిపోయినప్పుడు నార్ల రాసిన సంపాదకీయాలు ఎంతో అమూల్యమైనవిగా పేరొందాయి. ముక్కుసూటిగా రాయడం ఆయన నైజం. పౌర హక్కులు, మానవ హక్కుల విలువలు సమాజంలో తప్పనిసరిగా ఉండాలని కోరుకున్న వ్యక్తి. 'పత్రికొక్కటున్న పదివేల సైన్యము, పత్రికొక్కటున్న మిత్ర కోటి, ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న' అని ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల ప్రాధాన్యాన్ని విశదపరిచిన దార్శనికుడాయన.

నార్ల వెంకటేశ్వరరావు

1958 ఏప్రిల్ 3 నుండి 1970 ఏప్రిల్ 2 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా ప్రజా ప్రయోజనకరమైన అనేక అంశాలపై మాట్లాడారు. 1981లో ఆయన రచించిన 'సీత జోస్యం' నాటకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 1983లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సలహాదారుగా పనిచేశారు. సంపాదకుడిగా తనదైన శకాన్ని ఆవిష్కరించిన నార్ల 1985 ఫిబ్రవరి 16న గుండెపోటుతో కన్నుమూశారు. విరామ మెరుగని ప్రజాక్షర పోరాట యజ్ఞం చేసిన నార్ల ఈ ఆధునిక కాలపు మహోన్నత పత్రికాచార్యుడు.

– డా॥ తిరునగరి శ్రీనివాస్ । సాహిత్య విమర్శకుడు

(నేడు నార్ల వెంకటేశ్వరరావు జయంతి)

వాసి తగ్గినా... రాశి పెరిగింది!

'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ – సస్టెయినబిలిటీ 2026'లో ఈ ఏడాది మన దేశంలోని 103 వర్సిటీలు స్థానం సంపాదించాయి. గత ఏడాది ఈ సంఖ్య 78.



ఒకటే మాట!

జ్యోతిర్మయం

గురువు మరణశయ్యపై ఉన్నారు. ఆయన శిష్యుడు దిగులుతో కనిపించాడు. గురువు అతనిని చూసి 'శిష్యా నువ్వెందుకు ఆందోళన చెందుతున్నావు? నేను ఎల్లప్పుడూ నీకు అండగా ఉంటాను. చింతించకు' అన్నారు.

శిష్యుడు 'గురుదేవా! మీరు చెప్పినట్లుగా నేను ధ్యానం, జపం అన్నీ చేస్తున్నాను. కానీ నేను ఎప్పుడు అత్యున్నత ఆధ్యాత్మిక స్థాయికి చేరుకుంటానో తెలియడం లేదు. నేను నా ఆధ్యాత్మిక సాధనను ఎంతకాలం కొనసాగించగలను? మీ తర్వాత నేను ఎవరిని అడగాలి?' అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

'చింతించకు! ఈ మంచం కింద ఒక పెట్టె ఉంది. దాని లోపల నేను భవిష్యత్తులో నీకు బోధించాల్సిన దానిని ఉంచాను. అది నీకు అన్నీ నేర్పుతుంది. నీకు నా బోధనలు అవసరమైనప్పుడు మాత్రమే పెట్టె తెరచి చూడాలి. నీకు నా ఆశీస్సులు' అన్నారు గురువు.

రోజులు గడుస్తున్నాయి. శిష్యుడికి తన ఆధ్యాత్మిక సాధన నుండి పెద్దగా ప్రయోజనం పొందుతున్నట్లు అనిపించడం లేదు. ధ్యానం, జపం మానేయాలా, వద్దా అని ఆలోచనలో పడ్డాడు. గురువు తనకిచ్చిన పెట్టె తెరిచాడు. అందులోని వాక్యాన్ని చదివిన శిష్యుడు జ్ఞానోదయం పొందాడు.

'మళ్ళీ ప్రయత్నించు' అనే ఒక్క మాటే ఆ పెట్టెలోని తాళపత్రంపై రాసి ఉంది. నిజానికి ఆధ్యాత్మిక సాధనలో ఉన్న వారందరికీ తోడ్పడే మాట ఇది. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనతో పైకెదగాలి. ఇంకా సరళంగా చెప్పాలంటే, ఒక గురువు మనకోసం వంట చేయగలరు. తినిపించగలరు కూడా! కానీ మనమేగా దానిని జీర్ణించుకోవాల్సింది!!

– యామిజాల జగదీశ్

కృష్ణాలోకి కెమికిల్!

దాచేపల్లి వద్ద కృష్ణా నదిలో ప్రమాదకర రసాయనాల తెట్టు

- కెమికల్, సిమెంట్ కంపెనీల వ్యర్థ రసాయనాలను నదిలో వదిలేసినట్లు అనుమానం
- రంగుమారి కలుషితమైన నీరు... తీవ్ర దుర్వాసన
- నదిలో నీటిని పట్టుకుంటుంటే చేతులు మండుతున్నాయంటున్న మత్స్యకారులు
- భయాందోళనలకు గురవుతున్న స్థానికులు

పల్నాడు జిల్లా ఏలియంపేట వద్ద కృష్ణా నదిలో తేలాడుతున్న రసాయనాల తెట్టు

దాచేపల్లి: కృష్ణానదిలో ప్రమాదకర రసాయనాల తెట్టు ప్రజలను కలవర పెడుతోంది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ, ఏలియంపేట గ్రామాల వద్ద కృష్ణానదిలో ఇటీవల భారీగా రసాయనాల తెట్టుని స్థానికులు గుర్తించారు. నీటిపై రంగురంగులుగా రసాయనాల తెట్టు తేలియాడుతూ దిగువకు వెళుతోంది. కొన్నిచోట్ల నది ఒడ్డుకు వచ్చి పేరుకుపోయింది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో నదిలోని నీరు రంగు మారిపోయింది. రకరకాల రంగులు, కెమికల్స్ కలిసి ఉండటంతో ఆ తెట్టు పేరుకుపోయిన ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వస్తోంది. తెట్టు ఉన్న ప్రాంతంలో నీటిని పట్టుకుంటే చేతులు మంటలు వస్తున్నాయని నదిలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు చెబుతున్నారు. దాచేపల్లి మండల పరిధిలో ఉన్న కెమికల్, సిమెంట్ పరిశ్రమల నుంచి రసాయనాల వ్యర్థాలు తెచ్చి నదిలో పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ నీటిని తాగితే ప్రాణాలు పోతాయని భయాందోళనలకు గురవుతున్నారు.

ఆ నీరే ప్రజలకు సరఫరా

కృష్ణానది నుంచి తంగెడ గ్రామంలోని సుమారు 6వేల మంది ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. పైలట్ ప్రాజెక్ట్ ద్వారా నదిలో నీటిని పంపింగ్ చేసి పైపుల ద్వారా ట్యాంకుల్లో నింపి అక్కడ నుంచి కుళాయిల ద్వారా తాగునీటిని ఇళ్లకు సరఫరా చేస్తారు. కొద్ది రోజులుగా కృష్ణానదిలో రసాయనాల తెట్టు ప్రవహిస్తున్నప్పటికీ అధికారులు ఆ నీటినే ప్రజలకు సరఫరా చేస్తున్నారు. కృష్ణానది ఒడ్డునే ఏలియంపేట గ్రామం ఉంది. ఇక్కడున్న 50 కుటుంబాలవారు నదిలో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వీరు పూర్తిస్థాయిలో కృష్ణానది నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు నదిలోని నీటిని తాగుతున్న వారంతా తమకు ఏమవుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు కృష్ణానదికి అవతలి వైపు ఉన్న తెలంగాణలోని కొన్ని గ్రామాల వెంట కూడా నదిలో ఈ రసాయనాల తెట్టు కనిపిస్తోంది.

అధికారుల ఆరా... నది నుంచి నీటి సరఫరా నిలిపివేత

కృష్ణానది నీటిలో రసాయనాలు కలవటంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఎక్కడ నుంచి అయినా రసాయనాలు తెచ్చి ఇక్కడ నదిలో వదిలేశారా? దాచేపల్లి మండల పరిధిలో ఎక్కువగా ఉన్న కెమికల్, సిమెంట్ పరిశ్రమల వారే వ్యర్థ రసాయనాలను నదిలో కలిపేశారా? అనే దానిపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆరా తీస్తున్నారు. మూడు విభాగాల అధికారులు ఆదివారం తంగెడ గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామానికి నది నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. గ్రామంలోని బోర్ల ద్వారా నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు.

వివాహితపై లైంగిక దాడి

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో శనివారం రాత్రి ఒక వివాహితపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. మండలంలోని వినగడపకు చెందిన వివాహిత తోటమూలలోని ఓ కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తోంది. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు తోటమూల సెంటర్లో ఆటో కోసం వేచి ఉండగా, కార్ల సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకుడు చెన్నోజు అశోకచారి, మెకానిక్ రాజేష్ కారులో ఆమె వద్దకు వచ్చారు. తాము ఇంటివద్ద దింపుతామని నమ్మించి ఆమెను కారులో ఎక్కించుకున్నారు. గంపలగూడెం శివారులో ఆమెకు కూల్‌డ్రింక్‌లో మద్యం కలిపి తాగించారు. అనంతరం లైంగిక దాడికి పాల్పడ్డారు. వివాహిత ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

కనకదుర్గమ్మ సేవలో న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి

భవానీపురం (విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం జస్టిస్ జ్యోతిర్మయికి వేద పండితులు.. ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

అన్ని దానాల కన్నా విద్యా దానమే గొప్పది

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్

మాదాపూర్: అన్ని దానాలలో విద్యాదానం ఎంతో గొప్పదని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) క్యాంపస్‌లోని ఆడిటోరియంలో ఆదివారం 'వదాన్య' స్వచ్ఛంద సంస్థ 15వ వార్షికోత్సవం జరిగింది. దీనికి హాజరైన జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ..విద్య అంతిమ లక్ష్యం మనిషిని ధనవంతుని చేయడం కాదని, జ్ఞానవంతుడిగా మార్చడమని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు డిజిటల్ టీచింగ్ విధానం ద్వారా విద్యను బోధిస్తున్నందుకు వదాన్య సంస్థను అభినందించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి జయ ప్రకాశ్‌నారాయణ్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగమే సర్వస్వం అనుకున్న వారు పరమ మూర్ఖులని అన్నారు. మన దేశంలో ఉన్న డిగ్రీలు ప్రపంచంలో ఎక్కడా లేవన్నారు. సమాజం కోరేది నైపుణ్యం, సృజనాత్మకత అని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.మాధవిలత, 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ డి.రామేశ్వరరావు, వదాన్య సంస్థ ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ రామకృష్ణప్రసాద్ తదితరులు

రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సువర్ణరాజు

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా మద్యం ఏరులై పారుతోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం తాడేపల్లిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం గతంకంటే ఎక్కువ మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చి, మద్యం విక్రయించే సమయాన్ని కూడా పెంచిందన్నారు. ఇది చాలదన్నట్లు ప్రతి గ్రామంలో, ప్రతి సందులో టీడీపీ నేతలు బెల్టు షాపులు నిర్వహిస్తూ బడుగు, బహుజనుల బిడ్డలను మరింతగా మద్యానికి బానిసలుగా చేస్తున్నారని చెప్పారు. 24 గంటలూ పల్లెల్లో మద్యం లభిస్తుండటంతో పేద, బడుగు వర్గాల ప్రజలు మద్యానికి బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కనీసం బెల్టుషాపుల నిర్వహణపై, మద్యం అమ్మకాలపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలకు అరికట్టకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అక్క కంట నీరు చూడలేక..బావ, అత్త హత్య

- పట్టపగలు ఇంట్లోనే కత్తులతో పొడిచి, నరికి చంపిన పాలిటెక్నిక్ విద్యార్థి, అతడి స్నేహితులు
- కుటుంబకలహాల నేపథ్యంలో దురాగతం
- నిందితుల్లో ఒక యువకుడు, ఇద్దరు బాలురు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో ఆదివారం పట్టపగలు తల్లి, కొడుకు హత్యకు గురయ్యారు. దొప్పలపూడి సాంబశివరావు (30), కృష్ణకుమారి (55)పై మారణాయుధాలతో దాడిచేసిన ముగ్గురు.. కత్తులతో పొడిచి, నరికి చంపేశారు. స్థానికుల కథనం మేరకు.. ధూళిపాళ్ల గ్రామానికి చెందిన దొప్పలపూడి వీరయ్య, కృష్ణకుమారి దంపతులకు కుమారుడు సాంబశివరావు, కుమార్తె మౌనిక ఉన్నారు. మౌనికను ముప్పాళ్ల మండలం పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. తాడికొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సాంబశివరావుకు 2022లో నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన చెరుకూరి రఘుబాబు కుమార్తె సాహితితో వివాహం చేశారు. సాంబశివరావు, సాహితి దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. రెండేళ్లపాటు కేసులు పెట్టుకుని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగారు. ఈ క్రమంలో ఆరునెలల కిందట విడాకులు తీసుకున్నారు. సాంబశివరావు తాను పనిచేస్తున్న తాడికొండలోనే ఉంటూ వారానికి ఒకసారి తల్లిదండ్రుల వద్దకు వచ్చి వెళుతున్నాడు. ఈ క్రమంలో శనివారం నిత్యావసర సరుకులు తీసుకుని ధూళిపాళ్ల వచ్చాడు.

సాంబశివరావు, కృష్ణకుమారి(ఫైల్)

తన సోదరిని హింసించారని..

తన సోదరి వైవాహిక జీవితంలో భర్త, అత్త, మామ కలిసి శారీరకంగా, మానసికంగా వేధించారని వారిపై సాహితి సోదరుడు చెరుకూరి రోహిత్‌చౌదరి కక్ష పెంచుకున్నాడు. ఆ ముగ్గురిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రత్తిపాడు మండలం చోడవరంలోని కళ్లం హరినాథ్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న రోహిత్‌చౌదరి.. చిలకలూరిపేటలోని పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో తనకు స్నేహితులైన ఇద్దరు బాలురకు ఈ విషయం చెప్పాడు. గుంటూరు నారాయణ జూనియర్ కళాశాలలోను, చిలకలూరిపేట శ్రీచైతన్య జూనియర్ కళాశాలలోను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆ ఇద్దరితో కలిసి హత్యలకు పథకం వేశాడు. ఆదివారం సాంబశివరావు ధూళిపాళ్లలో ఇంట్లో ఉన్నట్లు తెలుసుకున్న రోహిత్‌చౌదరి తన స్నేహితులిద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆ ఇంటివద్దకు చేరుకున్నాడు. సాంబశివరావు ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా, తల్లి కృష్ణకుమారి ఇంట్లోనే ఉంది. ఒక్కసారిగా మారణాయుధాలతో దాడిచేసిన ముగ్గురు.. వారిద్దరిని కత్తులతో పొడిచి, తలపై నరికి.. ద్విచక్రవాహనంపై పరారయ్యారు. సాంబశివరావు ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. కొన ఊపిరితో ఉన్న కృష్ణకుమారిని స్థానికులు 108 వాహనంలో సత్తెనపల్లిలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైనవైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు చెప్పారు. అప్పటివరకు ఇంట్లో ఉన్న దొప్పలపూడి వీరయ్య బజారుకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.హైమారావు, ఎస్ఐ షేక్ అమీరుద్దీన్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సాంబశివరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పట్టపగలు ఇంట్లో ఉన్న తల్లి, కుమారులను దారుణంగా హత్యచేయడం కలకలం సృష్టించింది. పరారైన ముగ్గురు నిందితులను గ్రామస్తులు, పోలీసులు కలిసి నకరికల్లు మండలం చాగల్లు గ్రామంలో పట్టుకున్నట్లు తెలిసింది.

GOVERNMENT OF ANDHRA PRADESH
GSWS Department
RFP No. RT 320/2025-ADMIN-GSWS-HK&WMs, Dt. 26.11.2025
RFP is floated inviting bids from the interested bidders to provide man-power services for Housekeeping and Watchmen to the Directorate of GSWS Department, Nirman Bhavan, Auto Nagar, Vijayawada. For details, please visit https://tender.apeprocurement.gov.in from 12.00 PM onwards on 01.12.2025
Sd/- DIRECTOR, GSWSD
DIPR RO No. 4613PP/CL/ADVT/1/1/2021-22, Dt: 28.11.2025

భారత ఎన్నికల సంఘం దేశంలోని 12 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా యొక్క ప్రత్యేక విస్తృత సవరణ నిర్వహిస్తున్నది

అర్హతగల ఏ ఓటరును విడిచిపెట్టరాదు.
అనర్హత గల ఏ ఓటరును చేర్చరాదు



ECINet
పౌరుల కోసం ఒక సింగిల్ యూనిఫైడ్ మొబైల్ యాప్
ఓటరు సేవలకు సంబంధించి 40+ యాప్స్/వెబ్‌సైట్స్‌ను ఏకీకృతం చేస్తుంది

తుది SIR జాబితాలో మీ పేరు చెక్ చేసుకోవడానికి దిగువ విధానం అనుసరించండి

వెబ్‌సైట్ ద్వారా
- Voters.eci.gov.in దర్శించండి
- "Search your name in Last SIR" ఆప్షన్ సెలక్ట్ చేయండి
- మీ సమాచారం నింపండి
  - రాష్ట్రం సెలక్ట్ చేయండి
  - ఓటరు పేరు ఎంటర్ చేయండి
  - క్యాప్చా నింపి, సెర్చ్‌పై క్లిక్ చేయండి
- సరియైన సెర్చ్ కోసం బంధువుల పేరు సెలక్ట్ చేయండి ; మరింత సరియైన సెర్చ్ కోసం జిల్లా/అసెంబ్లీ నియోజక వర్గం (AC)/పార్ట్ సెలక్ట్ చేయండి

ECINet యాప్ ద్వారా
- ECINet డౌన్‌లోడ్ చేసుకుని, ఓటర్ రిజిస్ట్రేషన్ ఫారంలపై క్లిక్ చేయండి
- "Search your name in Last SIR" ఆప్షన్ సెలక్ట్ చేయండి
- మీ సమాచారం నింపండి
  - రాష్ట్రం సెలక్ట్ చేయండి
  - ఓటరు పేరు ఎంటర్ చేయండి
  - క్యాప్చా నింపి, సెర్చ్‌పై క్లిక్ చేయండి
- సరియైన సెర్చ్ కోసం బంధువుల పేరు సెలక్ట్ చేయండి : మరింత సరియైన సెర్చ్ కోసం జిల్లా/అసెంబ్లీ నియోజక వర్గం (AC)/పార్ట్ సెలక్ట్ చేయండి

మీ ఎన్యూమరేషన్ ఫారం ఆన్‌లైన్‌లో నింపండి

ECI వెబ్‌సైట్ https://voters.eci.gov.in/ దర్శించండి
- OTP ద్వారా రిజిస్టర్డ్ మొబైల్ నంబరు, EPIC లేదా ఇ-మెయిల్‌తో లాగిన్ కావలెను
- SERVICES ట్యాబ్ క్రింద ఫిల్ యువర్ ఎన్యూమరేషన్ ఫారంపై క్లిక్ చేయండి
- మీ రాష్ట్రం సెలక్ట్ చేసి, EPIC నంబరు నింపి మీ ప్రీ-ఫిల్డ్ ఎన్యూమరేషన్ ఫారం ఓపెన్ చేయండి
- మీరు భారతదేశం వెలుపల ఉంటే, ఓవర్సీస్ ఎలక్టర్స్ పై క్లిక్ చేసి వివరాలు నింపండి

ECINet యాప్
- యాప్ స్టోర్ దర్శించండి
- ECINet యాప్ డౌన్‌లోడ్ చేయండి
- ఓటర్ సర్వీసెస్ సెక్షన్ దర్శించండి మరియు ఓటర్ రిజిస్ట్రేషన్ ఫారంపై క్లిక్ చేయండి

- ప్రీ-ఫిల్డ్ ఎన్యూమరేషన్ ఫారంలో మీ సమాచారాన్ని పరిశీలించండి
- మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబరు ఎంటర్ చేసి, OTP ద్వారా పూర్తి ఎన్యూమరేషన్ ఫారం నింపండి
- ఎన్యూమరేషన్ ఫారంలో మీ సమాచారం పరిశీలించండి, తుది SIR నుండి లింకింగ్ చేయండి. పూర్తి వివరాలు నింపి ఫోటో అప్‌లోడ్ చేయండి
- ప్రివ్యూలో పూర్తి సమాచారమును పరిశీలించి, సబ్మిట్ ఎన్యూమరేషన్ ఫారంపై క్లిక్ చేయండి
- E-సైన్ చేసి ఎన్యూమరేషన్ ఫారం విజయవంతంగా దాఖలు చేసిన తరువాత రసీదు డౌన్‌లోడ్ చేయండి

ముఖ్యమైన తేదీలు

ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేయుకాలము:	4 నవంబర్-11 డిసెంబర్ 2025
ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ:	16 డిసెంబర్ 2025
క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు కాలము:	16 డిసెంబర్ 2025-15 జనవరి 2026
నోటీసు దశ:	16 డిసెంబర్ 2025-7 ఫిబ్రవరి 2026
తుది ఓటరు జాబితా ప్రచురణ:	14 ఫిబ్రవరి 2026

దర్శించండి ECI వెబ్‌సైట్
https://voters.eci.gov.in/

CBC 52101/13/0012/2526

fb.com/ECI | @ecisveep | youtube.com/eci | Election Commission of India | @ecisveep | Election Commission of India

నేటి నుంచి సభా సమరం

డిసెంబర్ 19 వరకు శీతాకాల సమావేశాలు

- 'ఎస్ఐఆర్'పై ప్రభుత్వాన్ని నిలదీయడానికి సిద్ధమైన విపక్షాలు
- కీలక అంశాలను ప్రస్తావించాలని నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ఆరంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకు మొత్తం 15 రోజులపాటు సమావేశాలు కొనసాగుతాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభల్లో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇటీవల మరణించిన ఎంపీలకు తొలుత సంతాపం తెలియజేస్తారు. అనంతరం సభా కార్యకలాపాలు మొదలవుతాయి. ఈసారి శీతాకాల సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై పార్లమెంట్‌లో చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎస్ఐఆర్‌పై ప్రభుత్వాన్ని ఐక్యంగా నిలదీయడానికి విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఢిల్లీలో కారుబాంబు పేలుడు ఘటన నేపథ్యంలో దేశ భద్రతపై మోదీ సర్కార్‌ను ఇరుకున పెట్టాలని నిర్ణయించుకున్నాయి. విదేశాంగ విధానం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, నూతన లేబర్ కోడ్స్, బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు ఇవ్వకపోవడం వంటి అంశాలతోపాటు ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. వందేమాతరం గీతానికి 150 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో పార్లమెంట్‌లో ఈ అంశంపై ప్రత్యేక చర్చ చేపట్టబోతున్నారు.

పార్లమెంట్‌లో 14 బిల్లులు

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 14 బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(రెండో సవరణ) బిల్లు–2025, సెంట్రల్ ఎక్సైజ్(సవరణ) బిల్లు–2025, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు–2025, పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేట్ సంస్థలకు భాగస్వామ్యం కల్పించే బిల్లు, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు–2025, ఉన్నత విద్యా కమిషన్ బిల్లు–2025ను జన్ విశ్వాస్(నిబంధనల సవరణ) బిల్లు, దివాళా, దివాళా కోడ్ (సవరణ) బిల్లు, పారదర్శకంగా భూసేకరణ కోసం జాతీయ రహదారుల(సవరణ) బిల్లు, కంపెనీల చట్టం సవరించడానికి కార్పొరేట్ చట్టాలు(సవరణ) బిల్లులు వంటివి ఉన్నాయి. ఇటీవల వివిధ పార్టీల అభ్యంతరాల తర్వాత, చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్రపతి నేరుగా నిబంధనలు జారీ చేసే అధికారం కల్పించే బిల్లును ప్రభుత్వం విరమించుకున్న విషయం తెలిసిందే.

బీఏసీ భేటీలో గళమెత్తిన ప్రతిపక్షాలు

లోక్‌సభ, రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు ఆదివారం నిర్వహించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల మొదటి రోజైన సోమవారం రాజ్యసభలో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై స్వల్ప కాల చర్చ చేపట్టాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీలోని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అధ్యక్షతన ఆదివారం ఈ కమిటీ సమావేశమైంది. సభ సజావుగా సాగేందుకు సహకరిస్తామని చెప్పిన ప్రతిపక్ష నేతలు ఎస్ఐఆర్ అంశాన్ని ప్రస్తావించారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నికల సంస్కరణలపై చర్చ జరపాలని కోరారు. చర్చ జరపకుంటే, సభా కార్యకలాపాలకు కలిగే అంతరాయానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని కూడా వారు స్పష్టం చేశారు. ఈ అంశానికి ఎన్నికల సంస్కరణలు లేదా ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత వంటి పేరు పెట్టుకోవచ్చన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు పార్లమెంట్ సమావేశాలు జరగనుండటం తెల్సిందే.

సభకు సహకరించండి

- అఖిలపక్ష భేటీలో కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- 36 పార్టీలకు చెందిన 50 మంది సభ్యులు హాజరు
- ఎస్ఐఆర్ సహా ముఖ్యమైన అంశాలపై చర్చించాలని డిమాండ్

అఖిపక్ష సమావేశానికి వస్తున్న మంత్రులు రాజ్‌నాథ్, నడ్డా, రిజిజు తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా జరిగేలా ప్రతిపక్షాలు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. 36 రాజకీయ పార్టీలకు చెందిన 50 మంది సభ్యులు హాజరయ్యారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్‌తోపాటు కాంగ్రెస్ తరఫున జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, వైఎస్సార్‌సీపీ తరఫున పి.మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆర్జేడీ తరఫున మనోజ్ ఝా, డీఎంకే నుంచి టీఆర్ బాలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి డెరెక్ ఓబ్రియన్, కల్యాణ్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ తరఫున రాంగోపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్, జాతీయ భద్రత, వాయు కాలుష్యం, ఢిల్లీ బాంబు పేలుళ్ల వంటి అంశాలపై పార్లమెంట్‌లో చర్చించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రాష్ట్ర విభజన వ్యవహారాలు, విశాఖ స్టీల్ ప్లాంట్, ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం వంటి అంశాలపై చర్చ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి చేసింది. ఎస్ఐఆర్ అంశానికి అన్నింటికంటే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రత్యేకంగా చర్చించాలని తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పట్టుబట్టాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎలాంటి అలజడి లేకుండా నిర్మాణాత్మక చర్చలు జరగాలని కోరుకుంటున్నామని, ఇందుకోసం అన్ని పార్టీలతో సంప్రదింపులు జరుపుతామని ప్రభుత్వం వెల్లడించింది.

అంతరాయం కలిగించవద్దు: కిరణ్ రిజిజు

పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం కలిగించకూడదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. సభ సక్రమంగా జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఇందుకోసం అందరి సహకారాన్ని అర్థిస్తున్నామని తెలిపారు. ఎస్ఐఆర్‌పై పార్లమెంట్‌లో చర్చిస్తారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఈ అంశంపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకోనున్నట్లు బదులిచ్చారు. ప్రతిపక్షాలు చక్కటి సలహాలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని అన్నారు. విపక్షాలు లేవనెత్తే అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు.

ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే కుట్రలు: గౌరవ్ గొగోయ్

ప్రధాని మోదీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు. పార్లమెంటరీ సంప్రదాయాలను అంతం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అఖిలపక్ష భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించకుండా దాటవేలయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోందని అన్నారు. శీతాకాల సమావేశాల్లో కీలక అంశాలపై చర్చించాల్సిందేనని, లేకపోతే సభను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

సమావేశాలు 15 రోజులేనా?: జైరాం రమేశ్

శీతాకాల సమావేశాలను కేవలం 15 రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. తక్కువ సమయంలో ముఖ్యమైన అంశాలపై, బిల్లులపై చర్చించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీన్నిబట్టి మోదీ సర్కార్ ఉద్దేశం ఏమిటో అర్థం చేసుకోవచ్చని వెల్లడించారు.

సోనియా, రాహుల్‌పై కేసు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీని చిరకాలంగా వెంటాడుతున్న నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌పై ఢిల్లీ పోలీసులు ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈడీ ఫిర్యాదు ఆధారంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. వారితోపాటు ఈ కేసులో సహ నిందితులైన కాంగ్రెస్ నేతలు సుమన్ దుబే, శామ్ పిట్రోడాతో పాటు యంగ్ ఇండియన్, అసోసియేటెడ్ జర్నల్స్, దాని ప్రమోటర్ సునీల్ భండారీ తదితరులపై ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. వారిపై ఐపీసీ 120 బి (నేరపూరిత కుట్ర), 406 (నమ్మకద్రోహం), 403 (ఆస్తులు కాజేయడం), 420 (మోసం) సెక్షన్లు మోపారు. మనీ లాండరింగ్ నిరోధకచట్టంలోని 66(2) సెక్షన్ ప్రకారం దఖలు పడ్డ అధికారాలను ఉపయోగించుకుని ఎఫ్ఐఆర్ దాఖలు దిశగా ఈడీ చర్యలు తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎఫ్ఐఆర్ నమోదుపై కాంగ్రెస్, బీజేపీ పరస్పర దూషణలకు దిగాయి. బోగస్ కేసును అడ్డుపెట్టుకుని సోనియా, రాహుల్‌ను వేధించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చౌకబారు రాజకీయాలకు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, అభిషేక్ సింఘ్వీ, ప్రమోద్ తివారీ తదితరులు మండిపడ్డారు. వారు ఎంతటి అభద్రతా భావంలో ఉన్నదీ దీన్నిబట్టి మరోసారి రుజువవుతోందన్నారు. వారి ఆరోపణలను బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ తోసిపుచ్చారు.

సున్నితత్వం పెంచుకోండి

- జనాభిప్రాయాన్ని మార్చండి
- పోలీసులకు మోదీ హితవు
- విచ్ఛిన్న శక్తులపై డేగకన్ను

రాయ్‌పూర్: పోలీసులంటే ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఉన్న భావనను ఎంతగానో మెరుగుపరచాల్సిన అవసరముందని ప్రధాని మోదీ అన్నారు. ''అది జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసులదే. అందుకోసం వారే సున్నితత్వం, జవాబుదారీతనం పెంచుకోవాలి''అని ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఆ శాఖలో ప్రొఫెషనలిజం మరింత మెరుగవాలని ఆకాంక్షించారు. రాయ్‌పూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన డీజీపీలు, ఐజీల 60వ అఖిల భారత సదస్సును ఉద్దేశించి ఆదివారం ఆయన ప్రసంగించారు. విచ్ఛిన్న కార్యకలాపాలకు పాల్పడేందుకు పొంచి ఉన్న నిషేధిత శక్తులపై నిత్యం డేగ కన్నుంచడం కూడా అత్యవసరమని ఉద్బోధించారు. వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తమైన ప్రాంతాల సమగ్రాభివృద్ధిలో పోలీసులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అప్పుడే ప్రజల్లో వారిపట్ల మరింత సదభిప్రాయం కలుగుతుందని గుర్తు చేశారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో సువిశాలమైన భారత తీర రక్షణను మరింత బలోపేతం చేసేందుకు వినూత్న చర్యలు చేపట్టాల్సిన అవసరం కూడా ఎంతో ఉందని చెప్పారు. 'వికసిత భారతం: భద్రతా కోణాలు' ప్రధానాంశంగా ఈ సదస్సు జరిగింది. డ్రగ్స్ భూతం కట్టడి మొదలుకుని తీర రక్షణ దాకా విభిన్నాంశాలపై మూడు రోజుల పాటు లోతైన చర్చ జరిగింది. విజన్ 2047 సాకారానికి పోలీసులపరంగా తీసుకోవాల్సిన పలు చర్యలు ప్రస్తావనకు వచ్చాయి. హిడ్మా తదితర మావోయిస్టు అగ్రనేతలను పోలీసులు ఇటీవలే ఎన్‌కౌంటర్ చేసిన నేపథ్యంలో ఛత్తీసగఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో సదస్సు జరగడం గమనార్హం. అర్బన్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, పర్యాటక పోలీసింగ్‌ను మరింత స్నేహశీలంగా మార్చడం, కొత్తగా వచ్చిన భారత న్యాయ చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయడం తదితరాలపై పోలీసులు బాగా దృష్టి సారించాలని మోదీ హితవు పలికారు. ప్రాకృతిక విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకునే విషయంలోనూ పోలీసులు ముందు వరుసలో నిలవాలన్నారు. పోలీసు విచారణల్లో ఫోరెన్సిక్ వాడకంపై కేస్ స్టడీలు రూపొందించాల్సిందిగా యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలకు పలుపునిచ్చారు. ఇంటలిజెన్స్ బ్యూరోకు చెందిన అధికారులకు రాష్ట్రపతి పోలీసు మెడల్స్‌ను మోదీ ఈ సందర్భంగా ప్రదానం చేశారు. అర్బన్ పోలీసింగ్‌లో అత్యుత్తమంగా నిలిచిన నగరాలకు తొలిసారిగా ప్రవేశపెట్టిన అవార్డులను అందజేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల డీజీపీలు, ఐజీలు, కేంద్ర పోలీసు బలగాల సారథులు తదితరులు సదస్సులో పాల్గొన్నారు. మరో 700 మందికి పైగా పోలీసు ఉన్నతాధికారులు వర్చువల్‌గా ఈ కీలక సదస్సులో భాగం పంచుకోవడం విశేషం.

ఎస్ఐఆర్ గడువు వారం పొడిగింపు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) షెడ్యూల్‌లో మార్పులు చేసింది. ఓటర్ల జాబితాలో సమగ్రత, పారదర్శకతను పెంచేందుకు చేపట్టిన ఈ ప్రక్రియను మరో వారంపాటు పొడిగించింది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ సహా మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ పొడిగింపు వర్తించనుంది. ఎస్ఐఆర్‌లో భాగంగా దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీ డిసెంబర్ 4 కాగా, పొడిగింపుతో 11 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. పరిశీలనల అనంతరం 2026 ఫిబ్రవరి 14న తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించనుంది. ఈ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారులతో చర్చించిన అనంతరం కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ స్పందించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు షెడ్యూల్‌లో మార్పులు చేయడం చూస్తే.. సభలో ఎస్ఐఆర్‌పై చర్చించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను పక్కన పెట్టడానికి ప్రభుత్వం కుట్రలు సాగిస్తున్నట్లు అర్థమవుతోందని విమర్శించింది. గోవాలో 90 వేల నకిలీ ఓట్లున్నట్లు ఎస్ఐఆర్‌లో తేలిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సంజయ్ గోయెల్ తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లిపోయినవారు, మరణించిన వారితోపాటు నకిలీ ఓట్లు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందు నవంబర్ 4న రాష్ట్రంలో మొత్తం 11,85,000 ఓటర్లున్నారని, ఎస్ఐఆర్ తరువాత కేవలం 10,55,000 దరఖాస్తులు మాత్రమే ఎన్నికల సంఘానికి అందాయని తెలిపారు. ఇంకా 40 వేల దరఖాస్తులు కమిషన్‌కు రాలేదని వెల్లడించారు.

పెళ్లి వేడుకలో కాల్పుల మోత

ఇద్దరు అతిథులు మృత్యువాత

లుధియానా: పంజాబ్‌లోని లుధియానాలో శనివారం రాత్రి పెళ్లి వేడుకకు వచ్చిన వైరి వర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో అతిథులిద్దరు చనిపోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పఖోవల్ రోడ్డులో జరిగే పెళ్లికి వరుడు ప్రత్యర్థి వర్గాల వారికి ఆహ్వానం పంపించాడు. పెళ్లి జరుగుతున్న సమయంలో వేదిక వద్ద రెండు గ్రూపులు ఎదురుపడ్డాయి. ఏదో విషయమై వారి మధ్య గొడవ ముదిరింది. పరస్పరం కాల్పులకు దిగారు. కనీసం 20 రౌండ్ల వరకు కాల్చారు. పెళ్లికి హాజరైన ఇద్దరు వ్యక్తులు బుల్లెట్లు తగిలి చనిపోయారు. పోలీసుల రాకతో రెండు గ్రూపులు అక్కడి నుంచి పరారయ్యాయి. వీరిని పెళ్లికి ఆహ్వానించిన వరుడితోపాటు భద్రతా నిబంధనలను పాటించని ఫంక్షన్ హాల్ నిర్వాహకుడిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ భూమికి ఏమైంది?

ఈ భూమికి ఏమైంది? వరుస భూకంపాలు. బీభత్సమైన వరదలు. కార్చిచ్చులు. అగ్నిపర్వతాల పేలుళ్లు. ప్రపంచంలో ఏదో ఒక మూల నిత్యం విపత్తులే. పెను ప్రాకృతిక ఉత్పాతాలే. ఈ ప్రమాదకర ధోరణి కొన్నాళ్లుగా మరీ పెరిగిపోతూ వస్తోంది. ముఖ్యంగా మరో నెల రోజుల్లో కాలగర్భంలో కలిసిపోనున్న 2025ను అయితే విపత్తునామ సంవత్సరం అన్నా అతిశయోక్తి కాదేమో! దీనికితోడు, వచ్చే ఏడాది పరిస్థితులు పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా ఉంటాయన్న హెచ్చరికలు మరింత గుబులు రేపుతున్నాయి...

- నిత్య విపత్తుల కొలిమిలో ప్రపంచం
- భూకంపాలు, వరదలు, కార్చిచ్చులు
- విపత్తునామ సంవత్సరంగా 2025
- వచ్చే ఏడు మరిన్ని విపత్తులే!

12 వేల ఏళ్లకు ఒకసారి మాత్రమే వచ్చేంతటి తీవ్రతతో కూడిన భారీ అగ్ని పర్వత పేలుడు ఇండోనేసియాను తాజాగా అతలాకుతలం చేసి వదిలింది. దాని ధాటికి చెలరేగిన బూడిద మేఘాలు భారత్, చైనా దాకా వ్యాపించాయి. వాటి తాలూకు కలకలం, భయాందోళనలు ఇంకా సద్దుమణగనేలేదు! అదే ఇండొనేసియా కేవలం గత 30 రోజుల్లో ఏకంగా 1,400 పై చిలుకు భూకంపాలను చవిచూసింది. ఈ వర్షాకాలంలో బెంబేలెత్తించే స్థాయి వరదలు ఇటు భారత్‌లోనూ, అటు పాక్‌లోనూ తీవ్ర విధ్వంసానికి, పంట నష్టం తదితరాలకు దారితీశాయి. ఇక అగ్రరాజ్యం అమెరికాలో కాలిఫోర్నియా తదితర రాష్ట్రాలను పెను కార్చిచ్చులు భస్మీపటలం చేసినంత పని చేశాయి. ఇవి చాలవన్నట్టు గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతటి తీవ్రతతో కూడిన సౌర తుపాను భూమిని వణికించి వదిలింది. 2025లో ప్రపంచానికి చెమటలు పట్టించిన ప్రాకృతిక విపత్తుల్లో ఇవి కొన్ని మాత్రమే. ఈ ఏడాది కాలగర్భంలో కలిసేందుకు ఇంకా నెల రోజులకు పైగా ఉంది. ఈ 30 రోజుల్లో మరిన్ని విపత్తులు ముంచుకురావడం ఖాయమన్న సైంటిస్టుల హెచ్చరికలు మరింతగా భయపెడుతున్నాయి. వీటి వెనక ప్రాకృతిక నిమిత్తాలు కొన్నున్నా, ప్రధాన కారణం మాత్రమే మనిషి దురాశేనని సైంటిస్టులు మొదలుకుని పర్యావరణవేత్తల దాకా అంతా ముక్త కంఠంతో మొత్తుకుంటున్నారు.

వామ్మో భూకంపాలు!

2025ను భూకంపనామ సంవత్సరంగా కూడా చెప్పవచ్చేమో. పసిఫిక్‌లోని రింగ్ ఆఫ్ ఫైర్, సమీప ప్రాంతాలన్నీ నిత్యం భూకంపాలతో చిగురుటాకుల్లా వణుకుతూ కాలం గడిపాయి. మార్చిలో మయన్మార్‌లో సంభవించిన 7.7 తీవ్రతతో కూడిన భూకంపం 5,500 మందికి పైగా పొట్టన పెట్టుకుంది. ఆగస్టులో అఫ్గానిస్తాన్‌లో వచ్చిన భూకంపానికి అధికారిక లెక్కల ప్రకారమే 2,500 మందికి పైగా బలయ్యారు. వాస్తవ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని అక్కడి అధికారులే అంగీకరించారు. ఇవేగాక 7కు మించిన తీవ్రతతోనే 2025లో ప్రపంచవ్యాప్తంగా కనీసం మరో 10 భూకంపాలు సంభవించాయి. అంతకు తక్కువ తీవ్రతతో కూడిన వాటి సంఖ్య అయితే చెప్పనవసరమే లేదు.

అక్షరాలా 'అగ్ని'పర్వతాలే!

ఇక అగ్నిపర్వతాల పేలుళ్లు ఈ ఏడాది రికార్డులు బద్దలు కొట్టాయి. గత నెలలో ఇథియోపియాలోని హైలీ గుబ్బీ అగ్నిపర్వతం గత 12 వేల ఏళ్లలో తొలిసారిగా బద్దలై ఆశ్చర్యపరిచింది. దాంతో అటు ఎర్రసముద్రం నుంచి ఇటు అరేబియా దాకా విమాన సేవలకు కూడా అంతరాయం కలిగింది. అగ్నిపర్వతాల పేలుళ్లకు భూకంపాలతో అతి సన్నిహిత సంబంధముందని రూర్కీ ఐఐటీలో అర్త్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ సందీప్ సింగ్ వివరించారు. ''భూకంపం వల్ల భూమి లోపలి భాగం తీవ్ర కుదుపులకు లోనవుతుంది. ఫలితంగా ద్రవ రూపంలో ఉండే మాగ్మా పైకి తన్నుకురావడం మొదలవుతుంది. దాంతో దాని చుట్టూ ఉండే రాళ్లు తదితరాలు కుదుపులకు లోనవుతాయి. అగ్నిపర్వత ప్రాంతాల్లో ఇది ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. సూర్యుడు కూడా సౌర చక్ర క్రమంలో ప్రస్తుతం ఉత్కృష్ట దశకు చేరుతున్నాడు. దాంతో సౌరతుపాన్లు తరచూ వచ్చి పడుతున్నాయి. ఇవన్నీ కూడా భూమిపై వాతావరణాన్ని బాగా ప్రభావితం చేస్తున్నాయి. అంతేగాక మరిన్ని ప్రాకృతిక విపత్తులకు కారణంగా మారుతున్నాయి. అంతేకాదు, రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థలు, విద్యుత్ గ్రిడ్లు, అంతరిక్షంలోని ఉపగ్రహాల పనితీరు తదితరాలన్నింటినీ ప్రభావితం చేస్తున్నాయి. అలా పలు దేశాలు భారీ ఆర్థిక నష్టాల బారిన పడేందుకు కారణమవుతున్నాయి.

బాబోయ్ వరదలు!

ఇక వరదలు, కార్చిచ్చులైతే ఈ ఏడాది ప్రపంచమంతటినీ అతలాకుతలం చేసి వదిలాయి. భారత్, పాకిస్తాన్‌తో పాటు మలేసియా, థాయ్‌లాండ్ తదితర దేశాలెన్నో వీటి బారిన పడి అల్లాడాయి. అతి కొద్ది సమయంలోనే కుండపోతతో విలయం సృష్టించే క్లౌడ్ బరస్టులు రానురానూ ఈ దేశాల్లో పరిపాటిగా మారుతుండటం 2025లో కొట్టొచ్చినట్టుగా కన్పించిన మరో ప్రమాదకర పరిణామం. ఇవన్నీ రానున్న పెను ముప్పులకు హెచ్చరిక సంకేతాలుగానే కనిపిస్తున్నాయి. హిమ ప్రాంతాలన్నింట్లోనూ మంచు శరవేగంగా కరిగిపోతోంది. తాగు, సాగు అవసరాల నిమిత్తం నదీజలాలను రిజర్వాయర్లలో వీలైనంతగా బంధించే ధోరణి ప్రపంచ దేశాలన్నింట్లోనూ నానాటికీ పెరిగిపోతోంది. వీటికి తోడు సగటు భూ ఉష్ణోగ్రతలో కూడా శరవేగంగా వృద్ధి నమోదవుతూ మరింతగా భయపెడుతోంది. పారిశ్రామికీకరణ ముందు నాటితో పోలిస్తే అదిప్పటికే ఒక డిగ్రీ సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా పెరిగిపోయి డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ''భూమి తాలూకు కీలక వ్యవస్థలన్నీ అతలాకుతలం అవుతున్నాయి. మనిషి అత్యాశ తమపై మోపుతున్న మోయలేని భారానికి తమ ప్రతిస్పందనను ఇలా పలు ప్రాకృతిక విపత్తుల రూపంలో వ్యక్తం చేస్తున్నాయి. ఈ హెచ్చరిక సంకేతాలను ఇప్పటికైనా అర్థం చేసుకోకుంటే మానవాళి మనుగడకే ప్రమాదం''అని సైంటిస్టులు స్పష్టం చేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బర్త్‌డే పార్టీలో కాల్పులు

నలుగురు మృతి • 14 మందికి గాయాలు

స్టాక్‌టన్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం స్టాక్‌టన్‌లో శనివారం చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో నలుగురు చనిపోయారు. పద్నాలుగు మంది గాయపడ్డారు. శాన్ జోక్విన్ కౌంటీ పరిధిలోని లూసిల్ అవెన్యూలో ఉన్న బాంక్వెట్ హాల్‌లో సాయంత్రం 6 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఓ చిన్నారి బర్త్‌డే వేడుక జరుగుతుండగా అందులో పాల్గొన్న వారిపై విచక్షణారహితంగా ఓ గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు జరిపి పరారైనట్లు స్టాక్‌టన్ వైస్ మేయర్ జాసన్ లీ చెప్పారు. మృతుల్లో చిన్నారులు సైతం ఉన్నట్లు వివరించారు. దుండగుడి కోసం పోలీసులు గాలింపు జరుపుతున్నారన్నారు. క్షతగాత్రుల పరిస్థితిని ఆయన వివరించలేదు. కాల్పులకు దారి తీసిన కారణాలు, బాధితుల వివరాలను అధికారులు వెల్లడించలేదు. ఉద్దేశపూర్వకంగానే దుండగుడు కాల్పులు జరిపినట్లుగా భావిస్తున్నామన్నారు. పరారీలో ఉన్న దుండగుడి ఆచూకీ తెలిసిన వారు తమకు వెంటనే సమాచారమివ్వాలని కోరారు.

భారతీయుల నుంచి అమెరికా ఎంతో లబ్ధి పొందింది: మస్క్

వాషింగ్టన్: ప్రతిభావంతులైన భారతీయుల నుంచి అమెరికా అత్యంత లబ్ధిపొందిందని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. జెరోధా సంస్థ సహవ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన 'డబ్ల్యూటీఎఫ్' పాడ్‌కాస్ట్‌లో మస్క్ పలు అంశాలపై మాట్లాడారు. ''అమెరికా వలస విధానాలను వ్యతిరేకించే కొన్ని శక్తులే హెచ్–1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగమయిందనే వాదనను తెరమీదకు తీసుకొచ్చాయి. వాస్తవానికి ప్రతిభావంతులైన భారతీయుల నుంచి అమెరికా ఎంతో లబ్ధిపొందింది'' అని అన్నారు. భారతీయుల ఉద్యోగాలను స్థానిక అమెరికన్లకు ఇవ్వాలని ట్రంప్ సర్కార్ కంకణం కట్టుకుందా? అని ప్రశ్నించగా..''అదెలా సాధ్యం? నిజానికి అత్యంత ప్రతిభావంతులకు అమెరికాలో ఎప్పట్నుంచో కొరత ఉంది. నా సొంత ఎక్స్, టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ఏఐ సంస్థల కోసం సైతం ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతుల కోసం వెతుకుతున్నా. హెచ్–1బీని నిలిపేయాలనే గుంపులో నేను లేను'' అని మస్క్ అన్నారు.

నా కుమారుని పేరు శేఖర్

మస్క్ తన వ్యక్తిగత జీవిత వివరాలను కొన్నింటిని తొలిసారిగా బహిర్గతంచేశారు. ''నాకూ శివోన్ జిలిస్‌కు పుట్టిన కుమారుల్లో ఒకరికి శేఖర్ అనే పదం కలిసొచ్చేలా పేరు పెట్టాం. భారతీయమూలాలున్న అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సుబ్రమణ్యాన్ చంద్రశేఖర్ పేరులోంచే శేఖర్‌ను తీసుకున్నాం. సహచరిణి శివోన్ సగం భారతీయురాలు. ఆమె తల్లి పంజాబీ. జివోన్‌ను చిన్నతనంలో ఉన్నప్పుడే వేరే కుటుంబం దత్తత తీసుకుంది. అలా శివోన్ కెనడాలో పెరిగింది'' అని మస్క్ వెల్లడించారు.

తమిళనాడు రాజ్‌భవన్ ఇకపై లోక్ భవన్

సాక్షి, చెన్నై: తమిళనాడు రాజ్‌భవన్ ఇకపై లోక్ భవన్‌గా మారనుంది. పేరు మార్పునకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్ పేరును ఇటీవలే లోక్‌భవన్‌గా మార్చిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో తమిళనాడు రాజ్‌భవన్ పేరు సైతం మార్చాలంటూ గవర్నర్ ఆర్.ఎన్.రవి కేంద్ర ప్రభుత్వానికి సూచించినట్టు సమాచారం. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం రాజ్‌భవన్ పేరును లోక్ భవన్‌గా మారుస్తూ కేంద్రం చర్యలు చేపట్టడం గమనార్హం. అలాగే పుదుచ్చేరిలోని రాజ్‌నివాస్‌ను పేరును లోక్ నివాస్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టింది. లోక్‌భవన్ అంటే ప్రజా భవనం అని అధికారులు చెబుతున్నారు. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచడంలో భాగంగా ఈ పేరును నిర్ణయించినట్టు పేర్కొంటున్నారు. రాజ్‌భవన్ పేరును లోక్ భవన్‌గా మారుస్తూ కేంద్రం తీసుకున్న చర్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర సర్కార్ నిర్ణయాన్ని తప్పుపట్టారు.

మరో ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు

ముగ్గురిని అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలున్న ఉగ్ర మాడ్యూల్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. షాజాద్ భట్టి ఆదేశాల మేరకే పనిచేసే ముగ్గురిని మధ్యప్రదేశ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి అరెస్ట్ చేశారు. నవంబర్ 25న పంజాబ్‌లోని గుర్దాస్పూర్‌లో జరిగిన గ్రెనేడ్ దాడితో వీరికి సంబంధముంది. పాకిస్తాన్ నుంచి కార్యకలాపాలు సాగించే భట్టితో నిందితులు ముగ్గురికీ ప్రత్యక్ష సంబంధాలున్నాయి. వీరిలో వికాస్ ప్రజాపతి మధ్యప్రదేశ్, హర్గుణ్‌ప్రీత్ పంజాబ్, ఆసిఫ్ యూపీకి చెందినవాళ్లు. సోదాల్లో వీరి వద్ద ఒక పిస్టల్, రెక్కీ జరిపిన వీడియోలు, చాటింగ్, వాయిస్ నోట్స్ లభించాయి. సోషల్ మీడియా యాప్‌ల ద్వారా వీరిని భట్టి ఎంపిక చేసుకున్నట్లు తేలింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ తదితరులను వీరు టార్గెట్ చేశారు. ఈ కోణంలో ఢిల్లీ పోలీసులు, కేంద్ర విభాగాల అధికారులు ముమ్మర దర్యాప్తు ప్రారంభించారు.

బ్రిటన్‌లో భారతీయ విద్యార్థి హత్య

న్యూఢిల్లీ: బ్రిటన్‌లో భారతీయ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. హరియాణాలోని చర్కి దాద్రికి చెందిన విజయ్‌కుమార్ షియోరాన్(30) యూకేలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున వెర్సెస్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై కత్తులతో దాడి చేసి పారిపోయారు. స్థానికులు విజయ్‌ను ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఇండియాలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగం చేసిన విజయ్ ఉన్నత విద్య కోసం ఈ ఏడాది ప్రారంభంలో యూకే వెళ్లాడు. బ్రిస్టల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ది వెస్ట్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో చదువుతున్నాడు. అతడిహత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై బ్రిటిష్ పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. వీలైనంత త్వరగా తమ కుమారుడి మృతదేహాన్ని దేశానికి తీసుకురావాలని అతడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఘటనలో ఐదుగురు అనుమానితులను బ్రిటన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

సాక్షి
గుంటూరు
సోమవారం । 1 । డిసెంబర్ । 2025

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 400 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు. నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.



పశ్చిమ డెల్టాకు నీటి నిలుపుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ డెల్టాకు నీటి విడుదల నిలుపుదల చేశారు. సముద్రంలోనికి 3,625 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జుసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 580.60 అడుగులకు చేరింది. ఇది 284.7452 టీఎంసీలకు సమానం.

న్యూస్‌రీల్

ఐశ్వర్య ప్రదాయినిగా బగళాముఖి అమ్మవారు

చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో కొలువై ఉన్న బగళాముఖి అమ్మవారు ఆదివారం భక్తులకు ఐశ్వర్య ప్రదాయినిగా దర్శనమిచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అమ్మవారి భక్తులు చందోలు గ్రామానికి వచ్చి బగళాముఖి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, పూలు, పండ్లు సమర్పించి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్

వేమూరు: రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ భావన తెలిపారు. వేమూరు మండలం జంపని గ్రామంలో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆదివారం సందర్శించారు. ఆన్‌లైన్ ద్వారా రైతులు నమోదు చేసుకున్న పేర్లు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులందరూ తమ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని సూచించారు. జంపని రైతులందరు అమర్తలూరు మండలంలోని రైస్ మిల్లుకు ట్యాగ్ చేస్తామన్నారు. రేపల్లె ఆర్డీవో జంపని ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. వెంటనే రైతులకు ట్రక్ సీట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సుశీల, ఎంపీడీఓ రవికుమార్, మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పెదకాకాని మల్లేశ్వరస్వామి సేవలు

పెదకాకాని: భక్తుల సౌకర్యార్థం పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. శివాలయానికి విచ్చేసే భక్తులు ఆలయంలో వసతి గదులు, దర్శనాలు, రాహుకేతు పూజలు, స్వామి వారి అభిషేకాలు, చండీరుద్ర హోమ పూజలు ఇతర సేవలు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. ప్రసాదాల టోకెన్‌ల విక్రయాలు సైతం ఆన్‌లైన్‌లో ఉండటం జరిగిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా వివిధ సేవలు, దర్శనాల టికెట్స్ బుక్ చేసుకోవడంతోపాటు ప్రసాదం టోకెన్లు పొందిన భక్తులను ఆలయం వద్ద సాధారణ క్యూలైన్‌లో ఎక్కువ సమయం వేచి ఉండే అవసరం లేకుండా త్వరితగతిన దర్శనం, ప్రసాదాలు పొందుటకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు వివిధ సేవల కోసం ఆలయ వెబ్‌సైట్ ద్వారా కానీ మనమిత్ర వాట్సాప్ నెంబరు 95552300009 ద్వారా క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు, గూగుల్ పే, ఫోన్‌పే, పేటీయం, బీమ్ యూపీఎల్, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించి ఆయా సేవల టికెట్‌లు పొందవచ్చని డీసీ తెలిపారు.

నాగార్జునకొండను సందర్శించిన పర్యాటకులు

విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండకు శని, ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున సందర్శించారు. దీంతో లాంచీ స్టేషన్‌కు లక్షా 20 వేల రూపాయల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ మేనేజర్ కె మస్తాన్‌బాబు తెలిపారు. కొండను సందర్శించిన పర్యాటకులు మహాస్థూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం, మ్యూజియంలోని తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన శిలాఫలకాలను తిలకించారు. అనంతరం మాచర్ల మండలంలోని అనుపు, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు.

కౌలుకోలేని దెబ్బ

ఈ చిత్రంలోని వ్యక్తి తెనాలి రూరల్ మండలం కఠెవరంకు చెందిన కౌలు రైతు పిల్లి వీరయ్య. ఎరుకలపూడి రోడ్డులో మూడు ఎకరాల మాగాణిని కౌలుకు తీసుకున్నాడు. ఎకరాకు రూ.35 వేల నగదు కౌలు చెల్లించాడు. ధాన్యం వెదజల్లింది మొదలు వర్షాలతో నానా అవస్థలు పడ్డాడు. మొంథా తుఫాన్‌తో చేను ఒరిగింది. హార్వెస్టరుతో నూర్పిడికి రెండు గంటలు పట్టింది. గంటకు రూ.3,500 చొప్పన రూ.7 వేలు ఖర్చయింది. చేలోంచి రోడ్డుపైకి తెచ్చినందుకు ట్రాక్టరుకు రూ.వెయ్యి ఇచ్చాడు. పంటంతా ఆరబెట్టివుంది. ఇప్పుడేమో కొనేవాడు కనిపించటం లేదు. సీసీఆర్‌సీ కార్డు లేకపోవటంతో ఈ-క్రాప్ నమోదు లేదు. ప్రభుత్వం కొనుగోలు చేయదు...ఏం చేయాలో తోచటం లేదు. వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు కనీసం టార్పాలిన్లనూ ప్రభుత్వం ఇవ్వనేలేదంటూ ఆవేదన పడుతున్నాడు. జిల్లాకు ధాన్యాగారమైన కృష్ణాపశ్చిమ డెల్టాలో కౌలురైతుల అవస్థలకు పిల్లి వీరయ్య ప్రత్యక్ష నిదర్శనం.

- మొంథా తుఫాన్‌తో ఇప్పటికే పీకల్లోతు నష్టాల్లో..
- అందని కౌలురైతు కార్డులు
- నమోదుకాని ఈ-క్రాప్
- ధాన్యానికి దక్కని 'మద్దతు'
- ధర తగ్గిస్తున్న వ్యాపారులు
- దిత్వా తుఫాన్ హెచ్చరికలతో గుండెల్లో గుబులు
- టార్పాలిన్లకు సైతం దిక్కులేని దుస్థితి

కష్టాల కడలిలో కౌలు రైతు

ఆరబెట్టిన ధాన్యాన్ని ట్రాక్టరులో లోడు చేస్తున్న కూలీలు

తెనాలి: సాగువిస్తీర్ణంలో 85 శాతం కౌలురైతులే సాగు చేస్తున్నా వారికి ఎలాంటి ప్రభుత్వ ఆసరా దక్కటం లేదు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ఎన్నికల్లో హామీనిచ్చి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఇందుకోసం సబ్ కమిటీని నియమించింది. అందులో తెనాలి ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా సభ్యులుగా ఉన్నారు. ఇంతకాలమైనా కమిటీ తన నివేదికను క్యాబినెట్‌కు సమర్పించలేదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదు. ఫలితంగా కౌలు రైతులు కష్టాల సాగుచేస్తూ కన్నీళ్లు దిగమింగుకుంటున్నారు.

ధాన్యం రైతుల దైన్యం

2025-26 ఖరీఫ్ సీజనుకు పశ్చిమడెల్టాలో మాగాణి భూముల్లో వరిసాగు చేసిన రైతులకు సీజనులో ప్రకృతి వైపరీత్యాలతో ఎడాపెడా దెబ్బలు తగిలాయి. చివరకు పంట చేతికొచ్చే సమయంలో మొంథా తుఫాన్ విరుచుకుపడింది. పంట నేలవాలిందని రైతులు హాహాకారాలు చేసినా.. అబ్బే! గుంటూరు జిల్లాలో 5 శాతంకు మించి నష్టం లేదంటూ ప్రభుత్వం ప్రకటించి చేతులు దులుపుకొంది. కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నష్టం అంచనా కూడా వేయలేదు. తీరా పంట పక్వానికొచ్చాక నూర్పిడులు జరుగుతుంటే, ఎకరాకు 5-10 బస్తాలకు పైగా దిగుబడి తగ్గిన చేదు వాస్తవం బహిర్గతమైంది. చేసేదేముంది... ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరిచి, ప్రతి గింజా కొనుగోలు చేస్తామని ప్రకటించినా ఆచరణలో అధికార యంత్రాంగం సమన్వయలోపం వెల్లడైంది. అధికారుల హడావుడి చేసి జీపీఎస్ లేకున్నా ఫర్వాలేదు, సొంత వాహనాల్లోనూ తీసుకెళ్లొచ్చు...అంటూ అనుమతులిచ్చారు. కొనుగోలు చేసేటప్పుడు 17 శాతం లోపుగా ఉన్న తేమ, రైస్‌మిల్లుకు వెళ్లేసరికి 21 శాతం చూపుతుండటం, బస్తాకు 4-5 కిలోలను తరుగుగా తీయాల్సిందేనని చెప్పటంతో అన్నదాత హతాశుడవుతున్న దుష్టాంతాలున్నాయి.

కౌలు రైతుల అవస్థలు వర్ణనాతీతం

ధాన్యం అమ్మకాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు ఇలాగుంటే, కౌలురైతుల అవస్థలు వర్ణనాతీతం. కౌలురైతు గుర్తింపు కార్డులు లేనందున ఈ-క్రాప్ నమోదుకు అవకాశం లేదని తెలిసిందే. ఎరువులు, విత్తనాల సంగతటుంచి వీరికి బ్యాంకు రుణాలు కూడా లేవు. పంటకు పెట్టుబడి అంతా అప్పులు తెచ్చి పెట్టారు. తీరా పంటచేతికొచ్చాక దిగుబడి తగ్గింది. ఇప్పుడా పంటకు కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు కొనే ఆస్కారం కూడా లేదు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని బయట వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు. పచ్చిమీద నూర్పిడి చేశారనే సాకుతో వ్యాపారులు బస్తాకు రూ.1200, రూ.1300 మించి ఇచ్చేది లేదంటున్నారు. అసలు రెండురోజులుగా బయట వ్యాపారులు పొలాలకేసి వచ్చింది లేదని రైతులు చెప్పారు. ఇక రైతులకే దక్కని టార్పాలిన్లు కౌలురైతులకు ఎలా వస్తాయి. దీనితో వాటిని కూడా కౌలు రైతులు కొనాల్సివస్తోంది.

రేపు మాపూ అంటున్నారు...

నేను కౌలురైతును. ఎకరం రూ.35 వేలకు రెండెకరాలు కౌలుకు తీసుకున్నా. మొంథా తుఫాన్‌కు పంట పడిపోతే కూలీలతో నిలబెట్టి కట్టించాను. రూ.4 వేలు ఖర్చయింది. హార్వెసింగ్‌కు ఎకరాకు రూ.7 వేలయింది. పంట చూస్తేనేమో తగ్గింది. కొనేందుకు వ్యాపారులు రావటం లేదు. రేపు మాపు అంటున్నారు. తాజా దిత్వా తుఫాన్ హెచ్చరికలతో టార్పాలిన్లను పెద్ద పట్ట రూ.6 వేల చొప్పున, చిన్న పట్టా రూ.4 వేల చొప్పున కొనుగోలు చేశాను.

–కమాదుల నాగరాజు, కౌలురైతు, కొలకలూరు

రైతుల ఆవేదన పట్టదా..?

ప్రస్తుతం దిత్వా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రోడ్లు, మెరక ప్రదేశాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకోవటానికి కనీసం టార్పాలిన్లను కూడా ప్రభుత్వం ఇవ్వలేకపోవటాన్ని అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దావులూరులో కొనుగోలు కేంద్రం ప్రారంభించినపుడు మంత్రి నాదెండ్ల మనోహర్ టార్పాలిన్లను ఉచితంగా తీసుకెళ్లొచ్చని చెప్పినట్టు రైతులు గుర్తుచేస్తున్నారు. ఆచరణలో ఒక్కో రైతుసేవా కేంద్రానికి 15-20కు మించి ఇవ్వలేమని అధికారులు అంటున్నారని రైతులు చెబుతున్నారు. అదికూడా ధాన్యం కొనుగోలు ఒప్పందం చేసిన రైతులకేనని, అవసరం తీరాక ఇతర రైతులకోసం ఇవ్వాల్సి వుంటుందని కూడా చెప్పారు.

'శ్రీకాళహస్తి' పాలకమండలి సభ్యురాలిపై కేసు నమోదు

చీరాలకు చెందిన వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై బాపట్లలో కేసు నమోదు

చీరాల: బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గానికి చెందిన శ్రీకాళహస్తి దేవస్థాన పాలక మండలి సభ్యురాలు, టీడీపీ నాయకురాలు కొమ్మనబోయిన రజని, మరికొందరిపై బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన బి.కల్యాణి శుక్రవారం రాత్రి పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాలు.. సాయికాలనీకి చెందిన కల్యాణి.. బచ్చు నాగరాజును రెండో వివాహం చేసుకుంది. అతడు 2021లో మరణించడంతో ఆమెకు మొదటి భార్య రవీంద్రకుమారితో ఆస్తి సంబంధిత వివాదాలు మొదలయ్యాయి. ఈ వివాదంపై కళ్యాణి చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. కేసు విషయమై పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుండగా ఆమెకు కొమ్మనబోయిన రజనితో పరిచయం ఏర్పడింది. ఆమె న్యాయవాది ఊసా తులసీరావును పరిచయం చేసింది. అతను వివాదాస్పద ఆస్తులను కొనుగోలు చేస్తానని చెప్పి తరచూ ఆమె ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో ఫిర్యాది కల్యాణిని బాపట్లలో ఇల్లు అద్దెకు తీసుకోవాలని చెప్పి రైలుపేటలో ఇల్లు అద్దెకు ఇప్పించారు. ఈ క్రమంలో ఆమెపై పలుమార్లు లైంగికదాడి చేయడంతో పాటు ఫొటోలు, వీడియోలు తీసి బెదిరించాడు. అంతేకాకుండా రజనితో కలిసి అసభ్యకరమైన వీడియోలతో బెదిరించి వేధించాడు. వీడియోలు, ఫొటోలు ఇవ్వాలంటే ఆస్తులు తమవారి పేరున రాయాలని బెదిరించి రాయించుకున్నారు. ఆస్తులు రాయించుకున్నా కూడా వీడియోలు బయటపెడతామని బెదిరించడంతో భయాందోళనకు గురైన ఆమె బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఊసా తులసీరావు, కొమ్మనబోయిన రజనిలతో సహా పదిమందిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి దేవస్థాన పాలకమండలి సభ్యురాలిగా రజనిపై కేసు నమోదు కావడంతో టీడీపీలో అంతర్గత చర్చలు మొదలయ్యాయి. ఆమెను ఎలాగైనా కాపాడాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

వీళ్లతో మామూలుగా ఉండదు!

సాంఘిక సంక్షేమ శాఖలో మామూళ్ల పర్వం

- వార్డెన్‌ల విషయంలో అధికారుల ద్వంద్వ వైఖరి
- తమకు అనుకూలంగా ఉండే వారికి అన్నింటా అగ్ర తాంబూలం
- అనుకూలంగా లేని వారికి హాస్టళ్ల తనిఖీల పేరుతో ఇబ్బందులు
- అవసరమైతే సస్పెండ్ చేయడానికి వెనుకాడని వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

నెహ్రూనగర్: సాంఘిక సంక్షేమ శాఖలో(ఎస్సీ వెల్ఫేర్) మామూళ్ల పర్వం నడుస్తోంది. తమను ప్రసన్నం చేసుకునే వార్డెన్లకు అగ్రతాంబూలం.. ప్రసన్నం చేసుకోని వారిని అన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టడంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారులు సిద్ధహస్తులనే చెప్పుకోవచ్చు. ఉన్నతాధికారులు జిల్లాలోని హాస్టళ్లను సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఆడిందే..ఆటగా..పాడిందే.. పాటగా మారిందనే చెప్పుకోవచ్చు.

హాస్టళ్ల నిర్వహణ గాలికి...!

గుంటూరు జిల్లాలో 33 ఎస్సీ హాస్టల్స్ ఉండగా అందులో 2707 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా హాస్టళ్లలో విద్యార్థులకు సరైన భోజనం, సక్రమమైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే చెప్పుకోవాలి.

- నవంబర్ 26న ప్రత్తిపాడు ఎస్సీ బాలికల హాస్టల్‌లో అన్నంలో పురుగులు వస్తున్నాయని అడిగితే హాస్టల్ నుంచి వెళ్లిపోమంటున్నారంటూ ఇద్దరు విద్యార్థినులు తమ తల్లిదండ్రులతో కలిసి ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. అక్కడ జరుగుతున్న విషయాన్ని తెలుసుకునేందుకు వెళ్లిన డీడీ చెన్నయ్యకు కూడా విద్యార్థినులు అన్నం బాగోలేదని చెప్పారు.
- గుంటూరు బీఆర్ స్టేడియం వద్ద ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఓ విద్యార్థినిని తోటి విద్యార్థులు నిత్యం గోల చేయడంతో పాటు బట్టలు ఆరేసుకుంటే కింద పడేస్తున్నారని, హాస్టల్‌లో భోజనం సరిగా ఉండటంతో లేదని నవంబర్ 16వ తేదీ ఆదివారం విద్యార్థులు తల్లిదండ్రులు వచ్చినప్పుడు సదరు విద్యార్థిని తనగోడు వెళ్లబోసుకుంది. తల్లిదండ్రులు హాస్టల్ వార్డెన్‌ను నిలదీశారు. మా పాపను ఇంత ఇబ్బందులు పెడుతుంటే మీరేం చేస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమ వారైతే చాలు..

ఒక పక్క హాస్టళ్లకు ఇన్‌ఛార్జ్‌లు ఉండటానికి వీల్లేదని సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ పట్టాభిపురం ఎస్సీ కాలేజీ బాలికల హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్నప్పటికీ పరివర్తన భవన్ కాలేజీ బాలికల హాస్టల్‌కు ఇన్‌ఛార్జ్‌గా గత సంవత్సరం నుంచి ఓ వార్డెన్ పనిచేస్తుంది. సదరు వార్డెన్ పరివర్తన భవన్‌లోనే విధులు నిర్వహిస్తూ రెగ్యులర్ హాస్టల్ వార్డెన్‌గా వెళ్లకుండా అక్కడ ఓ అనధికార మహిళకు హాస్టల్ బాధ్యతలు అప్పగించిన విషయం అందరికి తెలిసినప్పటికీ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే విధంగా జిల్లాలోని పలు హాస్టళ్లలో కొంతమంది తమకు మామూళ్లు అప్పజెప్పే వార్డెన్ల వైపు కన్నెత్తి చూడరని కార్యాలయ సిబ్బంది చెప్పుకోవడం గమనార్హం. జిల్లా సంక్షేమ కార్యాలయంలో ముగ్గురు వార్డెన్లు ఖాళీగా ఉన్నప్పటికీ వారికి ఎటువంటి పోస్టింగులు వేయకుండా అక్కడే ఉంచి.. తమకు మామూళ్లు అప్పగించే వారికి ఇన్‌ఛార్జ్ వార్డెన్లుగా పోస్టింగ్ కల్పిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. నగరంలోని హయ్యర్ హాల్-1 హాస్టల్‌కు మార్చి నుంచి ఇప్పటి వరకు బిల్స్ ఆగిపోయాయి. ఎటువంటి కారణాలు లేకుండానే బిల్స్ ఆపేశారు. మామూళ్లు ముట్టజెబితే ఆటోమేటిక్‌గా బిల్ పేమెంట్ అయిపోతాయని కార్యాలయ సిబ్బంది చెప్పుకోవడం గమనార్హం.

కుక్‌ని ఇవ్వమని అడిగినందుకు సస్పెన్షన్

గుంటూరు నగరం హయ్యర్ హాల్ 1లో వార్డెన్‌గా జూన్ నెలలో తిరుపతి స్వామి బాధ్యతలు స్వీకరించారు. హాస్టల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డించేందుకు కుక్ లేకపోవడంతో కొన్ని రోజుల పాటు ఆయనే తన సొంత డబ్బులతో కుక్‌ను, కబాటీని పెట్టుకుని విద్యార్థులకు భోజనం పెట్టారు. తనకు కుక్‌ను కేటాయించాలని నెలవారీ వార్డెన్ల సమావేశంలో అధికారులను అడిగినందుకు ఆయన్ను టార్గెట్‌గా చేసుకుని పని కట్టుకుని మరి అదే పనిగా హాస్టల్ విజిట్స్ పేరుతో తనిఖీలు చేపట్టి ఆగస్టు 28న సస్పెండ్ చేశారు. తీరా ప్రస్తుతం అదే హాస్టల్‌కు వేరే వార్డెన్‌ను ఇన్‌ఛార్జ్‌గా వేస్తే అతనికి మాత్రం కుక్, కబాటీ, వాచ్‌మెన్‌లను ముగ్గురు కేటాయించారు.

కేసుల ఛేదనలో ఎంతో కీలకపాత్ర పోషించే నిఘా నేత్రాలపై పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వీవీఐపీలు తిరిగే అత్యంత సున్నిత ప్రాంతాల్లో భద్రతా లోపాలు స్పష్టమవుతున్నాయి. ముఖ్య, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేక.. పాడైపోయిన వాటిని బాగు చేయించక నిఘా వ్యవస్థ నిర్వీర్యమవుతోంది.. దీంతో పట్టపగలే నేరాలు, ఘోరాలు జరుగుతున్నాయి.

నిద్రపోతున్న నిఘానేత్రం

వీవీఐపీలు పర్యటించే ప్రాంతంలో కనిపించని సీసీ కెమెరాలు

- నార్త్ సబ్ డివిజన్‌లో సీసీ కెమెరాల కోసం భారీ మొత్తంలో విరాళాల సేకరణ
- నేటికీ కెమెరాలు ఏర్పాటు చేయని పోలీసులు
- నిందితులకు వరంగా నిఘా లోపం
- మహిళ కిడ్నాప్ వ్యవహారంలో గుర్తించలేని నిందితుడి జాడ

సీసీ కెమెరాలు కనిపించని మంగళగిరిలోని 16వ నెంబర్ జాతీయ రహదారి

తాడేపల్లి రూరల్: రాజధాని ముఖద్వారమైన మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ముఖ్య కూడళ్లలో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. పాత కెమెరాలకు మరమ్మతులు చేయించపోవడంతో అవి పూర్తిగా పాడయ్యాయి. కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో అసలు ఏర్పాటే చేయలేదు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు భారీ విరాళాలు..

పలు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కొంతమంది నాయకులు భారీ మొత్తంలో అధికారులకు నగదును అందజేశారు. మంత్రి నారా లోకేష్ నియోజకవర్గం కావడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు భారీగా విరాళాలు వచ్చినట్లు సమాచారం. నెలలు గడుస్తున్నా కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. తూతూ మంత్రంగా గంజాయి, మద్యం బాబుల కదలికలను గమనించేందుకు మాత్రమే స్థానిక నాయకుల ద్వారా ఏర్పాటు చేసిన కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి.

ఒక్కటి పనిచేస్తే ఒట్టు

మంగళగిరి నియోజకవర్గం కాజా టోల్‌గేట్ నుంచి కనకదుర్గ వారధి, ఇటువైపు ప్రకాశం బ్యారేజ్ వరకు పాత, కొత్తజాతీయ రహదారుల్లో పోలీసులకు సంబంధించిన సీసీ కెమెరాలు ఒక్కమంగళగిరి పట్టణంలో మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో పనిచేయడం లేదు. పాత జాతీయ రహదారి వెంబడి ఎక్కడైనా వ్యాపారస్తులు, ఇళ్లలో నివసించే వారి సీసీ కెమెరాలు పరిశీలించి తూతూ మంత్రంగా నేరాలను పరిష్కరిస్తున్నారు.

- 16వనెంబర్ జాతీయ రహదారిపై కాజా టోల్‌గేటు వద్ద నుంచి కనకదుర్గ వారధి వరకు ఒక్క సీసీ కెమెరా కూడా ఏర్పాటుచేయలేదు. హైవే సీసీ కెమెరాలు ఉన్నా.. ట్రాఫిక్ జామ్ అయినప్పుడు మాత్రమే పనిచేసేవిధంగా ఆ సంస్థ ఏర్పాటు చేసుకుంది. దీంతో ఎటువంటి నేరాలు జరిగినా పోలీసులు దానిని ఛేదించడంలో చాలా ఆలస్యం అవుతోంది.
- తాడేపల్లి బైపాస్‌రోడ్‌లో సర్వీస్‌రోడ్‌లో పాత కక్షల నేపథ్యంలో ఒక రౌడీషీటర్‌పై మరో రౌడీషీటర్, ఇంకో పిక్ పాకెటర్ దాడికి పాల్పడ్డారు. ఆ కేసులో అయితే నిందితులను అరెస్ట్ చేశారు తప్ప ఏ రౌడీషీటర్‌ది తప్పు అనేది తేల్చలేకపోయారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు ప్రభుత్వం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు పేరుతో నగదు వసూలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని పలువురు కోరుకుంటున్నారు.

నిందితులకు వరం

గత నెల 13వతేదీ మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్త బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఒక మహిళ ఆటో ఎక్కగా ఆ ఆటోలో ఉన్న వారు మహిళను దారి మళ్లించి ఎయిమ్స్ హాస్పిటల్ ప్రాంతం నుంచి వడ్డేశ్వరం మీదుగా జాతీయ రహదారి నుంచి వెళ్లిపోయారు. ఆ మహిళ ఆచూకీ కోసం మంగళగిరి పోలీసులు సీసీ కెమెరాల్లో ఎక్కడైనా రికార్డు అయి ఉంటుందని పరిశీలించగా ఎక్కడా రికార్డు కాలేదు. చివరకు కృష్ణాజిల్లాలో రామలింగేశ్వర నగర్ నుంచి కృష్ణలంక మీదుగా ఇబ్రహీంపట్నం వరకు ఆ ఆటో ఆచూకీ కోసం వెతికినా చిన్న క్లూ కూడా దొరకకపోవడంతో ఆ కేసు అక్కడే నిలిచిపోయింది. కిడ్నాప్ అయిన మహిళ అపస్మారక స్థితిలో గుంటుపల్లి వద్ద దొరకడంతో పోలీసులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. ఆమెకు తలకు తీవ్ర గాయం కావడంతో ఇప్పటి వరకు ఏం జరిగిందనే విషయాన్ని పోలీసులు తేల్చలేకపోయారు. అవే సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే వెంటనే ఆ సంఘటనకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేసే అవకాశం ఉండేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

జిల్లాలో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: దిత్వా తుఫాన్ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ సబ్ డివిజన్లల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో గుంటూరు తూర్పు సబ్ డివిజన్ -0863-2223353, గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ – 0863-2241152 / 0863-2259301, ఉత్తర సబ్ డివిజన్- 08645-237099, దక్షిణ సబ్ డివిజన్ – 0863-2320136, తెనాలి సబ్ డివిజన్- 08644-225829, తుళ్లూరు సబ్ డివిజన్- 08645-243265, జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 0863-2230100 అని అన్నారు. ప్రతి కంట్రోల్ రూంకు సీఐలను, నోడల్ అధికారులుగా ఎస్ఐలను నియమించామని చెప్పారు. సీఐల పర్యవేక్షణలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా ప్రమాదకరమైన వంతెనలు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద పోలీస్ సిబ్బంది బందోబస్త్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు అత్యవసర స్పందన బృందాలను అందుబాటులో ఉంటాయని అన్నారు. ప్రజలు అత్యవసరమైతే మినహా గృహాల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు అన్నివేళల సిద్ధమని పేర్కొన్నారు.

క్లుప్తంగా

13న ద్వితీయ అన్నమయ్య సహస్ర గళార్చన

నగరంపాలెం: సనాతన భారతీయ ధర్మంలో సంగీతానికి విశేష ప్రాముఖ్యత ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో జై కిసాన్ ట్రస్ట్ అధ్యర్యంలో ఈనెల 13న శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్న ద్వితీయ అన్నమయ్య సహస్ర గళార్చన కార్యక్రమ ఆహ్వాన పత్రికలను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంగీతంలో మనుషులతోపాటు పశుపక్షాదులు సైతం ఆనందలోకంలో విహరిస్తాయని పేర్కొన్నారు. అన్నమయ్య సహస్ర గళార్చన నిర్వాహకులు బండ్లమూరి స్వామి మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలో హిందూ ధర్మం అంటే సన్మార్గమని అన్నారు. మానవుడిని సన్మార్గంలో నడిపించే ఒక జీవన విధానమని చెప్పారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సేవలో భాగంగా రాష్ట్ర స్థాయిలో వందల మంది గాయకులతో ద్వితీయ అన్నమయ్య సహస్ర గళార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7799800900 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హీరో అనే పదం డ్రగ్ కంటే ప్రమాదకరం

చిలకలూరిపేట: హీరో అనే పదం డ్రగ్ కంటే ప్రమాదకరంగా మారిందని, ఈ పదం వాడ కట్టడిచేసేలా చర్యలు తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాసినట్లు న్యాయవాది, సామాజికవేత్త మారాసు భానుప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హీరో అనే ఆకర్షణ వలన బాల్యదశ నుంచి యువత భవిష్యత్తుకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. సినిమాల్లో నటించే వారిని హీరోలు బదులుగా లీడ్ యాక్టర్, లీడ్ యాక్టర్స్ అని సంబోధించాలని కోరారు. విద్యార్థులు హైస్కూల్ స్థాయి నుంచే హీరో పాత్రధారులను అనుసరించాలని భావిస్తున్నారని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించే సైనికుల కంటే, దేశానికి అన్నం పెట్టే రైతన్నల కన్నా, జీవితాన్ని ఇచ్చిన తల్లిదండ్రుల కంటే హీరోలను గొప్పవాళ్లుగా భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నటులు రూ.200 కోట్లు, రూ.300 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకోవడం వలన సినిమా ఖర్చు పెరిగిపోతున్న నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రూ.10 మొక్కజొన్న పేలాలకు వందలు వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు. ఈ విషయాలను పరిశీలించి ప్రభుత్వం తగు దిద్దుబాటు చర్యలు చేపట్టి, ఎమ్మార్పీ ధరలకే సినిమా క్యాంటీన్లలో విక్రయాలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హరిప్రసాద్, మురుకొండ వెంకట్రావు, వెంకటేశ్వరరెడ్డి, అడపా రవి పాల్గొన్నారు.

విద్యారంగం ప్రైవేటీకరణ

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కళాధర్
- ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ ప్రారంభం

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కళాధర్, వేదికపై విద్యార్థి సంఘం నాయకులు

లక్ష్మీపురం: భారతదేశంలో ఆర్థిక సంస్కరణల తర్వాత ఉన్నత విద్యారంగంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయని ఉన్నత విద్యారంగం పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరుగుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కళాధర్ పేర్కొన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా 50వ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, యూనివర్సిటీలో 15 ఏళ్లగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో అకాడమిక్ క్షీణత ప్రారంభమైందని అన్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ప్రస్తుతం నాలుగు వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని చెప్పారు. కొన్నిచోట్ల కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో అధ్యాపకులు పనిచేస్తున్నారని, విశ్వవిద్యాలయాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందన్నారు. వైస్ చాన్సలర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకం పూర్తి రాజకీయ కోణంలో జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉంటున్నారని, తగిన మౌలిక వసతులు లేకపోవడం వలన చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని తెలిపారు. పేద విద్యార్థులు ముఖ్యంగా దళితులు, గిరిజన, బీసీ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 77 రద్దుచేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్, మాజీ జిల్లా కార్యదర్శి భావన్నారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్, జిల్లా అధ్యక్షులు కె పవన్‌కుమార్, సహాయ కార్యదర్శి అన్సారీ, కిరణ్ దాసరి, అమత వర్షిని, ఉపాధ్యక్షులు సౌమ్య, రూపాస్, కమిటీ సభ్యులు యశ్వంత్, సూర్జిత్, అజయ్, అభిలాష్, అనిల్ పాల్గొన్నారు.

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

లక్ష్మీపురం: అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఆదివారం సభ పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఎ.విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా బి.ముత్యాలరావు, అధ్యక్షులుగా ఎ.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పి విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా కమలాకర్ గుప్తా, అబ్దుల్ రషీద్, శ్రీనివాసరావు, రాజేష్, సుధీర్ ఎన్నికయ్యారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్-ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్-వర్కర్స్ రాష్ట్ర చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ యు.పి.హెచ్.సి ఉద్యోగులకు పి.హెచ్.సి ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ యు.పి.హెచ్.సి ఉద్యోగులు చేసే ప్రతి పోరాటానికి సీఐటీయూ అండ ఉంటుందని తెలియజేశారు. జేఏసీ జిల్లా సెక్రటరీ జనరల్ బి.ముత్యాలరావు మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్టణంలో జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభల జయప్రదం చేయాలని నేతలు కోరారు.

బాలోత్సవంలో అలరించిన చిన్నారులు

జానపద నృత్యం చేస్తున్న బాలలు

మంగళగిరి టౌన్: బాలోత్సవంలో చిన్నారులు అదరహో అని పించారు. పిల్లలు కాదు... పిడుగులు అన్న విధంగా ఆ చిన్నారుల ప్రదర్శనలు సాగాయి. ఒకరిని మించి ఒకరు తమ ప్రదర్శనలు ఇచ్చి ఔరా అనిపించారు. మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం పట్టణ పరిధిలోని అరవింద మోడల్ స్కూల్‌లో ఆదివారం రెండవ రోజు అరవిలో నిర్వహించారు. తెలుగులో ఉపన్యాసం, మట్టితో బొమ్మలు, ఇంగ్లిష్‌లో ఉపన్యాసం, జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, లఘు నాటికలు, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు, కోలాటం వంటి కార్యక్రమాల్లో బాలలు పాల్గొని చూపరులను ముగ్ధులను చేశారు. కార్యక్రమానికి అమరావతి బాలోత్సవం రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ, రాష్ట్ర బాధ్యులు ఐజాక్ న్యూటన్‌లతో పాటు నాగేశ్వరరావు, వి.వి.ప్రసాద్, శాంతిరెడ్డి, పి.రాజశేఖర్, వల్లభనేని వాణి, ఎం.విజయమోహనరావు, సిందే బాలకృష్ణ పర్యవేక్షించారు.

ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం జిల్లా శాఖ నూతన కార్యవర్గం

ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం (ఏపీఎంఎఫ్) జిల్లా శాఖ అధ్యక్షుడిగా పెదకాకాని జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్వీ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా గుంటూరు స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మీ-పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు బి.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీఎంఎఫ్ గుంటూరు జిల్లా శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్.బాల గంగాధర తిలక్ (గుంటూరు), గౌరవ సలహాదారుడిగా టి.సాంబశివరావు (తుళ్లూరు), కోశాధికారిగా అబ్దుల్ రెహ్మాన్ (నిడమర్రు), ఉపాధ్యక్షులుగా కె.కామాక్షి (దుగ్గిరాల), ఎం.సాయన్న (చినలింగాయపాలెం), బసవ లింగప్రసాద్, ఎంఎస్ఏ సిద్దిఖ్, బి.శ్రీనివాసరావు (గుంటూరు), జిల్లా కార్యదర్శులుగా నాంచారయ్య (తాడేపల్లి), ఎం.బాల నాగయ్య నాయక్ (కొలకలూరు), షేక్ చాంద్‌బాషా (పొన్నూరు), యు.సాంబశివరావు(తుళ్లూరు), ఎన్.పద్మావతి (తుళ్లూరు), జె.మురళీమోహన్ (మంగళగిరి), సునీతారజని, కె.జయలక్ష్మి(గుంటూరు), ఎం.ఉషశ్రీ (పెదనందిపాడు), ఎ.బాలచంద్రారెడ్డి (మేడికొండూరు), పి. శ్రీనివాసరావు(అత్తోట), ప్రమీల (ఫిరంగిపురం) రాష్ట్ర కౌన్సిలర్లుగా ఉప్పాల రామమోహనరావు, టి.సాంబశివరావు(గుంటూరు) ఎన్నికయ్యారు. అన్ని మండలాల నుంచి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి టి.సాంబశివరావు వ్యవహరించారు. జిల్లా శాఖ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల్లో గణిత సామర్థ్యాన్ని వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్

నెహ్రూనగర్: రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్ ఇస్తున్నట్టు ఆ సంస్థ జీఎం సప్పవరపు శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత్ సంచార్ నిగం లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) సంస్థ డిసెంబర్ 01 నుంచి 31, 2025 వరకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించిందన్నారు. ఇందులో భా గంగా రూపాయికే 30 రోజుల వ్యాలిడిటీతో కలిగిన ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ కాలింగ్, రోజుకు 2జీబీ డేటా, రోజుకు 100 మేసేజ్‌లు, ఉచిత సిమ్ కార్డ్ అందించబడుతుందన్నారు. ఈ ఆఫర్ ఎంఎన్‌పీ వినియోగదారులకు కూడా వర్తిస్తుందన్నారు. బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు కావలసిన వారు తమ దగ్గరలోని సంస్థ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

స్వర్ణం సాధించిన కేఎల్‌యూ విద్యార్థి

తాడేపల్లి రూరల్: ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో కేఎల్‌యూ విద్యార్థి స్వర్ణపతకం సాధించినట్లు వర్సిటీ స్పోర్ట్స్ విభాగ డీన్ హరికిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 24వ తేదీ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ షూటింగ్ పోటీలు జరుగుతున్నాయని, రాజస్థాన్ స్టేట్ షూటింగ్ రేంజ్‌లో ఆదివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కేఎల్‌యూకి ప్రాతినిధ్యం వహించిన నేలవల్లి ముఖేష్ స్వర్ణ పతకం సాధించాడని తెలిపారు. తమ యూనివర్సిటీ నుంచి తనిష్క్ మురళీధర్ నాయుడు, నాగసాయి తరుణ్ కూడిన బృందం రజత పతకాలు సాధించారని తెలిపారు. స్వర్ణ పతకం సాధించిన ముఖేష్‌ను రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్ కార్యదర్శి డి. రాజకుమార్, వర్సిటీ పీడీలు గౌతమ్, శ్రీహరి తదితరులు అభినందించారు.

నకిలీ బంగారంతో మోసం

- వివరాలు వెల్లడించిన నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): నకిలీ బంగారాన్ని విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న ముఠాను తెలంగాణలోని నిజామాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని ఏసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అందించిన వివరాలు.. గుంటూరు నగరంలోని స్వర్ణభారతీ కాలనీకి చెందిన తురక శివయ్య, తన్నీరు అంజమ్మ, తన్నీరు అంకమ్మ, తన్నీరు గంగరాజుల వద్ద ఉన్న మూడు నకిలీ బంగారం బిస్కెట్లను ఏపీలోనే ఎవరికైనా అమ్ముదామని ప్రయత్నించగా కుదరలేదు. దీంతో కొన్ని రోజుల క్రితం వారు నిజామాబాద్‌కు వచ్చి నగరంలోని శివాజీ నగర్ ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. కార్మికులుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సీతారాంనగర్‌లోని పాల దుకాణానికి వెళ్తూ అక్కడ మోర వనితతో పరిచయం పెంచుకున్నారు. ఈ క్రమంలో నవంబర్ 29న వారి దగ్గర ఉన్న ఒక బంగారం బిస్కెట్‌ను ఆమెకు చూపించి, దాదాపు 350 గ్రాములు ఉందని, బయట అమ్మితే రూ.30 లక్షల వరకు వస్తుందని నమ్మించారు. తమకు కేవలం రూ.10 లక్షలు ఇచ్చి తీసుకోవాలని కోరారు. వనిత అంత డబ్బు ఇవ్వలేమని, రూ.5 లక్షలు ఇస్తామని చెప్పగా.. అందుకు ఒప్పుకున్నారు. వనితకు నకిలీ బంగారం బిస్కెట్ ఇచ్చి రూ.5 లక్షలు తీసుకొని పరారయ్యారు. వనిత దానిని దుకాణానికి తీసుకువెళ్లి పరీక్షించగా నకిలీదని తేలింది. వెంటనే బాధితురాలు ఐదో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులు డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఉన్నారని తెలుసుకుని అదుపులోకి తీసుకున్నామని ఏసీపీ వివరించారు. నిందితుల నుంచి రూ.5 లక్షల నగదు, 96 గ్రాముల నకిలీ బంగారం బిస్కెట్లు, ఫోన్, కీప్యాడ్ తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

గంజాయి అమ్ముతున్న ఐదుగురు యువకుల అరెస్టు

మాచర్ల రూరల్: గంజాయిని ద్రవ రూపంలోకి మార్చి బాటిల్స్‌లో నింపి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి 494 గ్రాముల 260 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువకులలో ఒకడైన మచిలీపట్నానికి చెందిన రమణీ అరవింద్, షేక్ నాగూర్ షరీఫ్, షేక్ నజీర్, షేక్ పఠాన్ సిరాన్ ఖాన్, షేక్ సలీం అనే యువకులు ఒడిస్సాలోని చిత్రకొండ పరిసరాలలో గంజాయితో తయారు చేసే హ్యాష్ ఆయిల్ బాటిల్స్ తెచ్చి మాచర్ల పట్టణ, పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు, యువకులకు అమ్ముతున్నారు. రూరల్ సీఐ షేక్ నఫీజ్ బాషా నేతృత్వంలో వెల్దుర్తి ఎస్ఐ డి. అశోక్ తనకు వచ్చిన సమాచారంతో మండాదిలోని కానాగు వాగు దగ్గరకు సిబ్బందితో వెళ్లారు.అక్కడ గంజాయి ఆయిల్‌ను 5ఎం.ఎల్. బాటిళ్లలో నింపుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కొందరు యువకులు సులభమార్గంలో డబ్బులు సంపాదించేందుకు విద్యార్థులు, యువకులను టార్గెట్‌గా చేసుకొని గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. వీటిని అరికట్టేందుకు పోలీసులతో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి పట్టణ, గ్రామ శివారులో తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కాలేజీలలో అవగాహన కార్యక్రమాలతో పాటు యాజమాన్యంతోనూ ప్రత్యేకంగా చర్చించనున్నట్లు ఆయన చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయి లిక్విడ్‌ను స్వాధీనం చేసుకుని, యువకులను అదుపులోకి తీసుకున్న రూరల్ సీఐ షేక్ నఫీజ్ బాషా, వెల్దుర్తి ఎస్ఐ డి. అశోక్, సిబ్బందిలను పల్నాడు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారన్నారు. వీరికి రివార్డులను అందించనున్నట్లు ఆయన తెలిపారు.

విజేతలకు పతకాలు ప్రదానోత్సవం

ఏపీ షూటింగ్ చాంపియన్‌షిప్- 2025 విజేతలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్, తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ ఏడాది జూన్ 21 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ షూటింగ్ చాంపియన్‌షిప్- 2025 ఏపీ విజేతలకు ఆదివారం స్థానిక వెల్‌కమ్ హోటల్లో పతకాల బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సలాలిత్ తొట్టెంపూడి మాట్లాడుతూ ఏపీ నుంచి మొత్తం 520 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో 204 పతకాలు సాధించారన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ మల్లికార్జున నాయక్, కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, రోడిక్ కన్సల్టెంట్ ఎండీ రాజ్‌కుమార్ హాజరై క్రీడాకారులకు బహుమతులు అందించినట్లు చెప్పారు.

విద్యుత్ వైర్లు చోరీ చేసే ముఠాకు చెక్

- ఇద్దరు నిందితుల అరెస్టు
- మరో ఇద్దరి కోసం గాలింపు

నిందితులను మీడియాకు చూపుతున్న కంకిపాడు పోలీసులు

కంకిపాడు: ఖాళీగా ఉన్న వెంచర్లలో విద్యుత్ స్తంభాలకు ఉన్న అల్యూమినియం వైర్లను చోరీ చేసే ముఠాకు కంకిపాడు పోలీసులు చెక్ పెట్టారు. చోరీకి పాల్పడుతున్న ముఠా సభ్యుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.3 లక్షలు విలువైన వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ జె.మురళీకృష్ణ కథనం మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన గరికే చందు ఇళ్ల వెంబడి ఉల్లిపాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తూ మద్యం, పేకాటకు బానిసయ్యాడు. తన గ్రామానికే చెందిన గరికే నాగరాజు, పాలపర్తి నాగరాజు, మంగళగిరి మండలం యర్రబాలేనికి చెందిన పాత ఇనుప కొట్టు నిర్వాహకుడు కుంటిగుర్ల నరసింహరాజుతో కలిసి జల్సాలు తీర్చుకోవటానికి, డబ్బుకోసం విద్యుత్ వైర్లు చోరీని మార్గంగా ఎంచుకున్నారు. కంకిపాడు, జగన్నాధపురం, కొణతనపాడు, ప్రొద్దుటూరు, దావులూరు గ్రామాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లలో స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్నారన్నారు. గరికే చందుపై గతంలో నాలుగు వైరు చోరీ కేసులు ఉన్నాయి. విద్యుత్ వైర్లు చోరీపై నమోదైన కేసులో భాగంగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. ప్రొద్దుటూరు గాయత్రీ విహార్ వద్ద గరికే చందు, గరికే నాగరాజు, పాలపర్తి నాగరాజు, కుంటిగుర్ల నరసింహరాజు అల్యూమినియం రేకులు ఏరుతూ సంచుల్లో మూట గట్టడాన్ని పోలీసులు గుర్తించారు. గరికే చందు, కుంటిగుర్ల నరసింహరాజు పోలీసులకు చిక్కగా, మిగిలిన ఇద్దరు పరారయ్యారు. కంకిపాడు పరిసర గ్రామాల్లో అల్యూమినియం వైర్లు చోరీ చేస్తున్నట్లు అంగీకరించారు. వారి వద్ద రూ.3 లక్షలు విలువైన వైరును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులు చందు, నరసింహరాజును అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపు చేపట్టామని సీఐ మురళీకృష్ణ తెలిపారు. కేసు విచారణలో ముఖ్యభూమిక వహించిన ఎస్ఐ డి.సందీప్, పీఎస్ఐ ఎస్.సురేష్, హెచ్‌సీ కె.చంద్రబాబు, పీసీలు పి.ఎస్.ఎన్.మూర్తి, సయ్యద్ బాజీబాబును ప్రత్యేకంగా అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును © 8790741166

WANTED

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000 - వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: ఏదీ డిగ్రీ, 55 wpm typing speed, M.S Office Skills వయస్సు: 22సంవత్సర ములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. 8978480429

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, క్లాసు ఇన్‌ఛార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు: 22సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయి ఉండాలి సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429

■ గుంటూరు వాసవి క్లాత్ మార్కెట్ దగ్గరలో షాపులో పనిచేయుటకు వర్కర్స్ (స్త్రీలు/ పురుషులు కావలెను. 25సం॥లు, సంప్ర॥ 9989929196

■ వంట మాస్టర్లు భార్యభర్తలు వెంటనే కావలెను. వసతి సౌకర్యం కలదు. వరంగల్ సిటీ లోని ప్రైవేటు మెడికల్ కాలేజిలో వంట చేయుటకు సంప్ర: 9390809999, 9849235255.

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు పురుషులు కావలెను. జీతము: 10,000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ 8978480435

■ గుంటూరులో ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మేనేజర్, అకౌంటెంట్, ఫీల్డ్, సూపర్‌వైజర్ అండ్ అసిస్టెంట్స్ కావలెను. మేల్ అండ్ ఫీమేల్. 9177999199, 9063999499

■ చిలకలూరిపేట పరిధిలోని రియల్‌ఎస్టేట్ కంపెనీలో వర్క్ చేయుటకు యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. 7097972927, 7032809961

■ అరండల్‌పేట 8/1లోని ఫ్రూట్ జ్యూస్ షాప్‌లో పనిచేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. సంప్రదించండి. 9618936240

■ Wanted primary lady principal, Vice Principal, AO, Incharge, English, Maths, Science and Mother Teachers, Apple Techno School, Krishna Babu Nagar, Gujjanagundla, Guntur. Contact: Phone: 6301036083

■ మంగళగిరి DGP Office సమీపంలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ: 18,000/- PF&ESI కటింగ్ పోను, 10th, Age 45 లోపు. © 88014 97437, 97034 65118

■ త్రివేణి హోంకేర్, హైదరాబాద్‌లో వృద్ధుల ను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం, జీ : 18K-20K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు 7075167663 7075167541

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హోమ్‌లోన్ సెంటర్ (ఆర్ఏసిపిసి), గుంటూరు, 26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ ఇ. రాజు, చీఫ్ మేనేజర్, మొబైల్ నెం.9866517080;
ఆస్తి తనిఖీ కొరకు : 96032 88555.

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. ... (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా ఉంది అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రికోర్స్ లేకుండా" పద్ధతిపై ...

1	ఋణగ్రహీత: శ్రీ తూములూరు బసవయ్య, తండ్రి : వీరరాఘవులు, డోర్ నెం. 16-13-68, ఆర్.టి.సి. కాలనీ రోడ్డు, గాంధీ నగర్ ఎక్స్‌టెన్షన్, కుసుమ ఏరియా, గుంటూరు - 522001. డిమాండ్ నోటీసు తేది: 28-04-2025. బకాయి మొత్తం: తేది.28-04-2025 నాటికి రూ.38,80,443/- ... (తేది.04.04.2022న రిజిష్టరు కాబడిన సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3932/2022, తేది.31.03.2022 ప్రకారం).
	రిజర్వు ధర : రూ.45,13,500/- ధరావత్తు : రూ.4,51,350/- బిడ్ పెంపుదల : రూ.10,000/-
2	ఋణగ్రహీతలు: శ్రీమతి కీడాంబి నాగ మాధవీలత, భర్త: పి. సత్య శ్రీధర్ & శ్రీ పరిహారం సత్య శ్రీధర్, ... ఫ్లాట్ నెం. 305, బ్లాక్-బి, బాలకృష్ణ టవర్స్, గోరంట్ల, గుంటూరు - 522034. డిమాండ్ నోటీసు తేది: 30-06-2025. బకాయి మొత్తం: తేది.30-06-2025 నాటికి రూ.17,77,133/- ... G.O.Ms No.279, M.A & U.D. Department (Ele-II) Dated: 12.07.2012 ... ఈ హద్దులలోని విస్తీర్ణం 4344 చ.గజాలు లేదా 3632 చ.మీ.ల స్థలం ... (రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.5302/2014, తేది.04.07.2014 ప్రకారం)
	రిజర్వు ధర : రూ.29,88,000/- ధరావత్తు : రూ.2,98,800/- బిడ్ పెంపుదల : రూ.10,000/-
3	ఋణగ్రహీతలు: శ్రీమతి నందిగామ రోజ్‌మేరీ, భర్త: గుంటూరు సుధాకర్ & శ్రీ గుంటూరు సుధాకర్, తండ్రి : యేసయ్య, ఫ్లాట్ నెం. 204, ... గుంటూరు - 522006. డిమాండ్ నోటీసు తేది: 09-09-2025. బకాయి మొత్తం: తేది.09-09-2025 నాటికి రూ.21,68,807/- ... ఈ హద్దులలోని విస్తీర్ణం 866.24 చ.గజాలు లేదా 724.289 చ.మీ.ల స్థలం ... (రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3257/2016, తేది.29.04.2016 ప్రకారం)
	రిజర్వు ధర : రూ.26,50,500/- ధరావత్తు : రూ.2,65,050/- బిడ్ పెంపుదల : రూ.10,000/-
4	ఋణగ్రహీత: శ్రీ పోతుల మణికాంత్, తండ్రి : పోతురాజు, ... హైదరాబాద్ - 500072. డిమాండ్ నోటీసు తేది: 11-09-2025. బకాయి మొత్తం: తేది.11-09-2025 నాటికి రూ.16,13,288/- ... ఈ హద్దులలోని విస్తీర్ణం 2660.06 చ.గజాలు లేదా 2224.07 చ.మీ.ల స్థలం ... (రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3434/2019, తేది.25.09.2019 ప్రకారం)
	రిజర్వు ధర : రూ.27,43,200/- ధరావత్తు : రూ.2,74,320/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 31-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ నుండి సా॥ 04.00 గం॥ వరకు
ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం: తేది:01-12-2025 నుండి 30-12-2025 వరకు ఉ॥10.00 గం॥ నుండి సా॥ 04.00 గం॥ వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ... M/s PSB Alliance ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/bidder-registration & https://baanknet.com & హెల్ప్ డెస్క్ ఫోన్ నెం: 91 - 8291220220, Mail ID: support.baanknet@psballiance.com ను సంప్రదించండి.
2) ... ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 29-11-2025, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రజల సంతకాలే చంద్రబాబు సర్కార్‌కు పతనం!

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

సేకరించిన సంతకాల కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజలు పెట్టిన సంతకాలే రేపటి చంద్రబాబు సర్కార్ పతనమవ్వడానికి పునాది అని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరులో గల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం సేకరించిన సంతకాల పత్రాలను కంప్యూటరీకరణ చేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ మంగళగిరి నియోజకవర్గంలో 50 వేలకు పైగా సంతకాలు సేకరించినట్లు తెలియజేశారు. నియోజకవర్గ పరిధిలోని 42 గ్రామాలు, 55 వార్డుల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇంటింటికి తిరిగే క్రమంలో స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేసి ప్రభుత్వంపై వ్యతిరేకతను చాటిచెప్పారని తెలియజేశారు.

తండ్రి ఆశయాలలో తనయుడు..

చరిత్రలో ఎవరూ చేయలేని పనిని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం పెట్టి ప్రతి ఒక్క పేద విద్యార్థి చదువుకునే విధంగా చేశారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంటు వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు చేరువయ్యారని పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తండ్రి ఆశయాలను కొనసాగించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు శరణ్‌కుమార్ రెడ్డి, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకె సునీత, నాయకులు గోపీకృష్ణ, ఎండీ ఫిరోజ్, అబ్దుల్ రజాక్, శివప్రసాద్, అజయ్‌కుమార్, తమ్మిశెట్టి గౌతమి, రవి, దేవకుమార్ నాయక్, వెంకటేశ్వరరావు, అక్బర్ అలీ, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

దిత్వా తుపానుతో అన్నదాతల్లో ఆందోళన

రబీ విత్తనం వేసిన రైతుల్లో ఆందోళన.. వేయని రైతుల్లో సందిగ్ధత

రబీ విత్తనం వేసేందుకు దుక్కిని సిద్ధం చేస్తున్న రైతన్న

తాడికొండ: దిత్వా తుపానుతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఎడతెరిపి లేకుండా మూడు నెలలకు పైగా కురిసిన అధిక వర్షాలు కొంచెం సడలింపు ఇవ్వడంతో వరి, జ్యూట్ ఇతర పంటల కోతలు, కల్లాలు పూర్తిచేసుకుని రబీ పంటను విత్తుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కాగా దిత్వా తుపాను కారణంగా అల్పపీడన ద్రోణీ ప్రభావంతో ఆదివారం అక్కడక్కడా చిరు జల్లులు ప్రారంభమయ్యాయి. దీంతో పంట విత్తిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు భారీ వర్షం కురిస్తే మళ్లీ నేల ఆరి తాము రబీ విత్తనం వేసేందుకు ఆలస్యం అవుతుందని వాపోతున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టం జరిగినా ప్రభుత్వం పరిహారం ఇచ్చేందుకు ఆసక్తి చూపించకపోవడంతో రైతుల పరిస్థితి సంకటంగా మారింది. బ్లాక్ మార్కెట్ కారణంగా పెరిగిన యూరియా, ఎరువుల ధరలు, విత్తనాల కొనుగోలు రైతన్నలకు భారంగా మారాయి. రాయితీపై అందించాల్సిన ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలం కావడంతో ఈ ఏడాది దిత్వా తుపాను ఏ మేరకు నష్టం కలిగిస్తుందో అని ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

నేర ప్రవృత్తిని విడనాడాలి

మంగళగిరి టౌన్: రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని విడనాడాలని.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవించాలని మంగళగిరి పట్టణ ఎస్‌ఐ హరిబాబు హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హరి బాబు మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పిడియాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో దివ్యపూజాబలి

ఫిరంగిపురం: క్రీస్తు ప్రభువు రాక ఆగమణ కాలంను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో క్రీస్తు ప్రభువు రాకడ మొదటి ఆదివారం దివ్యపూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ క్రీస్తు రాకడ కోసం ప్రతి ఒక్కరూ నిరీక్షించాలని తెలిపారు. హృదయాలను ప్రక్షాలన చేసుకుని ప్రభువు కోసం ప్రార్థన చేయాలన్నారు. సౌకర్యవంతమైన జీవితం దేవుడికి వ్యతిరేకమని.. ప్రతి మానవుడు దేవుడి పట్ల విశ్వాసంతో జీవించాలని పేర్కొన్నారు. అనంతరం దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మఠకన్యలు, కథోళిక క్రైస్తవులు, గుడిపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో మున్సిపల్ విద్యార్థుల ప్రతిభ

తెనాలి: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ సంస్థ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వం పోటీల్లో తెనాలి విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. చిత్రలేఖనం పోటీల్లో 250 మంది పాల్గొనగా ఎన్‌సీఆర్ఎన్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు చల్లా మోహిత్ ప్రథమ, డి.పార్థు ద్వితీయ, మురుగేష్ నాగసాయి తృతీయ బహుమతులను గెలుచుకోగా, మొఘల్ మొహమ్మద్‌కు కన్సోలేషన్ బహుమతి లభించింది. గుంటూరులోని ఎన్జీవోస్ కళ్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగిన సభలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలకు రూ.5,000, రూ.4,000, రూ.3,000 చొప్పున నగదు బహుమతులను, ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. తమ విద్యార్థులు చిత్రలేఖన ప్రతిభను హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పఠాన్ కరీముల్లా అభినందించారు. వారికి శిక్షణనిచ్చిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్‌ను ప్రశంసించారు.

ఘనంగా ఎన్‌జీవోస్ పదవీ ప్రమాణస్వీకారం

తెనాలిటౌన్: ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ తెనాలి తాలూకా యూనిట్ నూతన అధ్యక్షునిగా వి.భిక్షాలు బాధ్యతలు చేపట్టారు. మూడు సంవత్సరాలు కొనసాగే ఈ పదవి కాలంలో 16 మంది సభ్యులు బాధ్యతలు చేపడుతూ పదవి ప్రమాణం చేశారు. ఎన్నికల అధికారి కె.ఎన్.సుకుమార్ నూతన కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించారు. కృషి పట్టుదలతో అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్ష కార్యదర్శులు భిక్షాలు, సాయికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారి అభిమానులు కొత్త పాలక వర్గాన్ని పూల మాలలు వేసి సత్కరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పాండురంగపేటలోని ఓ అప్పడాల కంపెనీలో రేషన్ బియ్యం నిల్వ చేశారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఉత్తర క్యాబిన్ సమీపంలో మృతదేహం



తెనాలి రూరల్: తెనాలి రైల్వే స్టేషన్ ఉత్తర క్యాబిన్ సమీపంలో సుమారు 60 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు ఆదివారం గుర్తించారు. చేతిపై పచ్చబొట్టు, నోటిలో నుంచి నురగ రావడం గుర్తించారు. వృద్ధురాలు వివరాలు తెలియలేదని, ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ పోలీసులను 9849234990 నంబరులో సంప్రదించాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రమేష్ బాబు కోరారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ధాన్యం రైతులతో మాట్లాడుతున్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: రైతుల వద్ద ధాన్యాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా.. తేమ శాతం పేరుతో జాప్యం చేయకుండా ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లి రూరల్ పరిధి గుండిమెడ గ్రామంలో ఆయన ఆదివారం ధాన్యం కల్లాల్లో రైతులను కలిసి మాట్లాడారు. పలువురు రైతులు తుఫాన్ ప్రభావంతో తక్కువ ధరకు దళారులకు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలో అనేకసార్లు అధిక వర్షాలు పడడం వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పండించే రైతుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని అన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అతి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, గుండిమెడ గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందించారు. పెనుమాక గ్రామానికి చెందిన అద్దంకి నాగభూషణం అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని.. స్పందించి రూ.10 వేలు, నిత్యావసర సరుకులు, 25 కేజీల బియ్యం అందజేశామని పలువురు నాయకులు తెలిపారు. పెనుమాక పీఏసీ చైర్మన్ కళ్లం గోవిందరెడ్డి, టీడీపీ నాయకులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కొల్లి సురేష్, జాన్ ప్రకాష్, బొబ్బ రవితేజ, కళ్లం చేతన్‌రెడ్డి, అత్తోట రాంబాబు, మస్తాన్‌రావు, అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి కురగల్లులో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. కురగల్లు గ్రామ పరిధిలో లోడ్‌తో ఉన్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ఉద్యోగ బాధ్యత నిర్వహణలో కృషి, పట్టుదల

మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ రమణ

మంగళగిరి టౌన్: జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు నిబద్ధత గల అధికారి అని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి.రమణ కొనియాడారు. గతంలో మంగళగిరి ఫైర్ ఆఫీసర్‌గా పనిచేసి ప్రస్తుతం సత్తెనపల్లి ఫైర్ ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేస్తున్న నల్లూరి వెంకటేశ్వరరావు పదవీ విరమణ సభ ఆదివారం మంగళగిరి మండల పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో చిన్న కుటుంబం నుంచి వచ్చి ఉద్యోగ బాధ్యత నిర్వహణలో వెంకటేశ్వరరావు కృషి, పట్టుదల, అంకిత భావంతో విధులు నిర్వహించారన్నారు. సత్తెనపల్లిలో ఫైర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ జరిగే సమయంలో ఆయన అందించిన సహకారం అభినందనీయమన్నారు. ఆయన అంకిత భావం, నిబద్ధత పలువురు అధికారులకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం వెంకటేశ్వరరావు, సుజాత దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో రీజనల్ అగ్నిమాపక శాఖ అధికారులు జిలాని, స్వామి, భూపాల్ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో 10 శాతం రాయితీ

తెనాలిఅర్బన్: ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విశాఖపట్నం ప్రయాణించే వారికి సోమవారం నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు 10 శాతం రాయితీ ఉన్నతాధికారులు కల్పించారని తెనాలి డిపో ఇన్‌చార్జి మేనేజర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి డిపో నుంచి బీహెచ్ఎల్, విశాఖపట్నం వెళ్ళే బస్సులకు రాయితీ వర్తిస్తుందని చెప్పారు.
తెనాలి నుంచి బీహెచ్ఎల్ రూ.770 కాగా రూ.710కి, తెనాలి నుంచి విశాఖపట్నం రూ.960 బదులు రూ.880 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆదివారాలు రాయితీ వర్తించదన్నారు. ప్రయాణికులందరూ రాయితీని ఉపయోగించుకోవాలని కోరారు.

గంజాయి కట్టడిపై బాబు సర్కారు విఫలం

నిరసన కార్యక్రమంలో బాలరాజు, సీపీఎం నాయకులు

దుగ్గిరాల: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠా సీపీఎం నాయకుడు కామ్రేడ్ కొట్టివిడి పెంచలయ్య అనే యువకుడిని దారుణ హత్య చేశారని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు ఆరోపించారు. దుగ్గిరాలలోని శివాలయం సెంటర్‌లో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. గంజాయి కట్టడిలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వాపోయారు. తమ కళల ద్వారా ప్రజలు, యువకులను చైతన్య పరుస్తున్న ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్యను గంజాయి బ్యాచ్ హత్య చేయడం దారుణమని ఆరోపించారు. హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఎన్.యోగేశ్వరరావు, చిరంజీవి, సుబ్బారావు, జగన్‌మోహన్‌రావు, వరప్రసాదరావు, కమలాకర్ పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

తెనాలి: స్థానిక లక్ష్మీనగర్‌లోని శరణాగతి గోష్టి 12వ ధనుర్మాస ఉత్సవాల బ్రోచర్‌ను సంస్థ వ్యవస్థాపకులు నరేంద్ర రామానుజ దాసస్వామి ఆదివారం లక్ష్మీనగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో 12వ ధనుర్మాస ఉత్సవాలను డిసెంబరు నెల 16వ తేదీ నుంచి నెలరోజులపాటు నిర్వహించనున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్టాండు నుంచి వీఎస్సార్ కాలేజీకి వెళ్లే రోడ్డులో వడ్లమూడి హాస్పటల్ పక్కన యర్రంశెట్టి గంగాధర్, యర్రంశెట్టి వెంకట రమేష్‌బాబు స్థలప్రాంగణలో ఈ ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు జయప్రదం చేయాలని కోరారు.

తల్లిదండ్రుల ఆశీర్వచనాలే పిల్లలకు విజయం

పిల్లలను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

తెనాలిటౌన్: తల్లిదండ్రుల హృదయపూర్వక ఆశీర్వాదాలు బిడ్డ జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి దోహదపడతాయని అచ్యుతా దాసాజీ పేర్కొన్నారు. శ్రీపరంజ్యోతి కల్కి సేవా సమితి ఆధ్వర్యంలో రూరల్ మండలం బుర్రిపాలెంలోని శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవ ఆలయంలో సేవకులు ఆదివారం తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుతా దాసాజీ మాట్లాడుతూ శ్రీ పరంజ్యోతి భగవతి భగవాన్ బోధనాలను అనుసరించి తల్లిదండ్రులపై చిన్ననాటి నుంచే పిల్లల్లో గౌరవం, వినయ విధేయతలు, ప్రేమ వంటి ఉన్నత భావాలను పెంపొందించడానికి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బుర్రిపాలెం, తెనాలి పరిసర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు, వారి పిల్లలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. పిల్లలు వారి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి వారిని ప్రేమగా అలింగనం చేసుకుని కృతజ్ఞతలు వ్యక్తపరిచారు. అచ్యుత దాసాజీ సారథ్యంలో సేవకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

తెనాలి రూరల్: ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. బాపట్ల జిల్లా కల్లూరు మండలం నుండి రెండు ట్రాక్టర్లు ఇసుకను ఎటువంటి బిల్లులు లేకుండ తరలిస్తున్నాయి..
పెదరావూరు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ డ్రైవర్లను బిల్లులు అడుగగా చూపకపోవడంతో సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

108లో వైద్యశాలకు వెళుతున్న నాగమల్లేశ్వరరావు

తెనాలిరూరల్: వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఇస్లాంపేటకు చెందిన టి. నాగమల్లేశ్వరరావు శనివారం రాత్రి తెనాలి–చందోలు రహదారిపై వెంబడి వాకింగ్‌కు వెళ్లాడు. రహదారిపై జగ్గడిగుంటపాలెం వద్ద అమృతలూరుకు చెందిన వ్యక్తి బైక్ వేగాన్ని అదుపు చేయలేక నాగమల్లేశ్వరరావును ఢీ కొట్టాడు. తీవ్రగాయాలపాలైన నాగమల్లేశ్వరరావును 108లో తెనాలి వైద్యశాలకు పంపగా గుంటూరు పంపారు. బైక్‌పై ఉన్న వ్యక్తి గాయాలపాలవగా వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. గుంటూరులో చికిత్స పొందుతూ నాగమల్లేశ్వరరావు ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరంలో 210 మందికి పరీక్షలు

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఎస్ భవనంలో తెనాలికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. తెనాలి పరిసరాల నుంచి వచ్చిన మహిళలకు ఉదయం పరగడుపున రక్తపరీక్షలు చేశారు. అల్పాహారం తదుపరి మరోసారి పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు తదుపరి, అవసరమైన రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. వైద్యశిబిరంలో మొత్తం 210 మందికి పరీక్షలు చేశారు. అనంతరం సమీపంలోని బుర్రిపాలెం గ్రామంలో కమ్యూనిటీ హెల్త్ ప్రాజెక్టు కింద వంద మంది మహిళలకు రక్తపరీక్షలు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

సానుకూల దృక్పథంతోనే జీవనసాఫల్యం

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి నవంబర్ నెల సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ భవన్‌లోని వీజీకే భవన్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో దుగ్గిరాలకు చెందిన విశ్రాంత ఆచార్యుడు, కవి, రచయిత బి.లలితానంద ప్రసాద్ 'విశ్రాంత జీవన సాఫల్యం' అనే అంశంపై ప్రసంగించారు. సానుకూల దృక్పథం, ప్రతిరోజూ నడక, క్రమం తప్పని వైద్యపరీక్షలు, మితాహారంతో విశ్రాంత జీవితంలో అందరూ సుఖ సంతోషాలతో కాలం గడపొచ్చని చెప్పారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. నవంబర్ నెలలో జన్మించిన వడ్లమూడి కృష్ణమూర్తి, వెలువోలు వెంకట లక్ష్మీనారాయణ, వెనిగళ్ల నారాయణ ప్రసాద్‌లకు అసోసియేషన్ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, సంయుక్త కార్యదర్శి పుచ్చకాయల కోటిరెడ్డి, కార్యవర్గసభ్యులు అబ్బూరు రామమూర్తి, కోశాధికారి నర్రావుల ఆదినారాయణ, కో–ఆప్షన్ సభ్యులు కుప్పాల చలమయ్య, కోటి రామకృష్ణారావు, చెరుకూరి శివరామయ్య పాల్గొన్నారు.

ఎస్ భారత్ జాతీయ కార్యాలయం ప్రారంభం

ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలో ఆంధ్రప్రదేశ్ యాదవ ఉద్యోగుల సంఘం సొసైటీ రాష్ట్ర కార్యాలయం, ఎస్(వైఈఎస్) భారత్ జాతీయ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎస్ భారత్ అధ్యక్షులు కేవీ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఈ రెండు కార్యాలయాలు సమాజ ఐక్యత, యువతకు మార్గదర్శకం, ఉద్యోగుల సంక్షేమం, విద్య, వృత్తి పురోగతికి కేంద్ర బిందువులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవ ఉద్యోగుల మధ్య సహకారం, పరస్పర బలోపేతం, సమస్యల పరిష్కారం కోసం సొసైటీ ఒక సమగ్ర వేదికగా పని చేస్తుందని పేర్కొన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్స్, డీఎస్సీ, ఎస్ఐ వంటి పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం శిక్షణా తరగతులు, మెంటర్‌షిప్, స్టడీ సర్కిల్స్ నిర్వహించనున్నామని వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఆరోగ్యశిబిరాలు, లీగల్ అవేర్‌నెస్, సమస్యల పరిష్కార వేదికలు, సంక్షేమ కార్యక్రమాలు సొసైటీ ద్వారా క్రమబద్ధంగా కొనసాగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కావేటి రమేష్, ఆర్థిక కార్యదర్శి పాలెల రామాంజనేయులు, వైఈఎస్ భారత్ జాతీయ విద్యా సమన్వయదారులు ఏవీవీ ప్రసాద్‌బాబు, నాయకులు రాజారావు, శ్రీనివాసులు, చిన్నారావు, నాగన్న, మర్రి ప్రభాకర్, మాగంటి శ్రీనివాస్, పిచ్చయ్య, గంగరాజు, శ్రీనివాసులు, వెంకటరమణ, జ్ఞానేశ్వర్‌రావు, రవీంద్ర, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయస్థానాల తీర్పులను అమలు చేయాలి

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు బూరుగ అంకయ్య, తుపాకుల నాగేశ్వరరావు, ముసల సాంబశివరావులతో కలిసి ఆదివారం సందర్శించారు. నాయకులు కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. 362 రోజులుగా కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించాలని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని గుర్తు చేశారు. కార్మికులు దీక్షలు ప్రారంభించి ఏడాది కానున్న సందర్భంగా భారీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.నాగేశ్వరరావు, మాణిక్యరావు, రమాదేవి, దుర్గాభవాని, బాషా, తదితరులు పాల్గొనగా దీక్షల్లో సాంబశివరావు, సూర్యప్రకాష్, విజయశ్రీ, నవనీతమ్మ, అన్నమ్మ, కూర్చున్నారు.

విశదలలో ఉచిత వైద్య శిబిరం

ముగింపు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మేడికొండూరు: మండల సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ శిబిరం చివరి రోజు శ్రీహాస్పిటల్ గుంటూరు వారితో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ గణేష్ తమ బృందంతో విచ్చేసి విశదల పరిసర గ్రామ ప్రజలకు పరీక్షలు జరిపి ఉచిత మందులు పంపిణీ చేశారు. అలానే ఆఫ్టోకేర్ కళ్ల వైద్య నిపుణులైన డాక్టర్ పీవీ లక్ష్మీ విచ్చేసి కళ్ల సమస్యలు ఉన్న వారిని పరీక్షించి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను గ్రామ పెద్దలు అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ పి.రవికుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. సేవా శిబిరం వారం రోజులు ఘనంగా నిర్వహించి ముగించడం పట్ల కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, ఏవో సీతారామయ్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గీతా జయంతి నేడు

తెనాలి: వివేక ఆత్మవిద్యా నికేతన్ ఆధ్వర్యంలో సోమవారం బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి గీతా జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్తరాఖండ్‌లోని రుషీకేశ్‌లో గల స్వామి దయానంద ఆశ్రమానికి చెందిన శ్రీస్వామి భాస్కరానంద సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలియజేశారు. గీతాచార్యులు, శ్రీమద్భగవద్గీత గ్రంథాలతో శోభాయాత్ర, అర్చన, భగవద్గీత ధ్యానశ్లోకాలతో పూజాకార్యక్రమం, భగవద్గీత పారాయణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. విజయవాడకు చెందిన డాక్టర్ చావా మురళీకృష్ణ 'విద్యార్థుల మనోవికాసానికి భగవద్గీత' ప్రతులను ఆవిష్కరిస్తారని వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణ

గీతా జయంతి సందర్భంగా సోమవారం కొత్తపేటలో గీతా సత్సంగం–2025, సంపూర్ణ భగవద్గీత పారాయణ భారీగా జరగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నాగలక్ష్మి అపార్టుమెంట్ పైభాగంలో కూరెళ్ల కోదండ రామం గురువు ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు కంకణాల వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు. విశిష్ట అతిథిగా రాఘవానంద ముడుంబా గురూజీ, గౌరవ అతిథులుగా కర్రా నాగరాజుబాబు బిల్లకంటి శ్రవణ్‌కుమార్, ముఖ్యఅతిథులుగా గునుపుడి నీరజ, పి.మధురవాణి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకు దరఖాస్తు చేసినట్టు వివరించారు.

రన్నరప్ భారత హాకీ జట్టు

ఇపో (మలేసియా): ఆరోసారి సుల్తాన్ అజ్లాన్ షా కప్ పురుషుల హాకీ టోర్నమెంట్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత జట్టుకు నిరాశ ఎదురైంది. ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియం జట్టుతో ఆదివారం జరిగిన ఫైనల్లో సంజయ్ సారథ్యంలోని టీమిండియా 0–1 గోల్ తేడాతో ఓడిపోయింది. ఆట 34వ నిమిషంలో థిబూ స్టాక్‌బ్రోక్స్ చేసిన ఫీల్డ్ గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన బెల్జియం చివరి వరకూ ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంది. ఈ క్రమంలో తొలిసారి సుల్తాన్ అజ్లాన్ షా కప్ టోర్నీలో విజేతగా అవతరించింది. ఇదే టోర్నీ లీగ్ దశలోనూ బెల్జియం చేతిలో ఓడిపోయిన భారత జట్టు ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోలేకపోయింది. మ్యాచ్‌లో బెల్జియం జట్టుకు ఆరు పెనాల్టీ కార్నర్‌లు, భారత జట్టుకు మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. అయితే రెండు జట్లు ఈ పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకున్నాయి. ఆరు జట్లు పోటీపడ్డ ఈ టోర్నీలో మొత్తం 18 మ్యాచ్‌లు జరిగాయి. 107 గోల్స్ నమోదయ్యాయి. ఇందులో 58 ఫీల్డ్ గోల్స్ కాగా, 40 గోల్స్ పెనాల్టీ కార్నర్‌ల ద్వారా, 9 గోల్స్ పెనాల్టీ స్ట్రోక్‌ల ద్వారా వచ్చాయి. 42 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో భారత జట్టు ఐదుసార్లు (1985, 1991, 1995, 2009, 2010) విజేతగా నిలిచి, నాలుగుసార్లు (2008, 2016, 2019, 2025) రన్నరప్ ట్రోఫీతో సంతృప్తి పడింది.

గాయత్రి-ట్రెసా జాలీ జోడీదే డబుల్స్ టైటిల్

పురుషుల సింగిల్స్ రన్నరప్ శ్రీకాంత్



లక్నో: సొంతగడ్డపై సత్తా చాటుకున్న పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ ఈ ఏడాది తమ ఖాతాలో తొలి టైటిల్‌ను జమ చేసుకుంది. ఆదివారం ముగిసిన సయ్యద్ మోడీ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో టాప్ సీడ్ గాయత్రి–ట్రెసా జాలీ జంట తమ టైటిల్‌ను నిలబెట్టుకుంది. 76 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 17–21, 21–13, 21–15తో కహో ఒసావా–మాయ్ తనాబె (జపాన్) ద్వయంపై విజయం సాధించింది. భుజం గాయం కారణంగా ఐదు నెలలు ఆటకు దూరంగా ఉన్న గాయత్రి గత వారం ఆ్రస్టేలియన్ ఓపెన్ టోర్నీతో పునరాగమనం చేసింది. విజేతగా నిలిచిన గాయత్రి–ట్రెసా జోడీకి 18,960 డాలర్ల (రూ. 16 లక్షల 94 వేలు) ప్రైజ్ మనీతోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఎనిమిదేళ్లుగా అంతర్జాతీయ టైటిల్ నెగ్గలేకపోయిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌కు మరోసారి నిరాశ ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాంత్ రన్నరప్‌గా నిలిచాడు. ప్రపంచ 59వ ర్యాంకర్ జేసన్ గుణవాన్ (హాంకాంగ్)తో జరిగిన ఫైనల్లో ప్రపంచ 38వ ర్యాంకర్ శ్రీకాంత్ 16–21, 21–8, 20–22తో పోరాడి ఓడిపోయాడు. ఈ సీజన్‌లో మలేసియా ఓపెన్ సూపర్–500 టోర్నీ ఫైనల్లోనూ శ్రీకాంత్ ఓడిపోయాడు. రన్నరప్ శ్రీకాంత్‌కు 9,120 డాలర్ల (రూ. 8 లక్షల 15 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5950 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

టెస్టు సిరీస్ పరాభవం నుంచి కోలుకున్న టీమిండియా... వన్డే సిరీస్‌లో శుభారంభం చేసింది. 'స్టార్స్' రోహిత్ శర్మ తనలో చేవ తగ్గలేదని నిరూపించగా... కోహ్లి వీరోచిత సెంచరీతో సత్తా చాటాడు. సింగిల్స్, డబుల్స్‌తో స్ట్రయిక్ రొటేట్ చేస్తూనే వీలు చిక్కినప్పుడల్లా భారీ సిక్స్‌లతో అచ్చమైన వన్డే ఇన్నింగ్స్‌తో కట్టిపడేశాడు. బంతితో కుల్దీప్, హర్షిత్ రాణించారు. సుదీర్ఘ ఫార్మాట్ గెలుపు ఇచ్చిన స్ఫూర్తితో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగిన సఫారీ జట్టు కడదాకా పోరాడినా పరాజయం తప్పలేదు.

కోహ్లి నూరు

వన్డేల్లో విరాట్ 52వ సెంచరీ

టెస్టుల్లో సచిన్ అత్యధిక సెంచరీల రికార్డును వన్డేల్లో అధిగమించిన కోహ్లి

- తొలి వన్డేలో భారత్ విజయం
- 17 పరుగులతో దక్షిణాఫ్రికా ఓటమి
- రాణించిన రోహిత్, రాహుల్
- మెరిసిన హర్షిత్ రాణా, కుల్దీప్
- బుధవారం రెండో వన్డే

రాంచీ: సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన భారత జట్టు... వన్డే సిరీస్‌లో బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి పోరులో టీమిండియా 17 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 349 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (120 బంతుల్లో 135; 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) వన్డే కెరీర్‌లో 52వ సెంచరీతో కదంతొక్కగా... కెప్టెన్ కేఎల్ రాహుల్ (60; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (51 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌటైంది. బ్రీట్కీ (80 బంతుల్లో 72; 8 ఫోర్లు, 1 సిక్స్), యాన్సెన్ (39 బంతుల్లో 70; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), కార్బిన్ బాష్ (51 బంతుల్లో 67; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 4, హర్షిత్ రాణా 3 వికెట్లు పడగొట్టారు. కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య బుధవారం రాయ్‌పూర్‌లో రెండో వన్డే జరగనుంది.

సెంచరీ భాగస్వామ్యం...

ఇప్పటికే టెస్టు, టి20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ... ఆడుతున్న ఒక్క ఫార్మాట్‌లోనే అదరగొడుతున్నారు. చివరగా ఆ్రస్టేలియాతో ఆడిన వన్డేలో దంచికొట్టిన ఈ జంట ... సిడ్నీలో ఎక్కడ ఆపిందో రాంచీలో అక్కడి నుంచే మోత మోగించింది. ఫామ్, ఫిట్‌నెస్‌లో యువ ఆటగాళ్లకు ఏమాత్రం తీసిపోమని మరోసారి చాటింది. నాలుగో ఓవర్‌లోనే యశస్వి జైస్వాల్ (18; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుట్ కాగా.. ఎదుర్కొన్న తొలి బంతికే బౌండరీ బాది విరాట్ తన ఉద్దేశాన్ని చాటాడు. సాధారణంగా నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించే కోహ్లి చూడచక్కటి షాట్లతో కట్టిపడేయగా... రోహిత్ కూడా లయ అందుకున్నాడు. దీంతో 10 ఓవర్లలో భారత జట్టు 80/1తో నిలిచింది. సుబ్రాయెన్ బౌలింగ్‌లో రోహిత్ రెండు వరుస సిక్స్‌లు బాదితే... కార్బిన్ బాష్ బౌలింగ్‌లో కోహ్లి చెలరేగిపోయాడు. రోహిత్ తనదైన పుల్ షాట్‌లతో రెచ్చిపోగా... విరాట్ వన్డేల్లో తన రెండో అత్యధిక సిక్స్ (7)లు ఈ మ్యాచ్‌లో నమోదు చేసుకున్నాడు. ఈ క్రమంలో కోహ్లి 48, రోహిత్ 43 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. రెండో వికెట్‌కు 136 పరుగులు జోడించిన అనంతరం రోహిత్ అవుట్ కాగా... రుతురాజ్ (8), సుందర్ (13) విఫలమయ్యారు. 102 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాక జూలు విదిల్చిన విరాట్... సుబ్రాయెన్ వేసిన 39వ ఓవర్‌లో వరుసగా 4, 6, 6, 4 బాదాడు. మరో భారీ షాట్ కొట్టే ప్రయత్నంలో కోహ్లి అవుటయ్యాడు. ఆఖర్లో జడేజా (20 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) అండతో... రాహుల్ కీలక పరుగులు జోడించాడు.

యాన్సెన్ దూకుడు...

భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా జట్టుకు శుభారంభం దక్కలేదు. రికెల్టన్ (0), డికాక్ (0), మార్క్‌రమ్ (7) పెవిలియన్‌కు చేరడంతో ఆ జట్టు 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఈ దశలో టోనీ జార్జి (39; 7 ఫోర్లు), బ్రెవిస్ (37; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి బ్రీట్కీ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ ఇద్దరు ఎక్కువసేపు నిలవలేకపోయినా... యాన్సెన్ రాకతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. టెస్టు సిరీస్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన యాన్సెన్... భారీ షాట్లతో టీమిండియాను భయపెట్టాడు. దీంతో సఫారీ జట్టు పోటీలోకి రాగా... కుల్దీప్ యాదవ్ ఒకే ఓవర్‌లో ఈ ఇద్దరినీ అవుట్ చేసి జట్టులో ఆనందం నింపాడు. చివరి వరుస బ్యాటర్లతో కలిసి బాష్ ఆఖర్లో పోరాడినా... జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయాడు.

యాన్సెన్

కోహ్లి కాళ్లు తాకాలని...

ఈ మ్యాచ్‌లో కోహ్లి బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఓ అభిమాని మైదానంలోకి దూసుకొచ్చాడు. భద్రతా సిబ్బంది కళ్లుగప్పి విరాట్ వరకు చేరుకున్న అభిమాని... కోహ్లికి పాదాభివందనం చేశాడు. అంతలో అప్రమత్తమైన సిబ్బంది అతడిని బయటకు తీసుకెళ్లారు.

52 వన్డేల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్‌లు (టెస్టు, వన్డే, టి20) ఉండగా... ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా కోహ్లి రికార్డు నెలకొల్పాడు. టెస్టుల్లో 51 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును వన్డేల్లో కోహ్లి బద్దలు కొట్టాడు.

వన్డే 'సిక్స్'లలో రోహిత్ రికార్డు

ఈ మ్యాచ్‌లో మూడు సిక్స్‌లు బాదిన 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ... వన్డే క్రికెట్‌లో అత్యధిక (352) సిక్స్‌లు కొట్టిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఈ క్రమంలో పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది (351) పేరిట 15 ఏళ్లుగా ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు. అఫ్రిది 398 మ్యాచ్‌ల్లో 351 సిక్స్‌లు బాదగా... రోహిత్ 278 మ్యాచ్‌ల్లోనే అతడిని అధిగమించాడు. గేల్ (301 మ్యాచ్‌ల్లో 331 సిక్స్‌లు) మూడో స్థానంలో ఉన్నాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) డికాక్ (బి) బర్గర్ 18; రోహిత్ (ఎల్బీ) (బి) యాన్సెన్ 57; కోహ్లి (సి) రికెల్టన్ (బి) బర్గర్ 135; రుతురాజ్ (సి) బ్రెవిస్ (బి) బార్ట్‌మన్ 8;సుందర్ (సి) బాష్ (బి) బార్ట్‌మన్ 13; రాహుల్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 60; జడేజా (సి) మార్క్‌రమ్ (బి) బాష్ 32; హర్షిత్ (నాటౌట్) 3; అర్ష్‌దీప్ (బి) బాష్ 0; కుల్దీప్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు)349. వికెట్ల పతనం:** 1–25, 2–161, 3–183, 4–200, 5–276, 6–341, 7–347, 8–347. **బౌలింగ్:** యాన్సెన్ 10–0–76–2; బర్గర్ 10–0–65–2; బాష్ 10–0–66–2; బార్ట్‌మన్ 10–0–60–2; సుబ్రాయెన్ 10–0–73–0. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 7; రికెల్టన్ (బి) హర్షిత్ 0; డికాక్ (సి) రాహుల్ (బి) హర్షిత్ 0; బ్రీట్కీ (సి) కోహ్లి (బి) కుల్దీప్ 72; జోర్జి (ఎల్బీ) (బి) కుల్దీప్ 39; బ్రెవిస్ (సి) రుతురాజ్ (బి) హర్షిత్ 37; యాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 70; బాష్ (సి) రోహిత్ (బి) ప్రసిధ్ 67; సుబ్రాయెన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 17; బర్గర్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 17; బార్ట్‌మన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 6; **మొత్తం (49.2 ఓవర్లలో ఆలౌట్) 332. వికెట్ల పతనం:** 1–7, 2–7, 3–11, 4–77, 5–130, 6–227, 7–228, 8–270, 9–312, 10–332. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10–1–64–2; హర్షిత్ రాణా 10–0–65–3; సుందర్ 3–0–18–0; ప్రసిధ్ 7.2–1–48–1; కుల్దీప్ 10–0–68–4; జడేజా 9–0–66–0.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ గువాహటిలో 177 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) గువాహటి ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్(నాన్ అకాడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 177.
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, అనాటమి, బయో కెమిస్ట్రీ, బర్న్స్–ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్–వీఎస్, కమ్యూనిటీ–ఫ్యామిలీ మెడిసిన్, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్–టాక్సికాలజీ, గ్యాస్ట్రో ఎంటిరాలజీ, జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ/హెమటాలజీ, మైక్రోబయాలజీ, నియోనెటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆబ్‌స్టిక్స్–గైనకాలజీ, ఆప్తల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫిజికల్ మెడిసిన్–రిహాబిలిటేషన్, ఫిజియాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, రేడియేషన్ ఆంకాలజీ, రేడియాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ట్రాన్స్‌ఫ్యుజన్ మెడిసిన్–బ్లడ్ బ్యాంక్, ట్రామా–ఎమర్జెన్సీ మెడిసిన్, యూరాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ), ఎంఎస్సీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 17.11.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.67,700.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.11.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.12.2025
» **వెబ్‌సైట్:** https://aiimsguwahati.ac.in

సీఎస్ఐఆర్-సీఎల్ఆర్ఐ, చెన్నైలో 14 పోస్టులు

చెన్నైలోని సీఎస్ఐఆర్–సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎల్ఆర్ఐ)తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **ఖాళీల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1–11, ప్రాజెక్ట్ అసోసియేట్2–01, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్–01, జూనియర్ రీసెర్చ్ ఫెలో–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంసీఏ, ఎంవీఎస్సీ, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు నెట్/గేట్ స్కోర్, ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.25,000, ప్రాజెక్ట్ అసోసియేట్–2కు రూ.28,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.25,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **రాతపరీక్ష(స్టేజ్–1) తేది:** 22.12.2025.
» **ఇంటర్వ్యూ తేది(స్టేజ్–2):** 23.12.2025.
» **ఇంటర్వ్యూ వేదిక:** సీఎస్ఐఆర్–సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సర్దార్ పటేల్ రోడ్, అడయార్, చెన్నై.
» **వెబ్‌సైట్:** https://www.clri.org

ఐఏఆర్ఐ, న్యూఢిల్లీలో సీనియర్ రీసెర్చ్ ఫెలోలు

న్యూఢిల్లీలోని ఐకార్–ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఏఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రీసెర్చ్ ఫెలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు నెట్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.12.2025
» **వెబ్‌సైట్:** https://www.iari.res.in

మేనేజ్ హైదరాబాద్‌లో పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026–28 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(అగ్రికల్చర్ సైన్సెస్/అగ్రికల్చర్ సంబంధ విభాగాల్లో) ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు క్యాట్–2025 స్కోర్‌ను కలిగి ఉండాలి. చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** క్యాట్–2025 స్కోర్, గ్రూప్ డిస్కషన్,ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2026.
» **ఎస్సే రైటింగ్, గ్రూప్ డిస్కషన్ అండ్ ఇంటర్వ్యూ తేది:** ఏప్రిల్ 2026.
» **ఫలితాలు:** ఏప్రిల్/మే 2026.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.manage.gov.in

బీఈసీఐఎల్ న్యూఢిల్లీలో 18 పోస్టులు

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
» **పోస్టుల వివరాలు:** డ్రైవర్–05, డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)–10, మెడికల్ ఫిజిసిస్ట్ (రేడియో థెరపీ)–01, మెడికల్ ఫిజిసిస్ట్ (రేడియాలజీ)–01, మెడికల్ ఫిజిసిస్ట్ (న్యూక్లియర్ మెడిసిన్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, పీజీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» **వయసు:** డ్రైవర్‌కు 21 నుంచి 40 ఏళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు 18 నుంచి 40 ఏళ్లు, మెడికల్ ఫిజిసిస్ట్‌కు 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.25,506, మెడికల్ ఫిజిసిస్ట్‌కు రూ.75,000.
» **విధానం:** స్కిల్‌టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ–56/ఏ–17, సెక్టార్–62, నోయిడా–201307(ఉత్తరప్రదేశ్) చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.12.2025.
» **వెబ్‌సైట్:** http://www.becil.com

బ్యాంక్ ఆఫ్ బరోడాలో అప్రెంటిస్

» 2,700 ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల
» దరఖాస్తులకు చివరి తేది 01.12.2025

బ్యాంకు ఉద్యోగాలు కోరుకునే వారికి చక్కటి అవకాశం. ప్రభుత్వ రంగ బ్యాంకు.. బ్యాంక్ ఆఫ్ బరోడా అప్రెంటిస్ అవకాశం కల్పిస్తోంది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉన్న 2,700 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ఏడాది శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో నెలకు రూ.15వేలు స్టైపెండ్ పొందొచ్చు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో... బ్యాంక్ ఆఫ్ బరోడాలో అప్రెంటిస్ అవకాశాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

మొత్తం ఖాళీలు: 2700

ఖాళీల వివరాలు: తెలంగాణ–154, ఆంధ్రప్రదేశ్–38, తమిళనాడు–159, కర్ణాటక–440, కేరళ–52, ఒడిశా–29, పుదుచ్చేరి–06, ఛత్తీస్‌గఢ్–48, గోవా–10, మహారాష్ట్ర–297, మధ్యప్రదేశ్–56, పశ్చిమ్ బెంగాల్–104, బిహార్–47, ఉత్తరాఖండ్–22, రాజస్థాన్–215, జార్ఖండ్–15, పంజాబ్–96, మిజోరం–05, మణిపూర్–02, చండీఘడ్ –12, గుజరాత్–400, దాద్రనగర్ హవేలీ–05, ఢిల్లీ–119, జమ్మూ కశ్మీర్–05, హరియాణ–36, అస్సాం–21.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించినవారు దరఖాస్తుకు అర్హులు.

వయసు

2025, నవంబర్ 1వ తేదీ నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీకి 3 ఏళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

స్టైపెండ్

అప్రెంటిస్‌కు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 స్టైపెండ్ అందిస్తారు.

అప్రెంటిస్ ప్రయోజనాలు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో అప్రెంటిస్ శిక్షణ వ్యవధి ఏడాది ఉంటుంది. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి నేషనల్ స్కిల్ డవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్ఎల్‌డీసీ) సర్టిఫికెట్ అందిస్తుంది.ఈ అనుభవంతో ప్రైవేటు బ్యాంకులు, బీమా, ఇతర ఆర్థిక సంస్థల్లో సులువుగా అవకాశాలను అందుకోవచ్చు. ముఖ్యంగా బ్యాంకు ఉద్యోగాలే లక్ష్యంగా పెట్టుకున్నవారికి ఇది మంచి అవకాశమని చెప్పొచ్చు.

ఎంపిక ఇలా

ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్షను ఆన్‌లైన్ (సీబీటీ)విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్/ఫైనాన్షియల్ అవేర్ నెస్, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు ఉంటుంది. ప్రతి సరైన జవాబుకూ ఒక మార్కు ఇస్తారు. నెగెటివ్ మార్కుల నిబంధన లేదు. పరీక్షలో అర్హత మార్కులు పొందినవారికి స్థానిక భాషలో పరీక్ష నిర్వహిస్తారు.

ఏపీ, తెలంగాణల్లో ఖాళీలకు దరఖాస్తు చేసుకుని, పది/ఇంటర్‌లో తెలుగు ఒక సబ్జెక్టుగా ఉన్న వారు లాంగ్వేజ్ టెస్టు రాయనవసరం లేదు. తెలుగు రాష్ట్రాల్లోని పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు స్థానిక భాషలో ఉత్తీర్ణత సాధిస్తేనే సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్టులను నిర్వహించి, అర్హులైన వారిని అప్రెంటిస్‌గా నియమిస్తారు.

ప్రిపరేషన్ పక్కాగా

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో ఆర్థికాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్యాంకింగ్ రంగానికి సంబంధించి ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థ, బ్యాంక్ పదజాలం, రివర్స్ రెపో, బీమా, రెపో, వడ్డీరేట్లు, బ్యాంకుల కార్యకలాపాలు, బ్యాంకులు–ప్రధాన కార్యాలయాలు –అధిపతులు, బ్యాంకుల విలీనం, తాజా ఆర్థిక నిర్ణయాలకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

ఇందులో ముఖ్యంగా దేశ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక వ్యవస్థ, పాలిటీ, సైన్స్‌ల్లో ప్రాథమిక అవగాహనను పరిశీలిస్తారు. వీటికోసం 8, 9, 10 తరగతుల్లోని ముఖ్యాంశాలు చదువుకుంటే సరిపోతుంది. వర్తమాన వ్యవహారాల కోసం పరీక్ష తేదీకి ఆరు నెలల ముందు వరకు జరిగిన ముఖ్య సంఘటనలు అంటే.. నియామకాలు, అవార్డులు, విజేతలు, ఎన్నికలు, పుస్తకాలు–రచయితలు, ప్రముఖుల పర్యటనలు, మరణాలు తెలుసుకోవాలి.

జనరల్ ఇంగ్లిష్

ఈ విభాగంలో స్పేసెస్ ఫిలింగ్, వాక్యంలో తప్పును గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, తప్పుగా ఉన్న పదాన్ని గుర్తించడం, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలుగా మార్చడం, వాక్యంలో పదాలను క్రమ పద్ధతిలో అమర్చడం,కాంప్రహెన్షన్..తదితర విభాగాల నుంచే ప్రశ్నలు అడుగుతారు. హైస్కూల్, ఇంటర్మీడియట్ స్థాయి ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలపై పట్టుతో ఎక్కువ మార్కులు పొందవచ్చు.

స్కిల్ డెవలప్‌మెంట్

క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో నంబర్ సిస్టమ్, ఫండమెంటల్ అర్థమేటికల్ ఆపరేషన్ల నుంచి ప్రశ్నలు వస్తాయి. అర్థమెటిక్ ఆపరేషన్స్‌లో భాగంగా.. శాతాలు, నిష్పత్తి, సరాసరి, చక్రవడ్డీ, బారువడ్డీ, లాభనష్టాలు, కాలం–పని, కాలం–దూరం, డిస్కౌంట్.. మొదలైనవి బాగా చదవాలి. రీజనింగ్‌లో.. వెర్బల్, నాన్ వెర్బల్ ప్రశ్నలు ఉంటాయి. సెమాంటిక్ ఎనాలజీ, సింబాలిక్ ఆపరేషన్స్, నెంబర్ ఎనాలజీ, ట్రెండ్స్, ఫిగర్ ఎనాలజీ, వెన్ డయాగ్రమ్స్, నంబర్ క్లాసిఫికేషన్, సిరీస్, కోడింగ్–డీకోడింగ్, వర్డ్ బిల్డింగ్.. తదితర విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి.

కంప్యూటర్ నాలెడ్జ్

కంప్యూటర్‌కు సంబంధించిన వర్డ్, ఎక్సెల్, ఇంటర్నెట్, వెబ్ బ్రౌజింగ్, ఈమెయిల్, యూఆర్ఎల్, హెచ్ టీటీపీ, వెబ్‌సైట్ బాగా తెలుసుకోవాలి. ఇంజనీరింగ్ విద్యార్థులు, డిగ్రీలో కంప్యూటర్ సైన్స్ చదువుకున్నవారికి ఈ ప్రశ్నలు పెద్దగా ఇబ్బంది అనిపించకపోవచ్చు.

ప్రాక్టీస్

ఐబీపీఎస్ క్లరికల్, గతంలో నిర్వహించిన అప్రెంటిస్ పాత, మాదిరి ప్రశ్నపత్రాలు వీలైనన్ని సాధన చేయాలి. నిర్ణీత వ్యవధిలో ఎక్కువ ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించేలా సన్నద్ధత ఉండాలి.ఒక్కో ప్రశ్నకు 36 సెకన్ల సమయం మాత్రమే అందుబాటులో ఉంటుంది. కాబట్టి ఇంత తక్కువ వ్యవధిలో సమాధానం గుర్తించాలంటే.. పరీక్షకు ముందు వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. నెగటివ్ మార్కులు లేవు కాబట్టి బాగా ఆలోచించి తెలియని ప్రశ్నలకు సైతం సమాధానాలు గుర్తించాలి. అలాగే ఏయే అంశాల్లో బలహీనంగా ఉన్నారో గుర్తించి.. వాటికి సంబంధించి వీలైనన్ని ప్రశ్నలు సాధన చేస్తే మెరుగైన ఫలితం పొందే అవకాశం ఉంటుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:2025, డిసెంబర్ 1
- వెబ్‌సైట్: https://bankofbaroda.bank.in

“నేను మర్చిపోతున్నాను” అనడం కంటే “నేను గుర్తుంచుకోగలను” అనుకోవడం మేధస్సుకు బలాన్నిస్తుంది. మానసిక విశ్వాసం జ్ఞాపక శక్తిని పెంచే ప్రధానమైన మంత్రం.

మంచిమాట

ఆత్మస్తుతి... పరనింద



మానవ సంబంధాలలో ఉన్నతమైన విలువలకు, మన ఆత్మగౌరవానికి మూలస్తంభాలుగా నిలిచేవి - నమ్మకం, వినయం, బాధ్యత. అయితే, ఈ ఉన్నత లక్షణాలను ఒక్క దెబ్బతో నేలకూల్చే ఒక అంతర్గత శక్తి ఉంది: అదే అహంకారం. జీవితంలో మనం నిత్యం కోల్పోతున్న ఆంతరంగిక ప్రశాంతతకు, సామాజిక మన్ననకు - ఈ ఆత్మస్తుతి, పరనింద అనేవే ప్రధాన కారణాలు.

మన అంతరంగంలో, 'నేనే గొప్ప', 'నా నిర్ణయమే శిరోధార్యం' అని నిశ్శబ్దంగా వినిపించే ఒక బలమైన, ప్రమాదకరమైన స్వరం ఉంటుంది. ఇదే అహంకారం. ఇది ఒక మానసిక విషం లాగా, మనల్ని ఇతరుల నుండి దూరం చేస్తుంది. నిజానికి, ఈ రెండూ మన లోపల ఉన్న అభద్రతా భావాన్ని, వైఫల్య భీతిని కప్పిపుచ్చే దుర్భేద్యమైన ముసుగులు. ఇవి మన నిజమైన ఎదుగుదలను, ఇతరులతో ఆరోగ్యకరమైన అనుబంధాన్ని పెంపొందించుకోవడానికి అడ్డుగోడలుగా నిలుస్తాయి.

అహంకారం రెండు ముఖాలు – స్పష్టమైన అనుభవం. ఈ రెండు లక్షణాలు రోజువారీ జీవితంలో మన నమ్మకమైన బంధాలను ఎలా ఛిద్రం చేస్తాయో గమనిద్దాం.

ఆత్మస్తుతి (అతిశయోక్తి): మీరు ఒక గొప్ప విజయాన్ని సాధించినా, ప్రతి సంభాషణను మీ గొప్పల చుట్టే తిప్పి, 'ఇదంతా నా తెలివి తేటలే' అని పదే పదే ప్రకటిస్తే – వినేవారికి అది సంతోషాన్ని పంచదు, తీవ్రమైన విసుగును, దూరాన్ని పెంచుతుంది. మిమ్మల్ని మీరే పొగుడుకుంటే, ఇతరులు మీకు నిజమైన గౌరవం ఇవ్వడం మానేస్తారు. గొప్ప జ్ఞాని అయిన యాజ్ఞవల్క్యుడు సైతం, తన జ్ఞానాన్ని తానే అతిగా చెప్పుకున్నప్పుడు, పండితుల విమర్శలను ఎదుర్కొన్నారు.

పరనింద (పలాయనవాదం): నమ్మకాన్ని విచ్ఛిన్నం చేయడం... వ్యాపారంలో ఎదురుదెబ్బ తగిలితే, 'పోటీదారులు కారణం, పరిస్థితులే కారణం' అని నిందించడం; క్రీడలలో ఓటమి ఎదురైతే 'అంపైర్ పొరపాటు, రూల్స్ తప్పు' అని వాదించడం. ఈ విధంగా తప్పును మరొకరిపై నెట్టడం తాత్కాలికంగా మన అహం కాపాడుకున్నట్టు అనిపించినా, అది మన నైతిక శక్తిని నాశనం చేస్తుంది. మీ వైఫల్యాలకు మీరు బాధ్యత తీసుకోనప్పుడు, ఇతరులు మిమ్మల్ని విశ్వసించడం పూర్తిగా మానేస్తారు. మహాభారతంలో దుర్యోధనుడు తన పతనానికి తన అహంకారాన్ని కాక, ఎప్పుడూ శ్రీ కృష్ణుడిని లేదా పాండవుల అదృష్టాన్ని నిందించేవాడే తప్ప, ఆత్మపరిశీలన చేసుకోలేకపోయాడు.

విజయం సాధించినప్పుడు, 'నా ప్రయత్నం' అని కాకుండా, 'మా బృందం/కుటుంబం సహకారం వల్ల సాధ్యమైంది' అని చెప్పండి. మీ గొప్పతనాన్ని మీరే చెప్పుకోకుండా, మీ పనిని మీకోసం మాట్లాడనివ్వండి. తప్పు జరిగినప్పుడు, వెంటనే 'దీని నుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటి?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. బాధ్యతను ధైర్యంగా అంగీకరించండి. ఈ ఒక్క చర్య మిమ్మల్ని ఇతరుల దృష్టిలో నిజమైన నాయకుడిగా, విశ్వసనీయుడిగా నిలబెడుతుంది.

ఆత్మస్తుతి అనేది వృథా అయిన శక్తి, పరనింద అనేది మీ ఎదుగుదలను అడ్డుకునే మానసిక చెరసాల. ఈ అహంకారం అనే సంకెళ్లను తెంచే సాధన చేసినప్పుడే, మీరు ఆ నిజమైన ఆనందాన్ని, ప్రశాంతతను సొంతం చేసుకుంటారు. ఇతరులపై నిందలు వేయడం ఆపి, మీ బాధ్యతను ప్రేమతో స్వీకరించండి. ఈ వినయం, బాధ్యత అనే రెండు అసాధారణ లక్షణాలతో, మీరు ప్రపంచం నుండి గౌరవంతోపాటు నమ్మకాన్ని, ప్రేరణను కూడా అందుకుంటారు. ఇదే మీ ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం.

– కె. భాస్కర్ గుప్తా
వ్యక్తిత్వ వికాస నిపుణులు

సందర్భం: నేడు గీతాజయంతి

ప్రశాంత జీవన రహస్యమే గీతాసారం

యుద్ధభూమిలో శ్రీ కృష్ణ భగవానునికి, అర్జునునికి మధ్య జరిగిన సంభాషణే భగవద్గీత. అయితే, దాని అసలైన సందేశం యుద్ధం గురించే కాదు, ప్రతి రోజూ వివేకవంతంగా ఎలా జీవించాలో తెలియజేయడం. దాని అత్యంత ప్రధానమైన బోధన నిష్కామ కర్మ గురించి. అంటే ఫలితాలపై ధ్యాస ఉంచకుండా, శక్తిమేరకు కృషి చేయడం.

గొప్ప భారతీయ ఆధ్యాత్మిక గురువైన పరమహంస యోగానంద కోరికలు లేకుండా కర్మలను నిర్వర్తించడం యోగంలో ఒక ముఖ్యమైన అంశమని చెప్పారు. గాడ్ టాక్స్ విత్ అర్జున: ది భగవద్గీత అనే తన మహత్తర గీతాభాష్యంలో, శ్రీ కృష్ణుని సందేశం గృహస్థునకైనా, ఒక సంస్థకు అధిపతికైనా, లేక ఒక దైవాన్వేషకునికైనా ఒక ఆచరణాత్మకమైన మార్గదర్శి అని ఆయన వివరించారు.



భగవద్గీతలోని 2వ అధ్యాయం, 47వ శ్లోకంలో, శ్రీ కృష్ణుడు అర్జునుడికి ఇలా బోధించాడు...''కర్మలు చేయుట యందు మాత్రమే నీకు అధికారముంది, వాటి ఫలితములందు ఎన్నడూ లేదు. నీ కర్మ ఫలములకు సృష్టికర్తవు నీవని భావించకు; అట్లని నిష్క్రియ పట్ల నీకు అనురక్తి కలగనీయకు.''

దీని అర్థం ఏమిటంటే: అది మీ ఉద్యోగమైనా, మీ కుటుంబాన్ని పోషించడం అయినా, లేదా ఏదైనా బాధ్యత అయినా, మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి. కానీ ప్రతిఫలం గురించి, గుర్తింపు గురించి ఆందోళన చెందుతూ ఉండకండి. ''ఈ పని చేయడం వల్ల నాకేమి లభిస్తుంది'' అనే ఆందోళన ఒత్తిడిని మాత్రమే తెస్తుంది. మీరు ఫలితంపై కాకుండా, కర్మపైనే దృష్టి సారించినప్పుడు స్వేచ్ఛ లభిస్తుంది. అదే సమయంలో, సోమరిగా లేదా నిష్క్రియగా మారకండి. 48వ శ్లోకంలో, శ్రీ కృష్ణుడు అర్జునుడికి ఇలా సలహా ఇచ్చాడు...''ఓ ధనంజయ, యోగంలో నిమగ్నుడవై, సమస్త కర్మలను ఆచరించు. వాటి ఫలాలపై ఆసక్తిని త్యజించి, జయాపజయములయందు సమభావం గలవాడవై ఉండు. ఈ మానసిక సమత్వమే యోగం.''

జీవితం ప్రశంసలను, నిందలను, విజయాన్ని, అపజయాన్ని తెస్తుంది. ఈ రెండు పరిస్థితులలోనూ ప్రశాంతంగా ఉండాలని శ్రీ కృష్ణుడు మనకు బోధిస్తాడు. ఈ సమభావమే నిజమైన యోగం. అంటే ఆంతరంగిక శాంతిని బాహ్య కర్మాచరణతో అనుసంధానం చేయడం.

3వ అధ్యాయం, 30వ శ్లోకంలో, ఈ స్థితిని సాధించడానికి శ్రీ కృష్ణుడు కీలకమైన మార్గాన్ని తెలియజేశాడు.

''సమస్త కర్మలను నాకు అర్పించు! అహంకారం, ఆశలు విడిచి, నీ మనస్సును ఆత్మపై కేంద్రీకరించి, ఆందోళన నుండి విముక్తుడవై, కర్మాచరణమనే యుద్ధంలో నిమగ్నమై ఉండు.''

సరళమైన మాటల్లో చెప్పాలంటే, మీరు చేసే ప్రతి పనిని భగవంతునికి అంకితం చేయండి. ఈ విధంగా జీవించడం అంటే ప్రపంచం నుంచి విరమించుకోవడం కాదు... కోరికలు, అహంకారం లేకుండా, అపేక్ష, తీవ్రమైన చింత లేకుండా, ప్రతి కర్మను ఆయనకు ఒక సమర్పణగా నిర్వర్తించడం. ప్రశాంతమైన జీవితానికి ఇదే ఏకైకమార్గం. 5వ అధ్యాయం, 10వ శ్లోకంలో, శ్రీ కృష్ణుడు ఒక అందమైన ఉపమానాన్ని అందించాడు:

''నీరు స్పృశించ లేని తామరాకు వలె, కర్మలను నిర్వర్తించే యోగి, ఆసక్తిని త్యజించి, తన కర్మలను అనంతునికి సమర్పించడం ద్వారా, ఇంద్రియ బంధాలకు లోనుకాకుండా ఉంటాడు.''

బురదలో పెరిగినా దాని మలినం సోకని కమలం వలె, నిష్కామ కర్మను ఆచరిస్తూ, భగవంతునికి శరణాగతి చెందడం ద్వారా ప్రాపంచిక పోరాటాల మధ్య జీవిస్తూ కూడా ప్రశాంతంగా ఉండవచ్చు.

ఈ సనాతనమైన బోధనల వ్యాప్తికి యోగానంద పశ్చిమ దేశాలలో సెల్ఫ్–రియలైజేషన్ ఫెలోషిప్‌ను, యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియాను భారతదేశంలోను స్థాపించారు. ఆయన 'ఒక యోగి ఆత్మకథ' లక్షలాది మందికి యోగాన్ని, ధ్యానాన్ని– ముఖ్యంగా భగవద్గీత కూడా ప్రస్తావించిన క్రియాయోగమనే సనాతన ప్రక్రియను– దైవానుభవం కలిగించే ఒక తిన్నని రాజమార్గంగా పరిచయం చేసింది.

నిష్కామ కర్మ అంటే బాధ్యతల నుంచి పలాయనం కాదు, అది హృదయపూర్వకంగా– కార్యాలయాలలోను, మానవ సంబంధాలలోను, వ్యక్తిగత లక్ష్యాలలోను పనిచేయడం, కానీ ఫలితాల కోసం పాకులాడకుండా ఉండటం.

యుద్ధభూమి ప్రతీకాత్మకమే కావచ్చు, కానీ పోరాటం నిజమైనది–వ్యామోహానికీ స్వేచ్ఛకూ మధ్య, అహంకారానికీ శరణాగతికీ మధ్య, నిష్కామకర్మలోనే విజయం ఉందని గీత మనకు చూపిస్తుంది. ఎందుకంటే అది మాత్రమే శాశ్వత ఆనందాన్ని ఇవ్వగలదు.

– సత్యశ్రీ

ఆధ్యాత్మికకథ

స్వామి భక్తి

నలభై కాపురాలున్న చిన్న పల్లెటూరు అది. ఊరి మధ్యలో ఆంజనేయ స్వామి గుడి ఉంది. ప్రతి రోజు ఉదయం ఊర్లోని ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి గుడికి వచ్చి స్వామి దర్శనం చేసుకుని వెళ్ళేది. గుడికి వచ్చిన ప్రతిసారీ ఆ అమ్మాయి ఒక గులాబీ పువ్వును స్వామి వారి పాదాల చెంత ఉంచి నమస్కరించుకునేది. రోజూ ఒక పువ్వు తెచ్చి స్వామికి సమర్పించడం చూసి పూజారి చాలా సంతోషపడేవాడు. ఆ అమ్మాయి పట్ల ఎంతో అభిమానం కనబరచేవాడు.

కొన్నాళ్ళకి ఆ అమ్మాయికి పెళ్ళి కుదిరింది. పెళ్లయ్యాక అత్తగారి ఇంటికి వెళ్ళే రోజు దగ్గర పడింది. ప్రయాణానికి రెండు రోజుల ముందు ఆ అమ్మాయి గుడికి వచ్చి పూజారికి మిఠాయిలు ఇచ్చింది. తాను ఇక అత్తగారింటికి వెళ్తున్నానని, మెట్టినిల్లు దూరదేశాల్లో ఉందని చెప్పింది. పూజారి ''మీకు పెళ్లి కావడం, మీరు అత్తగారి ఇంటికి వెళ్ళడం చాలా సంతోషకరం. కానీ రోజూ స్వామివారికి మీరు సమర్పించే గులాబీపువ్వు ఇకపై ఉండదు కదా'' అని బాధపడ్డాడు. ఆమె చిన్ననవ్వు నవ్వింది. అలా జరుగనివ్వనని బదులిచ్చింది. ''మీ అమ్మా నాన్నలు రోజూ కొండ కింద ఉన్న పొలం పనులకు వెళ్ళి పోతారు కదా. అదెలా సాధ్యం?'' అని అడిగాడు. ఎలాగైనా తాను ఇబ్బంది లేకుండా చేస్తానని చెప్పి వెళ్ళింది. పూజారితోపాటు అక్కడ ఉన్న వారందరూ ఈ అమ్మాయి ఏమి చేయబోతోందో అని ఆసక్తి చూపారు.

ఆ అమ్మాయి అత్తగారింటికి వెళ్ళే రోజు రానే వచ్చింది. ఆమె ఆ రోజు కూడా గుడికి వచ్చింది. అయితే ఆమె చేతిలో గులాబీ లేదు. గులాబీ మొక్క ఉంది. ఆ మొక్కకి పూలు కూడా ఉన్నాయి. దాన్ని గుడి ప్రాంగణంలో నాటుతూ ''గుడిలోనే ఈ మొక్క పెరుగుతుంది. రోజూ మీరు ఒక పువ్వు కోసి స్వామికి సమర్పించండి'' అని పూజారిని కోరింది. తను ఊర్లో లేకున్నా, స్వామికి పువ్వులందాలని ఆలోచించిన అమ్మాయి భక్తిని, తెలివితేటలనూ పూజారితో సహా ఊరి వారందరూ అభినందించారు. 'మనసుంటే మార్గముంటుంది' అనుకున్నారు. స్వామి విగ్రహంపై ఉన్న పూలు ఆ అమ్మాయిని ఆశీర్వదిస్తున్నట్లుగా జలజలా రాలాయి.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

మాస్ డ్యాన్స్ షురూ

● చిరంజీవి, వెంకటేశ్

చిరంజీవి, వెంకటేశ్ కలిసి చేస్తున్న సెలబ్రేషన్ సాంగ్ చిత్రీకరణ మొదలైంది. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్‌గారు'. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, వెంకటేశ్, క్యాథరిన్, వీటీవీ గణేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో జరుగుతోంది. చిరంజీవి, వెంకటేశ్‌తో పాటు 500 మందికి పైగా డ్యాన్సర్స్ పాల్గొంటుండగా ఓ స్టైలిష్ మాస్ డ్యాన్స్ సాంగ్ షూట్‌ను ఆరంభించారు. సంగీతదర్శకుడు భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు పొలకి విజయ్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ''చిరంజీవి, వెంకటేశ్ కలిసి చేస్తున్న ఈ పాట ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు అసలు సిసలైన విందులా ఉంటుంది. అలాగే చిరంజీవి–నయనతారలపై చిత్రీకరించిన ఓ మెలోడియస్ రొమాంటిక్ సాంగ్‌ను త్వరలోనే రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ తెలిపింది. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

● రజనీకాంత్

చలో గోవా

ఈ నెలలో గోవా వెళ్లనున్నారు రజనీకాంత్. ఆయన హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జైలర్ 2'. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లుగా తెలిసింది. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో గోవాలో ప్రారంభం కానుందట. అయితే 'జైలర్ 2' చిత్రీకరణ ఆల్రెడీ గోవాలో జరిగింది. ఆ సమయంలో రజనీకాంత్, ఎస్‌జే సూర్య కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరించారట. త్వరలో ప్రారంభం కానున్న గోవా షెడ్యూల్‌లో రజనీకాంత్, విజయ్ సేతుపతి, మోహన్ లాల్‌ల కాంబినేషన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగేలా నెల్సన్ ప్లాన్ చేశారని టాక్. ఈ గోవా షెడ్యూల్‌తో 'జైలర్ 2' సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందని తెలిసింది. ఇక రజనీకాంత్, నెల్సన్‌ల కాంబినేషన్‌లో 2023లో వచ్చిన హిట్ ఫిల్మ్ 'జైలర్'కు సీక్వెల్‌గా 'జైలర్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే.

కుటుంబం గొప్పతనం చెప్పేలా...

రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సఃకుటుంబానాం'. ఉదయ్ శర్మ దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 12న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నేను చేసిన పాత్రకు చాలెంజ్‌లు ఉన్నాయి. కుటుంబం నేపథ్యంలో కుటుంబం గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను తెలియజేసే ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది'' అని చెప్పారు. బ్రహ్మానందం మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నేను పోషించిన పాత్ర చాలా చిత్రంగా ఉంటుంది. దర్శకుడు ఉదయ్ శర్మ తనకు కావాల్సిన అవుట్‌పుట్ రాబట్టుకోగలిగిన మంచి దర్శకుడు'' అని పేర్కొన్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు సానా మాట్లాడుతూ– ''నా స్నేహితుడు విక్రమ్ ఒక స్టోరీ లైన్‌ను సినిమాగా చేయాలనుకున్నాడు. కానీ ఆయన చనిపోవడంతో తన ఫ్రెండ్ ఉదయ్ ఆ లైన్‌ను కథగా మార్చి, సినిమా చేస్తున్నాడని చెప్పినప్పుడు చాలా హ్యాపీ ఫీలయ్యాను. ఈ సినిమా సుకుమార్‌గారి ఐడియాతో ఉంటుంది. ఈ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''హీరో కావాలనుకున్న నా పదహారేళ్ల కల ఈ సినిమాతో నిజమైంది'' అని చెప్పారు రామ్‌కిరణ్. ''నా తొలి చిత్రానికి మణిశర్మగారు సంగీతం అందించడాన్ని గొప్ప విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పారు ఉదయ్ శర్మ. ''మా హెచ్ఎన్‌జీ బ్యానర్‌లో వస్తున్న తొలి చిత్రమిది. ప్రేక్షకులు ఈ సినిమాను సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను'' అని మహదేవ్ గౌడ్ చెప్పారు.

● బుచ్చిబాబు, రామ్‌కిరణ్, బ్రహ్మానందం, రాజేంద్రప్రసాద్, మహదేవ్, ఉదయ్ శర్మ

విలక్షణ నటిగా పేరు తెచ్చుకోవాలని ఉంది

- హర్షాలీ మల్హోత్రా

బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ 2: తాండవం'. సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటించారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కానుంది. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో హర్షాలీ మల్హోత్రా మాట్లాడుతూ– ''సల్మాన్ ఖాన్‌గారు నటించిన 'బజరంగీ భాయిజాన్' చిత్రంలో చైల్డ్ ఆర్టిస్టుగా చేశాను. పదేళ్ల తర్వాత ఇప్పుడు 'అఖండ 2' చిత్రంలో జనని పాత్ర చేశాను. ఈ పదేళ్ల గ్యాప్‌లో చదువు మీద ఫోకస్ పెట్టాను... కథక్ డ్యాన్స్ నేర్చుకున్నాను. ఈ మధ్య కాలంలో కొన్ని సినిమా ఆఫర్స్ వచ్చాయి. కానీ 'అఖండ 2' సరైన అవకాశంగా భావించి, ఈ సినిమా చేశాను. ఈ సినిమాలో నేను చేసిన జనని పాత్ర కథలో కీలకమైనది. జనని లైఫ్ ఎప్పుడు డేంజర్‌లో ఉంటే అప్పుడు తన కోసం అఖండ వస్తాడు. నా పాత్రకు కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. సెట్స్‌లో బోయపాటిగారు నేను బాగా యాక్ట్ చేయడానికి ప్రోత్సహించారు. 'బజరంగీ భాయిజాన్' సినిమా అప్పుడు సల్మాన్‌గారితో కలిసి టేబుల్ టెన్నిస్ ఆడాను. అలా 'అఖండ 2' సెట్స్‌లోనూ కొన్ని మెమొరబుల్ మూమెంట్స్ ఉన్నాయి. అన్ని రకాల జానర్ సినిమాలు చేసి, విలక్షణ నటిగా పేరు తెచ్చుకోవాలని ఉంది. మెయిన్ లీడ్ రోల్ చేసేందుకు కూడా ఎదురు చూస్తున్నాను'' అన్నారు.

● అనిల్ కపూర్

డ్రాగన్‌లో..?

ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమాలో అనిల్ కపూర్ భాగమయ్యారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇదిలా ఉంటే... బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర చేసేందుకు అంగీకరించారనే టాక్ తెరపైకి వచ్చింది. త్వరలోనే ఆయన ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొంటారట. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.



● మహతి, ఆతీకూర్ రెహమాన్

యువతను చైతన్యపరిచేలా....

సమాజానికి ఉపయోగపడేలా, యువతను చైతన్యపరిచేలా సినిమాలు నిర్మించేందుకు 'ఆర్ ఎక్స్‌ప్లోర్ మూవీస్' అనే నిర్మాణ సంస్థను ప్రారంభించినట్లుగా నిర్మాత ఆతీకూర్ రెహమాన్ చెప్పారు. ఈ నిర్మాణ సంస్థ లాంచ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ– ''డ్రగ్స్, చైల్డ్ ట్రాఫికింగ్, ఉమెన్ ట్రాఫికింగ్, సోషల్ మీడియా ఫ్రాడ్స్... ఇలా ఎన్నో సమస్యల్లో చిక్కుకుని యువత దారి తప్పి, ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి యువతీ యువకులను అప్రమత్తం చేసేలా, వారు ఇలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కోకుండా ఉండేలా కొన్ని కాన్సెప్ట్‌లను ఎంచుకుని మా నిర్మాణ సంస్థలో సినిమాలు చేయనున్నాం. మేము నిర్మించనున్న మొదటి సినిమాకు కథ సిద్ధమైంది. అతి త్వరలోనే ఆడిషన్స్ జరిపి, ఆపై ఈ సినిమా వివరాలు వెల్లడిస్తాం'' అని తెలిపారు. నటి మహతి, డా. సత్యవతి, అరుణ మాట్లాడారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

లవ్ ఫెయిల్... సక్సెస్ థియరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

నాటి దేవదాసు నుండి నేటి గర్ల్ ఫ్రెండ్ వరకు ప్రేమను ఓ అందమైన దృశ్య కావ్యంగా చిత్రీకరించిన సినిమాలు ఎన్నో వచ్చాయి. సక్సెస్‌ఫుల్ ప్రేమ ముందుగా ఫెయిల్యూర్‌తోనే పుడుతుంది. అది ఏ కాలమైనా, ప్రాంతమైనా, భాష అయినా ఇదే సిద్ధాంతం. అందుకేనేమో ఈ థీమ్‌తో వచ్చిన సినిమాలు ప్రేక్షకుల మదిలో అలా పదిలంగా నిలిచిపోతాయి. కానీ ఓ సీరియస్ ప్రేమ అయిన స్వీట్‌కు కామెడీ అనే కారం తగిలిస్తే ఎలా ఉంటుందో తెలిపేదే 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి'. ఈ సినిమా పేరుతోనే దర్శకుడు ప్రేక్షకుడికి కాస్తంత గిలిగింతలు పెట్టించాడు. కాస్త లోతుగా గమనిస్తే సెటైరికల్ మోడ్‌లో మహా గమ్మత్తుగా ఉందీ టైటిల్. శశాంక్ ఖేతన్ ఈ కథ రాసి, దర్శకత్వం వహించారు. వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ జంటగా, సాన్యా మల్హోత్రా ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం రూ. వంద కోట్ల వసూళ్లు దక్కించుకుంది. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓసారి చూద్దాం. సన్నీ సంస్కారి తన గర్ల్ ఫ్రెండ్ అయిన అనన్యకు వినూత్న రీతిలో... ఇంకా చెప్పాలంటే బాహుబలి సెటప్‌లో కాస్త భారీగానే ప్రపోజ్ చేయడానికి ప్లాన్ చేస్తాడు. సెటప్, గెటప్ అంతా బాగానే ఉన్నా అనన్య మాత్రం కోటీశ్వరుడైన విక్రమ్‌తో తన తల్లిదండ్రులు తనకు పెళ్ళి నిర్ణయించారని సంస్కారికి ససేమిరా నో చెబుతుంది. ఇది విన్న సన్నీ బాగా బాధపడి ఎలాగైనా అనన్యను సొంతం చేసుకోవాలని విక్రమ్ గురించి ఆరా తీస్తాడు. తులసీ కుమారి అనే అమ్మాయితో ఇటీవలే విక్రమ్‌కు బ్రేకప్ అయిన విషయం తెలుసుకొని తులసీ కుమారిని కలవడానికి వెళతాడు. ఈ లోపల అనన్య, విక్రమ్‌ల పెళ్ళి ఆహ్వాన పత్రిక సన్నీతో పాటు తులసీ కుమారికి కూడా అందుతుంది. తులసీతో కలిసి సన్నీ ఈ పెళ్ళి చెడగొట్టడానికి ఓ కుట్ర పన్నుతాడు. మరి... సన్నీ ప్లాన్ సక్సెస్ అయి, అనన్యను పెళ్ళి చేసుకుంటాడా? అలాగే విక్రమ్, తులసీ కుమారి మళ్ళీ కలిసిపోతారా? అన్న విషయం మాత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి' సినిమాలోనే చూడాలి. వరుణ్ తన ఈజ్‌తో... అలాగే జాన్వీ తన క్రేజ్‌తో యూత్‌ని బాగా అలరించే సినిమా ఇది. అక్కడక్కడా కాస్త ఓవర్ యాక్షన్ అనిపించినా సినిమా ఎక్కడా బోర్ కొట్టదు... సరికదా సరదాగా సాగిపోతుంది. వర్త్ టు వాచ్.

– హరికృష్ణ ఇంటూరు

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (24-11-25 నుంచి 28-11-25 వరకు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
475	135
85,707	26,203

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	23,365	▲	151
డోజోన్స్	47,716	▲	527
ఎఫ్‌టీఎస్ఈ 100	9,720	▲	26
డాక్స్	23,836	▲	68
షాంఘై	3,888	▲	13
నికాయ్	50,253	▲	129

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	87.62	90.62
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	115.85	120.18
€	యూరో	థామస్‌కుక్	101.29	105.23
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	55.99	59.84
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.63	70.33
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.97	24.47
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.47	24.72
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.77	13.59

మీ కార్డు సంపాదిస్తోందా?

చాలామందికి క్రెడిట్ కార్డంటే భయం. ప్రమాదాన్ని జేబులో పెట్టుకున్నట్లే భావిస్తారు. కానీ కొంచెం తెలివిగా... క్రమశిక్షణతో వాడితే క్రెడిట్ కార్డుతో లాభమే ఎక్కువ. పైసా వడ్డీ చెల్లించక్కర్లేదు. పైపెచ్చు కాస్త సంపాదించుకోవచ్చు కూడా. వీటన్నిటికీ తోడు హోటళ్లు, సినిమా టికెట్లు, ప్రయాణ టికెట్లపై ఎప్పటికప్పుడు ఆఫర్లూ వస్తాయి. ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లలో ఉచిత సదుపాయాలు... ఆన్‌లైన్ షాపింగ్ చేసినప్పుడు నో-కాస్ట్ ఈఎంఐ తీసుకుంటే... రూపాయి వడ్డీలేకుండా వాయిదాల్లో చెల్లించుకునే అవకాశం ... ఇలా చాలా లాభాలుంటాయి. కాకపోతే ఒక్కటే షరతు. ఏ క్రెడిట్ కార్డుపై ఎంత కొన్నా... బిల్లు గడువు తేదీ ముగిసేలోగా పూర్తిగా చెల్లించెయ్యాలి. అలాకాకుండా ఈ సారి మినిమం బిల్లు చెల్లిస్తే సరిపోతుందిలే అనుకున్నారో...! మీ పని అయిపోయినట్లే!!.

- క్రెడిట్ కార్డు స్మార్ట్‌గా వాడితే ఇబ్బందులుండవు
- వడ్డీ లేని అప్పుతో పాటు రివార్డు పాయింట్లు
- ఈ పాయింట్ల ద్వారా 1 శాతం వరకూ సంపాదన
- చార్జీల్లేకుండా ఎయిర్‌పోర్టు లాంజ్‌లలో సదుపాయాలు
- హోటల్ బుకింగ్స్ సహా ట్రావెల్ టికెట్లపై ఆఫర్లు
- జీవితకాలం నిర్వహణ చార్జీల్లేకుండా ఇస్తున్న బ్యాంకులు
- సకాలంలో చెల్లించకపోతే మాత్రం రుణాల ఊబిలోకి
- ఒకసారి ఆ ట్రాప్‌లో ఇరుక్కుంటే బయటకు రావటం కష్టం



సరైన ఆదాయం లేకపోవటమో... అప్పులంటే భయమో... లేదా సమాచారం లేకపోవటమో... ఏదైనా కావచ్చు. మన దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం చాలా తక్కువ. మన జనాభాలో వీటిని వాడుతున్నవారు ఐదారు శాతానికి మించి లేరు. అమెరికా లాంటి దేశాల్లో ఏకంగా 80 శాతం మందికిపైగా కనీసం ఒక్క క్రెడిట్ కార్డయినా వాడతారు. అందుకే ఈ క్రెడిట్ కార్డుల వ్యాపార విస్తరణకు దేశంలో విపరీతమైన అవకాశాలున్నాయి కాబట్టే... కంపెనీలు రకరకాల ఆఫర్లిస్తూ మరింతమందికి చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఇదీ.. అసలైన లాభం

ప్రతి క్రెడిట్ కార్డుకూ ఓ లిమిట్ ఉంటుంది. ఉదాహరణకు రాఘవకు యాక్సిస్ బ్యాంకు కార్డుంది. దాని లిమిట్ రూ.6 లక్షలు. అంటే రూ.6 లక్షల వరకూ తను వాడుకోవచ్చన్న మాట. మరి ఆ కార్డు జేబులో పెట్టుకుంటే... తన జేబులో రూ.6 లక్షలున్నట్లే కదా? ఆసుపత్రి వంటి ఎంత ఎమర్జెన్సీ వచ్చినా... డబ్బుల కోసం ఇబ్బంది పడకుండా దీన్ని వాడొచ్చు. ఇలాంటి ఎమర్జెన్సీల కోసం డబ్బును సేవింగ్స్ ఖాతాల్లో ఉంచుకోవాల్సిన పనిలేదు కూడా. ఇక ప్రతి కార్డుకూ బిల్లింగ్ తేదీ... చెల్లించడానికి గడువు తేదీ ఉంటాయి. ప్రతి బిల్లింగ్ తేదీకి 30 రోజుల సైకిల్... చెల్లించడానికి మరో 15 రోజుల గడువు ఉంటాయి. అంటే మొత్తంగా 45 రోజుల వ్యవధన్న మాట. బిల్లింగ్ తేదీ అయిన వెంటనే భారీ మొత్తాన్ని వాడినా అది తదుపరి బిల్లులోనే వస్తుంది. గడువు తేదీ కూడా ఉంటుంది కనక దాదాపు 40 రోజులు వడ్డీ లేకుండా అప్పు దొరికినట్లన్న మాట. దాన్ని గడువులోపు చెల్లించేస్తే వాడిన మొత్తంపై పైసా వడ్డీ కూడా ఉండదు.

ఇదీ.. ప్రమాదానికి సంకేతం

మీరు కార్డుపై ఆ నెల అవసరం కొద్దీ రూ.2 లక్షలు వాడారనుకుందాం. తదుపరి నెల బిల్లులో వాడుకున్న మొత్తాన్ని చూపించటంతో పాటు... ఒకవేళ మీరు దాన్ని చెల్లించలేకపోతే వాడినదాంట్లో 5 శాతాన్ని చెల్లించవచ్చని (మినిమం బిల్) పేర్కొంటారు. అంటే రూ.10వేలు చెల్లిస్తే చాలు. అది ఈజీ కూడా. కానీ మిగిలిన మొత్తంపై 36 శాతానికిపైగా వార్షిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే మరో నెల గడిస్తే మరో 3 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. పైపెచ్చు కనీస బిల్లు కూడా చెల్లించకపోతే అపరాధ రుసుములు భారీగా ఉంటాయి. మీ లిమిట్‌ను దాటి వాడినా భారీ చార్జీలు చెల్లించాలి. వీటివల్ల ఆర్థిక పరిస్థితులు తల్లకిందులయిపోతాయి. ప్రతినెలా కనీస బిల్లు కట్టుకుంటూ పోతే ఆ రుణం ఎప్పటికీ తీరదని గుర్తుంచుకోవాలి. క్రెడిట్ కార్డుతో అతి పెద్ద ప్రమాదం ఇదే.

కో-బ్రాండెడ్ కార్డులు కూడా...

చాలా బ్యాంకులు రకరకాల సంస్థలతో జతకట్టి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులు ఆఫర్ చేస్తున్నాయి. ఉదాహరణకు గతంలో సిటీ బ్యాంకు ఐఓసీతో జతకట్టి సిటీ-ఐఓసీ కార్డును ఆఫర్ చేసింది. సిటీ క్రెడిట్ కార్డుల వ్యాపారాన్ని కొనుగోలు చేసిన యాక్సిస్ బ్యాంకు కూడా దాన్ని కొనసాగిస్తోంది. ఐఓసీ బంకులో పెట్రోలు లేదా డీజిల్ పోయించుకుంటే 2 శాతం వరకూ క్యాష్‌బ్యాక్ వస్తుందన్న మాట. ఆ పాయింట్లను నేరుగా బిల్లు రూపంలో చెల్లించేయొచ్చు కూడా.

రోజువారీ వినియోగానికి ఇవి బెస్ట్..

- ✓ **ఎస్‌బీఐ క్యాష్ బ్యాక్ కార్డ్:** ఆన్‌లైన్ కొనుగోళ్లపై ఫ్లాట్ 5 శాతం క్యాష్ బ్యాక్ వస్తుంది.
- ✓ **యాక్సిస్ బ్యాంక్ ఏస్:** కొనుగోళ్లపై 2-5 మధ్య క్యాష్ బ్యాక్. గూగుల్ పేతో లింక్ చేసుకోవచ్చు.
- ✓ **హెచ్‌డీఎఫ్‌సీ రిగాలియా:** ప్రయాణాలు, రెస్టారెంట్లలో చెల్లింపులపై రివార్డులు.

ఇలా చేయొద్దు...

- కార్డుపై చేసే చెల్లింపుల్లో కొన్నింటిని ఈఎంఐ కిందకు మార్చుకోవచ్చు. కానీ, ప్రతి నెలా ఇదే ధోరణి అనుసరిస్తే ఈఎంఐలు చెల్లించడం కష్టం.
- ఆఫర్లు ఉన్నాయని చెప్పి, అవసరం లేకపోయినా క్రెడిట్ కార్డుతో కొనుగోళ్లు చేయడం స్మార్ట్ కానే కాదు.
- వార్షిక ఫీజుపైనా దృష్టి సారించాలి. కొన్ని ఫ్రీగా ఇచ్చినా... కొన్ని సంస్థలు అధిక చార్జీలు వసూలు చేస్తుంటాయి.

ఇదీ క్యాష్‌బ్యాక్ పవర్..

- ఒక నెలలో కార్డుతో ఆన్‌లైన్‌లో రూ.30,000 ఖర్చు చేశారు.
- 5 శాతం క్యాష్‌బ్యాక్ ఆఫర్ కింద రూ.1,500 వెనక్కి వస్తుంది.
- ఇలా ఒక ఏడాదిలో రూ.18,000 ఆదా చేసుకోవచ్చు.
- ఈ మొత్తంతో కుటుంబానికి కావాల్సిన ఆరోగ్య బీమాను సొంతం చేసుకోవచ్చు. ఈక్విటీ ఫండ్‌లో ఏటా రూ.18,000 చొప్పున పదేళ్లు ఇన్వెస్ట్ చేసుకుంటే, 12 శాతం రాబడి ఆధారంగా రూ.3.53 లక్షలు సమకూరుతుంది.

స్మార్ట్ అంటే ఇలా..

- క్రెడిట్‌కార్డు బిల్లును ప్రతి నెలా గడువులోపు పూర్తిగా చెల్లించేయాలి.
- కార్డుతో ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేయనే చేయొద్దు
- గడువు తేదీకి చెల్లింపులు జరిగేలా ఆటో డెబిట్ సదుపాయం యాక్టివేట్ చేసుకోవాలి.
- లిమిట్ ఉంది కదా అని చెప్పి నియంత్రణ లేకుండా వాడకూడదు.
- క్రెడిట్ కార్డులు రెండుకు మించకుండా చూసుకోండి.

ఇండియా - అమెరికా తేడా ఇదీ

	ఇండియా	అమెరికా
దేశంలో ఉన్న కార్డులు	11.12 కోట్లు	63.6 కోట్లు
జనాభాలో వాడుతున్న %	5 శాతం	82 శాతం

పాఠకుల ప్రశ్నలు..నిపుణుల సమాధానాలు

రియల్టీ..

ప్రీ-లాంచ్ ఆఫర్లలో ఫ్లాట్ కొనటం మంచిదేనా?

నిజమే! ప్రీ లాంచ్ ఆఫర్లలో తీసుకుంటే కాస్త తక్కువ ధరకే ఫ్లాట్స్ దొరుకుతాయి. కానీ ఆ బిల్డర్ సకాలంలో పూర్తి చేయకపోతే పరిస్థితేంటి? కొందరు బిల్డర్లు ప్రీలాంచ్ ఆఫర్లని పెట్టి ఎక్కువ మంది దగ్గర డబ్బులు తీసుకుని, వాటితో మరో ప్రాజెక్టును స్టార్ట్ చేయటమో, లేకపోతే ఆగిపోయిన తమ ప్రాజెక్టుల్ని పూర్తి చేసుకోవటమో చేస్తుంటారు. అందుకని ప్రీలాంచ్‌లో తీసుకునేటపుడు రెరా అప్రూవల్ ఉందో లేదో చూసుకోవాలి. బిల్డర్ ట్రాక్ రికార్డు చూడాలి. ట్రాక్ రికార్డు బాగుండి, పేరున్న బిల్డర్లయితేనే ఫ్లాట్స్ బుక్ చెయ్యాలి.

బ్యాంకింగ్..

నేను డిపాజిట్ చేసినపుడు వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నాయి. ఇపుడేమో పెరిగాయి. మరి నా ఎఫ్‌డీని బ్రేక్ చేసి మళ్లీ ఎక్కువ వడ్డీకి రీ-ఇన్వెస్ట్ చేయొచ్చా?

ఇపుడు వడ్డీ రేట్లు పెరిగిన మాట వాస్తవం. కాబట్టి చాలామందికి ఈ ఆలోచన వస్తుంది. మన పాత వడ్డీ రేటుకు, ప్రస్తుత వడ్డీ రేటుకు తేడా ఎంతుందో ముందు చూడాలి. కనీసం 1.5% ఎక్కువగా ఉండి, మీరు దీర్ఘకాలానికి డిపాజిట్ చేస్తున్నట్లయితే నిక్షేపంగా మారొచ్చు. అలా కాని పక్షంలో మీ డిపాజిట్ బ్రేక్ చేస్తే వచ్చే నష్టం, పెనాల్టీ చార్జీలు అన్నీ కలిపితే పెద్దగా కలిసొచ్చేదేమీ ఉండదు.

బంగారం

తరచూ బంగారంలో 22 కేరెట్లు, 24 కేరెట్లు అంటుంటారు కదా! ఏది మంచిది?

ఆభరణాల కోసమైతే 22 కేరెట్ల బంగారాన్ని కొంటే సరిపోతుంది. అలాకాకుండా ఇన్వెస్ట్ చేయడానికైతే 24 కేరెట్ల బంగారమే బెటర్. దీన్లో తరుగు ఉండదు కాబట్టి స్వచ్ఛమైన 24 కేరెట్ల బంగారమైతే ఎప్పుడు విక్రయించినా అప్పుడు మార్కెట్లో ఉన్న రేటు మనకు లభిస్తుంది. సాధారణంగా కాయిన్లు, బిస్కెట్ల వంటివి 24 కేరెట్లలోనే లభిస్తుంటాయి. ధర కూడా 22 కన్నా 24 కేరెట్లు కాస్త ఎక్కువ ఉంటుంది. కొందరైతే ఆభరణాల కోసం 18 కేరెట్ల బంగారాన్ని కూడా వాడతారు. ఇది మరికొంత చౌక.

ఫండ్స్...

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ లేక ఈక్విటీ ట్యాక్స్ సేవింగ్ స్కీమ్స్ (ఈఎల్ఎస్ఎస్) మంచివా?

ఇప్పుడు పీపీఎఫ్‌పై వార్షికంగా 7.1 శాతం వడ్డీ వస్తోంది. ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌ని బట్టి రేటు మారుతుంది. కొన్ని ఫండ్లు గతేడాది 18- 19 శాతం రాబడి కూడా ఇచ్చాయి. ప్రతి ఏటా స్టాక్ మార్కెట్లు ఈ స్థాయిలో పెరగవు కనక సగటున ఐదారేళ్లకు 10 శాతం రాబడి రావొచ్చు. కాకుంటే పీపీఎఫ్‌పై రాబడికి గ్యారంటీ ఉంటుంది. ఈఎల్ఎస్ఎస్‌కు ఎలాంటి గ్యారంటీ ఉండదు.

స్టాక్ మార్కెట్లు...

ఇంట్రా-డే ట్రేడింగ్ సురక్షితమేనా? లాభాలొస్తాయా?

అసలు ఇంట్రా-డే ట్రేడింగ్ అనే మాటే రిటైలర్ల నుంచి రాకూడదు. అది కేవలం హెడ్జింగ్ కోసం పెద్ద పెద్ద ఇన్వెస్టర్లకు, ఫండ్లకు ఉద్దేశించింది. ఇంట్రా-డే ట్రేడింగ్‌లో 90% పైగా నష్టపోతూనే ఉంటారు. ప్రతి ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లోనూ ఇది ప్రమాదకరం, నష్టాలే ఎక్కువని సందేశాలూ ఇస్తుంటారు. సత్వర లాభాలకోసం, చాలా మంది దీన్ని వదులుకోలేరు. డబ్బులు పోతున్నా సరే వీరు ఇంట్రాడే ట్రేడింగ్ చేస్తూనే ఉంటారు. నిజానికి ఇదెంతమాత్రం సురక్షితం కాదు. దీని జోలికెళ్లొద్దు.

ఇన్సూరెన్స్...

టర్మ్ ఇన్సూరెన్స్ ఎంతుండాలి? ఎలాంటి టర్మ్ మంచిది?

టర్మ్ ఇన్సూరెన్స్ అనేది మీ వార్షిక సంపాదనకు 10 నుంచి 15 రెట్లుండాలి. మీ వార్షిక సంపాదన రూ.20 లక్షలయితే కనీసం టర్మ్ ఇన్సూరెన్స్ రూ.2 కోట్లుండాలి. అప్పుడే కుటుంబానికి భద్రత. ప్యూర్ టర్మ్ పాలసీలే మంచివని గుర్తుంచుకోండి. ఇన్వెస్ట్‌మెంట్‌తో ముడిపడ్డ పాలసీలను చాలామంది ఎంచుకుంటుంటారు కానీ... ఇన్వెస్ట్‌మెంట్ వేరేగా చేసుకోవచ్చుగా? మీకు కనీసం 65-70 ఏళ్లు వచ్చేవరకు ప్రొటెక్షన్ ఉంటే మంచిది.

మీ సందేహాలకు నిపుణుల ద్వారా సమాధానాలు కావాలంటే business@sakshi.comకు మెయిల్ చేయండి.

స్టాక్స్ వ్యూ

హిందుస్తాన్ జింక్ | బ్రోకరేజ్: ఇండ్‌సెక్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 485 — టార్గెట్: రూ. 580

ఎందుకంటే: మెటల్, మైనింగ్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ఈ ఏడాది(2025-26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నిర్వహణ లాభం వార్షికంగా 7.8 శాతం ఎగసింది. వ్యయాలు తగ్గడంతోపాటు జింక్, సిల్వర్‌కు అధిక ధరలు లభించడం సహకరించింది. ఈ కాలంలో వెండి ధరలు రికార్డ్ గరిష్టం 48 డాలర్లను తాకగా.. జింక్ ధరలు 10 శాతం బలపడ్డాయి. దీంతో వాణిజ్య ఆందోళనలు, సరఫరా సవాళ్ల నేపథ్యంలోనూ కంపెనీ ఆర్జన మెరుగుపడింది. అయితే ద్వితీయార్ధానికి మైన్డ్ మెటల్, సిల్వర్ ప్రొడక్షన్ అంచనాలు తగ్గించింది. ఈ ఏడాది 40 కోట్ల డాలర్ల(రూ. 3,500 కోట్లు) వృద్ధి ఆధారిత పెట్టుబడులను వెచ్చించే ప్రణాళికల్లో ఉంది. దేబరీలో ఏర్పాటు చేస్తున్న 250 కేటీపీఏ స్మెల్టర్ ప్రాజెక్టుపై అధిక శాతం నిధులను వినియోగించనుంది. 2029 క్యూ2కల్లా రూ. 12,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. అంతేకాకుండా 2028 క్యూ4కల్లా రూ. 3,800 కోట్లు వెచ్చించనున్న జింక్ టైలింగ్స్ ప్రాజెక్టుకూ నిధులు కేటాయించనుంది. మెరుగైన మెటల్ ధరలు, ప్రపంచవ్యాప్త సిల్వర్ సరఫరాల తగ్గుదలసహా దేశీయంగా స్టీల్ సామర్థ్యాల పెంపుతో జింక్‌కు నెలకొన్న పటిష్ట డిమాండ్ కారణంగా కంపెనీ మరింత ఉత్తమ ఫలితాలు సాధించనున్నట్లు అంచనా వేస్తున్నాం. కంపెనీ వ్యయ నియంత్రణలు ఇందుకు దన్నునివ్వనున్నాయి. జింక్ తయారీ వ్యయాలను టన్నుకి 1,000 డాలర్లస్థాయిలో కొనసాగిస్తుండటం సానుకూల అంశం. ఇదే సమయంలో భారీ విస్తరణ ప్రాజెక్టులు చేపట్టడంతో కంపెనీకి బలమైన వృద్ధి అవకాశాలున్నట్లు భావిస్తున్నాం. వెరసి వచ్చే ఏడాది(2027) ఆదాయం, నిర్వహణ లాభ అంచనాలను తాజాగా 5.5 శాతం, 6.3 శాతం చొప్పున మెరుగుపరుస్తున్నాం.

ఎటర్నల్ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 301 — టార్గెట్: రూ. 450

ఎందుకంటే: వార్షిక పెట్టుబడిదారుల సదస్సులో ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ దిగ్గజం ఎటర్నల్ సీఎఫ్‌వో అక్షంత్ గోయల్‌తో ఇటీవలే సమావేశమయ్యాం. ఈ వివరాల ప్రకారం ఎటర్నల్‌కు.. నికర ఆర్డర్ల విలువ(ఎన్‌వోవీ) ద్వారా బీటూసీలో 50 శాతం వాటా కలిగిన బ్లింకిట్ ప్రధాన వృద్ధి చోదకశక్తిగా పనిచేస్తోంది. ప్రధానంగా టైర్-1, టైర్-2 నగరాలలో వినియోగదారుల కొనుగోళ్ల తీరు సంప్రదాయ ఈకామర్స్, ఆఫ్‌లైన్ స్టోర్ల నుంచి క్విక్‌కామర్స్‌వైపు మళ్లేందుకు మరింత అవకాశముంది. నిజానికి ఇప్పటికే జోరందుకున్న ఢిల్లీ(వార్షికంగా 70 శాతంపైగా వృద్ధి)తరహా నగరాలలో క్విక్ కామర్స్ సేవలకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. నెలవారీ లావాదేవీలు నిర్వహించే వినియోగదారుల(ఎంటీయూ) సంఖ్య ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమోటోతో పోలిస్తే క్రమంగా పలు రెట్లు అధికంగా నమోదయ్యే అవకాశముంది. వినియోగదారుల కొనుగోళ్లు విచక్షణ ఆధారితంకాకపోవడం(నిత్యావసరాలు) ఇందుకు కారణంకానుంది. మధ్యకాలానికి జొమాటో ఎన్‌వోవీ డెలివరీలు వార్షికంగా 20 శాతం పుంజుకోనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో దాదాపు 15 శాతానికిపైన వృద్ధి నమోదయ్యే అవకాశముంది. ఇక బ్లింకిట్ విషయంలో లాభదాయకత సమయానుగుణంగా మెరుగుపడవచ్చు. కొన్ని మార్కెట్లలో(అత్యధిక పోటీ పరిస్థితులున్నప్పటికీ) ఇప్పటికే ఎన్‌వోవీలో సర్దుబాటుతో నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్ 3 శాతానికిపైగా నమోదవుతోంది. బ్రాండ్, కస్టమర్ మానిటైజేషన్ ద్వారా దీర్ఘకాలానికి 5-6 శాతం మార్జిన్లు కొనసాగించగలిగే వీలున్నట్లు అంచనా. నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపరచుకోవడం, స్టోర్ల నుంచి డెలివరీలు పెంచుకోవడం ఇందుకు దోహదపడనున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యాక్సిస్ ఎంఎఫ్ మైక్రో ఇన్వెస్ట్‌మెంట్ ఫీచర్..

ఎందులో ఇన్వెస్ట్ చేయాలి, ఏ ఫండ్ సరైనది, డైవర్సిఫై చేయాలా లేక ఒకే ఫండ్‌కి కట్టుబడి ఉంటే సరిపోతుందా? మదుపరులకు ఎదురయ్యే ఇలాంటి సందేహాలను పరిష్కరించే దిశగా యాక్సిస్ ఎంఎఫ్ పరిశ్రమలోనే తొలిసారిగా మైక్రో ఇన్వెస్ట్‌మెంట్ ఫీచరును ప్రవేశపెట్టింది. వివిధ పథకాల్లో నామమాత్ర పెట్టుబడి పెట్టి, మార్కెట్లపై స్వయంగా అవగాహన పెంచుకునేందుకు, తదుపరి దీర్ఘకాలానికి తమకు అనువైన సాధనాన్ని ఎంచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని యాక్సిస్ ఏఎంసీ ఎండీ బి. గోప్‌కుమార్ తెలిపారు. భారీ నష్టభయం లేకుండా ఒక్కో స్కీముకి కేవలం రూ. 100 చొప్పున రూ. 1,000తో పది ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్‌తో ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. వివిధ స్కీములను పరిశీలించేందుకు, పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యం పాటించేందుకు, ఇన్వెస్టింగ్ ఫండమెంటల్స్‌ని తెలుసుకునేందుకు ఈ ఫీచర్ సహాయకరంగా ఉంటుందన్నారు. యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ వెబ్‌సైట్‌లో మైక్రో-ఇన్వెస్టింగ్ ఫీచరు అందుబాటులో ఉంటుంది.

వృద్ధి గుడ్.. మరి వడ్డీ రేట్లో?

- మార్కెట్‌కు వృద్ధి రేటు ఊతమిచ్చే ఛాన్స్
- ఈ వారం ఆర్‌బీఐ సమీక్షలో వడ్డీ రేట్లపై నిర్ణయం
- తగ్గించే అవకాశాలే ఎక్కువ; ఇది కూడా జోష్ పెంచేదే
- మరింత గరిష్ఠ స్థాయిలకు వెళ్లవచ్చని అంచనాలు

మార్కెట్లు ఆల్‌టైమ్ రికార్డులకు అత్యంత చేరువలో ఉన్నాయి. గతంలో రెండుసార్లు మార్కెట్ ఈ స్థాయిలకు వచ్చి... అక్కడి నుంచి ముందుకు వెళ్లలేక కొంత కరెక్షన్‌కు గురయ్యింది. ఈ సారి మాత్రం మార్కెట్లు ముందుకెళ్ళి, కొత్త ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలను నమోదు చేసే అవకాశం ఉందనేది నిపుణుల మాట. గత వారం చివర్లో... అది కూడా మార్కెట్లు ముగిశాక విడుదలైన క్యూ2 జీడీపీ వృద్ధి గణాంకాలు మార్కెట్‌ను ముందుకు నడిపించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నది వారి అభిప్రాయం. ఎందుకంటే వృద్ధి రేటు అంచనాలను మించింది. తయారీ, సర్వీసు రంగాలు 9 శాతం వృద్ధిని దాటి పరుగు తీయడంతో ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం ఎగసింది. ఇది ఆరు త్రైమాసికాలలోనే అత్యధికం. కాబట్టి ఈ ప్రభావం సోమవారం మార్కెట్లలో ప్రతిఫలించనునున్న విశ్లేషకులు చెబుతున్నారు. యూఎస్ టారిఫ్‌ల నేపథ్యంలో జీఎస్‌టీ రేట్లను సవరించటమనేది దేశ ఆర్థిక వ్యవస్థ బలపడటానికి ఉపకరించినట్లు వారు అభిప్రాయపడుతున్నారు.

దేశీ కీలకాంశాలివే...

- ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేయబోయే దేశీయ అంశాల్లో ప్రధానమైనది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరపతి విధానంపై జరిపే సమీక్షా సమావేశం. ఈ నెల 5న (వారాంతాన) ఈ సమావేశం ముగుస్తుంది. మరింతగా రేట్లను తగ్గించటమా... లేదా యథాతథ పరిస్థితిని కొనసాగించటమా అన్నది మార్కెట్లను ప్రభావితం చేయనుంది. వృద్ధి రేటు పెరిగింది కనక రేట్ల కోత ఉండొచ్చన్నదే ఎక్కువ మంది అభిప్రాయంగా కనిపిస్తోంది.
- డిసెంబరు 1న (సోమవారం) అక్టోబర్ నెలకు సంబంధించిన దేశ పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) గణాంకాలు విడుదలవుతాయి. సెప్టెంబర్‌లో ఐఐపీ 4 శాతం వద్ద నిలకడగా నమోదైంది. తయారీ రంగం 4.8 శాతం పుంజుకోవడం ఇందుకు సహకరించింది.
- నవంబర్ నెలకు ఆటో రంగ విక్రయ గణాంకాలు సైతం 1న వెలువడనున్నాయి. దీంతో పాటు హెచ్ఎస్‌బీసీ తయారీ, సర్వీసులు, కాంపోజిట్ పీఎంఐ గణాంకాలు ఈ వారం విడుదలకానున్నాయి.

సాంకేతికంగా స్పీడ్..

- గత వారం మొదట్లో దేశీ స్టాక్ మార్కెట్లు బలహీనపడినప్పటికీ చివర్లో బౌన్స్ బ్యాక్ అయ్యాయి. దీంతో సరికొత్త గరిష్టాలను తాకాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 85707 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 26,203 పాయింట్ల వద్ద ముగిశాయి. సాంకేతికంగా చూస్తే ఈ వారం సైతం మార్కెట్లు మరింత పుంజుకునే వీలుంది. నిఫ్టీ 26,300 పాయింట్లను దాటితే.. 26,800-26,850 వరకూ బలపడవచ్చు. ఇలాకాకుండా ఈ స్థాయిలో బలహీనపడితే.. తొలుత 26,000 పాయింట్లకు నీరసించవచ్చు. తదుపరి 25,850-25,800 పాయింట్ల స్థాయిలో సపోర్ట్ లభించే వీలుంది.

గమనించాల్సిన ప్రధాన షేర్లు...

అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఐసీఐసీఐ బ్యాంక్ లిమిటెడ్, గెయిల్ ఇండియా కంపెనీల షేర్లను గతవారం పలు బ్రోకరేజీ సంస్థలు రికమెండ్ చేశాయి. వీటి టార్గెట్ ధరను అప్‌గ్రేడ్ చేశాయి కూడా. దీంతో ఈ వారం ఇన్వెస్టర్లు ఈ షేర్లలో కదలికలను గమనించవచ్చు.

నిద్రపోతున్నపుడు కూడా సంపాదించే మార్గాన్ని కనుగొనకపోతే. పోయేవరకూ కష్టపడుతూనే ఉండాలి.
- వారెన్ బఫెట్, అమెరికన్ వ్యాపారవేత్త, పెట్టుబడిదారుడు

గృహ రుణానికి ముందే గుడ్‌బై

- రూ.5 వేలతో ఏకంగా 11 లక్షలు ఆదా
- మూడున్నరేళ్ల ముందే రుణం తీరిపోతుంది
- ఈఎంఐ చెల్లింపులకు అదనంగా కాస్త జత చేస్తే చాలు
- వీలైనంత త్వరగా తీర్చడానికే ప్రాధాన్యమివ్వాలి
- ఈఎంఐ మొత్తాన్ని తగ్గిస్తామని బ్యాంకులు ఆఫర్ చేస్తే నో

అదనపు చెల్లింపులతో అద్భుతాన్ని సాధించొచ్చు

ఇల్లు, కారు, బైక్, ఫర్నిచర్... ఇలా ఏదైనా కానీండి. చాలామందికి బడ్జెట్‌తో పోరాటం తప్పనిసరి. చేతిలో ఉన్న సొమ్ముకు... కావాలనుకుంటున్న వస్తువుకు తేడా ఉంటూనే ఉంటుంది. కొందరు ఇంకాస్త ఎక్కువ పెట్టి కావాలనుకుంటున్న వస్తువు సొంతం చేసుకుంటారు. కొందరు ఉన్నదానికి తగ్గదే కొనుక్కుని సర్దుకుపోతారు. మరికొందరైతే ఇటు సర్దుకుపోలేక... అటు కావాలనుకున్నది కొనలేక తరువాత చూద్దామని వాయిదా వేసుకుంటుంటారు. కానీ... 'తరువాత' అనేది రావటం కష్టం. ఎందుకంటే మనం అప్‌గ్రేడ్ అయ్యేసరికి మన కోరిక, లేకపోతే ఆ వస్తువు ధర కూడా అప్‌గ్రేడ్ అవుతాయి కదా? ఇదంతా ఎందుకంటే... ఆ మొదటి కేటగిరీ గురించి. ఇంకాస్త ఎక్కువ పెట్టి ముందుకెళ్లే వారి గురించి. వారు మొదట్లో కొంత ఇబ్బంది పడినా... తాను అనుకున్నది చేశామనే సంతృప్తి ఉంటుంది కదా! అది ఆర్థికంగానూ లాభాన్నే ఇస్తుంది. గృహ రుణం చెల్లింపుల్లో అలా ఇంకాస్త ఎక్కువ పెట్టే వారి గురించే ఈ ప్రత్యేక కథనం...

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కలే. ఒకప్పుడు రిటైర్‌మెంట్ తరువాతే సొంతిల్లు. ఈజీ రుణాల కారణంగా... ఈ తరం మాత్రం ఉద్యోగంలో చేరిన మొదట్లోనే సొంతింటికి ఓటేస్తున్నారు. 20-30 ఏళ్ల పాటు రుణ చెల్లింపులకు గడువు పెట్టుకున్నా... వీలైనంత త్వరగా తీర్చేయడానికి కష్టపడుతున్నారు. మరి మీకు తెలుసా ఒక 5వేల రూపాయలు ఎంత మ్యాజిక్ చేస్తుందో? నెలనెలా చెల్లించే ఈఎంఐకి అదనంగా రూ.5వేలు గనక చెల్లిస్తే... 20 ఏళ్లలో ఏకంగా రూ.11.5 లక్షల వడ్డీ ఆదా అవుతుంది. పైపెచ్చు ఈఎంఐలు చెల్లించాల్సిన కాలమూ తగ్గుతుంది. అదెలాగంటే...

చెల్లించేదెంత	ఆదా ఎంత
ప్రతి నెలా రూ.3,000	రూ.7లక్షలు
ప్రతి నెలా రూ.5,000	11.5 లక్షలు
ప్రతి నెలా రూ.10,000	రూ.20 లక్షలు

రూ.5,000 చేసే మ్యాజిక్ ఇదీ...

ఉదాహరణకు శ్రీకర్ రూ.50 లక్షల గృహ రుణం తీసుకున్నాడు. 20 ఏళ్ల కాలానికి నెలకు రూ.40వేలు ఈఎంఐ చెల్లించడానికి ముందే మానసికంగా సిద్ధపడ్డాడు. కానీ మరో రూ.5వేలు అదనంగా చెల్లిస్తే..? ఏం జరుగుతుందో చూద్దాం...

- శ్రీకర్ రుణంపై వడ్డీ రేటు 8.5 శాతం. ప్రతి నెలా చెల్లించాల్సిన ఈఎంఐ రూ,.43,500
- 20 ఏళ్లలో రూ.50 లక్షల అసలుతో పాటు మరో రూ.54 లక్షలు వడ్డీ కింద చెల్లించాలి.
- కానీ ప్రతినెలా రూ.43,500 కాకుండా దానికి రూ.5వేలు జోడించి రూ.48,500 చెల్లిస్తే....
- 20 ఏళ్ల రుణం కాస్తా 16 ఏళ్ల 6 నెలల్లో తీరిపోతుంది. వడ్డీ రూపంలో ఏకంగా రూ.11.5 లక్షలు ఆదా అవుతుంది.
- ఒకవేళ రూ.10,000 అదనంగా (రూ.53,500 చొప్పున) చెల్లిస్తే... రుణం 13 ఏళ్లకే తీరిపోతుంది. వడ్డీ రూపంలో రూ.20 లక్షలు మిగులుతుంది.
- ఇలా స్మార్ట్ చెల్లింపులతో 20 ఏళ్ల రుణ బంధాన్ని 12-13 ఏళ్లకే తీర్చుకోవచ్చు.

ఒకే విడతా లేక నెలవారీనా..?

- వేతన జీవులు ప్రతి నెలా ఈఎంఐకి కొంత అదనంగా చెల్లిస్తూ వెళ్లడమే మంచి మార్గం
- దీనివల్ల ప్రతి నెలా అసలు కాస్త తగ్గుతూ వెళుతుంది. ఈ అదనపు చెల్లింపుల వల్ల ఇతర ఖర్చులపైనా నియంత్రణ వస్తుంది
- బోనస్ లాంటివి వచ్చినపుడు ఆ మొత్తాన్ని గృహ రుణం ముందస్తు చెల్లింపులకు వినియోగించుకోవచ్చు.
- అయితే ఎక్కువ మొత్తం ఒకేసారి చెల్లిస్తున్నపుడు... గృహ రుణం వడ్డీకన్నా ఎక్కువ వడ్డీ వచ్చే మార్గాలేవైనా ఉన్నాయేమో చూడాలి.
- అలాంటి మార్గాల్లో ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాన్ని పరిశీలించాకే గృహ రుణం సంగతి చూడాలి. ఎందుకంటే గృహరుణాలపై వడ్డీ తక్కువ.

అంత ఆదా సాధ్యమా?

- గృహ రుణంపై బ్యాంకులు ప్రతి నెలా చివర్లో మిగిలే నికర బకాయిపైనే వడ్డీ విధిస్తాయి.
- ప్రతి నెలా చెల్లించే అదనపు మొత్తం నేరుగా అసలులో జమవుతుంది. తదుపరి నెలలో ఆ మేరకు అసలుపై వడ్డీ మిగులుతుంది.
- ఈఎంఐకి అదనంగా ఇలా ఎంత అదనంగా చెల్లిస్తారో... అంత మేర వడ్డీ భారాన్ని, కాల వ్యవధిని తగ్గించుకోవచ్చు.
- రుణం తీసుకున్న మొదటి ఐదేళ్లలో వీలైనంత అదనంగా చెల్లిస్తే... వడ్డీ- కాలవ్యవధిని అంత గణనీయంగా తగ్గుతాయి.
- ఒకవేళ బ్యాంక్ రుణ కాల వ్యవధి పెంచుతూ, ఈఎంఐని తగ్గించే ఆఫర్ ఇస్తే.. అంగీకరించొద్దు.

ఫ్లోటింగ్ - ఫిక్స్‌డ్ రేటు రుణం

- ఫ్లోటింగ్ రేటుపై తీసుకున్న గృహ రుణం అయితే ముందస్తు చెల్లింపులపై ఎలాంటి పెనాల్టీ పడదు.
- ఫిక్స్‌డ్ రేటుపై రుణం తీసుకున్న వారు ముందుగా చేసే చెల్లింపులపై 1- 3 శాతం మేర పెనాల్టీ చెల్లించాల్సి రావచ్చు.
- ప్రస్తుతం బ్యాంక్‌లు/ ఎన్‌బీఎఫ్‌సీలు ఫ్లోటింగ్ రేటునే అనుసరిస్తున్నాయి. ఫిక్స్‌డ్ రేటుపై, పెనాల్టీ లేని ముందస్తు చెల్లింపులకు అవకాశం ఉంటే దాన్ని పరిశీలించొచ్చు.
- ఒకవేళ బ్యాంక్ రుణ కాల వ్యవధి పెంచుతూ, ఈఎంఐని తగ్గించే ఆఫర్ ఇస్తే.. అంగీకరించొద్దు.

జెన్ జెడ్ ఇన్వెస్టర్లకు బీమా.. డైలమా

జాక్సన్ జేకబ్
చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్, జూనో జనరల్ ఇన్సూరెన్స్

పూర్తిగా డిజిటల్ శకంలో పెరుగుతున్న జెన్ జెడ్ తొలి తరం ఇన్వెస్టర్లు.. డబ్బు, లైఫ్‌స్టయిల్, విశ్వసనీయతకు సంబంధించిన అభిప్రాయాలను తిరగరాస్తున్నారు. వారు ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా ఉంటున్నారు. ఎంచుకునే ప్రతి దాన్నుంచి గరిష్ట విలువను పొందడంపై దృష్టి పెడుతున్నారు. తాము ఉపయోగించే ప్రతి ప్రొడక్టు, సర్వీసు సరళంగా, వేగవంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. దీనితో వారికి అనుగుణమైన ప్రొడక్టులను అందించే విషయంలో ఈ పరిణామం, బీమా సంస్థలకు ఒక పెద్ద డైలమాగా మారింది. వారి వాస్తవ అవసరాలు, అందుబాటులో ఉన్న సాధనాల మధ్య అంతరాలను భర్తీ చేసేలా కొత్త సొల్యూషన్స్‌ని కనుగొనాల్సిన పరిస్థితి నెలకొంది.

జెన్ జెడ్ తరం వారు ఆర్థిక ప్రణాళికలపై ఆసక్తిగానే ఉన్నప్పటికీ బీమాను ఇంకా పూర్తి స్థాయిలో పరిశీలించడం లేదు. ఇటీవలి హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో నివేదిక ప్రకారం 61 శాతం యువత హెల్త్ ఇన్సూరెన్స్‌పై ఆసక్తి చూపగా, 37 శాతం మంది క్యాష్‌లెస్ హాస్పిటల్ నెట్‌వర్క్ లభ్యతకు ప్రాధాన్యమిచ్చారు. బీమాకు ప్రాధాన్యమిస్తున్నప్పటికీ కేవలం సంప్రదాయ ఫీచర్లకే పరిమితం కాకుండా సౌకర్యం, తమకు ఎంత వరకు ఉపయోగకరంగా ఉంటుందనే కోణాల్లో కూడా ఇన్సూరెన్స్‌ని చూస్తున్నారని దీని ద్వారా తెలుస్తోంది. జెన్ జెడ్ తరం టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ లాంటి అంశాలపై గణనీయంగా ఖర్చు చేస్తోంది. తమ లైఫ్‌స్టయిల్‌కి అనుగుణంగా, పారదర్శకమైన, సరళమైన ట్రావెల్, హెల్త్ పాలసీలను, గ్యాడ్జెట్స్‌ను కొనుగోలు చేసేందుకు వారు సిద్ధంగా ఉంటున్నారు. దానికి తగ్గట్లుగా వారికి అర్థమయ్యే రీతిలో బీమాను వివరించి, తగు పాలసీలను అందచేయగలిగితే ఇన్సూరెన్స్ ప్రయోజనాలను జెన్ జెడ్ తరంవారికి మరింతగా చేరువ చేసేందుకు వీలవుతుంది.

ఏం కోరుకుంటున్నారు..

సరళత్వం: అర్థం కాని సంక్లిష్టమైన పదాలు, సుదీర్ఘంగా ఉండే పాలసీ డాక్యుమెంట్లను వారు ఇష్టపడటం లేదు. సాదా సీదాగా అర్థమయ్యే భాషను, డిజిటల్ సాధనాలను, స్పష్టతను కోరుకుంటున్నారు.

పర్సనలైజేషన్: వారు సంప్రదాయ పద్ధతుల్లో గిరిగీసుకుని ఉండటం లేదు. ఫ్రీల్యాన్స్ కెరియర్లు మొదలుకుని ఇతరత్రా పార్ట్‌టైమ్ పనులు కూడా చేస్తున్నారు. కాబట్టి పే-యాజ్-యు-డ్రైవ్ కార్ ఇన్సూరెన్స్, అవసరాలకు తగ్గట్లు యాడ్-ఆన్‌లను చేర్చేందుకు వీలుండే హెల్త్ పాలసీలు, స్వల్పకాలిక కవరేజీల్లాంటి ప్రొడక్టులను వారు ఇష్టపడుతున్నారు.

డిజిటల్ ఫస్ట్: ఫోన్‌తో చెల్లింపులు జరిపినట్లు లేదా ఫుడ్ డెలివరీ యాప్ ద్వారా ఆర్డరు పెట్టినట్లు పాలసీ కొనుగోలు అనుభూతి కూడా సులభతరమైన విధంగా, వేగవంతంగా, మొబైల్ – ఫస్ట్ తరహాలో ఉండాలనుకుంటున్నారు.

పారదర్శకత: నైతిక విలువలు, పారదర్శక విధానాలను పాటించే బ్రాండ్స్ వైపు జెన్ జెడ్ తరం మొగ్గు చూపుతున్నారు. సమాజం, పర్యావరణంపట్ల బాధ్యతాయుతంగా ఉండే సొల్యూషన్స్.. వారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో జెన్ జెడ్ తరం అవసరాలకి తగ్గ పాలసీలను అందించే దిశగా పరిశ్రమలో ఇప్పటికే మార్పులు చోటు చేసుకుంటున్నాయి. టెలీమ్యాటిక్స్ ఆధారిత వాహన బీమా యువ డ్రైవర్లకు దన్నుగా ఉంటోంది. వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఆరోగ్య బీమా సంస్థలు తమ పాలసీల్లో వెల్‌నెస్ ప్రోగ్రాంలు, నగదురహిత డిజిటల్ సర్వీసులు మొదలైనవి అందిస్తున్నాయి. ప్రయాణాలు కావచ్చు ఇతరత్రా కొనుగోళ్లు కావచ్చు అన్నింటి అంతర్గతంగా బీమా ప్రయోజనాన్ని అందించే విధానం క్రమంగా ఊపందుకుంటోంది.

జెన్ జెడ్ తరం వారు బీమాను భారంగా కాకుండా సాధికారతగా చూస్తున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా కలలను సాకారం చేసుకునేందుకు తోడ్పడే భద్రత సాధనాలను వారు కోరుకుంటున్నారు. వృద్ధిలోకి వచ్చేందుకు ఇన్వెస్ట్ చేయదల్చుకుంటున్నారు. కాబట్టి బీమా అనేది డిజిటల్-ఫస్ట్‌గా, సరళంగా, పారదర్శకంగా ఉంటే కేవలం బ్యాకప్ వ్యూహంగా మాత్రమే కాకుండా వారు కోరుకునే జీవితాన్ని గడిపేందుకు సహాయపడే సాధనంగా ఉంటుంది.

వారి ఆకాంక్షలకు తగ్గట్లు పరిశ్రమ కూడా తనను తాను మల్చుకోగలిగితే జెన్ జెడ్ తరానికి చేరువ కావడంతో పాటు బీమా రంగ భవిష్యత్తును సరికొత్తగా తీర్చిదిద్దుకోవడానికి ఆస్కారం ఉంటుంది. జెన్ జెడ్ తరం అంటే ఏదో అల్లాటప్పా కస్టమర్ సెగ్మెంట్ కాదు, బీమా రంగం భవిష్యత్తుకు దిక్సూచి లాంటిది. కొత్త ఆవిష్కరణలను కనుగొనడం, పాలసీలను మరింత సరళం చేయడం, చక్కగా అర్థమయ్యేలా వివరించడంలాంటి అంశాల్లో పరిశ్రమ పురోగమనాన్ని ఇది మరింత వేగవంతం చేయనుంది.

వేక్‌ఫిట్ ఐపీవో 8న

రూ. 1,400 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: హోమ్, ఫర్నీషింగ్స్ కంపెనీ వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 8న ప్రారంభంకానుంది. 10న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 1,400 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా రూ. 377 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 4.67 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లతోపాటు ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈ నెల 5న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను ఆఫర్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 31 కోట్లు కొత్తగా 117 కోకో రెగ్యులర్ స్టోర్ల ఏర్పాటుకు, రూ. 15 కోట్లు మెషీనరీ తదితర కొనుగోళ్లకు, రూ. 161 కోట్లు లీజ్, సబ్‌లీజ్ అద్దెలుసహా ప్రస్తుత స్టోర్ల లైసెన్స్ ఫీజు చెల్లింపులకు వినియోగించనుంది. మరో రూ. 108 కోట్లు మార్కెటింగ్, ప్రకటనలకు కేటాయించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. గత నెల(నవంబర్) మొదట్లో కంపెనీ డీఎస్‌పీ ఇండియా ఫండ్, 360 వన్ ఈక్విటీ అపార్చునిటీస్ ఫండ్ నుంచి ప్రీఐపీవో రౌండ్‌లో భాగంగా రూ. 56 కోట్లు సమకూర్చుకుంది.

కంపెనీ బ్యాక్‌గ్రౌండ్..

2016లో ఏర్పాటైన కంపెనీ హోమ్, ఫర్నీషింగ్ మార్కెట్లో దేశీయంగా వేగవంత వృద్ధిని సాధిస్తోంది. 2025 సెప్టెంబర్30కల్లా 6 నెలల్లో రూ. 724 కోట్ల టర్నోవర్, రూ. 35 కోట్ల నికర లాభం ఆర్జించింది. కంపెనీ సొంత చానళ్లు, కోకో స్టోర్లతోపాటు.. ఇతర ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, మల్టీబ్రాండ్ ఔట్‌లెట్ల ద్వారా విభిన్న ఫర్నీచర్, ఫర్నీషింగ్స్ ప్రొడక్టులను విక్రయిస్తోంది. బెంగళూరు(కర్ణాటక), హోసూర్(తమిళనాడు), సోనిపట్(హర్యానా)లలో రెండేసి చొప్పున తయారీ యూనిట్లను కలిగి ఉంది.

పెట్టుబడి వృద్ధికి మార్గం!

ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్ ఫండ్

ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని సమకూర్చుకోవాలని భావించే వారు.. తమ పోర్ట్‌ఫోలియో కోసం స్మాల్‌క్యాప్ ఫండ్స్‌ను తప్పకుండా పరిశీలించాలి. ఈక్విటీల్లో అత్యధిక రిస్క్ ఉండేది ఈ విభాగంలోనే. అదే సమయంలో అధిక రాబడులు కూడా ఇక్కడే సాధ్యం. కనుక దీర్ఘకాల లక్ష్యాల కోసం తమ మొత్తం పెట్టుబడుల్లో 20 శాతం వరకు స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవచ్చు. ఈ విభాగంలో మంచి రాబడులను అందిస్తున్న పథకాల్లో ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్ ఫండ్ కూడా ఒకటి.

రాబడులు: గత ఐదేళ్ల కాలంలో ఎస్‌బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ పెట్టుబడిపై 285 శాతం రాబడిని అందించింది. ఈ కాలంలో నిఫ్టీ 50 రాబడి 164%. అంటే వార్షిక కాంపౌండెడ్ రాబడి 28.44 శాతం. గత ఏడాది కాలంలో రాబడి ఒక శాతంగా ఉంది. గత ఏడాది కాలంగా మార్కెట్లు దిద్దుబాటు దశలో ఉండడం తెలిసిందే. ఇక మూడేళ్ల కాలంలో వార్షిక రాబడి 15 శాతం వరకు ఉండడాన్ని గమనించొచ్చు. ఈ పథకం ఆరంభం నుంచి ఇప్పటి వరకు పనితీరును గమనిస్తే వార్షిక రాబడి 19.35 శాతం చొప్పున ఉంది. రాబడుల్లో స్థిరత్వాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక ఈ పథకంలో సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసినట్టయితే ఏడాది కాలంలో సిప్ పెట్టుబడులపై 6.88 శాతం నష్టాలు కనిపిస్తున్నాయి. మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే వార్షిక రాబడి 18.49 శాతం చొప్పున ఉంది. ఐదేళ్ల కాలంలో అయితే వార్షిక రాబడి ఏకంగా 55.78 శాతంగా ఉండడం గమనించొచ్చు. ఇక 10 ఏళ్లలో సిప్ రాబడి 164% ఉంది. కనుక సిప్ ప్లాన్ రూపంలో పెట్టుబడులతో రిస్క్‌ను అధిగమించడంతోపాటు.. మెరుగైన రాబడుల ను సమకూర్చుకోవచ్చని డేటా తెలియజేస్తోంది.

పెట్టుబడుల విధానం: దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు సంపద సమకూర్చడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగం. చిన్న కంపెనీలు ఆర్థిక సంక్షోభ సమయాల్లో పెద్ద కంపెనీలతో పోల్చి చూస్తే కుదేలవుతుంటాయి. కనుక ఆ సమయంలో స్మాల్‌క్యాప్ పెట్టుబడుల విలువ పడిపోతుంటుంది. ఆందోళన చెందకుండా, స్థిరంగా ఆ పెట్టుబడిని తిరిగి గణనీయంగా వృద్ధి చెందే వరకు వేచి చూడగలిగే వారికే స్మాల్ క్యాప్ పెట్టుబడులు అనుకూలం.

పోర్ట్‌ఫోలియో: ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం 36,945 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 93.27 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 2.57 శాతం పెట్టుబడులు డెట్ సాధనాల్లో ఉన్నాయి. 4.16 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడులను పరిశీలించగా, 36.34 శాతం మేర స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన మొత్తం మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఉన్నట్టు తెలుస్తోంది. పేరుకు స్మాల్‌క్యాప్ ఫండ్ అయినప్పటికీ.. మిడ్‌క్యాప్‌లో ఎక్స్‌పోజర్ ఎక్కువగా ఉంది. దీనికి కారణం స్వల్పకాలంలో రాబడుల అవకాశాలతోపాటు.. ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేసిన తర్వాతి కాలంలో కొన్ని కంపెనీలు వృద్ధితో మధ్యస్థ కంపెనీలుగా అవతరించినట్టు తెలుస్తోంది. ఈక్విటీల్లో అత్యధికంగా 26.55 శాతం ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. కన్జ్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీలకు 20.56 శాతం, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 15.9 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఏథర్ ఎనర్జీ	3.76
ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్	2.76
ఈఐడీ ప్యారీ	2.71
కల్పతరు ప్రాజెక్ట్	2.69
సిటీ యూనియన్ బ్యాంక్	2.58
చాలెట్ హోటల్స్	2.50
కృష్ణ ఇనిస్టిట్యూట్	2.41
నవీన్ ఫ్లోరిన్	2.31
డామ్స్	2.30
కజారియా సిరామిక్స్	2.29

నోటీసులా... నోటీసులే..!



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

రోజూ ఇన్‌కంట్యాక్స్ వారి వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ పర్సనల్ అకౌంటులో లాగిన్ అయ్యి మీ వివరాలు చూసుకోవడం అలవాటు చేసుకోండి. మీ ఆడిటర్ నుంచి మీ లాగిన్ వివరాలు తీసుకోండి. ప్రతిసారి ఆడిటర్స్ దగ్గరకు పరిగెత్తకుండా మీరే లాగిన్ అవ్వొచ్చు.

నోటీసు/సమాచారం

ఇన్‌కమ్ ట్యాక్స్ సైట్‌లో లాగిన్ అయ్యి ... డాష్‌బోర్డులోని పెండింగ్ యాక్షన్స్‌లో ఈ-ప్రొసీడింగ్స్‌ని క్లిక్ చేయండి. అందులో నోటీసులు ఉంటాయి. ఆ నోటీసుని చూడండి. దీనిని VIEW అంటారు. దానిలో నోటీసులు ఉంటే డౌన్‌లోడ్ చేసుకోండి. అప్పుడు నోటీసులో ఏముందో అర్థమవుతుంది.

నోటీసులెన్నో రకాలు, మరెన్నో అంశాలు

- డిఫెక్టివ్ నోటీసు అంటారు. బదులుగా సకాలంలో దీన్ని సర్దుబాటు చేసుకోవచ్చు.
- అలా సర్దుబాటు చేస్తే సరిపోతుంది.
- 143 (1) ప్రకారం ఒక స్టేట్‌మెంట్ పంపిస్తారు. ఆదాయంలో కానీ పన్ను భారం లెక్కింపులో కానీ వ్యత్యాసాలుంటే తెలియజేస్తారు. ఆదాయం 'కాలమ్' మీరు వేసింది. అధికారి అస్సెస్ చేసింది పక్కపక్కనే ఉంటాయి. ఒకదానితో మరొకదాన్ని పోల్చి చూసుకోండి. హెచ్చుతగ్గులుంటాయి. మినహాయింపులుంటాయి.
- కూడికల్లో లేదా తీసివేతల్లో పొరపాట్లు రావచ్చు.
- పన్ను చెల్లింపుల విషయంలో రికార్డులు అప్‌డేట్ కాకపోవడం వల్ల తేడాలుంటాయి.
- అలాంటి సందర్భాల్లో ట్యాక్స్ చెల్లించమంటారు.
- ఆ సర్దుబాటు ఆర్డర్లు ఉంటాయి.
- మీరు వాటితో ఏకీభవిస్తేనే పన్ను కట్టండి. ఒప్పుకోకపోతే అంటే అంగీకరించకపోతే డాక్యుమెంట్లు పొందుపరుస్తూ జవాబు ఇవ్వండి.
- స్క్రూటినీకి ఎంపిక అయితే ఏయే సమాచారం ఇవ్వాలో అడుగుతారు. ఇవ్వండి.
- ముందుగా AGREE/ NOT AGREE చెప్పండి
- అనవసరంగా వాయిదాలు అడగొద్దు. అవసరం అని తెలిస్తేనే టైం అడగండి
- అంతా ఫేస్‌లెస్ ... మీ మీద ఎటువంటి ఒత్తిళ్లు ఉండవు.
- అధికారులు ఎంతో ఓపికగా మీ రిప్లై చదువుతారు.
- సాధారణంగా తప్పులేం జరగవు
- అవసరం అయితే నిబంధనల మేరకు మీరు అప్పీల్‌కు వెళ్లవచ్చు.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

క్లుప్తంగా...

ఉచిత సివిల్స్ శిక్షణకు 6,361 మంది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం 6,361 మంది దరఖాస్తు చేసుకోగా, వారికి అన్ని జిల్లా కేంద్రాలలో ప్రవేశ పరీక్ష జరిగింది. ఇందులో మెరిట్ సాధించిన అభ్యర్థులకు విశాఖ, విజయవాడ, తిరుపతి అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో ఈనెల 10 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దీంతోపాటు వసతి, భోజన సౌకర్యం కూడా కల్పిస్తారు.

ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడిగా కాకి ప్రకాశ్ రావు

సాక్షి, అమరావతి/మచిలీపట్నం అర్బన్: : ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడిగా కాకి ప్రకాశ్ రావు ఎన్నికయ్యారు. సంఘం ప్రస్తుత అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారు గుర్తింపు సంఘాల్లో కీలక పదవులు చేపట్టరాదనే నిబంధన ఉంది. దీంతో ఆదివారం మచిలీపట్నంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో గణపతిరావు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా ఉన్న కర్నూలు జిల్లాకు చెందిన కాకి ప్రకాశ్ రావును రాష్ట్ర అధ్యక్షుడిగాను, కృష్ణా జిల్లాకు చెందిన ఎంజీ మహాదిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సమావేశంలో సంఘం ఆర్థిక కార్యదర్శి నారాయణరావు, తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్ శర్మ, ఆప్టా ఏపీ ఎన్నికల అధికారి రాజాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో ఘోర ప్రమాదం

రెండు ప్రభుత్వ బస్సుల ఢీ.. 11 మంది దుర్మరణం

సాక్షి, చెన్నై: తమిళనాడులోని శివగంగ జిల్లా తిరుపత్తూరు సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు ప్రభుత్వ బస్సులు అతి వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 9 మంది మహిళలతో సహా 11 మంది మరణించారు. తిరుప్పూర్ నుంచి కారైక్కుడి వస్తున్న తమిళనాడు రవాణా సంస్థ ఎక్స్‌ప్రెస్ బస్సు, కారైక్కుడి నుంచి దిండుగల్ వైపుగా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా పిల్లయార్‌పట్టి సమీపాన సమత్తువ పురం వంతెన వద్ద ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొన్నాయి. దీంతో రెండు బస్సులు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు గాయపడ్డ వారిని, శిథిలాలలో చిక్కుకున్న వారిని బయటకు తీసి కారైక్కుడి ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలోనే ఎనిమిది మంది మరణించగా, చికిత్స పొందుతూ మరో ముగ్గురు ప్రాణాలొదిలారు. శివగంగై జిల్లా కలెక్టర్ పొర్కొడి, ఎస్పీ శివప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వంతెన దాటగానే ఉన్న మలుపు వద్ద రెండు బస్సులు అతివేగంగా దూసుకు రావడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టుగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శివగంగ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో 40 మంది ఉండగా, వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది.

కొలకలూరి ఇనాక్‌కు గురజాడ పురస్కారం

కొలకలూరి ఇనాక్‌కు గురజాడ పురస్కార పత్రాన్ని అందిస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ తదితరులు

విజయనగరం టౌన్: పద్మశ్రీ, ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ఆదివారం గురజాడ విశిష్ట సాహితీ పురస్కారం అందజేశారు. విజయనగరంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ.. మహాకవి గురజాడ ఆశయాలను భావితరాలకు అందించాలని కోరారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. గురజాడ విశిష్ట పురస్కారం అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రపంచ మానవ వికాసం కోరిన మహోన్నతమైన వ్యక్తి గురజాడ అని కొనియాడారు. అంతకుముందు గురజాడ నివాసంలో జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులర్పించారు. అనంతరం దేశభక్తి గీతాలాపనతో పాటు భారీ ర్యాలీ నిర్వహించి గురజాడ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, శ్రీ సాయి ఫౌండేషన్ ప్రతినిధి కోలగట్ల తమ్మన్నశెట్టి, నవ సాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్వీ సూర్యప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తొలుత కృష్ణా తర్వాత గంగ

అత్యధిక నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలున్న బేసిన్‌లో అగ్రగామిగా కృష్ణా

రెండో స్థానంలో నిలిచిన గంగ.. మూడో స్థానంలో గోదావరి

కేంద్ర జలసంఘం నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో అతి పెద్ద నది గంగ..అతి పెద్ద నదుల్లో కృష్ణమ్మది మూడో స్థానం. కానీ.. అత్యధిక నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలు ఉన్న నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లో మాత్రం కృష్ణ అగ్రగామిగా నిలిచింది. ఆ తరువాత స్థానంలో గంగ బేసిన్ నిలిచింది. కానీ.. నిర్మాణంలో ఉన్న జలాశయాలు పూర్తయితే నీటి నిల్వ సామర్థ్యం అత్యధికంగా కలిగిన జలాశయాలు ఉన్న బేసిన్‌లలో గంగమ్మ తొలి స్థానంలో నిలుస్తుంది. ఆ తరువాతి స్థానంలో కృష్ణమ్మ నిలుస్తుందంటూ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. దేశంలో సింధూ నుంచి కావేరి వరకూ అన్ని నదీ పరివాహక ప్రాంతాల్లో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న జలాశయాల నీటి నిల్వలపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది. ఆ అధ్యయన నివేదికలో ప్రధానాంశాలు..

- దేశంలో అన్ని నదీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయిన జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 9,105.92 టీఎంసీలు. నిర్మాణంలో ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,651.73 టీఎంసీలు.
- దేశంలో అతి పెద్ద నదుల్లో గంగా నదిది మొదటి స్థానం.. రెండో స్థానంలో గోదావరి.. మూడో స్థానంలో కృష్ణా నిలుస్తాయి.
- నదీ పరివాహక ప్రాంతాల్లో అత్యధిక నీటి నిల్వలు కలిగిన జలాశయాలు ఉన్న బేసిన్‌లలో కృష్ణా మొదటి స్థానంలో నిలుస్తుంది. కృష్ణా బేసిన్‌లో ఇప్పటికే పూర్తయిన జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,789 టీఎంసీలు. నిర్మాణంలో ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 146.79 టీఎంసీలు. కృష్ణా బేసిన్‌లో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,935.79 టీఎంసీలు.
- గంగా బేసిన్‌లో పూర్తయిన జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,719.28 టీఎంసీలు.. నిర్మాణంలో ఉన్న జలాశయాల నిల్వ సామర్థ్యం 270.17.. గంగా బేసిన్‌లో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,989.45 టీఎంసీలు. అంటే.. నిర్మాణంలో ఉన్న జలాశయాలు పూర్తయితే అత్యధిక నీటి నిల్వ కలిగిన రిజర్వాయర్లు ఉన్న బేసిన్‌లలో కృష్ణమ్మను గంగమ్మ అధిగమించి ప్రథమ స్థానానికి చేరుతుందన్న మాట.
- చైనా, భారత్, బంగ్లాదేశ్‌ల మీదుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే బ్రహ్మపుత్రా నది జీవ నది. కానీ.. వర్షాచాయ ప్రాంతంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మీదుగా ప్రవహించే బంగాళఖాతంలో కలిసే పెన్నా నదీ పరివాహక ప్రాంతంలోనే అత్యధిక నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలు ఉండటం గమనార్హం. దేశంలో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న జలాశయాల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే..అత్యధిక నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు ఉన్న బేసిన్‌ల్లో పెన్నా పదో స్థానంలో నిలిస్తే.. బ్రహ్మపుత్ర 11వ స్థానంలో నిలిచింది. బ్రహ్మపుత్ర బేసిన్ పర్వతాలు, కొండలు, లోయలతో కూడుకున్నది. జలాశయాల నిర్మాణానికి అంత అనువైన ప్రాంతం కాదు.

దేశంలో వివిధ బేసిన్‌లలో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)

నది పరీవాహక ప్రాంతం	పూర్తయిన జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం	పూర్తవని జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం	మొత్తం
గంగ	1,719.28	270.17	1,989.45
కృష్ణా	1,789.00	146.79	1935.79
గోదావరి	1,237.62	297.12	1,534.74
నర్మద	770.55	93.29	863.84
సింధూ	573.00	3.54	576.54
మహానది	461.48	51.61	513.09
తాపి	322.72	55.03	377.75
కావేరి	320.82	0.53	321.35
మహి	177.20	5.30	182.50
పెన్నా	103.78	75.62	179.40
బ్రహ్మపుత్ర	60.68	28.08	68.76

సంక్షోభంలో ఏపీ రైతాంగం

- ప్రభుత్వాలు ఆదుకోవాలి
- ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో మిథున్‌రెడ్డి, సుభాశ్ చంద్రబోస్
- సమస్యలపై మాట్లాడేందుకు సభలో తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ : రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందని వైఎస్సార్‌సీపీ ఆవేదన వ్యక్తం చేసింది. రైతుల సమస్యల పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేసింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఆదివారం కేంద్రం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. వైఎస్సార్‌సీపీ లోక్‌సభ సభ్యులు మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాశ్ చంద్రబోస్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సమస్యలను కేంద్రం దృష్టికి తెచ్చారు. 'పలు సమస్యలపై మాట్లాడేందుకు సభలో సమయం ఇవ్వాలి. మేము లేవనెత్తిన ప్రతి ఒక్క అంశంపై కేంద్రం పరిష్కారాన్ని చూపాలి. జాతీయ స్థాయిలో 2023–24లో కోటి 84 టన్నుల మత్స్య ఉత్పత్తుల దిగుబడులు నమోదయ్యాయి. ఇందులో 51.58 లక్షల టన్నుల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో ఉత్పత్తయ్యే రొయ్యల్లో 76 శాతం, చేపల్లో 28 శాతం వాటా ఏపీదే. వ్యవసాయ అనుబంధ రంగాల స్థూల ఆదాయ నిష్పత్తిలో 9.15 శాతం ఆక్వా రంగం నుంచే వస్తోంది. ట్రంప్ విధించిన టారిఫ్‌ల కారణంగా రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. వీరిని ఆదుకునేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలి' అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

సమావేశం అనంతరం పార్టీ లోక్‌సభపక్ష నేత మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, వైద్యరంగం బలోపేతం కోసం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు. ఈ ప్రైవేటీకరణను ఆపాలని తాము కేంద్రం దృష్టికి తీసెకెళ్లామన్నారు. అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడం లేదంటూ స్పష్టత ఇవ్వాలని సమావేశంలో డిమాండ్ చేసినట్లు వివరించారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

ఉపాధి హామీ నిధులపై పెదవి విప్పని పెమ్మసాని

కాగా, ఆరు నెలలుగా ఉపాధి హామీ పథకం డబ్బులు రాక పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సమావేశంలో తాము ప్రస్తావిస్తే, ఇదే సమావేశంలో పాల్గొన్న సంబంధిత శాఖ కేంద్ర మంత్రి పెమ్మసాని.. ఈ సమస్యపై నోరుమెదపలేదని మిథున్ రెడ్డి విమర్శించారు. కూలీలకు ఈఏడాది జూలై 17వ తేదీ నుంచి జరిగిన పనులకు నేటి వరకు డబ్బులు ఇవ్వలేదన్నారు. దాదాపు రూ.350 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని కేంద్రానికి వివరించినట్లు తెలిపారు. పనిలేని పేదలకు పని కల్పించి డబ్బు ఇవ్వడమే లక్ష్యమైన ఈ పథకానికి సంబంధించి కూడా టీడీపీకి చెందిన వారే రాజ్యమేలుతున్నారని ఎంపీ ధ్వజమెత్తారు. కూలీలు చేయాల్సిన పనిని వారిచేత చేయించకుండా, టీడీపీ నేతలు తమ సొంత వారి మిషన్లు పెట్టి పనులు చేస్తున్నట్లు విమర్శించారు. ఇలా దొంగ మస్టర్లు వేసుకుని బిల్లులు కాజేస్తున్నట్లు మండిపడ్డారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా.. ఆ శాఖకు కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న పెమ్మసాని స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.

బ్రేక్‌ఫాస్ట్‌తో కుర్చీ పోరుకు బ్రేక్!

- సోనియా నివాసంలో 'కర్ణాటకం'పై చర్చ
- అంతకు ముందే తనకు సీఎంతో విభేదాలు లేవని డీకే స్పష్టీకరణ
- 2028 ఎన్నికలే తమ లక్ష్యమని వెల్లడి

సాక్షి బెంగళూరు/బెంగళూరు (శివాజీనగర): కర్ణాటకలో సీఎం కుర్చీ మార్పుపై కొద్ది రోజులుగా సాగుతున్న పోరుకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లు ఢిల్లీకి వెళ్లకుండానే.. ఢిల్లీలో సోనియా గాంధీ నాయకత్వంలో ఏఐసీసీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వారిద్దరూ ఐక్యతారాగం ఆలపించారు. శుక్రవారం దాకా ఎత్తుకు పై ఎత్తు వేస్తూ.. పరోక్షంగా బల ప్రదర్శన చేస్తూ.. మరోవైపు హై కమాండ్ నిర్ణయమే శిరోధార్యమని చెబుతూ వచ్చిన వారు.. శనివారం అల్పాహార విందులో సుదీర్ఘంగా చర్చించుకున్నారు. అధిష్టానం నుంచి అందిన ఆదేశాలో.. లేక ఇద్దరి మధ్య కుదిరిన సయోధ్యో.. మొత్తానికి తమ లక్ష్యం 2028 ఎన్నికల్లో గెలవడమేనని స్పష్టం చేశారు. కర్ణాటక సమస్యను పరిష్కరించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలాలు పలుమార్లు చర్చించి చివరికి నిర్ణయాన్ని ఆ పార్టీ అధినేత్రి సోనియాకి వదిలేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఢిల్లీలో సోనియా నివాసంలో కాంగ్రెస్ పార్లమెంటరీ సమావేశం జరిగింది. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అవుతున్న తరుణంలో అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది. ఇదే సమయంలో కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. శనివారం సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ద్వారా ప్రస్తుతానికి పరిస్థితిని శాంతింపజేసినట్లు నేతలు సోనియా దృష్టికి తీసుకొచ్చారు. కర్ణాటక రాజకీయ పరిణామాలపై మల్లికార్జున ఖర్గే సోనియా గాంధీకి ప్రత్యేకంగా నివేదించారు. ఓ వైపు పార్లమెంట్ సమావేశాలు, మరోవైపు కర్ణాటకలోని బెళగావిలో అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలోసీఎం, డీసీఎంలు చర్చించుకుని, కుర్చీ పోరుకు తాత్కాలికంగా స్వస్తి చెప్పేలా అధిష్టానం చక్రం తిప్పడంలో విజయం సాధించింది.

కలిసికట్టుగా పని చేస్తాం

తనకు సీఎం సిద్ధరామయ్యతో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. బెంగళూరులోని తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు తమపై ఆశలు పెట్టుకున్నందున, తామంతా కలసికట్టుగా పని చేయాల్సి ఉందన్నారు. 2028 ఎన్నికలే తమ లక్ష్యం అని చెప్పారు. 'నేను ఏనాడూ గ్రూపు రాజకీయం చేయను. ఎప్పుడూ ఢిల్లీకి ఒక్కడినే వెళతాను. 140 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా నాయకులే. ఎవరినీ చిన్నచూపు చూడను. గతంలో కుమారస్వామి ప్రభుత్వాన్ని కాపాడేందుకు ఆఖరిరోజు వరకు ఎంతో ప్రయత్నం చేశాననేది ఆయన తండ్రికి తెలుసు. ఇప్పుడు విమర్శలు చేస్తుంటే చేసుకోనీ. నేను కోపగించుకోను. ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌తో చర్చించిన విషయాలు బయటకు చెప్పలేను' అని తెలిపారు.

పునర్విభజన చిచ్చురేపిన చంద్రబాబు

చంద్రబాబు సర్కారుపై మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం

- నెల్లూరు జిల్లా ప్రజలకు ద్రోహం
- ఎన్నికల ముందు గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ
- ఇప్పుడు 3 మండలాలను తిరుపతి జిల్లాలో చేరుస్తూ డ్రాఫ్ట్ విడుదల

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలన్న నిర్ణయంతోపాటు, గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేయకుండా చంద్రబాబు చిచ్చురేపారని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. పునర్విభజన నిరసన జ్వాలలు, మంటలు చెలరేగుతున్నాయన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పునర్విభజన విషయంలో ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన మాటకు, ఇప్పుడు చేస్తున్నదానికి సంబంధం లేదని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 కంటే ముందు పాదయాత్రలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లా చేస్తామని స్పష్టంగా ప్రకటించారని, ఆ మేరకు జిల్లాలను 13 నుంచి 26కు పెంచారని గుర్తుచేశారు. భౌగోళిక పరిస్థితులు, స్థానిక వనరులు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు జిల్లాల పునర్విభజన చేశారని చెప్పారు. విశాఖ ఏజెన్సీలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా అల్లూరి సీతారామరాజు జిల్లాను ప్రత్యేక జిల్లాగా ప్రకటించడంతో మొత్తం 26 జిల్లాలు ఏర్పడ్డాయన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఉన్నప్పటికీ భౌగోళికంగా నెల్లూరు నగరం చుట్టూ ఉండడంతో విభేదాలకు తావులేకుండా చేశారని చెప్పారు. నెల్లూరు జిల్లాకు భవిష్యత్‌లో ఇబ్బందులు, ప్రాంతాల మధ్య వివాదాలు తలెత్తకుండా వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను మాత్రం నెల్లూరు జిల్లాలో చేర్చారన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు కందుకూరును ప్రకాశం జిల్లాలోకి, గూడూరును నెల్లూరు జిల్లాలోకి విలీనం చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపినా.. గూడూరును మాత్రం తిరుపతి జిల్లాలోనే ఉంచడంతోపాటు నెల్లూరు జిల్లాలో ఉన్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీచేశారని చెప్పారు.

నీటి తగాదాలకు తెరతీసిన చంద్రబాబు

నెల్లూరు జిల్లాలో ఉన్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతిలో కలిపితే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అతిపెద్ద జలాశయాలైన సోమశిల, కండలేరు రెండూ నెల్లూరు జిల్లాలోనే ఉన్నాయని, సోమశిల జలాశయం నుంచి కండలేరుకు నీళ్లు వదిలితే, కండలేరు నుంచి నెల్లూరు జిల్లాలో ఉన్న మనుబోలు, పొదలకూరు ప్రాంతాలకు సాగునీరు అందించే పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల నీటియాజమాన్య హక్కులు కలిగిన మనుబోలుతోపాటు పొదలకూరు మండలం, కండలేరు లెఫ్ట్ కెనాల్ ద్వారా వెంకటాచలం మండలంలోని పాలిచర్లపాడు వరకు నీటికోసం రెండు జిల్లాల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉంటుందని చెప్పారు. చంద్రబాబు నిర్ణయం రైతులు, ప్రాంతాల మధ్య చిచ్చురేపుతుందన్నారు. హేతుబద్ధత లేకుండా చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం రైతుల మధ్య కొట్లాటకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సర్వేపల్లిని నెల్లూరు జిల్లాలో ఉంచాలని లేఖరాశానని చెప్పిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇప్పుడు అధికారం పక్షంలో ఉండి కూడా లేఖరాశానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై మేధావులు స్పందించాలి

వెంకయ్యనాయుడు, జేపీ లాంటి వారు వేదికలపై మాట్లాడాలి

- లేదంటే భవిష్యత్ తరాలకు తీరని నష్టం
- ప్రొద్దుటూరులో లక్ష సంతకాలు పూర్తిచేశాం
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

లక్ష సంతకాల పత్రాలను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : సీఎం చంద్రబాబు చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మేధావులు స్పందించకపోతే భవిష్యత్తు తరాలకు తీరని నష్టం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా లక్ష సంతకాలు పూర్తిచేసిన సందర్భంగా ఆదివారం ఆయన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, డా. జయప్రకాష్ నారాయణ లాంటి మేధావులు వేదికలపై మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రసంగించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే వీరు ఈ విషయంపై అస్సలు మాట్లాడటంలేదని, దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని రాచమల్లు చెప్పారు. ఇది కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సమస్య కాదని.. ఈ అంశాన్ని రాజకీయంగా కాకుండా సామాజిక కోణంలో చూడాలని ఆయన సూచించారు. రాచమల్లు ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు సిగ్గుపడాలి..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణవల్ల ప్రతిభగల విద్యార్థులకు ఉచితంగా సీట్లు దొరికే అవకాశం ఉండదు. అందరి ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని వైఎస్ జగన్ 17 మెడికల్ కాలేజీలను మంజూరుచేసి అందులో కొన్నింటిని నిర్మించారు. నిజానికి గతంలో ఎవరూ ఇన్ని తీసుకురాలేదు. ప్రతీవారం సీఎం చంద్రబాబు చేసే అప్పుల్లో కేవలం రూ.నాలుగైదు వేల కోట్లు ఖర్చుపెడితే ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పూర్తిచెయ్యొచ్చు. సీఎం చంద్రబాబు వీటిని ప్రాథమిక బాధ్యతగా భావించి యుద్ధప్రాతిపదికన వీటి నిర్మాణం పూర్తిచేయాలి. వీటివల్ల ఆటో కార్మికులు, బేల్దారి పనిచేసే వారు, హమాలీల పిల్లలకు వాటిల్లో చదివే అవకాశం దొరుకుతుంది. పూర్తిగా జగన్‌పై కక్షతోనే.. ఆయనకు పేరొస్తుందన్న అక్కసుతోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను గాలికొదిలేశారు. ఏంచెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ఇందుకు బాబు సిగ్గుపడాలి.

ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించారు

ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలతో వైఎస్ రాజశేఖరరెడ్డి చరిత్రలో నిలిచిపోయారు. ఎంతోమంది నిరుపేదలు ఆరోగ్యశ్రీతో గుండెజబ్బుల ఆపరేషన్లు చేయించుకుని జీవిస్తున్నారు. పేద పిల్లలూ ఉన్నత చదువులు చదివారు. చంద్రబాబు ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా ఆరోగ్యశ్రీని అటకెక్కించారు. దీంతో ఆస్పత్రుల వద్ద ఆరోగ్యశ్రీ లేదని బోర్డులు పెట్టే పరిస్థితి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సక్రమంగా చెల్లించడంలేదు. బాబు 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో నాలుగోసారి సీఎంగా ఉన్నారు. అసలు ఇప్పటివరకు ఆయనకు మెడికల్ కాలేజీలు నిర్మించాలన్న ఆలోచన ఎందుకు రాలేదు?

లక్ష సంతకాలు పూర్తిచేశాం..

ఇక మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గాంధేయ మార్గంలో చేపట్టాలని పార్టీ నేతలను ఆదేశించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని 41 వార్డులతోపాటు నియోజకవర్గంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. ఒక్కో పుస్తకంలో 200 సంతకాలతో మొత్తం 500 పుస్తకాలను పూర్తిచేశాం. వాస్తవానికి అన్ని నియోజకవర్గాల్లో 50 వేల నుంచి 60 వేలు సంతకాలు చేయించాలని పార్టీ సూచించగా, ఇక్కడొక్క చోటే లక్ష సంతకాలు పూర్తిచేయడంతో నియోజకవర్గం అందరికీ ఆదర్శంగా ఉంది. డిసెంబరు 10న పార్టీ హైకమాండ్‌కు వీటిని అందిస్తాం.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 14 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. శనివారం అర్ధరాత్రి వరకు 79,791 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,911 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

ఆన్‌లైన్‌లో బోయకొండ గంగమ్మ దర్శనం టికెట్లు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దేవస్థానానికి వచ్చే యాత్రికులకు సౌకర్యంగా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు, ప్రసాదాలు, వివిధ సేవలు పొందవచ్చని ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా కూడా ఆలయ సేవలు పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మన మిత్ర వాట్సాప్ నెంబరు 9552300009 తోపాటు https://www. aptemples.org వెబ్‌సైట్ ద్వారా ఆలయ సేవలు పొందవచ్చని చెప్పారు. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు ప్రత్యేక కౌంటర్‌లో ఆధార్ కార్డులను పరిశీలించి దర్శనానికి అనుమతించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. దర్శనం, ప్రసాదాలు, వసతి సముదాయం కోసం ఆసక్తిగల భక్తులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఆలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి సేవలో పీఠాధిపతి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పాదరాజ మఠం పీఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామీజీ సేవించుకున్నారు. బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయనకు టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, డిప్యూటీ ఈఓ లోకనాథం స్వాగతం పలికారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చలి లోగిలి

మాడగడ వ్యూపాయింట్‌కు కాలినడకన వస్తున్న పర్యాటకులు

చలిలో థింసా నృత్యం చేస్తూ ఉపాధి పొందుతున్న గిరి మహిళలు

అరకు పైనరీలో మంట కాగుతున్న పర్యాటకులు

దట్టంగా కురుస్తున్న మంచు

వణికిస్తున్న చలిగాలులు

- అరకు పరిసర ప్రాంతాల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అవస్థలు పడుతున్న స్థానికులు
- ఎంజాయ్ చేస్తున్న పర్యాటకులు
- సందర్శకుల రాకతో భారీగా వ్యాపారం
- వేల సంఖ్యలో కుటుంబాలకు ఉపాధి

మంచు.. ప్రకృతి అందాలకు వన్నెలద్దుతూ.. వేల కుటుంబాలకు జీవనోపాధి నిస్తోంది. కేవలం మూడు నుంచి నాలుగు నెలల్లో వచ్చే ఆదాయం ఆయా కుటుంబాలకు ఏడాది పొడవునా భరోసా కల్పిస్తోంది. అల్లూరి జిల్లాలో అక్టోబర్ నుంచి జనవరి వరకు ఉష్ణోగ్రతలు తగ్గిపోతుంటాయి. మంచు దట్టంగా కురుస్తూ ఉంటుంది. మంచు తెరల అందాలతో మన్యం రూపురేఖలు పూర్తిగా మారిపోతుంటాయి. ఒక్కసారైనా ఈ అందాలను తిలకించాలన్న ఆశతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివస్తుంటారు. ఇలా వేల సంఖ్యలో రావడం వల్ల అదే స్థాయిలో వ్యాపారం జరుగుతుంది.

అరకులోయ టౌన్: అల్లూరి జిల్లా మన్యంలో ఈ ఏడాది కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో పర్యాటకుల పెరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. మంచు ఉదయం 9 గంటల వరకు కురుస్తోంది. పర్యాటక ప్రాంతాలను సందర్శించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రైవేట్ రిసార్టులు, అనుబంధ రంగాలు, పర్యాటక శాఖకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. కేవలం ఇదంతా మంచుపైనే ఆధార పడి ఉందంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. పర్యాటకులు మాత్రం పక్రృతి ఒడిలో అద్భుత అందాలను తిలకిస్తూ ఎంజాయ్ చేస్తుంటారు. సందర్శకుల్లో ఎక్కువ శాతం లాడ్జీలు, రిసార్టుల్లో కాకుండా క్యాంపెయిన్ టెంట్లలో బస చేస్తుండటంతో ఎంతోమందికి ఉపాధి నిస్తోంది.

అదనపు అందాలు

ఈ ప్రాంతంలో గిరిరైతులు పండించే వలిసె, పొద్దు తిరుగుడు పూలు మంచు సొగసుకు అదనపు అందాలు అద్దుతున్నాయి. పొగమంచులో అబ్బురపరుస్తున్న సోయగాల మధ్య ఫొటోలు తీసుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. క్యాంపెయిన్ టెంట్ల వద్ద ఫైర్ క్యాంప్‌లకు కట్టెలు కొనుగోలు చేయడం వల్ల రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. కబాబ్, చికెన్, బాంబు బిర్యానీ అమ్మకాలు భారీగా జరగడం వల్ల వందల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

కనిష్ట ఉష్ణోగ్రతలిలా..

పర్యాటక కేంద్రం అరకులోయలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 9గంటల వరకు మంచు దట్టంగా కురుస్తుండటంతో పర్యాటకులు ఎంజాయ్ చేస్తున్నారు. నవంబర్ 14 నుంచి సింగిల్ డిజిట్ నమోదు అవుతున్నాయి. 14న 7.3, 15న 7.0, 16న 7.4, 17న 6.7, 18న 7.6, 19న 8.3, 26న 8.6, 27న 8.5, 28న 6.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

వలిసె పూల తోటల వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

అరకు రైల్వే ట్రాక్ వద్ద ఆకట్టుకుంటున్న మంచు అందాలు

ఉన్నికి చాటుకుంటూ..

ముంచంగిపుట్టు: జిల్లాలో చలితీవ్రత పెరగడంతో మన్యంవాసులు రక్షణ పొందేందుకు రగ్గులు, స్వెట్టర్లు, శాలువాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వీటి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మండలంలో ముంచంగిపుట్టు, జోలాపుట్టు, లక్ష్మీపురం, భూసిపుట్టు, బంగారుమెట్ట వారపు సంతల్లో వ్యాపారం భారీగా జరుగుతున్నాయి. వీటి ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నందున కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. పిల్లల స్వెట్టర్లు రూ.250 నుంచి రూ.600, పెద్దలకు రూ.400 నుంచి రూ.1500, శాలువాలు రూ.100 నుంచి 500, స్కార్ఫ్‌లు రూ.50 నుంచి రూ.150, మంకీ క్యాప్‌లు రూ.100 నుంచి 200, బ్లాంకెట్‌లు రూ.300 నుంచి రూ.500 ,గ్లౌజులు రూ.100 నుంచి రూ.150, రగ్గులు రూ.600 నుంచి రూ.3వేల ధరకు అమ్ముతున్నారు. వారపు సంతల్లో వీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. చలినుంచి రక్షణ ఇచ్చే దుస్తులు ఆకర్షణీయమైన రంగులతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.

ముంచంగిపుట్టులో స్వెట్టర్లు, రగ్గుల అమ్మకాలు

తక్కువ ధరలు

సంతల్లో అమ్ముతున్న స్వెట్టర్లు, జర్కెన్లు, మంకీ క్యాప్‌ల ధరలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. మంచి రంగులు, డిజైన్లలో లభ్యమవుతున్నాయి. చలి నుంచి రక్షణకు మంచిగా ఉపయోగపడుతున్నాయి.

– జి.జయరాం, కుమ్మరిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

వ్యాపారం బాగుంది

చలి పెరగడం వల్ల వ్యాపారం జోరుగా సాగుతోంది.అన్ని రకాల డిజైన్లలో దుస్తులు ఉన్నాయి.వినియోగదారులను ఆకట్టుకునేందుకు కాస్తంత తక్కువ ధరలతో నాణ్యమైన వ్యాపారం చేస్తున్నాం.లాభసాటిగా ఉంది.

– పి.రాజారావు, వ్యాపారి, జోలాపుట్టు, మంచంగిపుట్టు మండలం

ఆలస్యంగా పర్యాటకుల రాక

సన్‌రైజ్ వ్యూ పాయింట్ వద్ద ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది చలి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఉదయం 5 గంటలకే వచ్చే పర్యాటకులు ఈ ఏడాది 7 గంటల తరువాత వస్తున్నారు.

– బారికి సుమన్, గిరిజనుడు, మాడగడ, అరకులోయ

ఈ ఏడాది చలి బాగా ఎక్కువ

గతంలో ఎప్పుడు ఇంత చలి లేదు. ఈ ఏడాది చలికి బయటకు వచ్చేందుకు సాహసించలేకపోతున్నాం. అత్యవస పరిస్థితి అయితే తప్పా ఉదయం 8 గంటలు దాటితేనే బయటకు వస్తున్నాం.

– గెద్దం నర్సింగరావు, మందులషాపు యజమాని, అరకులోయ

టిప్పర్లకు మట్టి నింపుతున్న హిటాచీలు

రూ. కోట్ల మట్టి.. కొల్లగొట్టి!

దళవాయి చెరువులో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

మూడు నెలలుగా యథేచ్ఛగా తరలింపు

- హైవే పేరిట అక్రమ రవాణా
- గుట్టుగా ఇటుక బట్టీలకు విక్రయం
- ప్రమాదకర స్థితికి చేరిన చెరువు కట్ట
- 32 పంచాయతీలకు పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికారులు
- మొత్తం వ్యవహారం నడిపిస్తున్న బీజేపీ నేత

అక్రమార్జనే లక్ష్యంగా తిరుపతి జిల్లాలో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. ప్రకృతి వనరులను ఎవరికి దొరికింది వారు దోచుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. అందులో భాగంగా ఓ బీజేపీ నేత ఆబగా దళవాయి చెరువుపై పడి ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. జాతీయ రహదారి పనుల పేరిట భారీ యంత్రాలతో గ్రావెల్ తరలించేస్తున్నారు. వందలాది టిప్పర్లతో యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. పగలు హైవే నిర్మాణానికి.. రాత్రివేళ ఇటుక బట్టీలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కేవలం మూడు నెలల్లోనే దాదాపు రూ.15 కోట్ల మట్టిని కొల్లగొట్టేశారు. ఇదెక్కడి అన్యాయమని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. కళ్లెదుటే చెరువు గుంతలమయంగా మారిపోతున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

చంద్రగిరి : తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె పంచాయతీ దళవాయి చెరువును బీజేపీ నేత ఒకరు కబళించేస్తున్నారు. ఇటీవల ఆయన పూతలపట్టు–నాయుడు జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి 8 కిలోమీటర్ల పనులకు కాంట్రాక్టు పొందాడు. తిరుచానూరు నుంచి బాలాజీ డెయిరీ వరకు గ్రావెల్ తరలింపు పనులను ఒప్పుకున్నాడు. దీంతో ఆ నేత చూపు దళవాయి చెరువుపై పడింది. సుమారు మూడు నెలలుగా పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఎర్రమట్టిని తరలించేస్తున్నారు.

అనుమతులు లేకుండానే..!

దళవాయి చెరువు నుంచి రహదారి పేరిట తరలిస్తున్న ఎర్రమట్టికి సంబంధించి సదరు బీజేపీ నేత ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. అయినప్పటికీ పట్టపగలే గ్రావెల్ దోచుకెళుతుంటే రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు బీజేపీ నేత భారీగా ముడుపులు చెల్లించి అధికారుల నోరు మూయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కట్ట తెగితే ముప్పు తప్పదు

బీజేపీ నేత మట్టి దోపిడితో దళవాయి చెరువు ప్రమాదకర స్థితికి చేరుకుంది. 40 అడుగుల మేర గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువు నిండితే కట్ట తెగిపోయే పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్ట తెగితే పెరుమాళ్ల పల్లె, పుదిపట్ల, చెర్లోపల్లె, పేరూరు చెరువులకు వరద ముప్పు తప్పదు. అలాగే తిరుచానూరు వరకు సుమారు 32 పంచాయతీలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.. గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోయే అవకాశముందని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల కేవీబీపురం మండలం ఒళ్లూరు వద్ద రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో రెండు ఊళ్లు దెబ్బతిన్న విషయం గుర్తుచేస్తున్నారు. ఆ అనుభవాల నుంచి అధికారులు పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరముందని సూచిస్తున్నారు.

మట్టిని తరలించేందుకు శేషాచలం నుంచి వచ్చే నక్కలవాగు కాలువను పూడ్చివేసిన దృశ్యం

శ్రీనివాసమంగాపురం వద్ద దూసుకెళుతున్న టిప్పర్లు

పగలు ఇటు.. రాత్రి అటు!

హైవే విస్తరణ పనులకు మట్టిని తరలిస్తున్నట్లు కలరింగ్ చేస్తున్న ఆ బీజేపీనే త రాత్రుల్లో నిరంతరాయంగా మల్లవరం నుంచి చెర్లోపల్లె వరకు ఉన్న ఇటుక బట్టీలకు గ్రావెల్ సరఫరా చేస్తున్నట్లుగా సమాచారం. ఇటుక బట్టీలకు టిప్పరు మట్టిని రూ.6వేలకు విక్రయిస్తున్నట్లుగా బట్టీల యజమానులు బహిరంగంగానే చెబుతున్నారు. తాను ఏదో సేవ చేస్తున్నట్లుగా ఆ నాయకుడు చెప్పుకుంటూ ఇలా సహజ వనరులను దోచేస్తుండడంపై స్థానికులు మండిపడుతున్నారు.

చుట్టూ మట్టిని తవ్వేయడంతో ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభం

గుంతలమయంగా చెరువు

మట్టిని తవ్వేయడంతో గోతుల్లో చేరిన వర్షపు నీరు

దళవాయి చెరువులో మట్టి తవ్వకాలతో సదరు బీజేపీ నేత రూ.కోట్లు వెనకేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 40 అడుగుల మేర భారీ తవ్వకాలను చేపట్టడంతో చెరువు గుంతలమయంగా మారిపోయింది. రెండు హిటాచీలతో లోతుగా తవ్వేస్తూ, నిత్యం 150కు పైగా టిప్పర్ల మట్టిని తరలించేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ప్రకారం టిప్పర్ మట్టి సుమారు రూ.4వేలు ఉండగా, రోజుకు రూ.6లక్షల మేర అక్రమార్జన సాగిస్తున్నారు. ఈ లెక్కన మూడు నెలల కాలంలో ఏకంగా రూ.15కోట్ల మేర అక్రమంగా మట్టిని స్వాహా చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

దళవాయి చెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఈ చెరువు నుంచి భారీగా మట్టి తరలిపోతున్నట్లు మాకు సమాచారం అందింది. వెంటనే చెరువును పరిశీలించి, గ్రావెల్ అక్రమ తవ్వకం, రవాణాను అడ్డుకుంటా. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, ఇరిగేషన్ డీఈ

ఐఐటీ విద్యార్థులకు క్రీడా పోటీలు

ఏర్పేడు: భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ(ఐఐటీ) 58వ ఇంటర్ స్పోర్ట్స్ మీట్ ఈనెల 14వ తేదీ నుంచి 9 రోజులపాటు తిరుపతి ఐఐటీ వేదికగా జరగనున్నాయి. తిరుపతి ఐఐటీతో పాటు మద్రాస్, హైదరాబాద్ ఐఐటీలు వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో జరిగే ఈ వేడుకల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ భారతీయ రెజ్లర్ సతీష్ శివలింగం హాజరుకానున్నారు. దేశంలోని 23 ఐఐటీల నుంచి 5 వేలమందికి పైగా విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షకు విశేష స్పందన

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా తాము ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) ఉచిత నమూనా పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నరోత్తమరెడ్డి, అధ్యక్షుడు చింతల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 30 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. వర్షాల వల్ల పలుచోట్ల నిలిపివేసిన పరీక్షను.. సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో రాసేందుకు ఆసక్తి ఉన్నవారు 95027 66455 లేదా 99484 37301 నంబర్లకు 'ఎన్ఎంఎంఎస్' అని పంపి లింక్ పొందవచ్చని సూచించారు.

కరుణించు మంగమ్మతల్లి

గుబ్బల మంగమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరు పొందిన ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అలంకరణతో ఉన్న మంగమ్మవారిని దర్శించుకున్న భక్తులు పరమానంద భరితులయ్యారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 5 వేల వరకు భక్తులు తరలివచ్చి దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీవారి క్షేత్రంలో తగ్గని భక్తుల రద్దీ

అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి తరలివచ్చారు. దాంతో దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు, కల్యాణకట్ట, నిత్యాన్నదాన భవనం, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, పరిసర ప్రాంతాలు భక్తులతో పోటెత్తాయి. అనివేటి మండపంలో పలు భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

పెద్దింట్లమ్మా.. నీ చరణములే గతి

కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థాన ధ్వజస్తంభం వద్ద భక్తులు

కై కలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ పాద చరణములే గతి అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. ఏలూరు జిల్లా కై కలూరు మండలం కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మను సమీప జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు పాలపొంగళ్లు సమర్పించారు. అనేక కుటుంబాలు నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం మద్ది క్షేత్రంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా హోమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనరు ఆర్‌వీ చందన పర్యవేక్షించారు. స్వామిని కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎం.అనురాధ కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి దర్శించుకున్నారు.

హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు

ఉత్కంఠంగా సాగుతున్న బేస్‌బాల్ పోటీలు

పలమనేరు : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 69వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్ర స్థాయిలో సాగుతున్న బేస్‌బాల్ అండర్–14 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఈ పోటీలకు 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆదివారం జరిగిన బాలుర పోటీల్లో శ్రీకాకుళంపై విజయనగరం, వెస్ట్ గోదావరిపై ఈస్ట్ గోదావరి, ప్రకాశం జట్టుపై చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. నేడు జరిగే పోటీల్లో బాలికల విభాగంలో చిత్తూరు–అనంతపూర్, శ్రీకాకుళం–ఈస్ట్‌గోదావరి, గుంటూరు– విజయనగరం, కడప–వైజాగ్ జట్ల మధ్య క్వార్టర్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆపై సెమీస్, ఫైనల్స్ ఉంటాయన్నారు. ఇందులో నిర్వాహకులు బాబు, సాంబశివ, శశి, ప్రకాష్, స్థానిక హెచ్ఎం షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఐటీలో 8వ ఐఎల్‌సీసీ సమావేశం

తిరుపతి ఐఐటీ

ఏర్పేడు: ఏర్పేడు సమీపంలో ఉన్న తిరుపతి ఐఐటీలో సోమవారం నుంచి మూడు రోజులు 8వ ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సీసీ)–2025 సమావేశం నిర్వహించనున్నట్టు డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా దేశంలో నిర్మాణ రంగంలో వ్యర్థాలను తొలగించడం, సుస్థిరత, డిజిటలైజ్డ్ ప్రాజెక్టు డెలివరీ సాధన తదితరాలపై చర్చ ఉంటుందని తెలిపారు. ఇందులో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొని సమావేశాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు.



లుంబిని నుంచి కుశినగర వరకు...
సమ్యక్ పర్యటన

బుద్ధుడికి జన్మనిచ్చిన లుంబినివనం.. సిద్ధార్థుడికి జ్ఞానోదయమైన బోధ్‌గయ.
తొలి అష్టాంగమార్గాన్ని విన్న సారనాథ్.. సారనాథ్‌లో శ్రీలంక చైత్యం మూలగంధకుటి.
బౌద్ధానికి రాజ గౌరవాన్నిచ్చిన రాజగృహ.. బుద్ధుడి ప్రకృతి విహారకేంద్రం వేణువనం.
సమ్యక్ జీవనసాఫల్య క్షేత్రం శ్రావస్థి.. చివరి ప్రబోధాన్ని విన్న మాతాకుటీర్.
బుద్ధుని అవశిష్ఠ నిర్మాణం రామభార్ స్థూప.. బుద్ధుడి తుదిశ్వాసకు మౌనసాక్షి కుశినగర.
ఒకే పర్యటనలో వీటన్నింటినీ చూడాలంటే... ఐఆర్‌సీటీసీ బుద్ధిస్ట్ సర్క్యూట్ టూరిస్ట్ ట్రైనెక్కాలి.

1 రోజు ఢిల్లీ నుంచి గయకు ప్రయాణం. మధ్యాహ్నం ఒంటిగంటకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వేస్టేషన్‌కి చేరాలి. చిన్న వెల్‌కమ్ తర్వాత 'బుద్ధిస్ట్ సర్క్యూట్ టూరిస్ట్ ట్రైన్' ఎక్కాలి. ట్రైన్ రెండున్నరకు బయలుదేరుతుంది. రాత్రి ఎనిమిది గంటలకు భోజనం రైల్లోనే అందిస్తారు. ప్రయాణం కొనసాగుతుంది.

2 రోజు రైలు ప్రయాణం కొనసాగుతుంటుంది. రైల్లో ఉదయం టీ, రిఫ్రెష్‌మెంట్ తర్వాత బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. గయకు చేరిన తర్వాత రైలు దిగి బోధ్‌గయకు ప్రయాణం. బోధ్‌గయలో హోటల్ గదిలో చెక్ ఇన్. కొంత సేపు విశ్రాంతి తర్వాత బోధగయ విహారం, మహాబోధి వృక్షం, మహాబోధి ఆలయ దర్శనం, నిరంజన నది తీరాన విహారం. బోధ్‌గయలోని థాయ్ టెంపుల్, జపనీస్ టెంపుల్, బుద్ధ విగ్రహ వీక్షణం. రాత్రి భోజనం, బస హోటల్లో.

నిరాడంబరం సుసంపన్నంగా

బోధగయలో చూడాల్సిన ప్రదేశాల్లో ప్రధానమైనది బోధివృక్షం. దాన్ని మహాబోధి అంటారు. బుద్ధుడికి జ్ఞానోదయమైన ప్రదేశం ఇది. ఇక్కడ మహా ఆలయ నిర్మాణం జరిగింది. అదే మహాబోధి ఆలయం. ఈ ఆలయానికి ఓ అరకిలోమీటరు దూరాన మాయా సరోవర్ తీరాన ఉంది వాట్‌థాయ్ టెంపుల్. బోధ్‌గయలోని వివిధ బౌద్ధాలయాన్నీ దేనికదే ప్రత్యేకమైన నిర్మాణశైలితో ఆకర్షణీయంగా ఉంటాయి. నిరాడంబరతను ఇంత సుసంపన్నంగా వ్యక్తం చేయవచ్చా అని ఆశ్చర్యం కూడా కలుగుతుంది. ఇది 1956లో థాయ్‌లాండ్ ప్రభుత్వం నిర్మించిన ఆలయం. భారత్– థాయ్‌లాండ్ దేశాల మధ్య మంచి సంబంధాలు నెలకొల్పాలనే ఉద్దేశంతో ప్రధాని నెహ్రూ కోరిన మీదట థాయ్ ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని చేపట్టింది. బంగారు పూత పై కప్పు నిర్మాణంలోని సునిశితత్వం అబ్బురపరుస్తుంది. ఈ ఆలయానికి సమీపంలో ఎనభై అడుగుల గ్రేట్ బుద్ధ స్టాట్యూ ఉంది. ధ్యాన ముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహంలో శిల్పనైపుణ్యం అద్భుతం. ఇక జపనీస్ టెంపుల్ ఇండోసాన్ నిప్పన్ జపనీస్ టెంపుల్ ప్రశాంతతకు ప్రతీకలా ఉంటుంది.

3 రోజు బోధ్‌గయ నుంచి నలంద, రాజ్‌గిర్, గయ, వారణాసికి ప్రయాణం. ఉదయం బోధ్‌గయలోని హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తర్వాత చెక్ అవుట్ చేసి రాజ్‌గిర్ వైపు సాగిపోవాలి. రాజ్‌గిర్‌లో బింబిసార జైల్, గ్రద్ధకూట పర్వతం, వేణువన్ పర్యటన తర్వాత లంచ్‌కి హోటల్‌కి రావాలి. భోజనం తర్వాత నలందకు ప్రయాణం. నలందలో యూనివర్సిటీ శిథిలాల వీక్షణం, నలంద మ్యూజియం సందర్శనం తర్వాత గయకు ప్రయాణం. గయ రైల్వేస్టేషన్‌కు చేరి 'బుద్ధిస్ట్ సర్క్యూట్ టూరిస్ట్ ట్రైన్' రైలెక్కాలి. రైలు వారణాసికి వైపు సాగిపోతుంది. రాత్రి భోజనం రైల్లోనే.

భీమ - జరాసంధుల యుద్ధక్షేత్రం

రాజ్‌గిర్ అసలు పేరు రాజగృహ. ప్రాచీనకాలం నాటి నివాస ప్రదేశం. మహాభారత కాలంలో జరాసంధుని రాజ్యం గిరివ్రజ ఇదే. భీముడితో జరాసంధుడు యుద్ధం చేసిన ప్రదేశం. మగధ రాజ్యానికి కొంతకాలం రాజధాని కూడా. రాజు నివసించే నగరం కావడంతో రాజగృహ అనే పేరు వచ్చింది. బుద్ధుడు తొలి బోధన సారనాథ్‌లో చేశాడు. రాజగృహలో రాజుల సమావేశంలో బోధన చేయడంతో బౌద్ధానికి విశేషమైన ప్రచారం వచ్చింది. సామాన్యులతో పాటు మగధ సామ్రాజ్య స్థాపకుడు బింబిసారుడికి కూడా బుద్ధుడు ఇక్కడే బోధనలు చేశాడు. రాజ్‌గిర్ విశ్వశాంతి స్తూపం నుంచి కనిపించే గ్రద్ధకూట పర్వతం మీద బుద్ధుడు కొంతకాలం ధ్యానం చేసుకున్నాడు. జైన 24వ తీర్థంకరుడు మహావీరుడు కూడా కొంతకాలం ఇక్కడ నివసించాడు. బింబిసారుడిని అతడి కొడుకు అజాతశత్రు జైలులో బంధించాడు. ఆ జైలు ఇక్కడికి దగ్గరలోనే ఉంది. బుద్ధుడు రాజ్‌గిర్‌లో నివసించిన కాలంలో పగలంతా బోధనలు చేస్తూ సాంత్వన కోసం సమీపంలోని వేణువన్‌లో సమయం గడిపేవాడు.

నాటి సరస్వతి నిలయం

నలంద ప్రపంచంలోనే తొలి రెసిడెన్సియల్ యూనివర్సిటీ. బౌద్ధ మహావిహార పేరుతో విలసిల్లింది. క్రీ.శ ఐదవ శతాబ్దం నుంచి పన్నెండవ శతాబ్దం వరకు విద్యార్థులతో కళకళలాడింది. ఈ నిర్మాణాన్ని పరిశీలిస్తే నిర్మాణంలో అనుసరించిన ఇంజనీరింగ్ స్కిల్ అబ్బురపరుస్తుంది. విద్యార్థులకు ఒక్కో గది, పుస్తకాలు దుస్తులకు అరలు ఉన్నాయి. నీరు వెలుపలకు వెళ్లడానికి నిర్మాణంలోనే పైపుల ఏర్పాటు ఉంది. జానపద కథల్లో చంద్రుడి వెలుతురు పడి ప్రకాశించే చంద్రశిలలను ఇక్కడ చూడవచ్చు. అతి పెద్ద లైబ్రరీలోని గ్రంథాలను రాశిపోసి భక్తియార్ ఖిల్జీ తగుల పెట్టాడని చెబుతారు. గ్రంథాలు తగలబడిన చోట ఇటుకలు నల్లగా మాడిపోయి ఉన్నాయి. నలందలో మహావిహార తర్వాత ఆర్కియలాజికల్ మ్యూజియం. సూర్యమందిర్, చైనా యాత్రికుడు హ్యూయాన్ త్సాంగ్ మందిరాలను చూడవచ్చు.

4 రోజు వారణాసి నుంచి సారనాథ్, నౌతన్వాకు ప్రయాణం. గయ నుంచి వారణాసికి వస్తున్న రైల్లో ఉదయాన్నే టీ, బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. రిఫ్రెష్‌మెంట్ పూర్తి చేసుకుని వారణాసిలో రైలు దిగిన తర్వాత సారనాథ్‌కు ప్రయాణం. సారనాథ్‌లో ధమేక్ స్థూప, సారనాథ్ మ్యూజియం, అశోక పిల్లర్, మూలగంధకుటి విహార్‌కు ప్రయాణం. హోటల్‌లో చెక్ ఇన్, లంచ్ తర్వాత గంగానది తీరాన హారతి వీక్షణం. రాత్రికి రైల్వేస్టేషన్‌కు చేరి రైలెక్కాలి. రాత్రి భోజనం రైల్లోనే. రైలు నౌతన్వా వైపు సాగిపోతుంది. నౌతన్వా మనదేశంలో చివరి రైల్వేస్టేషన్.

సారనాథ్ బుద్ధుడు

బోధగయలో జ్ఞానోదయం అయిన తర్వాత బుద్ధుడు తొలి ప్రవచనాన్ని వెలువరించిన ప్రదేశం సారనాథ్. బౌద్ధానికి సంబంధించిన నమూనా చిత్రాల్లో బోధిచెట్టు కింద కూర్చున్న బుద్ధుడు, ఎదురుగా ఐదుగురు శిష్యులు ఉంటారు. అది సారనాథ్‌లో ఇచ్చిన ప్రవచనానికి ప్రతీకాత్మక చిత్రం. సారనాథ్‌లోని బౌద్ధ స్థూపం పేరు ధమేక్ స్థూపం. దానిని అధ్యయనం చేస్తే బౌద్ధ పరమార్థం అవగతమవుతుంది. భారత ప్రభుత్వం అధికారిక ముద్రగా స్వీకరించిన నాలుగు సింహాల పిల్లర్ ఇక్కడిదే. ఇక్కడి మ్యూజియం ఒక బౌద్ధ అధ్యయన కేంద్రం. నిర్వహణ కూడా బాగుంటుంది. మూలగంధ కుటీర్ నిర్మాణకౌశలంలో మహోన్నతమైనదనే చెప్పాలి. ఓ వందేళ్ల కిందట బుద్ధుడి అవశిష్టాన్ని ప్రతిష్ఠించి నిర్మించిన ఆలయం. ఇక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే ఇప్పుడు మనం చూసే బోధివృక్షం శ్రీలంలోని అనూరాధపురా నుంచి సేకరించిన ఒక బోధి మొక్క. బుద్ధుడికి జ్ఞానోదయం అయిన బోధగయ బోధివృక్షం నుంచి ఒక మొక్కను అశోకుడి కూతురు సంఘమిత్ర... అనూరాధపురాకు తీసుకువెళ్లింది. బోధ్‌గయలోని చెట్టు విధ్వంసం అయినప్పుడు అనూరాధపుర వృక్షం నుంచి సేకరించి తెచ్చిన మొక్కల్లో ఒకటి బోధ్‌గయలో మరొక దానిని సారనాథ్‌లో నాటారు.

5 రోజు ఉదయాన్నే టీ, బ్రేక్‌ఫాస్ట్ రైల్లోనే. నౌతన్వా రైల్వేస్టేషన్‌కు చేరిన తర్వాత రైలు దిగి నేపాల్‌లో ప్రవేశించి లుంబినికి చేరాలి. పర్యాటకులు పాస్‌పోర్ట్, వీసా దగ్గర ఉంచుకోవాలి. నేపాల్ వీసా లేని వాళ్లు ఆన్ అరైవల్ వీసా కోసం (అక్కడికి చేరిన తర్వాత జారీ చేసే వీసా) ఫీజు తోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ఉండాలి. లుంబినిలో హోటల్‌లో చెక్‌ఇన్, మధ్యాహ్న భోజనం తర్వాత లుంబిని సైట్ సీయింగ్. రాత్రి భోజనం, బస లుంబినిలో.

లుంబినిలో పుట్టాడు

నౌత్వానా రైల్వే స్టేషన్ చాలా చిన్న స్టేషన్. నిజానికి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన ప్రదేశం కాదు. కానీ భారత్– నేపాల్ సరిహద్దులో మనదేశం నిర్వహిస్తున్న చివరి స్టేషన్. నేపాల్‌కి వెళ్లాలంటే ఇక్కడ దిగి రోడ్డుమార్గాన సరిహద్దు ప్రదేశం సునౌలి దగ్గర పాస్‌పోర్ట్ మీద స్టాంప్ వేయించుకోవాలి. ఇక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే క్రీ.పూ 544లో బుద్ధుడు పుట్టిన లుంబినిలో ఉంటాం. లుంబిని బుద్ధుడు పుట్టిన ప్రదేశంలో మాయాదేవి ఆలయాన్ని నిర్మించారు. ధవళం మీద ప్రసరించిన కాంతి వెలుగులతో ప్రశాంతతకు చిహ్నంగా ఉంటుందీ ఆలయం. లుంబినిలో నిర్మించిన మహాస్థూపాన్ని వరల్డ్ పీస్ పగోడాగా గుర్తిస్తారు. లుంబిని మొత్తాన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది యునెస్కో.

6 రోజు లుంబిని హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్. కుశినగరకు ప్రయాణం. కుశినగరలో లంచ్ తర్వాత మహాపరినిర్వాణ టెంపుల్, రామ్‌భర్ స్థూప, మాతా కుటీర్ టెంపుల్‌తోపాటు ఇతర దర్శనీయ స్థలాల వీక్షణం. అక్కడి నుంచి గోరఖ్‌పూర్‌కు ప్రయాణం. గోరఖ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో 'బుద్ధిస్ట్ సర్క్యూట్ టూరిస్ట్ ట్రైన్' ఎక్కి బలరామ్‌పూర్‌కు సాగిపోవాలి. డిన్నర్ ట్రైన్‌లోనే. (శ్రావస్థికి వెళ్లడానికి)

బుద్ధుడి నిర్యాణం

నేపాల్‌లో పుట్టిన సిద్ధార్థుడు భారతదేశంలో బుద్ధుడయ్యాడు. ఎనభై ఏళ్లు జీవించిన తర్వాత భారతదేశంలోనే చివరి నిద్రకుపక్రమించాడు. ఉత్తరప్రదేశ్‌లోని కుశినగరలో బుద్ధుడు తుది శ్వాస వదిలిన చోట మహాపరి నిర్యాణ ఆలయాన్ని నిర్మించారు. దాని వెనుక నిర్వాణ చైత్య (పరినిర్వాణ స్థూప) ఉంది. ఇక్కడికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరాన బుద్ధుడి అవశిష్ఠంతో నిర్మించిన రామభార్ స్థూప కూడా గొప్ప ప్రాశస్త్యం కలిగిన బౌద్ధ నిర్మాణం. ఇక ఇక్కడ చూడాల్సిన వాటిలో మాతా కుటీర్ టెంపుల్ ముఖ్యమైనది. బుద్ధుడు తొలి ప్రవచనం ఇచ్చిన ప్రదేశం సారనాథ్ అయితే చివరి ప్రవచనం ఇచ్చిన ప్రదేశం మాతా కుటీర్ టెంపుల్.

7 రోజు ఉదయం టీ తాగిన తర్వాత బలరామ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగి శ్రావస్థికి ప్రయాణం. 15 కిమీల దూరం. శ్రావస్థిలో హోటల్ గదిలో చెక్ ఇన్. రిఫ్రెష్‌మెంట్ బ్రేక్‌ఫాస్ట్ తర్వాత సైట్ సీయింగ్‌కి బయలుదేరాలి. జేతవన విహార, పక్కి సెహాత్ మహేత్ వీక్షణం. మధ్యాహ్న భోజనం తర్వాత కొంత సేపు విశ్రాంతి. ఆ తర్వాత బలరామ్‌పూర్ రైల్వేస్టేషన్‌కు ప్రయాణం. రైలెక్కిన తర్వాత రైలు ఆగ్రాకు సాగిపోతుంది. రాత్రి భోజనం రైల్లో.

శ్రావస్థి... ప్రపంచ శాంతిరవం

శ్రావస్థి ప్రాచీన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశం, జనపదాల కాలంలో కోసల రాజ్యానికి రాజధాని నగరం. రాముడి కుమారుడు లవుడు పాలించిన నగరమని చెబుతారు. జ్ఞానోదయమైన తరవాత బుద్ధుడు చాలా కాలం ఈ ప్రదేశంలో నివసించాడు. బుద్ధుడి జీవితంలో అనేక అద్భుతాలు ఇక్కడే జరిగాయని చెబుతారు. వందలాది బోధనలు వెలువరించడంతో పాటు అనేక మందిని సమ్యక్ జీవనం వైపు ప్రభావితం చేసిన ప్రదేశం. నాటి చౌద్ధ జ్ఞాపకాల పునర్నిర్మాణాలను చూడవచ్చు. ఇక్కడ పర్యటించిన బౌద్ధులు శ్రావస్థి సమీపంలోని ఆనందబోధి వృక్షం కింద కొంత సేపు ధ్యానంలో గడుపుతారు. బౌద్ధం ఆకాంక్ష అయిన ప్రపంచ శాంతికి ప్రతీకగా ఇక్కడ ప్రపంచ శాంతి గంట ఉంది. ఈ ప్రదేశం బౌద్ధంతోపాటు జైనానికి కూడా ప్రత్యేకమైనదే.

జేతవన వీక్షణం

బుద్ధుడు ప్రవచనాలను బోధిస్తూ పర్యటిస్తున్న క్రమంలో వేణువనంలో కొంతకాలం నివసించిన తర్వాత జేతవనంలో నివసించాడు. ఇక్కడ పెద్ద విహారం ఉండేది. ఇప్పుడు మనం చూడగలిగింది ఆ విహారానికి ఆనవాలుగా మిగిలిన శిథిలాలను మాత్రమే. బుద్ధుడి కోసం ఈ విహారాన్ని నిర్మించింది శ్రావస్థి నగరంలోని సంపన్నుడైన వ్యాపారి ఆనంద పిండిక. బౌద్ధాన్ని స్వీకరించిన తర్వాత జీవితాన్ని సమాజసేవ కోసం అంకితం చేసిన ఆనంద పిండిక విశాలమైన స్థలాన్ని కొని విహారాన్ని నిర్మించాడు. ఈ ప్రదేశాన్ని శ్రావస్థి యువరాజు జేత పేరుతో జేతవనంగా పిలిచేవారు. అదే జేతవన విహారంగా వాడుకలోకి వచ్చింది.

8 రోజు ఉదయం టీ తర్వాత రైలు ఆగ్రాకు చేరుతుంది. రిఫ్రెష్‌మెంట్ తర్వాత బ్రేక్‌ఫాస్ట్ చేసి రైలు దిగి సైట్‌సీయింగ్‌కి వెళ్లాలి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తాజ్‌మహల్ వీక్షణం తర్వాత ఆగ్రా రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలెక్కాలి. మధ్యాహ్న భోజనం రైల్లోనే. 'బుద్ధిస్ట్ సర్క్యూట్ టూరిస్ట్ ట్రైన్' సాయంత్రం టీ తర్వాత ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. టూర్ నిర్వాహకులు పర్యాటకులకు వీడ్కోలు చెబుతారు.

బియాండ్ ద తాజ్!

తాజ్‌మహల్ రకరకాల వాస్తుశైలిల సమ్మిళితం. ఇండో– ఇస్లామిక్ నిర్మాణ శైలికి మొఘల్ ఆర్కిటెక్చర్‌ని జోడిస్తే వచ్చిన రూపం. ముంతాజ్ మరణం తర్వాత మొఘల్ పాలకుడు షాజహాన్‌ని తీవ్రమైన దుంఖం నుంచి సాంత్వన కలిగించిన నిర్మాణం కూడా. ముంతాజ్ మరణం తర్వాత షాజహాన్ విచారంతో తనకిష్టమైన సంగీతం, ఆహారం, దుస్తుల పట్ల కూడా ఆసక్తి లేకుండా గడిపాడు. ఆగ్రా సమీపంలో రాజా మొదటి జయ్‌సింగ్ నిర్మించిన గొప్ప నిర్మాణం ఉందని తెలిసిన తర్వాత రాజుతో అంగీకారం కుదుర్చుకుని ముంతాజ్ సమాధి కోసం తీసుకున్నాడని చరిత్రకారులు నిర్ధారించారు. ముంతాజ్ మరణించినప్పుడు ఆమె శవపేటికను మధ్యప్రదేశ్,

బుర్హాన్‌పూర్‌లో తపతి నది తీరాన అహుఖానా అనే భవనంలో సమాధి చేశారు. జయ్‌సింగ్‌తో ఒప్పందం తర్వాత ఆ భవనానికి కొన్ని మార్పులు చేసి ముంతాజ్ శవపేటికను ఇక్కడికి తరలించారు. ఆ తర్వాత షాజహాన్‌ను కూడా ఇక్కడే ఖననం చేశారు. తాజ్‌మహల్‌లో ఆ రెండు సమాధులను చూడవచ్చు. తాజ్‌మహల్ వెనుక దాగిన వాస్తవాలను తెలుసుకునే కొద్దీ ప్రేమ చాలా గొప్పదని ఒప్పుకుని తీరాల్సిందే.



ప్యాకేజీల సంగతిదీ..

ఐఆర్‌సీటీసీ బుద్ధిస్ట్ సర్క్యూట్ టూరిస్ట్ ట్రైన్ ప్రస్తుతం కొత్త ఆఫర్లతో ప్యాకేజ్ ప్రకటించింది. ఇది ఎనిమిది రోజుల యాత్ర. ఢిల్లీ నుంచి మొదలై ఢిల్లీకి చేరడంతో పూర్తవుతుంది. ఇవి విదేశీయులు, ఎన్‌ఆర్‌ఐల కోసం ఉద్దేశించిన ప్యాకేజ్‌లు, కాబట్టి ప్యాకేజ్ ధరలు యూఎస్ డాలర్లలో ఉంటాయి. మనదేశంలో నివసిస్తున్న భారతీయులు కూడా ఆసక్తి ఉంటే ఈ ప్యాకేజ్‌లో టూర్ ప్లాన్ చేసుకోవచ్చు. ప్యాకేజ్‌లో సూచించిన డాలర్ల సరిపడిన రూపాయలు చెల్లించి టూర్ బుక్ చేసుకోవచ్చు.

- టికెట్ ధరలు ఏసీ ఫస్ట్ క్లాస్‌లో టూర్ మొత్తానికి 1400 డాలర్లు. ఒక రోజుకు 175 డాలర్లు.
- ఏసీ టూ టయర్‌లో టూర్ మొత్తానికి 1160 డాలర్లు, ఒక్క రోజుకు 145 డాలర్లు.
- ఏసీ ఫస్ట్ క్లాస్ కూపేలో టూర్ మొత్తానికి 1550 డాలర్లు, ఒక్క రోజుకు 175 డాలర్లు.
- టూర్ మొదలయ్యే తేదీలు డిసెంబర్ 20, జనవరి (2026) 3, ఫిబ్రవరి 21, మార్చి 21.

ఇవి వర్తించవు!

వీసా ఫీజులు ప్యాకేజ్‌లో వర్తించవు., లాండ్రీ, మందులు, మద్యం, ఇతర పానీయాలు ఉండవు. పర్యటన కోసం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం, పర్యటన పూర్తయిన తర్వాత రైల్వేస్టేషన్ నుంచి వెళ్లే రవాణా సౌకర్యం ఇందులో ఉండదు. పర్యాటక ప్రదేశాల్లోకి కెమెరాలను అనుమతించడానికి ఫీజులు కూడా ప్యాకేజ్‌లో వర్తించవు.

ఇవి వర్తిస్తాయి!

రైలు ప్రయాణం, రైలు దిగిన తర్వాత పర్యాటక ప్రదేశాలకు ఏసీ వాహనంలో రోడ్డు రవాణా, పర్యాటక ప్రదేశాల ఎంట్రీ టికెట్‌లు, బస, భోజనం, ట్రావెల్ ఇన్సూరెన్స్. వీటితో పాటు ఇంగ్లిష్, హిందీ మాట్లాడే టూర్ ఎస్కార్ట్ కూడా పర్యటన ఆద్యంతం వెంట ఉంటారు.

- వాకా మంజులారెడ్డి, సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి

ఈసారైనా... భారత్ కల నెరవేరేనా!

నేటి నుంచి మహిళల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ

ఫైనల్ చేరడమే లక్ష్యంగా బరిలోకి భారత జట్టు

క్వార్టర్ ఫైనల్ దాటితే ఏదైనా సాధ్యమే ● మరోసారి ఫేవరెట్‌గా నెదర్లాండ్స్

సాంటియాగో (చిలీ): మూడున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన మహిళల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టు ఇప్పటి వరకు ఫైనల్ చేరలేకపోయింది. ఈ మెగా ఈవెంట్‌లో మూడో స్థానం (2013లో) సాధించడమే భారత జట్టు అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. 2013లో నెదర్లాండ్స్ చేతిలో సెమీఫైనల్లో ఓడిపోయాక... మూడో స్థానం జరిగిన పోరులో 'షూటౌట్'లో భారత్ 3-2తో ఇంగ్లండ్‌ను ఓడించింది. 2022లో నెదర్లాండ్స్ చేతిలో సెమీఫైనల్లో ఓటమి పాలయ్యాక... మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో 'షూటౌట్'లో భారత్ 0-3తో ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలైంది. నేటి నుంచి 13వ తేదీ వరకు జరిగే జూనియర్ ప్రపంచకప్‌లో ఫైనల్ చేరడమే లక్ష్యంతో భారత జట్టు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఏడోసారి ఈ టోర్నీలో పోటీపడుతున్న భారత జట్టుకు ఈసారి సులువైన 'డ్రా'నే పడింది. గ్రూప్ 'సి'లో జర్మనీ, ఐర్లాండ్, నమీబియా జట్లతోపాటు భారత్‌కు చోటు కల్పించారు. 1989లో తొలి జూనియర్ ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత జర్మనీ జట్టు మరోసారి ఈ టోర్నీలో మళ్లీ విజేత కాలేదు. ఐర్లాండ్, నమీబియాలపై భారీ విజయాలు సాధించి, జర్మనీతో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంటే భారత్ క్వార్టర్ ఫైనల్ చేరడం తథ్యం. క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటినా సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ నెదర్లాండ్స్ ఎదురుకాకూడదని భారత్ కోరుకోవాలి. నెదర్లాండ్స్ ఎదురైతే మాత్రం భారత్ ప్రస్థానం సెమీఫైనల్లోనే ముగిసే అవకాశాలు ఉన్నాయి. మరోసారి టీమిండియా మూడో స్థానం కోసం వర్గీకరణ మ్యాచ్‌తో సరిపెట్టుకోవాల్సి ఉంటుంది.

24 జట్లతో...

జూనియర్ ప్రపంచకప్‌లో ఈసారి 24 జట్లు పోటీపడుతున్నాయి. 36 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో 24 జట్లు బరిలోకి దిగనుండటం ఇదే ప్రథమం. మొత్తం 24 జట్లను 6 గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో 4 జట్ల చొప్పున ఉన్నాయి. లీగ్ దశ ముగిశాక 6 గ్రూప్ విజేతలతోపాటు రెండో స్థానంలో నిలిచిన 2 అత్యుత్తమ జట్లు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటాయి. గ్రూప్ 'ఎ'లో చిలీ, జపాన్, మలేసియా, నెదర్లాండ్స్... గ్రూప్ 'బి'లో అర్జెంటీనా, బెల్జియం, వేల్స్, జింబాబ్వే... గ్రూప్ 'సి'లో భారత్, జర్మనీ, ఐర్లాండ్, నమీబియా... గ్రూప్ 'డి'లో ఆస్ట్రియా, చైనా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా... గ్రూప్ 'ఇ'లో ఆస్ట్రేలియా, కెనడా, స్కాట్లాండ్, స్పెయిన్... గ్రూప్ 'ఎఫ్'లో న్యూజిలాండ్, అమెరికా, దక్షిణ కొరియా, ఉరుగ్వే జట్లున్నాయి. భారత్ తమ తొలి మ్యాచ్‌ను నేడు నమీబియా జట్టుతో ఆడుతుంది. ఆ తర్వాత డిసెంబర్ 3న జర్మనీతో, 5న ఐర్లాండ్‌తో భారత్ మ్యాచ్‌లున్నాయి.

భారత జట్టు: జ్యోతి సింగ్ (కెప్టెన్), షీలిమా చాను, బినిమా ధన్, కనిక సివాచ్, ఇషిక, హీనా బానో, సుఖ్‌వీర్ కౌర్, నందిని, హర్షరణి మింజ్, సాక్షి శుక్లా, లాల్‌థంట్‌లువాంగి, సునెలితా టొప్పో, పూజా సాహూ, సాక్షి రాణా, సోనమ్, మనీషా, పూర్ణిమ యాదవ్, నిధి.

రాణించిన ప్రజ్ఞయ్ రెడ్డి

హైదరాబాద్ విజయం

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో హైదరాబాద్ జట్టు రెండో విజయం ఖాతాలో వేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఆదివారం జరిగిన పోరులో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో గోవాపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన గోవా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. లలిత్ యాదవ్ (48 బంతుల్లో 85 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 20 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టగా... రక్షణ్ రెడ్డి, అజయ్ దేవ్ గౌడ్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో హైదరాబాద్ 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసి గెలుపొందింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' **ప్రజ్ఞయ్ రెడ్డి (34** బంతుల్లో 67 నాటౌట్; 4 **ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలక** హాఫ్‌సెంచరీతో అదరగొట్టగా... **అమన్ రావు (22** బంతుల్లో 40; 3 ఫోర్లు, **3 సిక్స్‌లు) ధాటిగా** ఆడాడు. తన్మయ్ అగర్వాల్ (9 బంతుల్లో 19; 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు భారీ షాట్‌లతో అలరించాడు.

అభిషేక్ అదరహో

52 బంతుల్లో 8 ఫోర్లు, 16 సిక్స్‌లతో 148

- 12 బంతుల్లో హాఫ్‌సెంచరీ, 32 బంతుల్లో శతకం
- బెంగాల్‌పై పంజాబ్ ఘనవిజయం
- సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్

సాక్షి, హైదరాబాద్: టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (52 బంతుల్లో 148; 8 ఫోర్లు, 16 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 క్రికెట్ టోర్నీలో పంజాబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 25 ఏళ్ల అభిషేక్... బెంగాల్‌తో మ్యాచ్‌లో బంతిపై పగబట్టినట్లు... ప్రత్యర్థి బౌలర్లను చీల్చిచండాడడమే తన పని అన్నట్లు రెచ్చిపోయాడు. కేవలం బౌండరీల ద్వారానే 128 పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 12 బంతుల్లోనే 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్న అభిషేక్... భారత్ తరఫున వేగవంతమైన అర్ధశతకం చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. తన మెంటార్ యువరాజ్ సింగ్ కూడా 2007లో ఇంగ్లండ్‌పై 12 బంతుల్లోనే ఫిఫ్టీ కొట్టాడు. ఓవరాల్‌గా పురుషుల టి20ల్లో ఇది మూడో వేగవంతమైన అర్ధశతకం. ఈ క్రమంలో 32 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్న అభిషేక్ టి20ల్లో తన రెండో వేగవంతమైన సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఫలితంగా ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జరిగిన పోరులో పంజాబ్ జట్టు 112 పరుగుల తేడాతో బెంగాల్‌ను చిత్తు చేసింది.

బాదుడే బాదుడు...

అభిషేక్ దంచికొట్టడంతో... టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. ఈ టోర్నమెంట్ చరిత్రలో ఇది రెండో అత్యధిక స్కోరు. మరో ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్ (35 బంతుల్లో 70; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు)తో కలిసి తొలి వికెట్‌కు 205 పరుగులు జతచేసిన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అభిషేక్... క్రీజులో ఉన్నంతసేపు భారీ షాట్‌లతో విరుచుకుపడ్డాడు. ఈ జంట ప్రతి బంతిని బాదడమే పనిగా పెట్టుకోవడంతో... స్కోరు బోర్డు రాకెట్‌లా దూసుకెళ్లింది. మరో 17 బంతులు ఉండగానే అభిషేక్ అవుట్ కాగా... రమణ్‌దీప్ సింగ్ (15 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), సాన్‌వీర్ సింగ్ (9 బంతుల్లో 22; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా వేగంగా ఆడి జట్టుకు భారీ స్కోరు సాధించిపెట్టారు. బెంగాల్ బౌలర్లలో టీమిండియా ప్లేయర్లు మొహమ్మద్ షమీ 61 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టగా... ఆకాశ్‌దీప్ 55 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు.

ఈశ్వరన్ వీరోచిత సెంచరీ

అనంతరం భారీ లక్ష్యఛేదనలో బెంగాల్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 198 పరుగులకు పరిమితమైంది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (66 బంతుల్లో 130 నాటౌట్; 13 ఫోర్లు, 8 సిక్స్‌లు) అజేయ శతకంతో ఒంటరి పోరాటం చేయగా... అతడికి సహచరుల నుంచి సహకారం కరువైంది. ఇతర ఆటగాళ్లలో ఆకాశ్‌దీప్ (7 బంతుల్లో 31; 5 సిక్స్‌లు) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. అభిషేక్ పొరెల్ (6), కరణ్ లాల్ (1), షాబాజ్ అహ్మద్ (0), సుదిప్ కుమార్ (4), హబీబ్ గాంధీ (1), వృత్తిక్ చటర్జీ (1) విఫలమయ్యారు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 4 వికెట్లు పడగొట్టగా... గుర్‌నూర్ బ్రార్, నేహల్ వధేరా చెరో 2 వికెట్లు తీశారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిసి 40 ఓవర్లలో 508 పరుగులు రాబట్టడం విశేషం. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌ల్లో గుజరాత్ 4 వికెట్ల తేడాతో హరియాణాపై, సర్వీసెస్ 7 వికెట్ల తేడాతో పాండిచ్చేరిపై, బరోడా 5 వికెట్ల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై విజయాలు సాధించాయి.

2 టి20ల్లో వేగవంతమైన హాఫ్ సెంచరీ (12 బంతుల్లో) చేసిన రెండో భారత బ్యాటర్‌గా అభిషేక్ నిలిచాడు. 2007 టి20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌పై యువరాజ్ 12 బంతుల్లోనే ఫిఫ్టీ కొట్టాడు.

2 ఒక టి20 ఇన్నింగ్స్‌లో అత్యధిక (16) సిక్స్‌లు కొట్టిన భారత ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ రెండో స్థానంలో నిలిచాడు. పునీత్ బిష్త్ (17) అగ్రస్థానంలో ఉన్నాడు. 2021 ముస్తాక్ అలీ టోర్నీలో మిజోరంతో జరిగిన మ్యాచ్‌లో మేఘాలయ తరఫున ఆడుతూ పునీత్ ఈ ఘనత సాధించాడు.

310/5 సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఇది రెండో అత్యధిక స్కోరు. గతేడాది బరోడా జట్టు సిక్కింపై చేసిన 349 పరుగుల స్కోరు అగ్రస్థానంలో ఉంది.

ఆయుశ్ మాత్రే మరో సెంచరీ

ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన పోరులో ఆంధ్ర జట్టు ముంబై చేతిలో పరాజయం పాలైంది. ఆదివారం లక్నోలో జరిగిన పోరులో ఓపెనర్ ఆయుశ్ మాత్రే (59 బంతుల్లో 104 నాటౌట్; 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) అజేయ సెంచరీతో ఆకట్టుకోవడంతో ముంబై జట్టు 9 వికెట్ల తేడాతో ఆంధ్రపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ భుయ్ (40 బంతుల్లో 48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రసాద్ (32 బంతుల్లో 44 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), శ్రీకర్ భరత్ (25 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ముంబై బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఆయుశ్ మాత్రే దంచికొట్టడంతో ముంబై జట్టు 15.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 162 పరుగులు చేసి గెలుపొందింది. ముంబై జట్టుకు ఇది మూడో విజయం కాగా... ఆంధ్ర జట్టుకు తొలి పరాజయం. టీమిండియా టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (21 బంతుల్లో 31 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు.

ఐపీఎల్‌కు రసెల్ రిటైర్మెంట్

కోల్‌కతా నైట్‌రైడర్స్ 'పవర్ కోచ్'గా విండీస్ ఆల్‌రౌండర్

కోల్‌కతా: వెస్టిండీస్ ఆల్‌రౌండర్ ఆండ్రె రసెల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు వీడ్కోలు పలికాడు. గత 12 సీజన్లుగా కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న రసెల్... ఐపీఎల్ మినీ వేలానికి ముందు లీగ్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. కాగా... కేకేఆర్ యాజమాన్యం అతడిని జట్టు 'పవర్ కోచ్'గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. 2012 నుంచి ఐపీఎల్‌లో ఆడుతున్న 37 ఏళ్ల రసెల్ 2014 నుంచి ఇప్పటి వరకు కేకేఆర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 'కేకేఆర్‌తో బంధం విడదీయలేనిది. ఇప్పటికీ నాలో సిక్స్‌లు కొట్టే సత్తా... మ్యాచ్‌లు గెలిపించగల పట్టుదల ఉన్నాయి. కానీ వీడ్కోలు పలికేందుకు ఇదే సరైన సమయం అని భావించా. ఇక మీద కొత్త అవతారంలో దర్శనమిస్తా. 2026 సీజన్‌లో అదే ఉత్సాహంతో కేకేఆర్ 'పవర్ కోచ్'గా పనిచేయనున్న. 12 సీజన్‌లుగా కోల్‌కతా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. ఇక్కడ నాకెన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఇతర లీగ్‌ల్లో ఆటగాడిగా కొనసాగుతున్నా... ఐపీఎల్‌లో మాత్రం ప్లేయర్‌గా కాకుండా వేరే బాధ్యతలు నిర్వర్తించనున్నా. ఇంకా ఆడే సత్తా ఉన్నప్పుడే తప్పుకోవాలనేది నా అభిమతం. అందుకే ఇంకొన్నాళ్లు ఆడే దమ్ము ఉన్నప్పటికీ ముందే వీడ్కోలు పలుకుతున్నా. ఆటగాడిగా రిటైర్ అయినా... కేకేఆర్ కుటుంబంలో నేనెప్పుడూ భాగమే. ఈ నిర్ణయం తీసుకునే ముందు ఫ్రాంచైజీ యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చించా. వాళ్లు నాపై ఎంతో నమ్మకముంచారు. ఇన్నాళ్లు మైదానంలో ప్లేయర్‌గా నిర్వర్తించిన బాధ్యతలను ఇకపై 'పవర్ కోచ్'గా డగౌట్‌లో ఉండి చక్కబెట్టమని సూచించారు. అందుకు అంగీకరించా' అని రసెల్ వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు. తొలి రెండు సీజన్ల పాటు ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రసెల్... ఓవరాల్‌గా ఐపీఎల్లో 140 మ్యాచ్‌లాడి 174.18 స్ట్రయిక్‌రేట్‌తో 2,651 పరుగులు చేశాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా తన బౌలింగ్‌తోనూ ఎన్నో మ్యాచ్‌ల్లో జట్టుకు విజయాలు అందించిన రసెల్ 123 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.

ఇషాన్ కిషన్ సెంచరీ

అహ్మదాబాద్: టీమిండియా ప్లేయర్ ఇషాన్ కిషన్ (50 బంతుల్లో 113 నాటౌట్; 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో జార్ఖండ్ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా ఆదివారం జరిగిన పోరులో జార్ఖండ్ 8 వికెట్ల తేడాతో త్రిపురను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన త్రిపుర నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. విజయ్ శంకర్ (41 బంతుల్లో 59; 8 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ సాధించగా... బ్రికమ్ కుమార్ దాస్ (29 బంతుల్లో 42; 6 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ మణిశంకర్ (21 బంతుల్లో 42; 5 సిక్స్‌లు) రాణించారు. జార్ఖండ్ బౌలర్లలో వికాస్ సింగ్, అనుకూల్ రాయ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో జార్ఖండ్ 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసి గెలుపొందింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీతో కదంతొక్కగా... విరాట్ సింగ్ (40 బంతుల్లో 53 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో అతడికి అండగా నిలిచాడు. టోర్నీలో భాగంగా జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో చండీగఢ్ 5 వికెట్ల తేడాతో మహారాష్ట్రపై, రైల్వేస్ 3 వికెట్ల తేడాతో అస్సాంపై, కేరళ 8 వికెట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్‌పై, రాజస్తాన్ ఒక పరుగు తేడాతో కర్ణాటకపై, మధ్యప్రదేశ్ 37 పరుగుల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై, విదర్భ 8 వికెట్ల తేడాతో ఒడిశాపై, తమిళనాడు 5 వికెట్ల తేడాతో ఉత్తరాఖండ్‌పై విజయాలు సాధించాయి.

సంయుక్త విజేతలు భారత్ 'ఎ', అఫ్గానిస్తాన్

బెంగళూరు: అండర్-19 ముక్కోణపు వన్డే టోర్నమెంట్‌లో భారత్ 'ఎ', అఫ్గానిస్తాన్ జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం జరగాల్సిన ఫైనల్ వర్షం కారణంగా రద్దు అయింది. దిత్వా తుపాను ప్రభావంతో బెంగళూరులో భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌ను 31 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత 'ఎ' జట్టు 19 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసిన దశలో వెలుతురులేమి, వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత ఎంతసేపు ఎదురుచూసినా ఆట తిరిగి ప్రారంభించే పరిస్థితులు లేకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. భారత బ్యాటర్లలో కనిష్క్ చౌహాన్ (28 నాటౌట్), అభిజ్ఞ కుందు (27) ఫర్వాలేదనిపించగా... కెప్టెన్ విహాన్ మల్హోత్రా (10), వన్ష్ ఆచార్య (2), వఫీ (2), వినీత్ (0) విఫలమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో అబ్దుల్ అజీజ్ 2 వికెట్లు పడగొట్టాడు. ఈ టోర్నమెంట్‌లో భారత్ 'ఎ', అఫ్గానిస్తాన్‌తో పాటు భారత్ 'బి' జట్టు కూడా పాల్గొంది. లీగ్ దశలో అఫ్గానిస్తాన్ 4 మ్యాచ్‌లు ఆడి మూడింట గెలిచి ఒక దాంట్లో ఓడి 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా... భారత 'ఎ' జట్టు రెండు విజయాలు, రెండు పరాజయాలతో 8 పాయింట్లతో ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత 'బి' జట్టు 4 మ్యాచ్‌ల్లో ఒక విజయం రెండు పరాజయాలతో చివరి స్థానంలో నిలిచింది.

రన్నరప్ అనిరుధ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఐదో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ సాధించడంలో హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ విఫలమయ్యాడు. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో జరిగిన ప్లేఫోర్డ్ ఏటీపీ చాలెంజర్-75 టోర్నీలో అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)-రీస్ స్టాల్డర్ (అమెరికా) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. జేక్ డెలానీ-లు టు (ఆస్ట్రేలియా) జంటతో జరిగిన ఫైనల్లో అనిరుధ్-స్టాల్డర్ ద్వయం 7-6 (7/5), 5-7, 8-10తో 'సూపర్ టైబ్రేక్'లో పోరాడి ఓడిపోయింది. 1 గంట 46 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ఇండో-అమెరికన్ జంట 8 ఏస్‌లు సంధించి, 3 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 57 పాయింట్లకుగాను 38 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 24 పాయింట్లకుగాను 17 పాయింట్లు సాధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. అనిరుద్-స్టాల్డర్ జంటకు 2,880 డాలర్ల (రూ. 2 లక్షల 57 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది ఏటీపీ సర్క్యూట్‌లో అనిరుధ్ నాలుగు (బెంగళూరు ఓపెన్, గిరోనా ఓపెన్, లెక్సింగ్టన్ ఓపెన్, జింగ్‌షాన్ ఓపెన్) చాలెంజర్ డబుల్స్ టైటిల్స్ సాధించాడు.

పొట్టలో ఏదో సీతాకోక చిలుకలు ఎగురుతున్న ఫీలింగ్ మనందరికీ తరచూ కలిగేదే. కదా! భయం తాలూకు అనేకానేక సంకేతాల్లో అదొకటి. అలాంటి భయమంటే అసలేమిటో, అదెలా ఉంటుందో ఏమాత్రమూ తెలియని మహిళ ఒకరున్నారు. అందుకు కారణం ఫక్తు వైద్యపరమైనది కావడం విశేషం...!

నిర్భయ! భయం ఆమె 'మెదడు'లోనే లేదు

దాన్ని ప్రాసెస్ చేసే వ్యవస్థే గాయబ్!

చాలాకాలం కింది సంగతి. నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుపై ఆమె అలా నడిచి వెళ్తోంది. ఉన్నట్టుండి ఓ సాయుధుడు అటకాయించి ఏకంగా గొంతుపైనే కత్తి పెట్టాడు. కానీ ఆమె కళ్లలో భయం ఛాయలైనా కన్పించలేదు. 'ఊ, కానీ. ఆలస్యమెందుకు?' అంటూ గొంతు కోయమని ఆహ్వానించింది! దాంతో దొంగ కాస్తా బిత్తరపోయి ఉన్నపళాన కాలికి బుద్ధి చెప్పాల్సి వచ్చింది. మనమైతే దీన్ని సాహసం అంటాం కదా! కానీ సైంటిస్టులు మాత్రం మరేదో అంటున్నారు. ఆ మహిళ తాలూకు ప్రత్యేకతే అందుకు కారణం. ఏమంటే, ఆమె మెదడులో భయాన్ని ప్రాసెస్ చేసి మనసుకు అర్థమయ్యేలా చేసే అమిగ్డాలా అనే వ్యవస్థే పూర్తిగా లోపించింది. ప్రపంచంలో ఇలాంటి కేసులు ఇప్పటిదాకా కేవలం కొన్ని వందలు మాత్రమే వెలుగు చూశాయి. ప్రస్తుతమైతే ఇలాంటి లక్షణాలున్న ఏకైక వ్యక్తి భూ మండలం అంతటా ఆమె మాత్రమే కావడం విశేషం. వారిలోనూ ఇలా అమిగ్డాలా లోపించిన కేసు ఇది రెండోది మాత్రమే. అందుకే ఆమె వ్యక్తిగత వివరాలను సైంటిస్టులు అతి గోప్యంగా ఉంచారు. మనిషి భయం, ఆందోళన, అసంకల్పిత ఆత్మరక్షణ ప్రతిచర్య వంటివాటిని ఎలా అనుభూతి చెందుతాడో తెలుసుకునేందుకు ఆమెపై పలు పరిశోధనలు జరుపుతున్నారు. తనను కేవలం ఎస్ఎంగా వ్యవహరిస్తున్నారు.

అరుదైన వ్యాధి

ఎస్ఎంకు అర్బాక్ వీత్ అనే అత్యంత అరుదైన వ్యాధి ఉంది. ఇది తన మెదడులోని అమిగ్డాలాను క్రమంగా మటుమాయం చేస్తూ వచ్చింది. ఇదంతా ఓ పాతికేళ్ల కింది సంగతి. దాంతో 'ఫియర్‌లెస్ షీ'గా అప్పట్లో ఆమె ప్రపంచమంతటా ఫేమస్ అయిపోయింది. తనకు నిజంగానే వీసమెత్తు కూడా భయం వేయదా అన్నది తేల్చుకునేందుకు ఎందరో ఎన్నెన్నో రకాల పరీక్షలు పెట్టి చూశారు. అన్నింట్లోనూ విజయం ఆమెదే. పరాజయం... భయానిదీ, పరీక్షకులదీ! ఆమెను దెయ్యాల కొంపల్లో ఉంచి తాళం వేశారు. హఠాత్తుగా పాములను మెళ్లో వేశారు. భయంకరమైన హారర్ సినిమాలు ఒంటరిగా కూచోబెట్టి మరీ చూపించారు. ఆమె గత జీవితంలోనే అత్యంత భయానకమని చెప్పదగ్గ ఉదంతాలను పదేపదే పనిగట్టుకుని గుర్తు చేశారు. ఎన్ని చేసినా ఆమెకు భయమన్నదే కలగలేదు. సరికదా, అన్ని సందర్భాల్లోనూ ఎస్ఎం అత్యంత ఆసక్తిగా, ఉత్సాహంగా కన్పించి పరీక్షకులకే పరీక్ష పెట్టింది! పుట్టి బుద్ధెరిగిన నాటినుంచీ అసలు భయమంటే ఎలా ఉంటుందో కూడా ఎరగదట తను. 2009–11 మధ్య ఆమెపై పలుమార్లు ప్రాణాంతక దాడులు జరిగాయి. దోపిడీ యత్నాలకూ గురైంది. బెదిరింపులకైతే లెక్కే లేదు! కానీ ఒక్కటంటే ఒక్క ఉదంతంలో కూడా ఆమెలో భయం అణుమాత్రమైనా కన్పించలేదట.

ఆమె భయపడ్డ క్షణం...

ఇక ఇలా కాదని సైంటిస్టులు ఎస్ఎంను ఓ చిత్రమైన పరీక్షకు గురిచేసి చూశారు. తనతో పాటు తన మాదిరిగానే అమిగ్డాలా కాస్తో కూస్తో పాడైన మరో ఇద్దరిని ప్రయోగశాలలో కూచోబెట్టారు. 35 శాతం కార్బన్ డయాక్సైడ్ (సీఓటూ) పీల్చేలా చేశారు. నియంత్రిత పద్ధతిలో చేయగలిగితే దీనివల్ల అవతలి వ్యక్తి ఊపిరాడని పరిస్థితికి లోనవుతాడు. అలా సీఓటూ పీల్చగానే జరిగింది చూసి సైంటిస్టులే అవాక్కయ్యారు. జీవితంలోనే తొలిసారిగా ఎస్ఎం 'పానిక్' అయింది. అంటే, భయపడిందన్నమాట! సీఓటూ మాస్కును ముఖంపై నుంచి ఒక్కసారిగా పీకిపారేసింది. శ్వాస కోసం పెనుగులాడింది. ఇప్పటికి గుర్తు చేసినా సరే, 'అదో భయానక అనుభూతి' అంటూ గుర్తు చేసుకుంటూ ఉంటుంది. మిగతా ఇద్దరు రోగులు కూడా ఎస్ఎం మాదిరిగానే బెదిరిపోయారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కీలక స్పష్టత

ఎస్ఎం బృందంపై చేసిన పరీక్ష ఫలితాన్ని బట్టి సైంటిస్టులు ఒక కీలక స్పష్టతకు వచ్చారు. బయటి ప్రమాదాలను గుర్తించి శరీరానికి, మనసుకు అర్థమయేలా చేసేందుకు అమిగ్డాలా అవసరం. కానీ శరీరం లోపలి నుంచే పుట్టుకొచ్చే భయం మాత్రం దానితో నిమిత్తం లేకుండానే వణుకు పుట్టిస్తుంది! అంతేకాదు, ''భయానికి మెదడులో మూలం అమిగ్డాలా ఒక్కటే కాదు. అందుకు పలు దారులున్నాయి. అసలు భయం బలహీనత కానే కాదు. మనుగడకు అవసరమైన అత్యంత కీలకమైన సాధనం. ఎందుకంటే భయం ఏ కోశానా లేకపోబట్టే అర్ధరాత్రి, అపరాత్రి అనే లేకుండా ఎస్ఎం ఎటు పడితే అటు తిరిగి ప్రమాదాలను కొని తెచ్చుకుంది. భయముంటే ఇలాంటి పనులు ఎన్నటికీ చేయరు. అంతేకాదు, భయం లేకపోతే ఒంట్లో రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థే కుప్పకూలిపోతుంది.

కొసమెరుపు

అయితే, అమిగ్డాలాతో నిమిత్తం లేకుండా ఒంటికి, మనసుకు భయాన్ని అనుభూతం చేసే అంతర్గత సర్క్యూట్లు ఏమిటి, అవెలా పని చేస్తాయి అన్నది మాత్రం సైంటిస్టులకు ఇంకా అంతు చిక్కాల్సే ఉంది!

ఇండోనేసియాలో వరద బాధితుల ఆకలి కేకలు

- ఆకలి తీర్చుకునేందుకు దొంగతనాలు
- ప్రతికూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం

మెడాన్: వరదలతో అతలాకుతలమైన ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో బాధితులు ఆహారం, నీటికోసం అల్లాడుతున్నారు. ప్రాణాలు కాపాడుకోవడానికి కొందరు దొంగతనాలకు కూడా పాల్పడుతున్నారు. శనివారం సాయంత్రం దుకాణాల్లోకి ప్రజలు చొరబడినట్లు ఫిర్యాదు రావడంతో పోలీసులను మోహరించామని పోలీసు ప్రతినిధి ఫెర్రీ వాలింటుకాన్ తెలిపారు. దేశంలో వరదల కారణంగా 442 మంది మరణించారు. దాదాపు మూడు లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసమైంది. ఉత్తర సుమత్రా, పశ్చిమ సుమత్రా, ఆషే ప్రావిన్సుల్లో 402 మంది గల్లంతయ్యారని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. శిథిలాలు తొలగించేకొద్దీ ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపింది. సమర్థవంతమైన పరకరాలు లేకపోవడం, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఆహారం, మందులు, గ్యాస్ వంటి నిత్యావసరాలకోసం ప్రజలు ధ్వంసమైన రోడ్లు, వంతెనలు దాటుకుంటూ ప్రమాదకర పరిస్థితుల్లో వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో వీడియోలు చూపుతున్నాయి.

కాశీ తమిళ్ సంగం రేపట్నుంచే...

కాశీలో 12 రోజుల పాటు సదస్సు

చెన్నై: ఉత్తర, దక్షిణాల మధ్య సాంస్కృతిక వారధి వేసే యత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన కాశీ తమిళ్ సంగం నాలుగో సదస్సు మంగళవారం నుంచి వారణాసిలోని నమో ఘాట్‌లో మొదలవనుంది. కాశీ, తమిళనాడు నడుమ అనాది కాలంగా ఉన్న సాంస్కృతిక, వారసత్వ బంధాన్ని దేశమంతటికీ చాటడమే లక్ష్యంగా నాలుగేళ్ల క్రితం ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం తెలిసిందే. 'తమిళం నేర్చుకుందాం' అన్నది ఈసారి సదస్సు మోటో కానుంది. ప్రాచీన తమిళ గ్రంథాల్లోని విజ్ఞానం, సారస్వతం దేశమంతటికీ అందాలన్నదే దీని ఉద్దేశమని కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ 8 రోజుల సదస్సులో పలు కార్యక్రమాలు అందరినీ అలరించనున్నాయి. తమిళనాడుకు చెందిన ప్రతినిధుల బృందం కాశీ విశ్వనాథాలయం, నమో ఘాట్, హనుమాన్ ఘాట్, బెనారస్ హిందూ యూనివర్సిటీ, సారనాథ్ తదితరాలను సందర్శిస్తుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు తమిళనాడు వెళ్లి అక్కడి సాంస్కృతిక ఘనతను తిలకించనున్నారు. రుషి అగస్త్య పేరిట ఓ ప్రత్యేక వాహనం తమిళనాడులోని తెన్‌కాశీ నుంచి మంగళవారం బయల్దేరి డిసెంబర్ 12న కాశీ చేరనుంది.

కొందరికి మన భాషలేవో కూడా తెలియదు

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్య

నాగ్‌పూర్: దేశంలో భారతీయ భాషలు, మాతృభాషల వినియోగం తగ్గుముఖం పడుతుండటంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు భారతీయులకు మన భాషలేవో కూడా తెలియడం లేదన్నారు. సమాజం దీనిపై ఆలోచన చేయాల్సిన అవసరముందన్నారు. సంత్ ధ్యానేశ్వర్ మరాఠీలో రాసిన శ్రీ ధ్యానేశ్వర్ ఆంగ్ల వెర్షన్ పుస్తకం విడుదల సందర్భంగా ఆదివారం పుణెలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు దైనందిన కార్యకలాపాలు, సమాచార మార్పిడి మొత్తం సంస్కృతంలోనే జరిగేవి. ఇప్పుడు అమెరికా ప్రొఫెసర్ మనకు సంస్కృతం నేర్పాల్సిన పరిస్థితికి చేరుకున్నాం. వాస్తవానికి ప్రపంచ దేశాలకు సంస్కృతం బోధించే స్థాయిలో మనం ఉండాల్సింది. కనీస, సాధారణ పదాలను కూడా నేటి పిల్లలకు తెలియడం లేదు. బదులుగా వాళ్లు మాతృభాషను ఇంగ్లిష్‌తో కలిపి వాడుతున్నారు. కొందరు భారతీయులను నేడు మన భాషలేవో కూడా తెలియనంత స్థాయికి పడిపోయింది. మన భాషలను ఇళ్లలో మనం వాడకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించింది' అని ఆయన పేర్కొన్నారు.

శ్రీలంక నుంచి తిరిగొచ్చిన 400 భారతీయులు

కొలంబో: దిత్వా తుఫాను కారణంగా శ్రీలంకలోని కొలంబో విమానాశ్రయంలో చిక్కుకుపోయిన 400 మంది భారతీయులు ఆదివారం స్వదేశానికి చేరుకున్నారు. 150 మంది ఢిల్లీకి, 250 మందిని తిరువనంతపురానికి పంపించినట్లు శ్రీలంక అధికారులు తెలిపారు. కొలంబో విమానాశ్రయంలో చిక్కుకున్న భారతీయులను శ్రీలంకకు భారత తాత్కాలిక హైకమిషనర్ సత్యంజల్ పాండే శనివారం కలిశారు. శ్రీలంకలో ఉన్న బాధిత భారతీయులు అత్యవసర నంబర్ +94 773727832లో సంప్రదించాలని సూచించారు. దిత్వా తుఫాను సృష్టించిన విధ్వంసానికి శ్రీలంకలో మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరదలు సంభవించాయి. కొండచరియలు విరిగి పడ్డాయి. విమానాల రద్దుతో సహా అనేక సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. తుఫాను కారణంగా గురువారం నుంచి కురిసిన వర్షాలతో ఆదివారం నాటికి 212 మంది మరణించారు. 218 మంది గల్లంతయ్యారు.

తమిళనాట రెండు బస్సులు ఢీ

11 మంది మృతి

శివగంగ: తమిళనాడులోని శివగంగ జిల్లాలో ఆదివారం రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 11 మంది చనిపోయారు. 25 మంది గాయపడ్డారు. కరైకుడికి 15 కిలోమీటర్ల దూరంలో రోడ్డు రవాణా సంస్థకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయని పోలీసులు తెలిపారు. మృతుల్లో 8 మంది మహిళలు, ఒక చిన్నారి, ఇద్దరు పురుషులు ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం వేర్వేరు ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. ప్రమాదానికి దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టామన్నారు.

ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పూర్తి: డీజీసీఏ

న్యూఢిల్లీ: దేశంలో ఎయిర్‌బస్ ఏ-320 మోడల్ విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ప్రక్రియ పూర్తయినట్లు పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ ఆదివారం వెల్లడించారు. భారత్‌లో ఏ-320 మోడల్ విమానాలు మొత్తం 338 ఉన్నాయి. వీటిలో 323 విమానాలు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. ఎయిర్‌బస్ సంస్థ సూచన మేరకు వీటన్నింటిలో సాఫ్ట్‌వేర్‌ను నవీకరించారు. దీంతో ఎలాంటి అంతరాయం లేకుండా ఆయా విమానాల కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతున్నట్లు డీజీసీఏ పేర్కొన్నారు. అక్టోబర్ 30న మెక్సికో నుంచి అమెరికాకు వెళ్తున్న ఏ-320 విమానం తీవ్రస్థాయి సౌరరేడియోధార్మికత కారణంగా హఠాత్తుగా 100 అడుగుల మేర కిందికి దిగింది. 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఏ-320 మోడల్ విమానాలకు ఇలాంటి ముప్పు తలెత్తే ప్రమాదం ఉండడంతో తక్షణమే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాలని ఎయిర్‌బస్ యాజమాన్యం సూచించింది.

శ్రీనగర్‌లో చలి తీవ్రరూపం

షోపియాన్‌లో మైనస్ 6.6 డిగ్రీలు

శ్రీనగర్: కశ్మీర్‌లో చలి తీవ్రత పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు మరింత దిగువకు పడిపోయాయి. కశ్మీర్ లోయ వ్యాప్తంగా దట్టమైన మంచుకురుస్తోంది. శ్రీనగర్‌లో శనివారం రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 3.1 డిగ్రీల నుంచి మైనస్ 4.4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఈ సీజన్‌లో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదేనని వాతావరణ విభాగం తెలిపింది. గురువారం రాత్రి కూడా ఇక్కడ మైనస్ 4.5 డిగ్రీలుగా నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్‌లో శనివారం రాత్రి అత్యంత తక్కువగా మైనస్ 6.6 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డయింది. కాజీగుండ్‌లో మైనస్ 3 డిగ్రీలు, కుప్వారాలో మైనస్ 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతం పహల్గాంలో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 5.6 డిగ్రీలు, గుల్మార్గ్‌లో మైనస్ 1.4 డిగ్రీలుగా ఉంది. కశ్మీర్ లోయలో వచ్చే పది రోజులు ఇలాంటి పరిస్థితులే కొనసాగుతాయని వాతావరణ విభాగం వివరించింది.

ముంబైలోని జుహూ బీచ్ వద్ద ఆదివారం కారును పోలిన బోట్‌లో సముద్రంలో షికార్ చేస్తున్న యువత

శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు మైనస్‌కి పడిపోగా ఆదివారం ఉదయం దాల్ సరస్సుపై కప్పుకున్న మంచు దుప్పటి

అత్యంత విషమంగా ఖలేదా జియా ఆరోగ్యం

ఢాకా: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ మహిళా ప్రధానమంత్రి ఖలేదా జియా(80) పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు ఆదివారం తెలిపారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా నవంబర్ 23వ తేదీన కుటుంబీకులు ఆమెను ఢాకాలోని ఎవర్‌కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ఆమెకుఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. చికిత్సకు ఆమె స్పందిస్తోంది. గత మూడు రోజుల నుంచి ఆమె పరిస్థితిలో మార్పులేదని వైద్యులు అన్నారు. కాలేయం, మూత్ర పిండాల సమస్యతోపాటు డయాబెటిస్, ఆర్థ్రిటిస్, నేత్ర సంబంధ సమస్యలతోనూ ఆమె ఇబ్బంది పడుతున్నారని సమాచారం. ఆరోగ్యం కుదుటపడిన పక్షంలో మరింత మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు ఎయిర్ అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచామని ఖలేదా సారథ్యంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఉపాధ్యక్షుడు అహ్మద్ ఆజామ్ ఖాన్ చెప్పారు. ఖలేదా జియా ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేయాలని లండన్‌లో ఉంటున్న ఆమె కుమారుడు తారిఖ్ రహ్మాన్ బంగ్లాదేశ్ ప్రజలకు పిలుపునిచ్చారు.

'వికసిత్ భారత్'కు యువత అంకితభావమే బలం

కీలకమైన రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారు

- పరిశోధనల్లో భారత్ శరవేగంగా దూసుకెళ్తోంది
- ఏదైనా సాధించే శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయి
- 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: యువతలోని అంకితభావమే 'వికసిత్ భారత్'కు అతిపెద్ద బలమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. అంతరిక్ష నుంచి వ్యవసాయం దాకా ఎన్నో కీలక రంగాల్లో మన యువత అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. 'మన్ కీ బాత్'128వ ఎపిసోడ్‌లో భాగంగా ఆయన ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. పరిశోధన రంగంలో భారత్ వేగంగా ముందుకు దూసుకెళ్తోందని హర్షం వ్యక్తంచేశారు. ప్రపంచంలో ఏదైనా సాధించే శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని తేల్చిచెప్పారు. యువతలోని అసమాన శక్తి, బలీయమైన సంకల్పం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయని ఉద్ఘాటించారు. గత 11 ఏళ్లలో విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి వంటి కీలక రంగాల్లో యువతీ యువకులు చక్కటి ప్రతిభ కనబరిచారని కొనియాడారు. కష్టతరమైన విజయాలను సైతం అలవోకగా సాధిస్తున్నట్లు చెప్పారు. అంధుల మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ సాధించి, చరిత్ర సృష్టించిందని తెలిపారు. క్రీడల్లో ఎన్నో విజయాలు సొంతం చేసుకున్నామని చెప్పారు. 2030లో కామన్వెల్త్ క్రీడలను మన దేశంలో నిర్వహించడానికి బిడ్డింగ్‌లో నెగ్గడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

వైఫల్యం తర్వాత దక్కిన విజయంతో..

''కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియాలో కనిపించిన ఓ వీడియో నా దృష్టిని ఆకట్టుకుంది. అంగారక గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా సృష్టించి, అక్కడే డ్రోన్లను ఎగరవేయడానికి పుణేకు చెందిన యువకులు ప్రయత్నించారు. జీపీఎస్ మద్దతు లేకపోవడంతో డ్రోన్లు నేలకూలుతున్నప్పటికీ నిరాశ చెందకుండా వారు మరింత పట్టుదలతో ప్రయత్నించారు. ఎట్టకేలకు డ్రోన్లు కొంతసమయం ఎగిరేలా చేశారు. కెమెరాలు, ఇన్-బిల్ట్ సాఫ్ట్‌వేర్‌తోనే వారు ఈ ప్రయోగం నిర్వహించారు. మన యువతలోని ఇలాంటి మహోన్నత సంకల్ప బలమే దేశాన్ని 'వికసిత్ భారత్'గా మారుస్తుందనడంలో సందేహం లేదు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలతో యువత వికసిత్ భారత్ స్వప్నాన్ని కచ్చితంగా సాకారం చేస్తారని నేను విశ్వసిస్తున్నా. ఇస్రో సైంటిస్టులు కూడా చంద్రయాన్-2 వైఫల్యంతో కొంత నిరాశ చెందారు. తర్వాత రెట్టించి ఉత్సాహంతో పనిచేసి చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేశారు. వైఫల్యం తర్వాత దక్కిన విజయం గొప్ప విశ్వాసాన్ని అందిస్తుంది. యువత సంకల్పాన్ని, సైంటిస్టుల అంకితభావాన్ని చూసినప్పుడు నా హృదయం ఉత్సాహంతో నిండిపోతుంది.



అంతరిక్ష రంగంలో ప్రయోగాలకు కొత్త శక్తి

నవంబర్‌లో ఎన్నో స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహించుకున్నా. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. పార్లమెంట్ పాత భవనం సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. అయోధ్య భవ్య రామమందిరంపై ధర్మధ్వజం ఎగరవేశాం. ఐఎన్ఎస్ మాహే నౌక భారత నావికాదళంలో చేరింది. ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఇంజన్ ఎంఆర్ఓ సంస్థను హైదరాబాద్‌లో ప్రారంభించాం. అంతరిక్ష రంగంలో ప్రయోగాలకు స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ కొత్త శక్తిని అందించింది. దేశంలో నూతన ఆలోచనా విధానానికి, నవీన ఆవిష్కరణలకు, యువ శక్తికి ఇదొక ప్రతీక.

కాశీ–తమిళ సంగమంలో పాల్గొనండి

వారణాసిలోని నమో ఘాట్‌లో డిసెంబర్ 2 నుంచి జరుగబోయే కాశీ–తమిళ సంగమం నాలుగో ఎడిషన్‌లో పాల్గొనాలని ప్రజలను కోరుతున్నా. తమిళ భాష నేర్చుకొనే అవకాశం వదులుకోవద్దు. ప్రపంచంలో అత్యంత ప్రాచీన భాషను, అత్యంత ప్రాచీన నగరాన్ని అనుసంధానించే గొప్ప కార్యక్రమం ఇది. తమిళ భాషతో అనుబంధం ఉన్నవారికి కాశీ–తమిళ సంగమం ఒక ముఖ్యమైన వేదికగా మారుతోంది. తమిళ సోదరులు, సోదరీమణులను ఆహ్వానించడానికి కాశీ ప్రజలు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి ఇతర కార్యక్రమాల్లోనూ ప్రజలు భాగస్వాములుగా మారాలి. ఏక్ భారత్–శ్రేష్ట భారత్ స్ఫూర్తిని బలోపేతం చేయాలి.

'వోకల్ ఫర్ లోకల్' సెంటిమెంట్

నేను ఇటీవలే దక్షిణాఫ్రికాలో జీ20 సదస్సుకు హాజరయ్యాను. అక్కడ ప్రపంచ దేశాల నేతలకు అందజేసిన బహుమతుల్లో 'వోకల్ ఫర్ లోకల్'సెంటిమెంట్ కనిపించింది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడికి కంచు నటరాజ స్వామి విగ్రహం బహూకరించా. తమిళనాడులో చోళుల కాలం నాటి హస్తకళా నిపుణ్యానికి ఇది నిదర్శనం. తెలంగాణలోని కరీంనగర్ కళాకారులు రూపొందించిన వెండి అద్దాన్ని ఇటలీ ప్రధానమంత్రికి అందజేశా. సంప్రదాయ లోహ కళాకృతులకు ఇదొక ఉదాహరణ. భారతీయ కళలు, సంప్రదాయాలు, కళాకృతులను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్నదే నా లక్ష్యం. దీనివల్ల మన కళాకారులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వారి నైపుణ్యానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు లభిస్తుంది''అని ప్రధాని మోదీ స్పష్టంచేశారు.

యాప్ ఆధారిత వాహనాల్లో మహిళా డ్రైవర్లను ప్రోత్సహించాలి

రాజస్తాన్ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

జైపూర్: యాప్ ఆధారంగా నడిచే టాక్సీలు, బైక్‌ల డ్రైవర్లలో 15 శాతం మహిళలు ఉండేలా ప్రోత్సహించాలని రాజస్తాన్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రాబోయే రెండు, మూడేళ్లలో ఈ సంఖ్యను 25 శాతానికి పెంచాలని సూచించింది. మహిళా ప్రయాణికులకు మహిళా డ్రైవర్లను ఎంచుకునే అవకాశం ఉండాలని పేర్కొంది. సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సైబర్ పోలీసింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. అధికారులమని చెప్పి వృద్ధ దంపతుల దగ్గర రూ.2 కోట్లు కొట్టేశారనే ఆరోపణలపై జైల్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా మొత్తం 35 పాయింట్లతో కూడిన వివరణాత్మక ఉత్తర్వులను జారీ చేసింది. యాప్ ఆధారంగా నడిచే వాహనాలన్నింటిపై వాణిజ్య నంబర్ ప్లేట్ ఉండాలని, 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న విద్యార్థులు మొబైల్ ఫోన్ వినియోగించకుండా ప్రత్యేక విధానాన్ని పాఠశాలలు ప్రవేశపెట్టాలని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ తరహాలో రాష్ట్రంలో కూడా సైబర్ క్రైమ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని రాజస్తాన్ ప్రభుత్వానికి సూచించింది. ఎవరికైనా సిమ్ కార్డు జారీ చేసే ముందు ధ్రువీకరణ పత్రాల తనిఖీ పటిష్టంగా ఉండాలని టెలికాం అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో పని చేస్తున్న గిగ్ కార్మికుల వివరాలు సైబర్ క్రైమ్ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో రిజిస్టరై ఉండాలని, వారికి ఐడీ కార్డులతోపాటు డ్రెస్ కోడ్ కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

'రక్త' సిందూరం!

- కూతురి ప్రేమికుడిని కడతేర్చిన కన్నవారు
- ప్రియుడి శవాన్నే పెళ్లాడిన యువతి

కులం సాకుతో కూతురి ప్రేమను కాదన్నారు. ఖాతరు చేయలేదన్న కసితో కన్నతండ్రి, తోబుట్టువులే ఆమె ప్రేమికుడి పాలిట కాలయముళ్లయ్యారు. నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు. మనసారా ప్రేమించినవాడు నడిరోడ్డుపై రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంటే.. ఆమె గుండె పగిలింది. నిప్పుల కొలిమి అయ్యింది. చట్టాన్ని ధిక్కరించిన పగలకు, కులాన్ని అడ్డుపెట్టిన క్రూరత్వానికి బదులివ్వడానికి ఆమె అప్పటికప్పుడే ఎంచుకున్న మార్గం... చరిత్రలో విలక్షణ అధ్యాయమై నిలిచింది. మట్టిలో కలిసిపోవడానికి సిద్ధంగా ఉన్న ప్రియుడి దేహాన్నే వివాహం చేసుకుంది. అమరం.. అఖిలం మా ప్రేమ.. అంటూ యావత్ ప్రపంచానికి చాటిచెప్పింది. ఆమె ధిక్కార ప్రకటన.. మహారాష్ట్రలోని నాందేడ్‌లో కన్నీటి కెరటమై ఎగసిపడింది.

మూడేళ్ల ప్రేమకు నూరేళ్లు

ఆంచల్ మమిద్వార్ (21), సక్షం టేట్ (20)లది మూడేళ్ల గాఢమైన ప్రేమ బంధం. వాస్తవానికి ఆంచల్ సోదరుల ద్వారానే ఆమె కుటుంబానికి సక్షం పరిచయమయ్యాడు. తరచూ వారింటికి సక్షం రావడంతో.. వీరిద్దరి ప్రేమ బంధం బలపడింది. అయితే, వారిద్దరి కులాలు వేరు కావడంతో.. ఆంచల్ కుటుంబం ఈ ప్రేమను తీవ్రంగా వ్యతిరేకించింది. ఎన్ని బెదిరింపులు వచ్చినా ఆంచల్, సక్షం తమ ప్రేమ బంధాన్ని వదులుకోలేదు. సక్షం, ఆంచల్ పెళ్లి చేసుకోబోతున్నారనే విషయం ఆంచల్ తండ్రి గజానన్ మమిద్వార్ (45)కు, సోదరులు హిమేశ్, సాహిల్ (25)లకు తెలిసిపోయింది. అంతే.. పరువు హత్యకు పథకం సిద్ధమైపోయింది.

తుపాకీతో కాల్చి.. రాయితో కొట్టి..

గురువారం సాయంత్రం, నాందేడ్‌లోని పాతగంజ్ ప్రాంతంలో సక్షం తన స్నేహితులతో నిలబడి ఉండగా.. ఆంచల్ సోదరుడు హిమేశ్ మామిద్వార్ అక్కడికి చేరాడు. అతనికి.. సక్షం మధ్య గొడవ మొదలైంది. కోపంతో ఊగిపోయిన హిమేశ్, సక్షంపైకి తుపాకీతో కాల్పులు జరిపాడు. ఆ గుండు సక్షం పక్కటెముకల్లోకి దూసుకుపోయింది. అంతటితో ఆగకుండా, హిమేశ్ ఒక రాతి పెంకుతో సక్షం తలపై బలంగా కొట్టాడు. దీంతో సక్షం అక్కడికక్కడే మరణించాడు.

మా ప్రేమకు చావు లేదు..

సక్షం హత్య తర్వాత రోజు, శుక్రవారం సాయంత్రం .. అతని అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పుడే అక్కడికి ఆంచల్ చేరుకుంది. సక్షం నిర్జీవ దేహం పక్కన మోకరిల్లింది. కళ్ల నుండి దుఃఖం ధారాపాతమై ప్రవహిస్తుండగా.. ఆమె సక్షం శరీరానికి పసుపు పూసింది. తన నుదుట సిందూరం ధరించింది. ప్రియుడి భౌతిక కాయంతోనే పెళ్లి చేసుకుంది. తమ ప్రేమకు అమరత్వం కల్పించడానికి ఈ పని చేస్తున్నానని ఆంచల్ చెబుతుంటే.. అక్కడున్నవారంతా కంటతడి పెట్టారు. ఈ హృదయవిదారక దృశ్యం వీడియోల రూపంలో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

వారిని ఉరి తీయండి..

ప్రియుడి శవంతో వివాహం అనంతరం ఆంచల్ విలేకరులతో మాట్లాడుతూ.. కన్నతండ్రి, సోదరులు చేసిన ఈ ఘాతుకానికి వారికి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేసింది. 'కులం సాకుతో నా తండ్రి మా ప్రేమను వ్యతిరేకించాడు. నా కుటుంబం చాలాసార్లు సక్షంను చంపుతామని బెదిరించింది. ఇప్పుడదే చేసింది. నాకు న్యాయం కావాలి. ఈ ముగ్గురిని ఉరి తీయాలి'.. అని కోరింది. అంతేకాకుండా, ఆమె ఆ క్షణం నుంచే సక్షం ఇంట్లోనే కోడలిగా మిగిలిన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుంది. 'సక్షం మరణంలోనూ మా ప్రేమ గెలిచింది, నా తండ్రి, సోదరులు ఓడిపోయారు'.. అని ఆమె ప్రకటించింది. ఈ హత్యలో ఆంచల్ తండ్రి గజానన్, సోదరులు హిమేశ్, సాహిల్ పాత్ర ఉన్నట్లు పోలీసులు నిర్ధారించి, వెంటనే వారిని అరెస్టు చేశారు. మొత్తం ఆరుగురిపై భారతీయ న్యాయ సంహిత, ఎస్సీ/ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం, ఆయుధ చట్టం కింద కేసులు నమోదు చేశారు. నిందితులకు మూడు రోజుల పోలీస్ కస్టడీ విధించారు. ఆంచల్ ధైర్యం, ఆవేదనతో కూడిన ప్రేమకథ.. కులాల మధ్య ప్రేమ మనుగడ సాగించాలంటే ఎంతటి తీవ్ర పోరాటం చేయాలో, ఎన్ని ప్రాణాలు బలివ్వాలో మరోసారి రుజువు చేసింది.

అర్ధరాత్రి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న వేళ

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం

సి.ఆర్. ఫార్ములా (1944) (సి. రాజగోపాలాచారి సూత్రం)

ముస్లిం లీగ్ సహకారం కోసం, మతసమస్యల పరిష్కారం కోసం 1944 మార్చిలో గాంధీజీ ఆమోదంతో కాంగ్రెస్ తరఫున సి.రాజగోపాలాచారి ఒక సూత్రాన్ని ప్రతిపాదించారు. స్వయం నిర్ణయాధికార హక్కు కోసం పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయాలనే ముస్లిం లీగ్ కోరికను ఆయన అంగీకరించారు. కాంగ్రెస్‌కు కావాల్సిన స్వతంత్ర సాధన, దాని కోసం ముస్లిం ల సహకారాన్ని పొందేందుకు ఎంత నష్టాన్నైనా భరించటానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ముస్లిం లీగ్ మాత్రం దేశ స్వాతంత్ర్యం గురించి పట్టించుకోకుండా, ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చి, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దేశ విభజనకు అంగీకరించాలని కాంగ్రెస్‌ను కోరింది.

వేవెల్ ప్రణాళిక (1945)

భారత వైస్రాయ్, గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ నాటి బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌తో చర్చించి కొన్ని ప్రతిపాదనలు చేశారు.

ముఖ్యాంశాలు

- భారతదేశంలోని ప్రధాన మతాలకు సంబంధించిన వారికి సముచిత ప్రాతినిధ్యం కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిని విస్తరించడం.
- భారతదేశంలోని బ్రిటిష్ వారి ప్రయోజనాలు కాపాడేందుకు హైకమిషనర్‌ను నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో ముఖ్య సైన్యాధికారిగా భారతీయుడిని నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గం జాతీయ ప్రభుత్వంగా వ్యవహరించడం. దీని కోసం వైస్రాయి 1945 జూలైలో సిమ్లాలో ఒక సమావేశాన్ని నిర్వహించారు. కానీ కాంగ్రెస్ అవిభాజ్య భారత దేశం (యునైటెడ్ ఇండియా) కోసం పట్టు బట్టింది. ముస్లిం లీగ్ మాత్రం దేశ విభజనను సమర్థించింది.

కేబినెట్ మిషన్ (1946) (కేబినెట్ రాయబారం)

బ్రిటన్ ప్రధాని అట్లీ.. 1946 మార్చిలో పార్లమెంటులో భారతదేశానికి అధికార బదిలీకి సంబంధించి ఒక చరిత్రాత్మక ప్రకటన చేశారు. 'అల్ప సంఖ్యాకుల హక్కులపై మాకు అవగాహన ఉంది. అల్పసంఖ్యాకులు నిర్భయంగా జీవించాలి. అయి తే అధిక సంఖ్యాకుల పురోగతిని కాదనే అల్ప సంఖ్యాక వర్గాన్ని కూడా మనం అనుమతించలేం' అని పేర్కొన్నారు. అందులో భాగంగా బ్రిటన్‌లో కేబి నెట్ మంత్రులైన సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి.అలెగ్జాండర్, లార్డ్ పెథిక్ లారెన్స్ సభ్యులుగా మంత్రుల బృందం భారత పర్యటన ప్రారంభించింది. ఈ బృందానికి సర్ పెథిక్ లారెన్స్ నేతృత్వం వహించారు. 1946 మే 16న వీరు తమ ప్రణాళికను వెల్లడించారు.

ముఖ్యాంశాలు

- బ్రిటిష్ పాలిత భారతదేశం, స్వదేశీ సంస్థానాలు, ఇండియన్ యూనియన్ అనే రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుంది. ఆ యూనియన్ విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్ లాంటి జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను నిర్వహిస్తుంది.
- కేంద్ర ప్రభుత్వ పరిధిలో లేని పాలనాంశాలపై శాసనాధికారం రాష్ట్రాలకు సంక్రమిస్తుంది.
- ప్రాంతీయ ప్రభుత్వాలకు శాసన నిర్మాణ శాఖలు ఏర్పడుతాయి. పరిపాలనా నిర్వహణ కోసం 14 మంది సభ్యులతో కూడిన ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుంది.
- పాకిస్తాన్ అనే మరొక దేశం ఏర్పడే భావన ఆచరణ సాధ్యం కాదు.
- రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది.

తాత్కాలిక ప్రభుత్వం (1946)

బ్రిటిష్ ప్రభుత్వం 1946 ఆగస్టు 24న తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రకటించింది. దీనికి అనుగుణంగా 1946 సెప్టెంబర్ 2న తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రారంభంలో సందేహించిన ముస్లిం లీగ్, 1946 అక్టోబర్ 29న తాత్కాలిక ప్రభుత్వంలో చేరింది. కాంగ్రెస్ తరఫున వల్లభాయ్ పటేల్, రాజేంద్ర ప్రసాద్, అరుణా అసఫ్ అలీ, రాజగోపాలాచారి, జగ్జీవన్‌రామ్ లాంటి ప్రముఖులు, ముస్లిం లీగ్ తరఫున లియాఖత్ అలీఖాన్, జె.ఎన్.మండల్, గజ్నేఫర్ అలీఖాన్ లాంటి నాయకులు మంత్రులుగా, జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా వ్యవహరించారు.

అట్లీ ప్రకటన (1947)

1947 ఫిబ్రవరి 20న కామన్స్ సభలో మాట్లాడుతూ 1948 జూన్ నాటికి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుంచి వైదొలుగుతుందని ప్రకటించారు. దీన్నే అట్లీ ప్రకటన అంటారు. ఈ ప్రకటనను బ్రిటిష్‌వారు జారీచేసిన వాటిలో అత్యుత్తమమైందిగా మహాత్మాగాంధీ వర్ణించారు.

మౌంట్‌బాటన్ ప్రణాళిక (1947)

భారతదేశ రాజ ప్రతినిధి, గవర్నర్ జనరల్ గా నియమితుడైన మౌంట్‌బాటన్ దేశంలోని రాజకీయ ప్రముఖులతో సంప్రదింపులు జరిపి, సమైక్య భారతదేశ ప్రాతిపదికన కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీల మధ్య అంగీకారం కుదర్చడం సాధ్యం కాదనీ, దేశ

విభజన ఒక్కటే పరిష్కారంగా భావించి ప్రణాళిక తయారు చేశారు.

ముఖ్యాంశాలు

- ఇండియన్ యూనియన్‌ను భారత్, పాకిస్తాన్ అనే రెండు రాజ్యాలుగా విభజిస్తారు.
- 1948 జూన్‌కు బదులుగా 1947 ఆగస్టు 15 న రెండు దేశాలుగా విడిపోతాయి.
- అసోం భారత్‌లో అంతర్భాగంగా ఉండగా బెంగాల్, పంజాబ్‌లను మత ప్రాతిపదికన విభజించారు. అయితే ముస్లింలు అధికంగా ఉండే సిల్హట్ (బెంగాల్) జిల్లా విషయంలో మాత్రం అది తూర్పు బెంగాల్‌లో లేదా అసోంలో చేరడమా అనే విషయం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా జరుగుతుంది.
- బెలూచిస్థాన్ వాయవ్య ప్రాంతాలు భారత్ లేదా పాకిస్తాన్‌లో కానీ చేరే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది.
- పంజాబ్, బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను విభజించే విషయంలో రెండు సరిహద్దు సంఘాలను నియమించారు.
- బ్రిటన్ ఆధ్వర్యంలోని కామన్‌వెల్త్ కూటమిలో చేరే విషయంలో భారత్, పాకిస్తాన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

భారత స్వాతంత్ర్య చట్టం (1947)

భారతదేశ వ్యవహారాల నిర్వహణ, నియంత్రణ కోసం రూపొందించిన చివరి చట్టం ఇదే. బ్రిటన్ ప్రధాని క్లిమెంట్ అట్లీ ఆధ్వర్యంలో భారత గవర్నర్ జనరల్ లార్డ్ లూయిస్ మౌంట్‌బాటన్ సలహా మేరకు 1947 జూలై 4న బ్రిటిష్ పార్లమెంటులో భారత స్వాతంత్ర్య ముసాయిదాను ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై బ్రిటిష్ రాణి 1947 జూలై 18 న సంతకం చేసింది. ఇది 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది.

ముఖ్యాంశాలు

- ఇండియా, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు ఏర్పడతాయి. వీటికోసం వేర్వేరు రాజ్యాంగ పరిషత్తులు కూడా ఏర్పాటవుతాయి.
- స్వదేశీ సంస్థానాలపై బ్రిటిష్ సార్వభౌమాధికారంతోపాటు భారత వ్యవహారాల కార్యదర్శి పదవి కూడా రద్దవుతుంది.
- బ్రిటిష్ రాజు లేదా రాణికి ఉన్న భారత చక్రవర్తి అనే బిరుదు రద్దవుతుంది.
- వైస్రాయ్ పదవి రద్దు అవుతుంది.
- రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా పనిచేసి చట్టాలను రూపొందిస్తుంది.
- గవర్నర్ జనరల్, రాష్ట్ర గవర్నర్లు రాజ్యాంగ పరమైన అధిపతులుగా వ్యవహరిస్తారు.
- లార్డ్ మౌంట్‌బాటన్ మొదటి గవర్నర్ జనరల్‌గా నియమితులయ్యారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 1833 చార్టర్ చట్టం ప్రకారం ప్రవేశపెట్టిన అంశాల్లో కింది వాటిలో సరికానిది?
   ఎ) ఈస్టిండియా కంపెనీ వాణిజ్య కార్యకలాపాల రద్దు
   బి) కౌన్సిల్‌లోని ఉన్నతాధికారిని గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియాగా మార్చడం
   సి) కౌన్సిల్‌లో న్యాయ చట్టాలను చేసే అధికారం గవర్నర్ జనరల్ ఇచ్చింది
   డి) గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లోని న్యాయమండలికి మొదటిసారిగా భారతీయుడిని నియమించారు
2. కింది వాటిలో సరైంది?
   ఎ) బ్రిటన్ తరహాలో భారతదేశంలో రెగ్యులర్ పోలీసు దళాన్ని ఏర్పాటు చేసిన మొదటి గవర్నర్ జనరల్ వారెన్‌హేస్టింగ్స్
   బి) రెగ్యులేటింగ్ చట్టం–1773 ద్వారా కలకత్తాలో సుప్రీంకోర్టు ఏర్పాటు ప్రతిపాదన
   సి) ఎ, బి డి) ఏదీకాదు
3. భారత ప్రభుత్వ చట్టం–1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
   ఎ) రెండు బి) మూడు
   సి) అయిదు డి) ఆరు
4. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
   ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
   సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్
5. భారతదేశ పాలన బ్రిటిష్ చక్రవర్తి పరిధిలోకి వచ్చినట్లు విక్టోరియా రాణి ప్రకటన చేసిన రోజు?
   ఎ) 1858 నవంబర్ 1 బి) 1857 నవంబర్ 1
   సి) 1859 డిసెంబర్ 1 డి) 1857 డిసెంబర్ 1
6. భారత ప్రభుత్వ చట్టం–1919లోని ప్రధాన అంశం/ అంశాలు?
   ఎ) రాష్ట్రాల కార్యనిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
   బి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారాల నిర్వచనం
   సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికార సంక్రమణం
   డి) పైవన్నీ
7. పాలనలో భారతీయులకు భాగస్వామ్యం కల్పించటానికి ఉద్దేశించిన మొదటి బ్రిటిష్ చట్టం?
   ఎ) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం– 1861
   బి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం–1862
   సి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం– 1909
   డి) భారత ప్రభుత్వ చట్టం– 1919
8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం' గా నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
   ఎ) కేబినెట్ మిషన్
   బి) మౌంట్‌బాటన్ ప్రణాళిక
   సి) వేవెల్ ప్రణాళిక
   డి) భారత ప్రభుత్వ చట్టం–1935

సమాధానాలు

1) డి 2) సి 3) బి 4) బి
5) ఎ 6) డి 7) ఎ 8) డి

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
   ఎ) అమెరికా రాజ్యాంగం
   బి) బ్రిటిష్ రాజ్యాంగం సి) ఐరిష్ రాజ్యాంగం
   డి) భారత ప్రభుత్వ చట్టం
2. జతపరచండి.
   1) పోర్ట్ ఫోలియో పద్ధతి
   2) సివిల్ సర్వీసులు
   3) మత నియోజక వర్గాలు
   4) భారత న్యాయ సంస్కరణలు
   ఎ) లార్డ్ మెకాలే
   బి) లార్డ్ కార్న్ వాలిస్
   సి) లార్డ్ కానింగ్
   డి) లార్డ్ మింటో
   ఎ) 1–సి, 2–బి, 3–డి, 4–ఎ
   బి) 1–బి, 2–సి, 3–ఎ, 4–డి
   సి) 1–డి, 2–ఎ, 3–బి, 4–సి
   డి) 1–ఎ, 2–బి, 3–డి, 4–సి
3. కాలక్రమం ప్రకారం కింది వాటిని గుర్తించండి?
   1) ప్రత్యేక నియోజకవర్గాలు
   2) శాసన అధికారాల బదలాయింపు
   3) ద్విసభా విధానం
   4) డొమినియన్ ప్రతిపత్తి
   ఎ) 1, 2, 3, 4, బి) 2, 1, 3, 4
   సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 4
4. ప్రభుత్వానికి ఉండే అధికారం దేనికి ఉదాహరణ?
   ఎ) సంప్రదాయ అధికారం
   బి) సమ్మోహనాధికారం
   సి) చట్టబద్ధ, హేతుబద్ధ అధికారం
   డి) పైవన్నీ

సమాధానాలు

1) డి 2) ఎ 3) ఎ 4) సి

వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?

మాదిరి ప్రశ్నలు

1. భూమిపై ఉన్న వృక్షాలన్నీ నశిస్తే జీవులన్నీ మరణిస్తాయి. కారణం? (సివిల్స్, 1988)
   1) కార్బన్ డై ఆక్సైడ్ లేకపోవడం
   2) ఆక్సిజన్ లేకపోవడం
   3) 1, 2 4) ఏదీకాదు
2. మడ వృక్షాలు (మంగ్రూవ్ అడవులు) అంటే? (గ్రూప్–1, 1999)
   1) నీటి మొక్కలు
   2) ఉప్పునీటి వృక్షాలు
   3) పండ్లనిచ్చే వృక్షాలు 4) ఆల్గే
3. హైడ్రోపోనిక్స్ అంటే ఏమిటి? (సివిల్స్, 2000)
   1) ధ్వని తరంగాలతో నీటిని శుద్ధిచేయడం
   2) వాతావరణం, నీరు అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
   3) మృత్తిక అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
   4) తడి గాలిని పంపి మొక్కలను పెంచే పద్ధతి
4. హెర్బేరియం అనేది ఒక.. ? (ఎఫ్ఆర్‌వో, 2005)
   1) ఎండు ఔషధ మొక్కల సంకలనం
   2) వివిధ ఔషధ మొక్కల తోట
   3) విత్తనాలను నిల్వచేసే సంస్థ
   4) ఎండు మొక్కల నమూనాలను భద్రపరిచే సంస్థ
5. కాఫీలో కలిపే చికోరి పౌడర్‌ను మొక్క ఏ భాగం నుంచి గ్రహిస్తారు? (గ్రూప్–1, 2010)
   1) కాండం 2) వేరు
   3) ఆకులు 4) విత్తనాలు
6. 'రాడిష్' అనేది ఒక ..? (ఏఈఈ, 2009)
   1) బల్బ్ 2) మొక్కజొన్న
   3) మార్పుచేసిన వేరు
   4) ట్యూబర్
7. వేరు బుడిపెలు ఉన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తే నేలలో స్థాపితమయ్యే మూలకం ఏది? (వీడీవో, 1992)
   1) కాల్షియం 2) పొటాషియం
   3) భాస్వరం 4) నత్రజని
8. అల్లం అనేది ఒక ..? (గ్రూప్–1, 2003, గ్రూప్–4, 1996)
   1) కండ కలిగిన వేరు
   2) కండ కలిగిన కాండం
   3) నిల్వచేసే వేరు
   4) ఉపవాయుగత కాండం
9. 'జెనెటిక్స్' అనే పదాన్ని ప్రతిపాదించింది ఎవరు?
   1) హ్యూగో డీవ్రీస్ 2) మెండల్
   3) బేట్‌సన్ 4) సట్టన్–జొహాన్‌సన్
10. ఆకుల ద్వారా జరిగే ట్రాన్స్‌పిరేషన్ ప్రక్రియలో పాల్గొనే నిర్మాణాలేవి? (గ్రూప్–2, 2003)
    1) క్యూటికిల్ 2) లెంటిసెల్స్
    3) స్టొమాట 4) హైడథోడ్స్
11. కుంకుమపువ్వును మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్–1, 1999)
    1) ఎండిన రక్షక పత్రాలు
    2) ఎండిన పూమొగ్గలు
    3) కీలాగ్రం 4) ఆకర్షణ పత్రాలు
12. కింద పేర్కొన్న పత్రరంధ్రాల ద్వారా నీరు బిందువుల రూపంలో స్రవితమవుతుంది. ఆ నిర్మాణాలను ఏమంటారు? (సివిల్స్, 1996)
    1) లెంటిసెల్స్ 2) ఫయలోపోర్
    3) హైడథోడ్స్ 4) స్టొమాట
13. పీచర్ ప్లాంట్‌లోని ఏ భాగం పీచర్‌గా మార్పు చెందుతుంది? (సివిల్స్, 2007; ఎఫ్ఆర్‌వో, 2009)
    1) కాండం 2) ఆకు
    3) స్టిప్యూల్స్ 4) పిటియోల్
14. కింది వాటిలో మాంసాహార మొక్క ఏది? (సివిల్స్, 1996)
    1) నెపంథిస్ 2) డ్రాసిరా
    3) డయోనియా 4) పైవన్నీ
15. జీవితకాలంలో కొన్ని మొక్కలు ఒకేసారి పుష్పిస్తాయి. వాటిని ఏమని పిలుస్తారు? (గ్రూప్–4, 2010)
    1) మోనోకార్పిక్ 2) మోనోగామస్
    3) మోనోజెనిక్ 4) మోనోమార్ఫిక్
16. అతిపెద్ద పుష్పం ఏది? (గ్రూప్–4, 2010)
    1) క్రైసాంథిమమ్ 2) రఫ్లీషియా
    3) సన్‌ఫ్లవర్ 4) జిన్నియా
17. ఆపిల్‌లో తినే భాగం ఏది? (గ్రూప్–4, 1998)
    1) కార్పెల్ 2) థాలమస్
    3) పెడిసిల్ 4) ఎండోకార్ప్
18. పప్పుధాన్యాల్లో ప్రధానంగా ఉండే పోషక విలువలేవి? (ఏఈఈ, 2009)
    1) పిండి పదార్థాలు 2) విటమిన్లు
    3) కొవ్వులు 4) మాంసకృత్తులు
19. సుగంధద్రవ్యంగా ఉపయోగపడే లవంగం అనేది ఒక..? (డీఎల్, 2012)
    1) వేరు 2) ఫలం
    3) ఎండిన విప్పారని పూమొగ్గ
    4) కాండం
20. 'చందన వృక్షం' శాస్త్రీయ నామం? (గ్రూప్–4, 2002)
    1) సాంటాలమ్ ఆల్బం
    2) షోరియా రొబెస్టా
    3) సిడ్రస్ డియోడరా
    4) పైనస్ రాక్స్‌బర్గై
21. 'మార్ఫిన్'ను మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్–2 బ్యాక్‌లాగ్, 2003)
    1) పుష్పం 2) ఆకు
    3) పండు/కాయ లేటెక్స్ 4) కాండం
22. వృక్ష కణం, జంతు కణానికి మధ్య తేడా? (వాటర్‌వర్క్స్ మేనేజర్, 2008)
    1) కేంద్రకం 2) ప్లాస్మాత్వచం
    3) క్లోరోప్లాస్ట్ 4) మైటోకాండ్రియా
23. సూక్ష్మదర్శిని ద్వారా కణాన్ని పరిశీలించిన తొలి శాస్త్రవేత్త ఎవరు? (గ్రూప్–2 బ్యాక్‌లాగ్, 2000)
    1) రాబర్ట్ హుక్ 2) ఎ.వి. లీవెన్‌హుక్
    3) టి. ష్వాన్ 4) ఎం.జె. ష్లైడన్
24. కింది వాటిలో ప్రోకారియోటిక్ (కేంద్రక పూర్వ) కణం కానిది?
    1) క్లోరెల్లా 2) ఈస్ట్
    3) క్షయ బ్యాక్టీరియా 4) 1, 2
25. వాణిజ్యపరంగా 'కార్క్' అనేది ఏ వృక్షం నుంచి తీసిన బెండు?
    1) ఎల్మ్ 2) విల్లో
    3) ఆర్కిడ్ 4) ఓక్
26. 'ప్రతి జీవి దేహం కణాలతో నిర్మితమవుతుంది. జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం కణం' అని కణ సిద్ధాంతాన్ని వివరించినవారు? (సివిల్స్, 1998)
    1) లూయిపాశ్చర్
    2) రాబర్ట్ హుక్ 3) ష్లైడన్–ష్వాన్
    4) లీవెన్‌హుక్
27. జన్యువు (Gene) అంటే? (గ్రూప్–1, 1988)
    1) ప్రోటీన్‌లోని అమైనో ఆమ్లం
    2) ఆర్ఎన్ఏలో కొంత భాగం
    3) డీఎన్ఏ ముక్క
    4) సహలగ్న సముదాయం
28. అంతర్లీనంగా దాగి ఉండే లక్షణాన్ని ఏమంటారు? (గ్రూప్–4, 1989)
    1) డామినెంట్ 2) F_1 జనరేషన్
    3) రెసిసివ్ 4) పైవేవీకాదు
29. హరగోవింద్ ఖురానా చేసిన పరిశోధన ఏమిటి? (పాలిటెక్నిక్ లెక్చరర్, 2011)
    1) నూతన కణాల గుర్తింపు
    2) ప్రయోగశాలలో కృత్రిమ జన్యువు సృష్టి
    3) మొక్కల్లో పరివర్తన
    4) జన్యు మార్పిడి
30. 'జన్యువు' అని పేరు పెట్టినవారెవరు?
    1) బేట్‌సన్ 2) మెండల్
    3) జొహాన్‌సన్ 4) క్రిక్–వాట్సన్
31. జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలిసారిగా శాస్త్రీయంగా ప్రతిపాదించినవారు? (గ్రూప్–1, 1987-88)
    1) లామార్క్ 2) డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
32. 'ది ఆరిజన్ ఆఫ్ స్పెసీస్' గ్రంథకర్త? (గ్రూప్–1, 2003)
    1) లామార్క్ 2) చార్లెస్ డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
33. సముద్రంలో ఏర్పడిన, కిరణజన్య సంయోగ క్రియ జరిపే మొదటి జీవులేవి? (గ్రూప్–2, 2002)
    1) శైవలాలు 2) సయనో బ్యాక్టీరియా
    3) శిలీంధ్రాలు 4) మొక్కలు
34. ఉత్పరివర్తన పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు? (సివిల్స్, 2006)
    1) డార్విన్ 2) లామార్క్
    3) మెండల్ 4) హ్యూగో డీవ్రీస్
35. 'ప్రోటీన్ల కర్మాగారాలు' అని వేటిని పిలుస్తారు?
    1) పెరాక్సీజోమ్‌లు 2) రైబోజోమ్స్
    3) హరితరేణువు 4) మైటోకాండ్రియా
36. మానవుడి శుక్రకణంలోని క్రోమోజోమ్‌ల సంఖ్య?
    1) 46 2) 44+XX
    3) 22 4) 23
37. కొబ్బరి అంకురచ్ఛద స్థితి?
    1) ఏక స్థితికం 2) ద్వయ స్థితికం
    3) త్రయ స్థితికం 4) బహు స్థితికం
38. సమ విభజనను పరిశీలించడానికి అనువైన స్థానం ఏది?
    1) కాండం 2) ఉల్లి వేరుకొన
    3) మొగ్గ
    4) పుష్పంలోని పరాగకోశం
39. డీఎన్ఏ డబుల్ హెలిక్స్ నమూనాను ప్రతిపాదించినవారు?
    1) ష్లైడన్ – ష్వాన్ 2) క్రిక్–వాట్సన్
    3) బెంథమ్–హుకర్
    4) ఎంగ్లర్ ప్రాంటల్
40. అంటుకట్టడం, గాయాలు మానడంలో ఇమిడి ఉన్న ప్రక్రియ ఏది?
    1) ద్విధావిచ్ఛిత్తి 2) బహుధావిచ్ఛిత్తి
    3) సమ విభజన
    4) క్షయకరణ విభజన
41. పాకిటీన్ ఉపదశ దేనిలో ఉంటుంది?
    1) సమ విభజన
    2) క్షయకరణ విభజన
    3) అసమ విభజన 4) ఏదీకాదు
42. కిరణజన్య సంయోగక్రియ ఏ కాంతిలో ఎక్కువగా జరుగుతుంది?
    1) నీలి కాంతి 2) సూర్య కాంతి
    3) అరుణ కాంతి
    4) అతినీలలోహిత కాంతి
43. క్లోరోఫిల్ అణువులో ఏ మూలకం ఉంటుంది? (గ్రూప్–1, 1999)
    1) ఇనుము 2) మెగ్నీషియం
    3) కోబాల్ట్ 4) కాల్షియం
44. మానవ నిర్మిత ధాన్యపు మొక్క (Man made cereal)?
    1) ఓట్స్ 2) రెపానో బ్రాసికా
    3) ట్రిటికేల్ 4) షర్బతి సానోరా
45. నీటిలో కరిగే వర్ణద్రవ్యాలు?
    1) క్లోరోఫిల్స్ 2) కెరోటినాయిడ్స్
    3) జాంతోఫిల్స్ 4) ఫైకోబిలిన్లు
46. శిలీంధ్రం నుంచి రూపొందించిన ఫైటోహార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
    3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
47. అగ్రాధిక్యతకు కారణమైన హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
    3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
48. కింది వాటిలో జిబ్బరెల్లిన్ల చర్య ఏది?
    1) మొక్కల పొడవు పెంచుతుంది
    2) అన్ని రకాల మొక్కల పొడవు పెంచుతుంది
    3) పొట్టి మొక్కల పొడవు మాత్రమే పెంచుతుంది
    4) పొడవు మొక్కల పొడవు పెంచుతుంది
49. విత్తన రహిత ఫలాలు ఏర్పడటానికి దోహదపడే హార్మోన్ ఏది?
    1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) సైటోకైనిన్
    3) ఆక్సిన్ 4) జిబ్బరెల్లిన్లు
50. ఫ్రూట్ రైపెనింగ్ హార్మోన్ ఏది?
    1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) ఇథిలీన్
    3) సైటోకైనిన్ 4) జిబ్బరెల్లిన్
51. వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) సైటోకైనిన్
    3) ఇథిలీన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
52. కణ విభజనను ప్రోత్సహించే హార్మోన్?
    1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
    3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
53. సుప్తావస్థను కలుగజేసే హార్మోన్ ఏది?
    1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
    3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
54. మొక్కల ఆకులు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం? (ఏఈ, 2009)
    1) మెలనిన్ 2) టానిన్
    3) క్లోరోఫిల్ 4) బ్యాక్టీరియా
55. మొక్కల పెరుగుదలకు కావాల్సిన ప్రధాన సమ్మేళనం ఏది? (ఏఈ, 2009)
    1) సల్ఫర్ 2) సోడియం
    3) కార్బన్ 4) నైట్రోజన్
56. క్వినైన్ దేని నుంచి లభిస్తుంది? (గ్రూప్–2, 2002)
    1) మల్బరీ 2) కోకో
    3) సింకోనా 4) యూకలిప్టస్
57. 'ద్వి ఫలదీకరణం' ఏ మొక్కల ముఖ్య లక్షణం? (ఎంపీడీవో, 1997)
    1) శైవలాలు 2) బ్రయోఫైటా
    3) వివృత బీజాలు 4) ఆవృత బీజాలు
58. లిట్మస్ పేపర్ తయారీకి ఉపయోగించే మొక్క ఏది?
    1) శైవలాలు 2) శిలీంధ్రం
    3) లైకేన్లు 4) ఫెర్న్
59. పిండి పదార్థాలను గుర్తించే రసాయనం?
    1) కోబాల్ట్ క్లోరైడ్ 2) అయోడిన్
    3) సోడియం హైడ్రాక్సైడ్
    4) కాపర్ సల్ఫేట్
60. పాక్షిక స్వయం ప్రతిపత్తి ఉన్న కణాంగం?
    1) హరిత రేణువు 2) మైటోకాండ్రియా
    3) రైబోజోమ్స్ 4) 1, 2
61. జీవ పరిణామంలో ప్రకృతి ఎన్నిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త? (వీడీవో, 1988)
    1) లామార్క్ 2) డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
62. జీవుల్లో వంశపారంపర్య లక్షణాలు కలిగించేది ఏది? (గ్రూప్–2, 1991)
    1) ఆర్ఎన్ఏ 2) ఏటీపీ
    3) డీఎన్ఏ 4) హిమోగ్లోబిన్
63. క్రోమోజోమ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు? (గ్రూప్–4, 1996)
    1) డార్విన్ 2) మెండల్
    3) సట్టన్–బవేరి 4) లామార్క్
64. శిశువు లింగ నిర్ధారణ ఎవరిపై ఆధారపడి ఉంటుంది?
    1) తల్లి 2) తండ్రి
    3) తల్లి, తండ్రి 4) పూర్వీకులు
65. డీఎన్ఏలోని క్రియాత్మక ప్రమాణం?
    1) సిస్ట్రాన్ 2) రేకాన్
    3) మ్యూటాన్ 4) ఏదీకాదు

సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 4; 5) 2;
6) 3; 7) 4; 8) 2; 9) 3; 10) 3;
11) 3; 12) 3; 13) 2; 14) 4; 15) 1;
16) 2; 17) 2; 18) 4; 19) 3; 20) 1;
21) 3; 22) 3; 23) 1; 24) 4; 25) 4;
26) 3; 27) 3; 28) 3; 29) 2; 30) 3;
31) 2; 32) 2; 33) 2; 34) 4; 35) 2;
36) 4; 37) 3; 38) 2; 39) 2; 40) 3;
41) 2; 42) 3; 43) 2; 44) 3; 45) 4;
46) 2; 47) 1; 48) 3; 49) 4; 50) 2;
51) 2; 52) 2; 53) 4; 54) 3; 55) 4;
56) 3; 57) 4; 58) 3; 59) 2; 60) 4;
61) 2; 62) 3; 63) 3; 64) 2; 65) 1.

హుస్సేన్‌సాగర్ చెరువును నిర్మించిన పాలకుడు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

కాకతీయ యుగం

1. 'కేయూర బాహు చరిత్ర'ను రాసినవారు?
   1) మంచన 2) శివదేవయ్య
   3) శేషాద్రిరమణ కవులు
   4) గంగాధర కవి
2. సంస్కృతంలో 'యయాతి చరిత్ర, ఉషారాగోదయం' అనే నాటకాలు రాసిందెవరు?
   1) శివదేవయ్య 2) మంచన
   3) గంగాధర కవి 4) ప్రతాపరుద్రుడు
3. 'రంగనాథ రామాయణం' గ్రంథ రచయిత?
   1) గోన గన్నారెడ్డి 2) గోన బుద్ధారెడ్డి
   3) ప్రతాపరుద్రుడు 4) విశ్వనాథుడు
4. తొలి పురాణ అనువాద కవి ఎవరు?
   1) విశ్వనాథుడు 2) గోన బుద్ధారెడ్డి
   3) మారన 4) మంచన
5. కింది వారిలో 'మార్కండేయ పురాణం'ను ఎవరు అంకితం తీసుకున్నారు?
   1) జాయప్ప కవి
   2) గన్నయ నాయకుడు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
6. తెలుగులో తొలి మహాపురాణం ఏది?
   1) మనుచరిత్ర 2) వాయు పురాణం
   3) రంగనాథ రామాయణం
   4) మార్కండేయ పురాణం
7. కింది వాటిలో అనేక కావ్యాలకు ఆధారమైన గ్రంథం ఏది?
   1) మనుచరిత్ర
   2) మార్కండేయ పురాణం
   3) నాట్యశాస్త్రం
   4) రంగనాథ రామాయణం
8. సంస్కృతంలో అలంకార గ్రంథం రాసిన తొలి ప్రసిద్ధ తెలుగు కవి?
   1) విద్యానాథుడు 2) మారన
   3) మంచన 4) విశ్వనాథుడు
9. 'ప్రతాపరుద్ర యశోభూషణం' గ్రంథ రచయిత ఎవరు?
   1) రామరాజ భూషణుడు
   2) విద్యానాథుడు
   3) అల్లసాని పెద్దన 4) మారన
10. 'నరసభూపాలీయం' దేని అనువాద రచన?
    1) నాట్యశాస్త్రం 2) ధ్వన్యాలోకం
    3) ప్రతాపరుద్ర యశోభూషణం
    4) మార్కండేయ పురాణం
11. వరంగల్ కోట తోరణ ద్వారం మీద శ్లోకాలను లిఖించిన కవి?
    1) విద్యానాథుడు 2) నరసింహుడు
    3) శరభాంకుడు 4) మల్లినాథసూరి
12. 'కాకతీయ చరిత్ర', 'మలయవతి' అనే గ్రంథాలను రాసిందెవరు?
    1) నరసింహుడు 2) విద్యానాథుడు
    3) మల్లినాథసూరి 4) శరభాంకుడు
13. 'సౌగంధికాపహరణం' అనే సంస్కృత వ్యాయోగం రచయిత?
    1) విద్యానాథుడు 2) నరసింహుడు
    3) శరభాంకుడు 4) విశ్వనాథుడు
14. తెలుగులో తొలి జంట కవులెవరు?
    1) కాచభూపతి, విట్టలరాజు
    2) కాచభూపతి, విద్యానాథుడు
    3) విద్యానాథుడు, విశ్వనాథుడు
    4) శరభాంకుడు, నరసింహుడు
15. 'ఉత్తర రామాయణం' రచించింది ఎవరు?
    1) కాచభూపతి, విట్టలరాజు
    2) శరభాంకుడు, నరసింహుడు
    3) కాచభూపతి, విద్యానాథుడు
    4) విద్యానాథుడు, విశ్వనాథుడు
16. తెలుగులో తొలి కవయిత్రి ఎవరు?
    1) మొల్ల 2) గంగాదేవి
    3) కుప్పాంబిక 4) మైలాంబిక
17. ముగ్గురు కాకతీయ రాజుల వద్ద మంత్రిగా పనిచేసింది ఎవరు?
    1) గోన బుద్ధారెడ్డి 2) శివదేవయ్య
    3) గణపనారాధ్యుడు 4) శరభాంకుడు
18. 'శివదేవధీమణి' శతకకర్త?
    1) శరభాంకుడు 2) గోన బుద్ధారెడ్డి
    3) గణపతారాధ్యుడు 4) శివదేవయ్య
19. తెలుగులో వచ్చిన మొదటి చంపూ రామాయణం?
    1) ఉత్తర రామాయణం
    2) భాస్కర రామాయణం
    3) మొల్ల రామాయణం
    4) రంగనాథ రామాయణం
20. 'హుళిక్కి భాస్కరుడు' ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) రుద్రదేవుడు 2) రుద్రమదేవి
    3) గణపతిదేవుడు 4) ప్రతాపరుద్రుడు
21. 'భాస్కర రామాయణం'ను పూర్తి చేసిన వారెవరు?
    1) మల్లికార్జునభట్టు 2) అయ్యలార్యుడు
    3) రుద్రదేవుడు 4) శివదేవయ్య
22. సంస్కృతంలో 'ప్రేమాభిరామం' కావ్యాన్ని రాసింది ఎవరు?
    1) మల్లికార్జున భట్టు
    2) అయ్యలార్యుడు
    3) రావిపాటి త్రిపురాంతకుడు
    4) శివదేవయ్య
23. 'విద్యారణ్య స్వామి' జన్మస్థలం?
    1) ధర్మపురి 2) ఓరుగల్లు
    3) కొలనుపాక 4) పానగల్లు
24. కింది వారిలో శ్రీనాథ మహాకవి స్తుతించిన కవి ఎవరు?
    1) మల్లికార్జునభట్టు
    2) రావిపాటి త్రిపురాంతకుడు
    3) సాయణ 4) శివదేవయ్య
25. 'సంగీతసారం' అనే సంగీత శాస్త్ర గ్రంథ రచయిత?
    1) మల్లికార్జునభట్టు
    2) రావిపాటి త్రిపురాంతకుడు
    3) సాయణ 4) విద్యారణ్య స్వామి

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 3; 5) 2;
6) 4; 7) 2; 8) 1; 9) 2; 10) 3;
11) 2; 12) 1; 13) 4; 14) 1; 15) 1;
16) 3; 17) 2; 18) 4; 19) 2; 20) 4;
21) 2; 22) 3; 23) 1; 24) 2; 25) 4.

శాతవాహన అనంతర యుగం

1. తెలంగాణలో లభిస్తున్న తొలి సంస్కృత శాసనం ఏది?
   1) చైతన్యపురి శాసనం
   2) గోరంట్ల తామ్రశాసనం
   3) ఏలేశ్వర శాసనం
   4) ఇంద్రపాలనగర తామ్రశాసనం
2. తెలంగాణలో లభిస్తున్న తొలి ప్రాకృత శాసనం ఏది?
   1) గోరంట్ల తామ్రశాసనం
   2) చైతన్యపురి శాసనం
   3) ఇంద్రపాలనగర తామ్రశాసనం
   4) ఏలేశ్వర శాసనం
3. తెలంగాణలో గోవిందవర్మ వేయించిన తొలి సంస్కృత శాసన కాలం?
   1) క్రీ.శ. 425
   2) క్రీ.శ. 430
   3) క్రీ.శ. 435
   4) క్రీ.శ. 440
4. తెలంగాణ ప్రాంతంలో వచ్చిన మొదటి సంస్కృత లక్షణ గ్రంథం ఏది?
   1) జనాశ్రయ ఛందో విచ్ఛిత్తి
   2) కవిజనాశ్రయం
   3) ఉదయాదిత్యాలంకారం
   4) గోకర్ణ ఛందస్సు
5. 'జనాశ్రయ ఛందో విచ్ఛిత్తి' రాసిందెవరు?
   1) ఇంద్రభట్టారక వర్మ
   2) మంచన భట్టారకుడు
   3) గోవిందవర్మ
   4) నాలుగో మాధవ వర్మ
6. విష్ణుకుండినుల రాజ భాష ఏది?
   1) సంస్కృతం 2) ప్రాకృతం
   3) తెలుగు 4) పైశాచీ
7. 'విజయరాజ్య సంవత్సరంబుళ్' అనే తెలుగు పదమున్న శాసనం ఏది?
   1) గోరంట్ల తామ్రశాసనం
   2) ఇంద్రపాలనగర తామ్రశాసనం
   3) చిక్కుళ్ల శాసనం
   4) చైతన్యపురి శాసనం
8. చిక్కుళ్ల శాసనాన్ని వేయించినవారు?
   1) నాలుగో మాధవవర్మ
   2) విక్రమేంద్ర భట్టారిక వర్మ
   3) గోవిందవర్మ
   4) రెండో మాధవవర్మ
9. ఎవరి కాలం నుంచి శాసనాల్లో తెలుగు పదాలు కనిపిస్తున్నాయి?
   1) వాకాటకులు
   2) రాష్ట్రకూటులు
   3) విష్ణుకుండినులు
   4) ఇక్ష్వాకులు
10. ఏ రాజుల పాలనా కాలం నాటికి 'సంస్కృతం' పూర్తిగా రాజ భాష అయింది?
    1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
    3) వాకాటకులు 4) విష్ణుకుండినులు
11. ఇక్ష్వాకులు ఏ మతానికి చెందినవారు?
    1) బౌద్ధం 2) శైవం
    3) జైనం 4) వైదికం
12. ఇక్ష్వాకుల మిత్రులైన 'అభీరులు' ఏ మతాభిమానులు?
    1) శైవం 2) బౌద్ధం
    3) జైనం 4) వైష్ణవం
13. బుద్ధుడిని దేవతామూర్తిగా కింది వాటిలో ఏ అవతారంగా కూడా కొలిచారు?
    1) శివుడు 2) విష్ణుమూర్తి
    3) బ్రహ్మ 4) శ్రీకృష్ణుడు
14. ఆంధ్రదేశంలో 'హిందూ గుహాలయాలను' మొదట నిర్మించినవారు ఎవరు?
    1) విష్ణుకుండినులు 2) శాతవాహనులు
    3) ఇక్ష్వాకులు 4) వాకాటకులు
15. శాసనాల ఆధారంగా ఇక్ష్వాక రాజుల సంఖ్య?
    1) 7 2) 4 3) 6 4) 8

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 1; 5) 4;
6) 1; 7) 3; 8) 2; 9) 3; 10) 4;
11) 2; 12) 4; 13) 2; 14) 1; 15) 2.

కుతుబ్‌షాహీ యుగం

1. సుల్తాన్ కులీ కుతుబ్‌షా ఏ బహమనీ సుల్తాన్ వద్ద సేనాపతిగా పనిచేశాడు?
   1) అహ్మద్‌షా
   2) మహమూద్‌షా
   3) హుమాయూన్
   4) మొదటి మహమ్మద్‌షా
2. కులీ కుతుబ్‌షా గోల్కొండ జాగీర్‌దారుగా ఎప్పుడు నియమితులయ్యారు?
   1) క్రీ.శ. 1476 2) క్రీ.శ. 1486
   3) క్రీ.శ. 1493 4) క్రీ.శ. 1496
3. కులీ కుతుబ్‌షాకు 'కుతుబ్ ఉల్‌ముల్క్' బిరుదు ఇచ్చిన బహమనీ సుల్తాన్?
   1) హుమాయూన్
   2) మొదటి మహమ్మద్‌షా
   3) మహమూద్ షా 4) అహ్మద్‌షా
4. స్వతంత్ర గోల్కొండ రాజ్య స్థాపన ఎప్పుడు జరిగింది?
   1) 1515 2) 1518 3) 1520 4) 1521
5. గోల్కొండ రాజ్య స్థాపకుడెవరు?
   1) ఇబ్రహీం కుతుబ్‌షా
   2) జంషీద్ కుతుబ్‌షా
   3) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
   4) అబుల్ హసన్ తానీషా
6. గోల్కొండను ఎవరి కాలంలో నిర్మించారు?
   1) కాకతీయులు 2) యాదవ రాజులు
   3) కుతుబ్‌షాహీలు 4) అసఫ్‌జాహీలు
7. 'మంగళారం' అని పూర్వం ఏ ప్రాంతాన్ని పిలిచేవారు?
   1) భువనగిరి
   2) గోల్కొండ
   3) నల్లగొండ
   4) సికింద్రాబాద్
8. 'చిత్రభారతం'లో ఎవరికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది?
   1) కులీ కుతుబ్‌షా
   2) మహమూద్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) షితాబ్‌ఖాన్
9. ఎనుములపల్లి పెద్దనామాత్యుడు ఎవరి మంత్రి?
   1) కులీ కుతుబ్‌షా 2) మహమూద్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) షితాబ్‌ఖాన్
10. చరిగొండ ధర్మన్న ఎవరి ఆశ్రితుడు?
    1) ఎనుములపల్లి పెద్దనామాత్యుడు
    2) మహమూద్‌షా
    3) ఇబ్రహీం కుతుబ్‌షా 4) షితాబ్‌ఖాన్
11. 'చిత్రభారతం'ను రాసింది ఎవరు?
    1) ఎనుముపల్లి పెదనామాత్యుడు
    2) చరిగొండ ధర్మన్న
    3) ఇబ్రహీం కుతుబ్‌షా
    4) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
12. కులీ కుతుబ్‌షాను హత్య చేసిన అతడి కుమారుడి పేరు?
    1) జంషీద్ కుతుబ్‌షా
    2) హైదర్ కుతుబ్‌షా
    3) అబ్దుల్ కలీం 4) దౌలత్‌కుతుబ్ షా
13. వారసత్వ తగాదాలతో పారిపోయి విజయనగర రాజుల శరణార్థిగా ఉన్న సుల్తాన్?
    1) జంషీద్ కుతుబ్‌షా
    2) అబ్దుల్లా కుతుబ్‌షా
    3) ఇబ్రహీం కుతుబ్‌షా
    4) హైదర్ కుతుబ్‌షా
14. హుస్సేన్‌సాగర్ చెరువును నిర్మించిన పాలకుడు ఎవరు?
    1) ఇబ్రహీం కుతుబ్‌షా
    2) కులీ కుతుబ్‌షా
    3) హైదర్ కుతుబ్‌షా
    4) జంషీద్ కుతుబ్‌షా
15. ఇబ్రహీం కుతుబ్‌షా రాజమండ్రి, కొండవీడును ఆక్రమించిన సంవత్సరాలు వరసగా?
    1) 1571, 1579 2) 1575, 1579
    3) 1571, 1581 4) 1579, 1585
16. 'పురానాపూల్'ను నిర్మించింది ఎవరు?
    1) షాజహాన్ 2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) హైదర్ 4) జంషీద్
17. ఇబ్రహీం కుతుబ్‌షా 'పురానాపూల్'ను ఎక్కడ నిర్మించాడు?
    1) హుస్సేన్‌సాగర్
    2) ఇబ్రహీంపట్నం చెరువు
    3) మూసీనది 4) గండిపేట చెరువు
18. హుస్సేన్‌సాగర్‌ను, ఇబ్రహీంపట్నం చెరువును నిర్మించినవారు?
    1) అబుల్‌హసన్ తానీషా
    2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) అబ్దుల్లా కుతుబ్‌షా
19. ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్‌లను నిర్మించిన వారెవరు?
    1) అబుల్ హసన్ తానీషా
    2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) అబ్దుల్లా కుతుబ్‌షా
20. భిక్షాటకులకు ప్రత్యేకంగా లంగర్‌హౌస్‌ను నిర్మించిన పాలకుడు?
    1) అబుల్ హసన్ తానీషా
    2) అబ్దుల్లా కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) ఇబ్రహీం కుతుబ్‌షా
21. 'మల్కిభరాముడు' అనే బిరుదున్న చక్రవర్తి ఎవరు?
    1) షాజహాన్
    2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) హైదర్ కుతుబ్‌షా

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 2; 5) 3;
6) 1; 7) 2; 8) 4; 9) 4; 10) 1;
11) 2; 12) 1; 13) 3; 14) 1; 15) 1;
16) 2; 17) 3; 18) 2; 19) 2; 20) 4;
21) 2.

Mac Operating System is developed by..

BANK EXAMS
COMPUTER AWARENESS

Model Questions

1. Block on buffer caches is used:
   1) To improve disk performance
   2) To speed up main memory read operation
   3) To handle interrupts
   4) To increase capacity of main memory
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting
   1) Primary keys and their relationships to instances
   2) Entity classes and their relationships to primary keys
   3) Entity classes and their relationships
   4) Primary keys and their relationships
   5) None of the above
3. A hexadigit can be represented by
   1) Three binary (consecutive) bits
   2) Sixteen binary (consecutive) bits
   3) Eight binary (consecutive) bits
   4) Four binary (consecutive) bits
   5) None of the above
4. If a previously saved file is edited ___?
   1) The file must be saved again to store the changes
   2) The changes will automatically be saved in the file
   3) The file will only have to be saved again if it is more than one page in length
   4) Its name must be changed
   5) It cannot be saved again
5. What do we call the HTML codes written in a text editor to make web pages?
   1) Roots 2) HTML tags
   3) Source elements 4) Source code
   5) None of these
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page 2) Document
   3) Section 4) Page Setup
   5) None
7. Which key is used to indent a paragraph in MS word?
   1) Shift 2) Esc 3) Ctrl
   4) Tab 5) None of these
8. In a ring topology, the computer in possession of the______ can transmit data
   1) Packet 2) Data
   3) Token 4) Access method
   5) None of these
9. When you save to _______, your data will remain undamaged even when the computer is turned off.
   1) RAM 2) Motherboard
   3) Auxiliary storage
   4) Primary storage device
   5) None of these
10. A device operating at the physical layer is ________
    1) Bridge 2) Repeater
    3) Router 4) All of the above
    5) None of these
11. What type of computer could be found in a digital watch?
    1) Embedded computer
    2) Super computer
    3) Mainframe computer
    4) Notebook computer
    5) None of these
12. HTTP in URL stands for
    1) Hyper Text to Point
    2) Hyperlink for Tiny Protocol
    3) Highlighted Text through Pictures
    4) Hyper Text Transfer Protocol
    5) None of the above
13. Memory allocation at the dynamic run time is known as
    1) Static memory allocation
    2) Demanding 3) Paging
    4) Run time memory allocation
    5) None of the above
14. Network components are connected to the identical cable in the _____ topology
    1) Star 2) Bus 3) Ring
    4) Mesh 5) Mixed
15. A mobile phone number, a date of birth and a customer name are all examples of
    1) A record 2) Data
    3) A file 4) A database
    5) None of these
16. In Excel, _____ contains one or more worksheets.
    1) Template 2) Workbook
    3) Active cell 4) Label
    5) None of these
17. Cyberspace is being governed by a system of law and regulation called?
    1) Civil Law 2) Criminal Law
    3) Cyber Law 4) Electronic Law
    5) Cyber Authority
18. Primary memory is used by the:
    1) CPU 2) Input device
    3) User 4) All of these
    5) None of these
19. In Ms- Word, what combination of keys do you press to delete an entire word?
    1) Ctrl + Del 2) Alt + Del
    3) Shift + Backspace
    4) Shift + Alt + Del
    5) None of these
20. Specialized programs that allow particular input or output devices to communicate with the rest of the computer system are called ____.
    1) Operating systems
    2) Device drivers
    3) Utilities
    4) Language translators
    5) Connectors
21. ROM and memory differ with respect to which of the following characteristics?
    1) Price 2) Reliability
    3) Speed 4) All of the above
    5) None of these
22. The group of processors combined together to create a program is referred to as
    1) Multi-programming
    2) Multiprocessing
    3) Multitasking
    4) Thrashing 5) None of these
23. Which device is used to access your computer from another computer or for talk over phone?
    1) CD-ROM Drive 2) Modem
    3) RAM 4) Hard Drive
    5) None of these
24. System software does all of the following except
    1) Add graphics and pictures to files.
    2) Coordinate instructions between application software and the computer's hardware devices.
    3) Help manage system resources.
    4) Help run the computer.
    5) None of these
25. What are .bas, .doc and .htm examples of?
    1) Databases 2) Extensions
    3) Domains 4) Protocols
    5) None of these
26. When data changes in multiple lists and all lists are not updated, this causes:
    1) Data redundancy
    2) Information overload
    3) Duplicate data
    4) Data inconsistency
    5) Data repetition
27. Which of the following is not true?
    1) Chatting is like e-mail
    2) Chatting can be done with a single person
    3) Chatting can involve multiple persons
    4) Chatting is an electronic dialogue
    5) None of these
28. ______ is the process of dividing the disk into tracks and sectors.
    1) Tracking 2) Allotting
    3) Crashing 4) Formatting
    5) None of these
29. The computer abbreviation of KiB usually means-
    1) Key Block 2) kibi byte
    3) Kilobyte 4) Kernel Boot
    5) None of these
30. Hardware used to translate words, sounds, images, and actions that people understand into a form that the system unit can process is known as ______
    1) Device drives 2) Device readers
    3) Input devices 4) Output devices
    5) None of these
31. The mouse ______ usually appears in the shape of an arrow.
    1) Indicator 2) Marker
    3) Meter 4) Pointer
    5) None of these
32. A tool used to find a synonym or antonym for a particular word
    1) Dictionary 2) Summary
    3) Thesaurus 4) Spell check
    5) None of the above
33. Which of the following protocols is used by Internet mail?
    1) HTTP 2) TCP/IP 3) FTP
    4) HTMP 5) None of these
34. A scripting language similar to HTML and which runs only on a browser is
    1) FORTRAN
    2) BASIC
    3) FOXPRO
    4) Java script
    5) None of these
35. Generally, you access the Recycle Bin through an icon located-
    1) On the first visible screen
    2) On the hard drive
    3) On the shortcut menu
    4) In the Properties dialog box
    5) None of these
36. The first Computers were programmed using ________
    1) Assembly Language
    2) Machine Language
    3) Source Code
    4) Object code
    5) Spaghetti code
37. The programs which are as permanent as hardware and stored in ROM is known as
    1) Hardware
    2) Software
    3) Firmware
    4) ROM ware
    5) None of these
38. Which computer memory is used for storing programs and data currently being processed by the CPU?
    1) Mass memory
    2) Internal memory
    3) Non-volatile memory
    4) PROM 5) None of these
39. The world's first truly cross-platform programming language is called ________
    1) C++ 2) Java
    3) Visual Basic.NET 4) Smalltalk
    5) None of these
40. ________ software allows the user to speak into the computer rather than type in text.
    1) Speech recognition 2) Chat
    3) Message 4) All of the above
    5) None of these

Key

1) 1;	2) 2;	3) 4;	4) 1;
5) 4;	6) 4;	7) 4;	8) 3;
9) 3;	10) 2;	11) 1;	12) 4;
13) 4;	14) 2;	15) 1;	16) 2;
17) 3;	18) 1;	19) 5;	20) 2;
21) 4;	22) 2;	23) 2;	24) 1;
25) 2;	26) 4;	27) 1;	28) 4;
29) 2;	30) 2;	31) 4;	32) 3;
33) 1;	34) 4;	35) 1;	36) 2;
37) 3;	38) 2;	39) 2;	40) 1;